సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 22 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 199

బుధవారం 9-10-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'పేద ప్రజల ఆరోగ్యమే నాకు మహాభాగ్యం.
రాజీవ్ ఆరోగ్యశ్రీ సంజీవనిలా పనిచేస్తోంది.
ఈ తృప్తి చాలు'

ప్రమాదాల సముద్రం మీద 8 నెలల పాటు ప్రపంచ దేశాలు తిరిగి రావడానికి ఇద్దరు సాహస నేవీ మహిళా అధికారులు దిల్నా, రూపా అక్టోబర్ 2న గోవా నుంచి బయలుదేరారు. కేవలం వారిద్దరు మాత్రమే ఉండే ఈ సాహసభరిత యాత్రలో వారు తోడు తీసుకెళుతున్నవి ఏమిటి? వారికి తోడుండేవి ఏమిటి? ఇంత సాహసం చేసే వీరిని చూస్తే ప్రతి అమ్మాయిలోనూ కలగదా సముద్రమంత సాహస భావన!


రూప
దిల్నా

● శక్తి

ఆటుపోట్లకు వెరవని 'షి'జర్నీ

'గమ్యం ఎలాగూ ముఖ్యమే. కాని ప్రయాణం కూడా ముఖ్యం. ఈ యాత్రలోని ప్రతి క్షణాన్నీ ఆస్వాదించండి' అని అక్టోబర్ 2న గోవాలో జెండా ఊపి భవిష్యత్ చరిత్రలో చిరస్థాయిగా నిలబడనున్న 'నావికా సాగర్ పరిక్రమ–2'ను ప్రారంభించారు నేవీ చీఫ్ అడ్మిరల్ దినేష్ కె త్రిపాఠి. కేవలం ఇద్దరు మహిళా నేవీ ఆఫీసర్లు ఐఎన్ఎస్‌వి తారిణి పేరున్న సెయిల్ బోట్‌లో ఎనిమిది నెలల పాటు చేయనున్న ఈ సాహసయాత్ర విజయవంతం కావాలని ఈ కార్యక్రమానికి హాజరైన ప్రతి ఒక్కరూ కోరుకున్నారు.

ఐదు అంచెల యాత్ర

యాభై ఆరు అడుగుల పొడవుండే సెయిల్ బోట్ తారిణిలో కమాండర్లు దిల్నా, రూప ఒకరికి ఒకరు తోడుగా నిలిచి మొత్తం 23000 నాటికల్ మైళ్ల అంటే 40000 కిలోమీటర్లు ప్రయాణం చేయాలి. అక్టోబర్ 2న గోవా నుంచి బయలుదేరిన వీరు ఈ యాత్రను ఐదు భాగాలుగా చేస్తారు.

1. గోవా నుంచి ఆస్ట్రేలియా 2.ఆస్ట్రేలియా నుంచి న్యూజిలాండ్ 3. న్యూజిల్యాండ్ నుంచి ఫాక్‌ల్యాండ్ ఐలాండ్స్ (దక్షిణ పసిఫిక్ సముద్రం) 4.ఫాక్‌ల్యాండ్ నుంచి సౌత్ ఆఫ్రికా 5. సౌత్ ఆఫ్రికా నుంచి గోవా. భారతీయ మహిళలు అత్యంత శక్తిమంతులని ప్రపంచ దేశాలకు చాటి చెప్పేందుకు సాగుతున్న ఈ యాత్ర కోసం తరిణికి సారథిగా లెఫ్టినెంట్ కమాండర్ దిల్నా.కే వ్యవహరిస్తుండగా.. మరో లెఫ్టినెంట్ కమాండర్ రూపా సారథ్యం వహిస్తున్నారు.

మైక్రోప్లాస్టిక్స్‌పై పరిశోధన

'నావికా సాగర్ పరిక్రమ–2' మన స్త్రీ శక్తిని నిరూపించడానికే కాదు 'నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫీ'తో అనుసంధానమై సముద్ర జలాల్లోని మైక్రోప్లాస్టిక్స్‌ను అధ్యయనం చేయడానికి కూడా ఉపయోగపడనుంది. అలాగే 'వైల్డ్‌లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా'తో కలిసి సముద్రాలలోని పుష్పపత్రాలు, భారీ సముద్ర జీవులపై కూడా పరిశోధనకు అవసరమైన సమాచారం కూడా సేకరిస్తారు. వీటన్నింటికి వీలుగా 'తారిణి'ని సిద్ధం చేశారు. ఈ బోట్ ముందు భాగంలో మాస్ట్‌సెయిల్స్ ఉంటాయి. వెనుక భాగంలో రెండు స్టీరింగ్ వీల్స్, ఆటో పైలట్ సిస్టమ్, నెలకు 20 జీబీ వినియోగించుకునే సౌకర్యంతో కూడిన శాటిలైట్ యాంటెన్నా ఉంటుంది. సముద్ర జలాల్ని శుద్ధి చేసి గంటకు 30 లీటర్ల మంచినీరు ఇవ్వగల ఆర్‌వో ప్లాంట్ అమర్చారు. అవసరమైన సందర్భాల్లో వినియోగించుకునేందుకు 22 తాళ్లను అందుబాటులో ఉంచారు. ల్యాప్‌టాప్‌లు, మ్యూజిక్ సిస్టం సైతం బోట్‌లో ఉన్నాయి.

బోట్ తయారీలో అధికభాగం ఫైబర్ గ్లాస్‌ను ఉపయోగించారు. వీరి యాత్రను జీపీఎస్ విధానం ద్వారా ట్రాక్ చేస్తూ ప్రయాణం ఎలా సాగుతోందో భారత నౌకాదళం నిరంతరం పర్యవేక్షిస్తుంటుంది.

సోదరి ఇచ్చిన పాండా బొమ్మతో

'ప్రయాణం చేయడానికి భయం లేదని చెప్పడం లేదు. కానీ అంతకుమించిన ఆత్మ విశ్వాసం కూడా ఉంది. ఈ ప్రయాణంలో నాకు తోడుగా ఉంటుందని నా సోదరి పాన్‌పాన్ అని పిలుచుకునే పాండా బొమ్మ ఇచ్చింది. దీంతో పాటు ఖగోళశాస్త్రవేత్త కార్ల్‌సాగన్ రచించిన పుస్తకాలు తోడు తీసుకెళ్తున్నాను' అంది లెఫ్టినెంట్ కమాండర్ రూపా ఈ సందర్భంగా.

అమ్మ చేసిన ఊరగాయలతో

'సముద్రం ఒక గొప్ప గురువు. మాకు సహనాన్ని నేర్పిస్తుంది. బోట్‌ను మనం మంచిగా చూసుకుంటే, అది మనల్ని మంచిగా చూసుకుంటుందనే సూత్రాన్నే పాటిస్తాను. తరిణిలో మేమే ఇంజినీర్లం, ఎలక్ట్రీషియన్లం, కార్పెంటర్లం. వాతావరణ నివేదికల్ని అనుసరిస్తూ ప్రయాణం సాగించాలి. ఎనిమిది నెలల పాటు తరిణిలోనే మా నివాసం కాబట్టి పుస్తకాలు తెచ్చుకున్నా. కుటుంబ సభ్యులు, ఫ్రెండ్స్ ఇచ్చిన గిఫ్ట్స్, సంగీత వాద్య పరికరాలతోపాటు అమ్మ చేసిన ఊరగాయలు, కాలికట్ చిప్స్, టాపియోకా చిప్స్ తీసుకెళ్తున్నా. ఈ ప్రయాణం మొత్తానికి సరిపడా దోశల పిండి కూడా మా వెంట తీసుకువెళుతున్నాం. డిఫెన్స్ ఫుడ్ రీసెర్చ్ లేబొరేటరీ రూపొందించిన ప్రత్యేకమైన ఆహారాన్ని మాకు అందుబాటులో ఉంచారు' అని తెలిపింది లెఫ్టినెంట్ కమాండర్ దిల్నా.

వీరి యాత్ర సఫలం కావాలని కోరుకుందాం.

– కరుకోల గోపీకిశోర్ రాజా, సాక్షి, విశాఖపట్నం

లీగల్

ఆ రియల్ ఎస్టేట్ సంస్థపై కేసు పెట్టచ్చు

ప్రశ్న: మేము లోన్ ద్వారా ఒక రియల్ ఎస్టేట్ సంస్థ వద్దనుంచి నిర్మాణదశలోనే ఫ్లాట్ కొన్నాము. ఒప్పందం ప్రకారం పది నెలల లోగా ఫ్లాటు మాకు పూర్తి చేసి ఇవ్వాలి. కానీ సంవత్సరం అయినా ఇంకా పూర్తి చేయలేదు. లోను నెలవారీ వాయిదాలు కట్టడం కూడా మొదలైంది. ఈ పరిస్థితుల్లో మేము ఏం చేయాలి? పరిష్కారం చెప్పగలరు.

– టి.ఆర్. రాజేశ్వరి, హైదరాబాద్

సర్వసాధారణంగా రియల్ ఎస్టేట్ సంస్థవారు, మీరు రాసుకునే ఒప్పంద పత్రం అంటే అగ్రిమెంట్‌లో సమయానికి ఫ్లాట్ నిర్మాణం పూర్తి చేసి, మీకు అందజేయకపోతే అందుకుగాను తాత్కాలిక పరిహారం/ఉపశమనం ఏం చేస్తారో రాసుకుంటారు. కొన్ని సందర్భాలలో ఫ్లాట్ అప్పగించేంతవరకు అద్దె ఇవ్వటం లేదా మీ తరఫున నెలవారీ లోను డబ్బులు సదరు కంపెనీ వారే కట్టేలా ఒప్పందాలు కూడా రాసుకుంటారు. మీ ఒప్పందపత్రంలో కూడా అటువంటి కండిషన్ ఏమైనా ఉందేమో చూసుకోండి. ఏది ఏమైనా ఒప్పందాన్ని ఉల్లంఘిస్తే, మీరు సదరు రియల్ ఎస్టేట్ సంస్థపై వినియోగదారుల రక్షణ చట్టం కింద కేసు వేయవచ్చు. మీకు జరిగిన ప్రతి నష్టాన్ని లెక్కగట్టి దానికి తోడు మీకు కలిగిన మానసిక క్షోభకి కూడా అదనంగా పరిహారం కోరవచ్చు, పొందవచ్చు. అదనంగా... ఒకవేళ మీరు కొన్న ఫ్లాట్ ప్రాజెక్టు రెరా (రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ) లో రిజిస్టర్ అయి ఉంటే అదనంగా రెరాకు కూడా ఫిర్యాదు చేయవచ్చు. మీ అగ్రిమెంటు, ఆస్తి కొనుగోలు పత్రాలు తీసుకొని దగ్గర్లోని లాయర్‌ని కలవండి.

మొదటగా ఒక నోటీసు పంపి, అప్పటికీ కూడా మీకు పరిష్కారం దొరకకపోతే, పైన తెలిపిన విధంగా దావా వేసి న్యాయం పొందవచ్చు. వినియోగదారుల చట్టం ప్రకారం మీ కేసు మీరు కూడా వాదించుకోవచ్చు లేదా మీ తరఫున మరెవరినైనా 'ఆథరైజ్డ్ పర్సన్'గా నియమించుకోవచ్చు. 50 లక్షల దావా వరకు జిల్లా వినియోగదారుల ఫోరంలో, 50 లక్షల నుంచి రెండు కోట్ల వరకు రాష్ట్ర ఫోరంలో అలాగే రెండు కోట్ల పైన విలువ గల దావాకి జాతీయ వినియోగదారుల ఫోరంలో మీ ఫిర్యాదును నమోదు చేయాల్సి ఉంటుంది.



– శ్రీకాంత్ చింతల
హైకోర్టు న్యాయవాది

మీకున్న న్యాయపరమైన సమస్యలు, సందేహాలకోసం sakshifamily3@gmail.com కు మెయిల్ చేయవచ్చు.



"ఇది నవరాత్రుల పవిత్ర సమయం. ప్రజలు దుర్గాదేవి పట్ల భక్తితో వివిధ మార్గాల్లో కలిసి మెలిసి పూజలు జరుపుకుంటున్నారు. ఈ సంతోషంతో ఆమె దయకు పరవశుడనై రాసిన 'ఆవతికలాయ్' అనే గర్బా గేయాన్ని ఇక్కడ ఉంచాను. ఆమె ఆశీస్సులు మనపై ఎప్పుడూ ఉండాలి" అంటూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. గాయని పూర్వామంత్రి పాడిన ఈ గేయం గర్బా నృత్యానికి ఉన్న ప్రాధాన్యత తెలుసుకునేలా చేయడంతో పాటు ప్రతి మదిని ఆధ్యాత్మిక సౌరభమై తాకుతోంది. సోషల్ మీడియా వేదికగా వైరల్ అవుతోంది.

● భక్తి

ఆటా పాటగ మారిన స్త్రీశక్తి


గర్బా నృత్యం

గర్బా నృత్యం అనగానే సంప్రదాయదుస్తులు ధరించిన సమూహాలు, ఆనందంగా నృత్యం చేస్తున్న దృశ్యాలు మన కళ్లముందు మెదలుతాయి. ఆధ్యాత్మిక బలానికి మానసికోల్లాసాన్ని కలిపి జరుపుకునే ఈ వేడుక మొదట గుజరాతీ గ్రామాలలో పుట్టి, దేశ ఎల్లలు దాటి నేడు ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటున్నారు.

చిల్లులు గల మట్టి కుండలో దీపం వెలిగించి, తలపైన పెట్టుకుని అమ్మవారి విగ్రహం చుట్టూ వలయాకారంగా తిరుగుతూ భక్తి పారవశ్యంలో నృత్యం చేస్తారు. మట్టికుండ తల్లి గర్భాన్ని, జ్యోతి నుండి వెలువడే కాంతి లోపల పెరుగుతున్న కొత్త జీవిని సూచిస్తుంది. భక్తుల కోసం రాక్షసుడితో పోరాడిన దేవత పట్ల తమ ప్రేమ, కృతజ్ఞతలను ఈ నృత్యం ద్వారా తెలియజేస్తారు. మనలో ఉన్న అన్ని చెడులను నాశనం చేయడానికి, లోపల ఉన్న శక్తిని మేల్కొలిపే విధానంగా కూడా గర్బా నృత్యాన్ని చెబుతారు. గర్బా నృత్య రూపం స్త్రీత్వం, సంతానోత్పత్తిని తెలియజేస్తుంది. ఇందులో భజనలు, కీర్తనలకు చోటు ఎక్కువ. ఎక్కువ భక్తి ఆకర్షణను కలిగి ఉండే గర్బాను అమ్మవారి హారతికి ముందు నిర్వహిస్తారు.

కాలచక్రం .. పునరావృతం

దేవీ ఆరాధనలో భాగంగా చెప్పుకునే ఈ నృత్యాన్ని స్త్రీ–పురుషులు ఇద్దరూ తొమ్మిది రాత్రులు చేస్తారు. చాలా మంది ఈ తొమ్మిది రోజులూ కొన్ని ప్రత్యేక ఆహార నియమాలు, ఉపవాసాలు పాటిస్తారు. కాలచక్రం ఎప్పుడూ తిరుగుతూ పునరావృతం అవుతుంది. పుట్టుక నుంచి మరణం వరకు, మరణం నుంచి పునర్జన్మ వరకు ఆత్మ తిరుగుతూ ఉంటుంది. ఈ అన్ని అంశాల్లోనూ కదలకుండా నిరంతరాయంగా ఉండేది దైవశక్తి ఒకటే. దానికి ప్రతీకగా నృత్య వలయం మధ్య దేవీ ప్రతిమ లేదా పెద్ద దీపపు సెమ్మెను పెడతారు. జీవన చక్రం దాని చుట్టూనే పరిభ్రమిస్తుంటుందని చెప్పేందుకు ఇదొక ప్రతీక.

మహిషుని అంతం చేసిన మహిళా శక్తి

ఒక్క స్త్రీ చేతిలో తప్ప మరెవరి చేతిలోనూ మరణించకుండా ఉండాలన్న వరబలంతో మహిషాసురుడు తన శక్తులను చెడు కోసం ఉపయోగించడం ప్రారంభించాడు. అతడి దాడికి దేవతలు నిస్సహాయులైపోయారు. దుర్గాదేవి వద్దకు వెళ్లి, వేడుకున్నారు. దుర్గాదేవి ఒక్క కంటిచూపుతో ఆ రాక్షసుని అంతం చేయగలదు. కానీ, అసుర సంహారానికి ముందు తొమ్మిది పగళ్లు, తొమ్మిది రాత్రుల పాటు సాగిన సర్వోన్నతమైన యుద్ధం ద్వారా మానవాళికి గొప్ప సందేశాన్ని ఇచ్చింది. అసాంఘిక, అధార్మిక శక్తులు ఎంత బలంగా కనిపించినా, యుద్ధం ఎంతకాలం సాగినా, చివరికి ధర్మమే విజయం సాధిస్తుందని ఈ కథ ద్వారా మనకు తెలుస్తుంది. ఈ కథనాన్ని గర్బా నృత్యం ద్వారా ప్రదర్శించడం అంతర్లీనంగా కనిపిస్తుంది.

బేతే గర్బా

గుజరాత్‌లోని నాగర్ కమ్యూనిటీ 'బేతే గర్బా' అంటే కూర్చున్న గర్బా అని జరుపుకుంటారు. ఇక్కడ, భక్తులు ఒకరి ఇంటి వద్ద గుమిగూడి, గర్బా పాటలు పాడతారు. హిందువులు తమ పండుగలను బహిరంగంగా జరుపుకోవడాన్ని నిజాం నిషేధించినప్పుడు, ఇస్లామిక్ పాలనలో జునాగఢ్ లో బేతే గర్బా ప్రారంభమైంది. చాలామంది కఠినమైన ఉపవాస దీక్షలో ఉన్నప్పటికీ నృత్యం, సంగీతంతో ఉల్లాసంగా మారిపోతారు. ఉత్తర భారతదేశంలో గర్బా లో భక్తులు తబలా, మంజీరను ఉపయోగిస్తారు.

సంప్రదాయ దుస్తులతో...

ఈ నృత్యంలో మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి, శక్తి దేవత ఆశీర్వాదాలు కోరుకుంటూ నృత్యం చేస్తారు. గర్బా, దాండియా ఒకే విధంగా కనిపించినా, ఈ రెండింటికి వ్యత్యాసం ఉంది. గర్బాలో చేతులు, కాళ్లను సమన్వయంతో కదిలిస్తూ చేస్తారు. దాండియాలో కోలాటం కర్రలను ఉపయోగిస్తారు. గర్బా పాటలు దుర్గాదేవి, ఆమె అవతారాల చుట్టూ ఉంటే, దాండియాలో పాటలు కృష్ణుడి రాసలీలలపై ఉంటాయి.

పాదరక్షలు లేకుండా..

గర్బా దైవారాధనా రీతుల్లో చెప్పులు ధరించకపోవడం సకల జీవులకు ఆలవాలమైన భూదేవి పట్ల మనం చూపే గౌరవంగా భావిస్తారు. భూమిని నిరంతరం అంటి పెట్టుకుని ఉండే ఈ పాదాల ద్వారానే శరీరంలోకి శక్తి ప్రవాహం జరుగుతుందని నమ్మకం. ఆ దేవితో మనకు నేరుగా సంబంధాన్ని కల్పించేవి పాదాలే. అందుకే చెప్పులు లేకుండా చేసే ఈ నృత్యం పవిత్రమైన దైవారాధన వంటిది.

గర్బా.. యునెస్కో

నవరాత్రి ఉత్సవాలను గుజరాత్‌తో పాటు దేశంలోని అనేక ప్రాంతాలలో నిర్వహిస్తుంటారు. మన దేశానికే ప్రత్యేకమైన ఈ ప్రముఖ నృత్యాన్ని యునెస్కో 'ఇంటాంజిబుల్ కల్చరల్ హెరిటేజ్ ఆఫ్ హ్యూమానిటీ' (ఐసీహెచ్) జాబితాలో కిందటేడాది చేర్చింది. అమ్మవారి ఎదుట భక్తిని నృత్యరూపంలో చాటే ఈ ప్రాచీన సంప్రదాయం ఇప్పటికీ ఎప్పటికీ సజీవమే అనడానికి ప్రతీకగా నిలుస్తోంది గర్బా.





దేవుడు తన రెండు కాళ్లనూ బలహీనపరిచినా.. అవరోధాలనే అవకాశాలుగా మలుచుకుని తన జీవితాన్ని, తానే నిలబెట్టుకున్నారామె. ఇప్పుడు తన లాంటి దివ్యాంగుల ఉద్ధరణకు నడుం బిగించి వారికీ బతుకుబాట చూపుతున్నారు. ఆమే దీ హబ్ వ్యవస్థాపకురాలు కొప్పుల వసుంధర. ఉన్న చోటే వారు వ్యాపారం చేసుకునేలా అవగాహన కల్పిస్తూ రిజిస్ట్రేషన్, పెట్టుబడి, మార్కెటింగ్ వంటి అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. ఆమె ఇంటర్వ్యూని ఈ లింక్‌ను క్లిక్ చేసి సాక్షి @ నవశక్తిలో చూసేద్దాం.

https://www.youtube.com/watch?v=0c7--NycLyU

టెక్నాలజీ

స్వాగతం.. సుస్వాగతం



బెంగళూరులోని ఒక హోటల్‌లోకి అడుగు పెట్టిన అనన్య నారంగ్‌కు రిసెప్షనిస్ట్ స్వాగతం పలికింది.

అనన్యలో షాక్‌లాంటి ఆశ్చర్యం.

'ఇందులో ఆశ్చర్యపోవాల్సింది ఏముంది!' అనే కదా మీ డౌటు.

అయితే సదరు ఈ రిసెప్షనిస్ట్ సాధారణ రిసెప్షనిస్ట్ కాదు... వర్చువల్ రిసెప్షనిస్ట్!

'సిలికాన్ వ్యాలీ ఆఫ్ ఇండియా బెంగళూరులో వర్చువల్ రిసెప్షనిస్ట్' వార్త సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. మన దేశంలో నవీన సాంకేతికత గురించి వివరంగా మాట్లాడుకునేలా చేస్తోంది.

'సాంకేతికత సహాయంతో తక్కువ సిబ్బందితో ఎక్కువ పనులను ఏకకాలంలో సమన్వయం చేస్తున్నారు. సిలికాన్ వ్యాలీలో తప్ప మన దేశంలో ఎక్కడా ఇలాంటి దృశ్యం కనిపించదు' అంటూ ఈ 'వర్చువల్ రిసెప్షనిస్ట్' ఫొటోని షేర్ చేసింది అనన్య.

'ఎంత సాంకేతిక ప్రగతి' అనే ప్రశంసల మాట ఎలా ఉన్నా... 'అబ్బబ్బే! ఇదేం ప్రగతి. అందమైన మానవ రిసెప్షనిస్ట్ స్వాగతం పలకడానికి, వర్చువల్ రిసెప్షనిస్ట్ స్వాగతం పలకడానికి చా...లా తేడా ఉంటుంది' అనే వాళ్లే ఎక్కువ!

● చిన్నారులపై జచింత

నెత్తుటేరుల అవార్డ్ నాకొద్దు

తన ఆదివాసీల సామాజిక, సాంస్కృతిక జీవితం గురించి లోతుగా రాయడమే కాదు పిల్లల ప్రపంచం గురించి కూడా రాస్తోంది కవయిత్రి జసింతా కెర్కెట్టా.

ఎక్కడ చూస్తే అక్కడ వారై – విశ్వరూపమున విహరిస్తున్న ఈ కాలంలో పిల్లల కోసం జసింత రాసిన 'జిర్హుల్' అనే పుస్తకానికి 'రూమ్ టు రీడ్ యంగ్ రైటర్–2024' అవార్డ్ ప్రకటించారు. పాలస్తీనాలో బాంబు దాడుల్లో మరణించిన, హింసకు గురవుతున్న పిల్లలను దృష్టిలో పెట్టుకొని ఈ అవార్డ్‌ను జసింత తిరస్కరించింది.

'రూమ్ టు రీడ్ ఇండియా' అనేది అక్షరాస్యత, లింగ సమానత్వం... మొదలైన వాటిపై పనిచేసే స్వచ్ఛంద సంస్థ. ఈ సంస్థకు ఏరోస్పేస్ దిగ్గజం 'బోయింగ్'తో సంబంధం ఉంది అని ఆరోపిస్తూ తనకు ప్రకటించిన అవార్డ్‌ను జసింత కెర్కెట్టా తిరస్కరించింది. 'బోయింగ్‌కు ఇజ్రాయెల్ సైన్యంతో 75 ఏళ్లుగా సంబంధం ఉంది. ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ (ఐడీఎఫ్)కు ఆయుధాలను సరాఫరా చేసే కీలక సంస్థ అయిన బోయింగ్ 'రూమ్ టు రీడ్ ఇండియా ట్రస్ట్'కు నిధులు అందజేస్తుంది' అని జసింత తన తిరస్కరణ కారణాలపై ఆ ట్రస్ట్‌కు లేఖ రాసింది.

'ఆయుధాలతో పిల్లల ప్రపంచం నాశనం అవుతున్నప్పుడు ఆయుధాల వ్యాపారం, పిల్లల సంరక్షణ ఏకకాలంలో ఎలా కొనసాగుతాయి?' అని ఆ లేఖలో ప్రశ్నించింది జసింత.

'సాహిత్యంలో వైవిధ్యమైన, పిల్లల కోసం రాస్తే పుస్తకాలు తక్కువగా వస్తున్నాయి. బాల సాహిత్యానికి సంబంధించిన జిర్హుల్ పుస్తకానికి అవార్డ్ రావడం సరియైనదే అయినా ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా ఈ అవార్డ్‌ను స్వీకరించలేను' అని చెప్పింది.

ఈ తిరస్కరణ మాట ఎలా ఉన్నా 'సాహిత్యానికి జసింత కెర్కెట్టా చేసిన కృషి విలువైనదిగా భావిస్తున్నాం' అని స్పందించింది 'రూమ్ టు రీడ్ ఇండియా' ట్రస్ట్. ఇప్పుడు మాత్రమే కాదు సామాజిక కారణాలతో తనకు వచ్చిన కొన్ని అవార్డ్‌లను గతంలోనూ తిరస్కరించింది జసింత.

పిల్లల్లో సామాజిక చైతన్యం

'పిల్లలూ... మీరు ఎన్ని పువ్వుల గురించి విన్నారు? పూలన్నింటి గురించి తెలియనప్పుడు, కొన్ని పువ్వుల గురించి మాత్రమే తెలిసినప్పుడు... అవి మాత్రమే గొప్ప పుష్పాలూ, ప్రత్యేకమైన పుష్పాలూ ఎలా అవుతాయి? ఇవి మాత్రమే కాదు జిరాహుల్, జితంగి, సోనార్లి, సరాయ్, కోయినార్, సనాయ్ లాంటి ఎన్నో పూలు ఉన్నాయి' అంటూ పది పువ్వుల గురించి జసింత కవిత్వం రాసింది. ఈ పువ్వుల గురించి ఎప్పుడూ వినని, ఎప్పుడూ చూడని పిల్లలు కూడా జసింత రాసిన కవిత్వం చదివి, పక్కన ఉన్న బొమ్మలు చూస్తే ఎక్కడ ఏ పువ్వు కనిపించినా ఇట్టే గుర్తు పట్టేస్తారు.

ఈశ్వర్ ఔర్ బజార్, జసింతా కీ డైరీ, ల్యాండ్ ఆఫ్ ది రూట్స్‌తో సహా ఏడు పుస్తకాలు రాసింది.

'జిర్హుల్'లో పువ్వుల ప్రపంచం కనిపించినప్పటికీ అది అణగారిన వర్గాల కోసం ప్రతీకాత్మకంగా రాసిన పుస్తకం. ఆదివాసీ సంస్కృతి ఆధారంగా చేసుకొని పిల్లల్లో సామాజిక, రాజకీయ చైతన్యాన్ని పెంపొందించడమే ఈ పుస్తక లక్ష్యం. గాజాలో పదహారువేల మందికి పైగా చిన్నారులు మరణించారు. నెత్తుటేరులు పారాయి. ఈ నేపథ్యంలో 'రూమ్ టు రీడ్ యంగ్ రైటర్' అవార్డ్‌ను జసింత తిరస్కరించింది.




జసింతా కెర్కెట్టా

ఉద్యమ నేపథ్యం...

ఝార్ఖండ్‌లోని ఖుదపోష్ గ్రామంలో ఆదివాసీ కుటుంబంలో పుట్టిన జసింత మాస్ కమ్యూనికేషన్, వీడియో ప్రొడక్షన్‌లో డిగ్రీ చేసింది. రాంచీలోని ఒక ప్రముఖ దినపత్రికలో పని చేసింది. కెరీర్ పరంగా ఎంత ముందుకు వెళ్లినా తన మూలాలను మాత్రం మరవలేదు. 'ఆదివాసీ అండ్ మైనింగ్ ఇన్ ఫైవ్ డిస్ట్రిక్ట్స్ ఆఫ్ ఝార్ఖండ్' పేరుతో అధ్యయన పత్రాన్ని వెలువరించింది.

'ఇండిజినస్ వాయిస్ ఆఫ్ ఆసియా' అనే పరిశోధన పత్రానికి ఇండిజినస్ పీపుల్స్ ఫ్యాక్ట్ అవార్డు లభించింది. జర్నలిస్ట్‌గానే కాదు కవిత్వానికి సంబంధించి సృజనాత్మక రచనలతోనూ ఎన్నో అవార్డ్‌లు అందుకుంది. తన కవిత్వం విషయానికి వస్తే అది ఆకాశపల్లకిలో ఊరేగదు. జ్ఞాపకాలను నెమరు వేసుకునేలా ఉంటుంది. గాయాలను గుర్తు తెచ్చుకునేలా ఉంటుంది. బూటకపు అభివృద్ధిని ప్రశ్నించేలా ఉంటుంది.

జసింత మనోహర్‌పూర్‌లోని మిషనరీ బోర్డింగ్ స్కూల్‌లో చదువుతున్న రోజుల్లో తల్లి పుష్ప అనిమ తండ్రి చేతిలో తరచు హింసకు గురయ్యేది. మరచిపోలేని ఆ హింసాత్మక దృశ్యాలు తన కవిత్వంలో కనిపిస్తాయి. వ్యక్తిగత చేదు అనుభవాలే కాదు అభివృద్ధి పేరుతో ఆదివాసీ గ్రామాల్లో జరుగుతున్న విధ్వంసం కూడా జసింత కవిత్వంలో కనిపిస్తుంది.

జసింత కెర్కెట్టా జర్నలిస్ట్ మాత్రమే కాదు సోషల్ యాక్టివిస్ట్ కూడా. బాలికల విద్యకు సంబంధించి ఎన్నో ఆదివాసీ గ్రామాల్లో పనిచేసింది. ఫోర్బ్స్ ఇండియా 'టాప్ 20 సెల్ఫ్‌మేడ్ ఉమెన్'లో ఒకరిగా ఎంపిక అయింది.


'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండుగ రోజు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 22 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 199

బుధవారం 9-10-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


దసరా శుభాకాంక్షలతో...
సోనోవిజన్ దసరా సేల్
LG Life's Good 208 Cm (83") 4K OLED Flexi EMI : 6999/-
SAMSUNG 189 Cm (75") LED 4K Ultra UHD Flexi EMI : 3990/-
SONY 164 Cm (65") LED 4K Ultra HD Smart Flexi EMI : 6500/-
Panasonic 108 Cm (43") LED 4K HD EMI : 2791/-
Haier 139 Cm (55") LED 4K HD Smart Flexi EMI : 1994/-
LLOYD 108 Cm (43") LED 4K HD EMI : 2167/-
BPL 108 Cm (43") 4K HD Ultra LED EMI : 2210/-
iPhone16, 16+ 10000/- Cash Back 12/0 & 24/8 Schemes Available Selected Bank Cards (Exchange Bonus) EMI : 2933/-
vivo V-40 - 5G V-40 Pro - 5G Ram Expandable 7/1,6/0 & 9/0 Schemes Available EMI : 4666/-
SAMSUNG S-24 Ultra Mobile 12000/- Cash Back 24/0 Scheme Available EMI : 4875/-
oppo F-27 PRO 5G 8/0, 9/0 Schemes & 12/1 Scheme Available EMI : 2500/-
ONEPLUS 12 & 12 Pro 5G Ram Expandable Instant Cash Back ICICI Credit Card 12/4 Scheme Available EMI : 3750/-
realme 5G 13 Pro, 13 Pro+ 6/0, 8/2, 10/3 Schemes Available Selected Models EMI : 3700/-
Smart Watch Ear Buds Mobile Accessories Boat, Realme, Fastrack, Hapipola
hp 12/4 Scheme Available EMI : 4333/-
DELL 15/4 Scheme Available EMI : 4583/-
ASUS 12/4 Scheme Available EMI : 3960/-
Lenovo 12/4 Scheme Available EMI : 4166/-
MacBook 24/0 Scheme Available EMI : 4166/-
Sound Bar
LG Life's Good 5Star & 3Star Dual Inverter A.C Starting EMI : 2959/-
LLOYD 5Star & 3Star Inverter A.C Starting EMI : 3000/-
BLUE STAR 5Star & 3Star Inverter A.C Starting EMI : 3042/-
DAIKIN 5Star & 3Star Inverter A.C Starting EMI : 3000/-
VOLTAS 5Star & 3Star Inverter A.C Starting EMI : 2875/-
HITACHI 5Star & 3Star DC Inverter A.C Starting EMI : 3000/-
Haier 5Star & 3Star Inverter A.C Starting EMI : 2916/-
LG Life's Good Side by Side 633 Litres Refrigerator EMI : 13250/-
SAMSUNG Side by Side 653 Litres Refrigerator EMI : 5917/-
Whirlpool Frost Free Double Door 260 Litres Refrigerator EMI : 1750/-
LG Life's Good Frost Free Double Door 240 Litres Refrigerator EMI : 1900/-
Haier Frost Free Double Door 240 Litres Refrigerator EMI : 1691/-
Godrej Frost Free Double Door 233 Litres Refrigerator EMI : 1778/-
LG Front Load Automatic Washing Machine 9 KGS EMI : 2765/-
SAMSUNG Front Load Automatic Washing Machine 8 KGS EMI : 3050/-
BOSCH Front Load Automatic Washing Machine 6.5 KGS EMI : 2667/-
IFB Top Load Automatic Washing Machine 7 KGS EMI : 1667/-
Whirlpool Top Load Automatic Washing Machine 7.5 KGS EMI : 1292/-
Panasonic Top Load Automatic Washing Machine 8 KGS EMI : 1584/-
LLOYD Semi Automatic Washing Machine 6.5 KGS EMI : 734/-
HOME APPLIANCES
Water Dispenser Rs:8000/-
Water Purifier RO Rs:12000/-
Water Geyser 10 Litres Rs:6200/-
Microwave Oven Rs:6600/-
Air Chimney Rs:8100/-
3 Burner Glass Cooktop Rs:5000/-
Wet Grinder Rs:3400/-
Rice Cooker Rs:1650/-
Mixer Grinder 3 Jar, 750 Watts Rs:2900/-
Juicer
Air Fryer
Kettle
Iron Box
Blender
T & C Apply
Carrier EUREKA FORBES KENT pureit Sunflame Preethi Butterfly FABER KAFF V-GUARD KEELINE AO Smith UNISTAR Crompton MAHARAJA WHITELINE HAVELLS hindware morphy richards BAJAJ
You can take EMI with finance anywhere, wherever you are
No local address proof required
Special Offers On Mobiles & Laptops
AMAZON PAY Upto 2000/- CASH BACK Selected Bank Cards, Conditions Apply
అందరికన్న తక్కువ ధరలు, నమ్మకమైన సర్వీస్‌తో అందరి అభిమానం పొందిన షోరూం సోనోవిజన్
విశాఖపట్నం
డైమండ్‌పార్క్ - 1 ద్వారకా నగర్, వైజాగ్ 8333924946
డైమండ్‌పార్క్ - 2 ద్వారకా నగర్, వైజాగ్ 9246667474, 8333924929
ద్వారకానగర్ 2వ లైన్, పోలక్స్‌స్కూల్ ఎదురు, వైజాగ్. 8712635857, 858, 859.
శ్రీకన్య థియేటర్ ఎదురు, గాజువాక 9246667575, 9154281127
న్యూ గాజువాక జంక్షన్,గాజువాక. 9440804187, 9100991705
న్యూ సుకన్య థియేటర్,గోపాలపట్నం 9100991704, 9154281129
భారత్ పెట్రోల్ బంక్ ఎదురు, గోపాలపట్నం. 8712635833
కార్‌షెడ్ జంక్షన్, మధురవాడ. 9246666214, 9390006613
తూర్పు గోదావరి
కోటిపల్లి బస్టాండ్, రాజమండ్రి. 9246662288, 9246666212
జె.యన్.రోడ్, రాజమండ్రి. 9100991700, 9154281119
సాయికృష్ణ థియేటర్, ఇన్నిస్‌పేట, రాజమండ్రి. 9154281197, 98, 99
రామయ్య స్ట్రీట్, కాకినాడ. 9246665511, 9246666201
యన్.సి.సి.బోట్ క్లబ్ ఎదురు, సర్పవరం జంక్షన్, కాకినాడ. 7331149376, 77, 78
శ్రీ పొట్టి శ్రీరాములు జిల్లా
చెన్నయ్ బస్టాండ్ దగ్గర, నెల్లూరు. 9246666206, 9154279913
ముత్తుకూరు గేట్, మిని బైపాస్ రోడ్, నెల్లూరు.- 8712600519, 20, 21
పశ్చిమ గోదావరి
జువ్వల పాలెం రోడ్, భీమవరం. 8333924936, 9154281175
బడేటి పార్క్ ఎదురు, ఏలూరు. 9246666205, 9154281172
అశోక్ నగర్, ఏలూరు. 9390006620, 9154281112
అంజనాదేవి టెంపుల్, సత్రంపాడు, ఏలూరు - 8712635838, 839
సైడిపర్రు రోడ్, తణుకు. 8333924938, 9154281115
తాడేపల్లిగూడెం
గొల్లగూడెం సెంటర్, తాడేపల్లిగూడెం. 8712635854, 55, 56
విజయనగరం
3 లాంతర్ల సెంటర్, 9246666208, 9390006630
ఐస్ ఫ్యాక్టరీ జంక్షన్. 8712600523, 8712600535
శ్రీకాకుళం
రామలక్ష్మణ్ జంక్షన్, జి.టి.రోడ్, శ్రీకాకుళం. - 9154281140, 41
విజయవాడ ఎన్.టి.ఆర్. జిల్లా, కృష్ణా జిల్లా.
రామ మందిరం దగ్గర, ఏలూరు రోడ్, విజయవాడ. 9440804182, 9246666202
కంట్రోల్ రూమ్ దగ్గర, యం.జి.రోడ్, విజయవాడ. 9440804183, 9246666209
ఆల్ ఇండియా రేడియో ఎదురు, యం.జి.రోడ్, విజయవాడ. 9246666203, 9154281640
మోహన్‌దాస్ థియేటర్ దగ్గర, పటమట, విజయవాడ. 9246661616, 9100991702
శ్రీనగర్ కాలని, రింగ్ రోడ్, విజయవాడ. 8712600531, 532, 533
విజయప్లాజా (విజయటాకీస్) ఏలూరు రోడ్, విజయవాడ. 9154281648, 649, 650.
ప్రియదర్శిని థియేటర్ బిల్డింగ్, అరండల్‌పేట, విజయవాడ. 9100991701, 9246666664
ఎనికేపాడు, విజయవాడ. 9100991703, 9154281626
ఆంధ్రహాస్పిటల్ బిల్డింగ్, గొల్లపూడి, విజయవాడ. 8333924930, 9154281628
కానూరు, యం.జి.రోడ్, విజయవాడ. 8712600536, 8712600537
మెయిన్ రోడ్ సెంటర్, పోరంకి 9154281645, 46, 47
గుడివాడ
ఏలూరు రోడ్, గుడివాడ. 9100991708, 9154281178, 79
మచిలీపట్నం
మునిసిపల్ పార్క్ ఎదురు, రామనాయుడుపేట, కోనేరు సెంటర్, మచిలీపట్నం - 7331149379, 80, 81
గుంటూరు జిల్లా
జిన్నాటవర్ సెంటర్, గుంటూరు. 9154279910, 9440804185
లక్ష్మీపురం, మెయిన్ రోడ్, గుంటూరు. 9246667373, 9154867822, 23, 24
లక్ష్మీపురం, గుంటూరు. 9246666204, 9154279905
బ్రాడిపేట్, గుంటూరు. 9246666215, 9100991706
రత్నాటాకీస్ దగ్గర, తెనాలి. 8333924937, 9154279903
టౌన్ చర్చ్ ఎదురు, బోస్ రోడ్, తెనాలి. 9246666211, 9154279901
మునిసిపల్ ఆఫీస్ ఎదురు, రేపల్లె. 9390006609, 9154281200
కనకదుర్గమ్మ వారధి దగ్గర, తాడేపల్లి - 7331149366, 367, 368
ఒంగోలు
బాపూజి మార్కెట్, ఒంగోలు. 9246666329, 9154279911
రాయలసీమ
న్యూ బాలాజి కాలని, ఎయిర్ బైపాస్ రోడ్, తిరుపతి - 7331149370, 371, 372
అలిపిరి రోడ్, లీలామహల్ జంక్షన్, తిరుపతి - 9100991707, 9154279918
నేతాజి రోడ్, తిరుపతి. 9440804186, 9154279916
ఎగ్జిబిషన్ గ్రౌండ్ ఎదురు, పార్క్ రోడ్, కర్నూలు - 9154281642, 43.
అమ్మా హాస్పిటల్ సెంటర్, సి-క్యాంప్ ఆఫీస్, కర్నూలు - 8333924947, 48
హెచ్.పి.పెట్రోల్ బంక్ ప్రక్కన, సుభాష్ రోడ్, అనంతపురం - 9154281191, 92
రాజీవ్ గాంధి పార్క్ రోడ్, యన్.ఆర్.రాజీవ్ పార్క్ కడప - 9154281194, 96
పలమనేరు రోడ్, దర్గా ఎదురు, చిత్తూరు. 8712600528, 8712600530
తపోవనం స్కూల్ ఎదురు, వెల్లూరు రోడ్డు, చిత్తూరు. 8712635836, 46, 47
టి.టి.డి. కళ్యాణ మండపం ఎదురు, శ్రీనివాస నగర్ నంద్యాల - 8712600525, 526, 527
ఖమ్మం
కస్బాబజార్, ఖమ్మం. 9246666319, 9154281634
వైరా రోడ్, ఖమ్మం. 9100991709, 9154281635
పర్ణశాల ఎదురు, వైరారోడ్, ఖమ్మం. 8333924931, 9154281637, 38
కొత్తగూడెం
కొత్తగూడెం, భద్రాచలం రోడ్. 9154867825, 26, 27
మా నూతన షోరూం సందర్శించండి మహబూబ్‌నగర్
గవర్నమెంట్ హాస్పిటల్ దగ్గర, మెట్టుగడ్డ - 8712635851, 52, 53
మా నూతన షోరూం సందర్శించండి మిర్యాలగూడ
ఆర్&బి సాగర్ రోడ్, వైష్ణవిగ్రాండ్ దగ్గర 8712635848
హైదరాబాద్
పంజాగుట్ట, హైదరాబాద్. 9246663535, 9440804181
మెట్రోస్టేషన్ దగ్గర, కూకట్‌పల్లి. 9154281180, 9154281181
హైదర్ నగర్, హైదరాబాద్. 7331149363, 364, 365
మలక్‌పేట్, హైదరాబాద్. 8333924932 / 933
ఎల్.బి.నగర్, డి-మార్ట్ ఎదురు. 8333924943, 9154281188
కరీంనగర్
బి. పార్క్ ఎదురుగా, జగిత్యాల రోడ్ 8712635843, 44, 45
వేములవాడ రోడ్, మంకమ్మతోట 8712635841, 42

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 22 వెల: ₹ 5.50
సంపుటి: 17 సంచిక: 199
బుధవారం 9-10-2024
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'జల ప్రాజెక్టులపై జనం ఎన్నెన్నో ఆశలు పెట్టుకున్నారు. వాళ్ల నమ్మకం వమ్ము కాకుండా పనిచేయాలి'



దేశ రాజధాని ఢిల్లీలో 70వ జాతీయ చలన చిత్ర అవార్డుల ప్రదానోత్సవం మంగళవారం జరిగింది. రాష్ట్రపతి భవన్‌లో జరిగిన ఈ వేడుకలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము విజేతలకు పురస్కారాలు అందజేశారు.

- వివరాలు 16లో

న్యూస్‌రీల్

రాజకీయ లబ్ధి కోసం మా పరువు తీశారు



రాజకీయ లబ్ధి కోసమే అటవీ, దేవాదాయ శాఖల మంత్రి కొండా సురేఖ తమ కుటుంబంపై తప్పుడు వ్యాఖ్యలు చేశారని సినీ హీరో నాగార్జున నాంపల్లి కోర్టులో పేర్కొన్నారు. ఆమె చేసిన వ్యాఖ్యలన్నీ అవాస్తవాలేనన్నారు.

- వివరాలు 2లో ▶

బోర్డు తిప్పేసి.. రూ.7 వేల కోట్లు కొట్టేసి..



ఒకటి రెండు కాదు ఏకంగా రూ.7 వేల కోట్ల స్కాం జరిగింది. డీబీ స్టాక్ బ్రోకింగ్ సంస్థ అధిక వడ్డీ ఆశ చూపించి పెట్టుబడిదారులకు కుచ్చుటోపీ పెట్టింది. నగరానికి చెందిన వందలాది మంది మోసపోయారు.

- వివరాలు 15లో ▶

విద్యుత్‌శాఖలో ఖాళీలు భర్తీ చేస్తాం



'విద్యుత్ శాఖలో పదేళ్లగా ప్రమోషన్లు పెండింగ్‌లో ఉండగా, మా ప్రభుత్వమే ఇచ్చింది. ప్రస్తుతం ఈ శాఖలో ఖాళీల కారణంగా పనిభారం పడుతోంది. త్వరలో ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ ఇస్తాం' అని భట్టి చెప్పారు.


- వివరాలు 7లో ▶

64 ఏళ్ల తర్వాత...



- ఆసియా టీటీ చాంపియన్‌షిప్ సెమీ ఫైనల్లో భారత మహిళల జట్టు
- క్వార్టర్ ఫైనల్లో దక్షిణ కొరియాపై సంచలన విజయం

- 16లో



హరియాణాలో హ్యాట్రిక్

బీజేపీ అనూహ్య విజయం... కశ్మీర్‌లో ఎన్‌సీ-కాంగ్రెస్ కూటమి గెలుపు



ఎన్నికల ఫలితాల అనంతరం ఢిల్లీలో బీజేపీ ప్రధాన కార్యాలయం వద్ద అభివాదం చేస్తున్న ప్రధాని మోదీ. చిత్రంలో జేపీ నడ్డా

- హరియాణాలో 'ఎగ్జిట్ పోల్స్' తలకిందులు
- 48 చోట్ల కమలదళం జయకేతనం
- 37 స్థానాలతో సరిపెట్టుకున్న కాంగ్రెస్
- జమ్మూకశ్మీర్‌లో ఎన్‌సీ–కాంగ్రెస్ కూటమికి 49 సీట్లు... సీఎంగా ఒమర్ అబ్దుల్లా

6లో

హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో అనూహ్యంగా బీజేపీ హ్యాట్రిక్ విజయాన్ని నమోదు చేసింది. ఎగ్జిట్ పోల్స్ అంచనాలన్నింటినీ తలకిందులు చేస్తూ.. 48 సీట్లతో సొంతంగా మెజారిటీ సాధించింది. గెలుపు తమదేనన్న ధీమాతో వెళ్లిన కాంగ్రెస్ అంతర్గత కుమ్ములాటల నష్టాన్ని నివారించలేకపోయింది. మరోవైపు ఆర్టికల్ 370 రద్దు తర్వాత తొలిసారిగా జమ్మూకశ్మీర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో నేషనల్ కాన్ఫరెన్స్- కాంగ్రెస్ కూటమి విజయాన్ని సొంతం చేసుకుంది. సీపీఎంతో కలిసి కూటమికి 49 స్థానాలు లభించాయి.

హరియాణా అసెంబ్లీ ఫలితాలు

పార్టీ	సీట్లు
బీజేపీ	48
కాంగ్రెస్	37
ఐఎన్ఎల్‌డీ	2
స్వతంత్రులు	3
మొత్తం	90

జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఫలితాలు

పార్టీ	సీట్లు
నేషనల్ కాన్ఫరెన్స్	42
బీజేపీ	29
కాంగ్రెస్	6
పీడీపీ	3
జేపీసీ	1
సీపీఎం	1
ఆమ్ ఆద్మీ పార్టీ	1
స్వతంత్రులు	7
మొత్తం	90

కాంగ్రెస్ పార్టీకి నో ఎంట్రీ బోర్డులు పెట్టేశారు: మోదీ

6లో

హరియాణా ఫలితాలను ఒప్పుకోం



- 'ప్రజాతీర్పును అపహాస్యం చేస్తూ, ప్రజాస్వామ్యాన్ని ఖూనీచేస్తున్న ఫలితాలు ఇవి. వీటిని మేం ఒప్పుకోం. పారదర్శకమైన, ప్రజాస్వామ్యయుత పద్ధతి ఓటమిపాలైంది. హరియాణా అంకం ఇక్కడితో ముగిసిపోలేదు. ఇది ఇంకా కొనసాగుతుంది. ఇందులో కుట్ర దాగుంది' అని పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ అన్నారు.

6లో

'దారి' తప్పిన ఇసుక!



రీచ్‌ల నుంచి మార్కెట్ దాకా అమ్మకాల్లో మాయాజాలం

- చక్రం తిప్పుతున్న కాంట్రాక్టర్లు.. అధికారుల సహకారం
- వినియోగదారులకు మూడు, నాలుగు రెట్లు అధిక ధరకు అమ్మకాలు
- మరోవైపు కమర్షియల్ మార్కెట్‌కు తరలుతున్న బల్క్ అలాట్‌మెంట్లు
- ప్రభుత్వ పనుల పేరిట దరఖాస్తులు.. తీసుకెళ్లి బయట విక్రయాలు
- వర్షాలతో వాగులు, నదుల్లో ప్రవాహాలు పెరిగి ఇసుకకు కొరత
- దీన్ని భారీగా సొమ్ము చేసుకుంటున్న కాంట్రాక్టర్లు
- జల మండలి ఘటనతో అప్రమత్తమైన టీజీఎండీసీ యంత్రాంగం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఇసుక 'దారి' తప్పుతోంది. అటు ప్రభుత్వానికి ఆదాయం రాకుండా.. ఇటు జనానికి తక్కువ ధరకు దొరక్కుండా.. కాంట్రాక్టర్లు, దళారీల చేతిలో చిక్కుకుపోతోంది. ఇసుక విక్రయాల్లోని లొసుగులను వారు ఆసరాగా చేసుకుంటే.. అధికారుల కక్కుర్తి ఆ అవకతవకలకు తోడవుతోంది. అందులోనూ ప్రస్తుత వానాకాలంలో ఏర్పడిన ఇసుక కొరత అక్రమార్కులకు కాసుల వర్షం కురిపిస్తోంది. ప్రభుత్వ పనుల కోసమంటూ అడ్డగోలుగా బల్క్ అలాట్‌మెంట్లు చేయించుకుంటూ.. ఆ ఇసుకను వినియోగదారులకు అడ్డగోలుగా విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇటీవల జలమండలి పేరిట జరిగిన 'బల్క్ అలాట్‌మెంట్' వ్యవహారం దీనికి ఓ మచ్చుతునక మాత్రమే.

లొసుగులను వాడుకుంటూ..

రాష్ట్రంలో ఇసుక విక్రయాలతో ప్రభుత్వ ఖజానాకు ఏటా సుమారు రూ.700 కోట్ల మేర ఆదాయం సమకూరుతోంది. ప్రభుత్వం ఆన్‌లైన్‌లో ఇసుక విక్రయాల కోసం 'శాండ్ సేల్ మేనేజ్‌మెంట్,

మిగతా 7వ పేజీలో ▶

కొత్త టీచర్లకు నేడు నియామక పత్రాలు

ఎల్‌బీ స్టేడియంలో అట్టహాసంగా కార్యక్రమం

- జిల్లాల నుంచి నూతన ఉపాధ్యాయుల తరలింపు... సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు



సాక్షి, హైదరాబాద్: ఎట్టకేలకు 10 వేల మంది వరకూ రాష్ట్ర విద్యాశాఖలో ఉపాధ్యాయులుగా చేరబోతున్నారు. ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి వీరికి బుధవారం నియామక ఉత్తర్వులు నేరుగా అందించనున్నారు. హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో సాయంత్రం 4 గంటలకు పెద్దఎత్తున జరిగే ఈ కార్యక్రమానికి భారీ ఏర్పాట్లు చేశారు. కార్యక్రమ ఏర్పాట్లను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటికే ఎంపికైన కొత్త టీచర్లకు సంబంధిత జిల్లా కేంద్రాల డీఈవోల నుంచి ఫోన్‌కాల్స్ వచ్చాయి. ఉదయం డీఈవో ఆఫీసుకు రావాలని కోరారు. జిల్లాల నుంచి రవాణా సౌకర్యం ఏర్పాటు చేసినట్టు అధికార వర్గాలు తెలిపాయి. ప్రభుత్వ స్కూళ్లలో ఎస్‌జీటీలు, స్కూల్ అసిస్టెంట్లు, ఇతర టీచర్లు కలిపి మొత్తం 11,062 పోస్టుల భర్తీకి మార్చి 1న డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ పరీక్షకు 2.45 లక్షల మంది హాజరయ్యారు. జూలై 18 నుంచి ఆగస్టు 5 వరకూ ఆన్‌లైన్ విధానంలో డీఎస్సీ నిర్వహించారు. సెప్టెంబర్ 30న డీఎస్సీ మెరిట్ లిస్టును విడుదల చేశారు. ప్రతి పోస్టుకు ముగ్గురు చొప్పున ఎంపిక చేసి, జిల్లా సెలక్షన్ కమిటీకి పంపారు. వారం రోజుల్లోనే ధ్రువపత్రాల పరిశీలన చేశారు. ముగ్గురిలో ఒకరిని జిల్లా సెలక్షన్ కమిటీ ఎంపిక చేసింది. వీరికి నియామక పత్రాలను అందించబోతున్నారు.

10,006 పోస్టుల భర్తీ..

మొత్తం 11,062 టీచర్ పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చినప్పటికీ, ప్రస్తుతం 10,006 పోస్టులను మాత్రమే భర్తీ చేస్తున్నారు. మిగతా పోస్టుల్లో కొన్ని బ్యాక్‌లాగ్‌లపై నిర్ణయం తీసుకోలేదు. కొన్ని న్యాయపరమైన వివాదాల వల్ల ఆగిపోయాయి. కొన్ని పోస్టులకు సరైన అభ్యర్థి దొరకలేదని అధికారులు తెలిపారు. ఎస్‌జీటీ, ఎస్‌ఏ రెండు ఉద్యోగాలు వచ్చిన వాళ్లు 700 మంది వరకూ ఉన్నారు. వీరిని గుర్తించి, ఏదైనా ఒకదానిలో కొనసాగేందుకు ఐచ్ఛికం ఇచ్చారు. ఇతర ఉద్యోగాల్లో ఉన్న వారికి టీచర్ పోస్టులు వచ్చాయి. ఇవన్నీ క్రోడీకరించిన తర్వాతే తుది జాబితాను విడుదల చేశారు.

జిల్లాల వారీగా నోటిఫైడ్ పోస్టుల వివరాలు సాక్షి ప్లస్‌లో



బతుకమ్మ ఉత్సవాల్లో భాగంగా అమెరికాలోని వివిధ ప్రాంతాల్లో పూల సోయగం వెల్లివిరిసింది. తెలంగాణ పీపుల్స్ అసోసియేషన్ డాలస్ ఆధ్వర్యంలో టెక్సాస్ ఈవెంట్ సెంటర్‌లో నిర్వహించిన ఉత్సవాలకు పదివేల మంది హాజరై ఆడిపాడారు.

సేఫ్ జోన్ ఎక్కడ ?

- తెలంగాణ వైపు మళ్లీ వచ్చేందుకు మావోయిస్టుల ముమ్మర యత్నాలు
- సరిహద్దుల్లో కాచుక్కూర్చున్న పోలీసు బలగాలు... మావోయిస్టు కీలక నేతలకు వృద్ధాప్యం..అనారోగ్య సమస్యలు
- సేఫ్ జోన్లు చేజారుతుండడంతో అంతర్మథనం
- 2026 టార్గెట్ అని మరోసారి స్పష్టం చేసిన కేంద్ర హోం మంత్రి

2లో





జాన్ హాప్‌ఫీల్డ్ జెఫ్రీ హింటన్

ఏఐ మార్గదర్శకులకు ఫిజిక్స్ నోబెల్

వైద్య శాస్త్రం మాదిరిగానే ఫిజిక్స్‌లో కూడా ఈ ఏడాది నోబెల్ అవార్డు ఇద్దరు సైంటిస్టులను వరించింది. మెషీన్ లెర్నింగ్‌ను కొత్త పుంతలు తొక్కించి.. కృత్రిమ మేధ వికాసానికి మార్గదర్శకులుగా నిలిచిన సైంటిస్టులు జాన్ హాప్‌ఫీల్డ్, జెఫ్రీ హింటన్‌లు అత్యున్నత పురస్కారం అందుకోనున్నారు. 'వారు అభివృద్ధి చేసిన ఆర్టిఫిషియల్ న్యూరల్ నెట్‌వర్క్స్ సహాయక మెమరీలుగా ఎన్నోరంగాల్లో కీలక సేవలు అందిస్తున్నాయి. ఫేషియల్ రికగ్నిషన్ మొదలుకుని, యాంత్రిక అనువాదం దాకా అన్నింటా అవి మన జీవితంలో భాగంగా మారాయి' అని నోబెల్ కమిటీ ప్రశంసించింది.

- వివరాలు 6లో

స్క్రాప్ స్వచ్ఛందమే

15 ఏళ్లు దాటిన వాహనాలకు వలంటరీ వెహికల్ స్క్రాపింగ్ పాలసీ అమల్లోకి

- తుక్కుగా మారిస్తే కొత్త వాహనంపై పన్ను రాయితీ... కొత్త వాహనం ధరను బట్టి రాయితీ మొత్తం నిర్ధారణ
- గ్రీన్‌ట్యాక్స్ చెల్లించి నడుపుకొనే ప్రస్తుత విధానం కొనసాగింపు... భద్రతపై దృష్టి సారించాం: మంత్రి పొన్నం
- ప్రభుత్వ వాహనాలకు మాత్రం తప్పనిసరిగా తుక్కు విధానం అమలు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పదిహేనేళ్లు దాటిన వాహనాలను తప్పనిసరిగా తుక్కుగా మార్చాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వం 'వలంటరీ వెహికల్ స్క్రాపింగ్ పాలసీ'ని అమల్లోకి తెచ్చింది. వాహనాన్ని తుక్కుగా మార్చాలా, వద్దా అన్నదానిపై యజమానులే నిర్ణయం తీసుకునే వెసులుబాటు కల్పించింది. వాహనాలకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తీసుకుని, గ్రీన్‌ట్యాక్స్ చెల్లించి మరో ఐదేళ్లపాటు వినియోగించుకునే ప్రస్తుత విధానం కొనసాగుతుందని ప్రకటించింది. అయితే ఎవరైనా తమ వాహనాన్ని తుక్కుగా మార్చి, అదే కోవకు చెందిన కొత్త వాహనాన్ని కొంటే.. జీవితకాల పన్ను (లైఫ్ ట్యాక్స్)లో కొంతమొత్తం రాయితీగా ఇస్తామని తెలిపింది. కొన్నినెలల పాటు వివిధ రాష్ట్రాల్లోని వెహికల్ స్క్రాపింగ్ పాలసీలను అధ్యయనం చేశాక.. కర్ణాటక, మహారాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలను మిళితం చేసి అధికారులు ఈ విధానాన్ని రూపొందించారు. మంగళవారం రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్ ఆ శాఖ అధికారులతో కలసి ఈ వివరాలను వెల్లడించారు.

ఏ వాహనాలకు ఏ విధానం?

ఎవరైనా 15 ఏళ్లు దాటిన తమ వాహనాన్ని తుక్కుగా మార్చాలని భావిస్తే.. దీనిపై రవాణా శాఖకు సమాచారమిచ్చి, అధీకృత తుక్కు కేంద్రానికి వెళ్లి స్క్రాప్ చేయించుకోవాలి. ఆ కేంద్రం సంబంధిత వాహనానికి నిర్ధారిత స్క్రాప్ విలువను చెల్లిస్తుంది. ఈ మేరకు సర్టిఫికెట్ ఇస్తుంది. యజమానులు అదే కేటగిరీకి చెందిన కొత్త వాహనం కొన్నప్పుడు.. ఈ సర్టిఫికెట్ చూపితే కొత్త వాహనానికి సంబంధించిన జీవితకాల పన్నులో నిర్ధారిత మొత్తాన్ని రాయితీగా తగ్గిస్తారు.

- రవాణా వాహనాలను ఎనిమిదేళ్లకే స్క్రాప్‌కు ఇవ్వవచ్చు. వీటికి సంబంధించి ఎంపీ ట్యాక్స్‌లో 10% రాయితీ ఉంటుంది. మిగతా నిబంధనలు

మిగతా 15వ పేజీలో ▶

గ్రీన్‌ట్యాక్స్ మాఫీ..

15 ఏళ్లుదాటిన వాహనాలు ఇంకా ఫిట్‌గా ఉన్నాయని భావిస్తే, వాటిని ఇక ముందు కూడా నడుపుకోవచ్చు. రూ.5 వేల గ్రీన్ ట్యాక్స్ చెల్లించి తదుపరి ఐదేళ్లు, ఆ తర్వాత రూ.10 వేలు చెల్లించి మరో ఐదేళ్లు నడుపుకొనే వెసులుబాటు ఉంది. అయితే ఇప్పటికే 15ఏళ్లు దాటేసిన వాహనాలను తుక్కుగా మార్చేస్తే.. వాటికి గ్రీన్‌ట్యాక్స్ బకాయి ఉన్నట్టుగా పరిగణించాల్సి వస్తుంది. దీంతో కొత్త పాలసీలో ఆ ట్యాక్స్ చెల్లించాల్సిన అవసరం లేకుండా స్క్రాప్ చేసుకునే వెసులుబాటు కల్పించారు. అదే వాణిజ్య వాహనాలకు త్రైమాసిక పన్ను వంటి బకాయిలు ఉంటే.. ఆ బకాయిలపై పెనాల్టీని మాఫీ చేస్తారు.

మళ్లీ 'డెంగీ' పంజా!

- రాష్ట్రంలో తగ్గినట్టే తగ్గి మళ్లీ విజృంభిస్తున్న విష జ్వరాల కేసులు
- జనవరి నుంచి ఇప్పటివరకు రాష్ట్రంలో 9,254 డెంగీ కేసులు నమోదు... హైదరాబాద్‌లో డెంగీ, చికున్‌గున్యా.. భద్రాద్రి జిల్లాలో మలేరియా కేసులు అధికం
- అధికారులను అప్రమత్తం చేసిన మంత్రి దామోదర రాజనర్సింహ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో డెంగీ, చికున్‌గున్యా, మలేరియా కేసులు మళ్లీ పెరుగుతున్నాయి. ఇటీవల తగ్గినట్లే తగ్గి విష జ్వరాలు తిరిగి విజృంభిస్తున్నాయి. మరోవైపు దగ్గు, జలుబు బాధితుల సంఖ్య కూడా ఎక్కువగానే కనిపిస్తోంది. ఇటీవలి వానలతో నీళ్లు నిలవడం, ఉష్ణోగ్రతలు పెరగడంతో దోమలు స్వైర విహారం చేయడం, వాతావరణంలో మార్పులు వంటివి దీనికి కారణమవుతున్నాయని వైద్య నిపుణులు చెప్తున్నారు. ప్రభుత్వం, ప్రజలు తగిన జాగ్రత్తలు చేపట్టాలని సూచిస్తున్నారు.

హైదరాబాద్‌లో డెంగీ ప్రతాపం

ఈ ఏడాది జనవరి నుంచి ఈ నెల ఆరో తేదీ వరకు రాష్ట్రంలో 9,254 డెంగీ కేసులు నమోదైనట్టు వైద్య ఆరోగ్యశాఖ వెల్లడించింది. ఇందులో హైదరాబాద్‌లో అత్యధికంగా 2,731 డెంగీ కేసులు, తర్వాత

మిగతా 7వ పేజీలో ▶

క్లుప్తంగా...

నేడు గాంధీభవన్‌లో మంత్రితో ముఖాముఖి

హాజరు కానున్న మంత్రి పొన్నం ప్రభాకర్



సాక్షి, హైదరాబాద్: గాంధీభవన్‌లో నేడు మంత్రితో ముఖాముఖి కార్యక్రమం జరుగనుంది. ఈ కార్యక్రమానికి మంత్రి పొన్నం ప్రభాకర్ ఉదయం 9గంటలకు హాజరై ప్రజలు, పార్టీ కార్యకర్తల నుంచి వినతిపత్రాలు స్వీకరిస్తారని గాంధీభవన్ వర్గాలు వెల్లడించాయి. కాగా, ఈ ముఖాముఖి కార్యక్రమంలో భాగంగా జిల్లా పార్టీ అధ్యక్షులకు మంత్రి పొన్నం మంగళవారం లేఖ రాశారు. మండల కాంగ్రెస్ అధ్యక్షులు, అనుబంధ సంఘాల నేతలు, పార్టీ ముఖ్య కార్యకర్తలకు సంబంధించిన సమస్యలు, ఫిర్యాదులు ఉంటే ముఖాముఖి కార్యక్రమంలో తన దృష్టికి తీసుకురావాలని పొన్నం కోరారు.

దసరా కానుకగా ఉద్యోగుల డీఏలు మంజూరు చేయండి

వేం నరేందర్‌రెడ్డికి తెలంగాణ ఉద్యోగుల జేఏసీ వినతి

సాక్షి, హైదరాబాద్: రెండున్నర సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న తమ డీఏలను మంజూరు చేస్తారనే నమ్మకంతో రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలున్నాయని, దసరా కానుకగా ఆ డీఏలను మంజూరు చేయాలని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ కోరింది. ఈ మేరకు మంగళవారం జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి ఆధ్వర్యంలోని ప్రతినిధి బృందం సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేసింది. గత ప్రభుత్వం ఉన్నప్పుడే చెల్లించాల్సిన రెండు డీఏలను చెల్లించలేదని, ఈ డీఏల కోసం రాష్ట్రంలోని ఉద్యోగులు, పెన్షనర్లు ఎదురుచూస్తున్నారని ఆ వినతిపత్రంలో వెల్లడించారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్రంలో ఏర్పడిన ప్రజాప్రభుత్వం మంజూరు చేస్తుందనే ఆశతో ఉన్న ఉద్యోగులకు దసరా కానుకగా ఈ డీఏలను మంజూరు చేయాలని కోరారు. వేం నరేందర్ రెడ్డిని కలిసిన వారిలో తెలంగాణ ఉద్యోగుల జేఏసీ నేతలు కె.రామకృష్ణ, జి.నిర్మల, రమేశ్ పాక తదితరులున్నారు.

శాసన మండలి చీఫ్‌విప్‌గా నేడు పట్నం బాధ్యతల స్వీకరణ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర శాసనమండలి చీఫ్‌విప్‌గా నియమితులైన డాక్టర్ పట్నం మహేందర్‌రెడ్డి నేడు (బుధవారం) బాధ్యతలు స్వీకరించనున్నారు. శాసన మండలిలో ఉదయం 10:45 నిమిషాలకు జరిగే ఈ కార్యక్రమంలో మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, అధికారులు, మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ప్రజాప్రతినిధులు, కుటుంబ సభ్యులు తదితరుల సమక్షంలో ఆయన బాధ్యతలను స్వీకరించనున్నారు.

ప్రజారోగ్య అడిషనల్ డైరెక్టర్‌గా శశిశ్రీ

రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ

సాక్షి, హైదరాబాద్: ప్రజారోగ్య విభాగం అదనపు సంచాలకురాలు(పరిపాలన)గా శశిశ్రీని నియమిస్తూ వైద్య, ఆరోగ్యశాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. జేడీగా కొనసాగుతున్న ఆమెకు పదోన్నతి కల్పించి అడిషనల్ డైరెక్టర్‌గా నియమిస్తూ ఆ శాఖ కార్యదర్శి క్రిస్టీనా జెడ్ చోంగ్తూ ఉత్తర్వులు జారీచేశారు. ఇప్పటివరకు ఆమె వైద్య నియామకాల బోర్డులో కొనసాగారు. ఇప్పుడు ప్రజారోగ్య విభాగంలో కీలక బాధ్యతలు నిర్వహించనున్నారు.

టీపీసీసీ ఓబీసీ ప్రెసిడెంట్‌గా వీరన్న

సాక్షి, హైదరాబాద్: టీపీసీసీ ఓబీసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మేకల వీరన్న యాదవ్ నియమితులయ్యారు. వీరన్నను నియమిస్తున్నట్లు అఖిల భారత కాంగ్రెస్ ఓబీసీ కమిటీ చైర్మన్ అజయ్‌సింగ్ యాదవ్ మంగళవారం లేఖ విడుదల చేశారు. కాగా, ఓబీసీ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా తనను నియమించినందుకు ఏఐసీసీ ప్రెసిడెంట్ మల్లికార్జున ఖర్గే, సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో పార్టీ బలోపేతానికి, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థులను గెలిపించేందుకు తన వంతు కృషి చేస్తానని వీరన్న పేర్కొన్నారు.

'తహసీల్దార్‌పై దాడికి యత్నించిన వారిపై చర్యలు తీసుకోవాలి'

సాక్షి, హైదరాబాద్: బతుకమ్మ ఆడే స్థలాన్ని పరిశీలించేందుకు వెళ్లిన వరంగల్ అర్బన్ తహసీల్దార్ ఇక్బాల్‌పై దాడికి ప్రయత్నించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ తహసీల్దార్స్ అసోసియేషన్ (టీజీటీఏ) డిమాండ్ చేసింది. విధి నిర్వహణలో ఉన్న తహసీల్దార్‌పై దురుసుగా ప్రవర్తించిన వారిపై కేసు నమోదు చేయాలని టీజీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.రాములు, ప్రధాన కార్యదర్శి రమేశ్‌పాక, సెక్రెటరీ జనరల్ ఫూల్‌సింగ్ చౌహాన్‌లు మంగళవారం ఓ ప్రకటనలో కోరారు. స్థానికంగా ఉన్న కొందరు నేతలు తహసీల్దార్‌ను పక్కదారి పట్టించి ఆయనపైకి ప్రజలను రెచ్చగొట్టారని, వారిని గుర్తించి క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

సేఫ్ జోన్ ఎక్కడ?

తెలంగాణ వైపు మళ్లీ వచ్చేందుకు మావోయిస్టుల ముమ్మర యత్నాలు



- సరిహద్దుల్లో కాచుక్కూర్చున్న పోలీసు బలగాలు
- మావోయిస్టు కీలక నేతలకు వృద్ధాప్యం.. అనారోగ్య సమస్యలు
- సేఫ్ జోన్లు చేజారుతుండటంతో అంతర్మథనం
- 2026 టార్గెట్ అని మరోసారి స్పష్టం చేసిన కేంద్ర హోం మంత్రి

సాక్షి, హైదరాబాద్: మావోయిస్టులు సేఫ్ జోన్ వెతుకులాటలో పడ్డారు. ఆపరేషన్ కగార్ పేరిట కేంద్ర, రాష్ట్ర బలగాలు భారీ ఎత్తున ఏరివేతకు దిగడంతో మావోయిస్టులకు వరుస ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. ఛత్తీస్‌గఢ్‌లో ఇటీవల జరిగిన భారీ ఎన్‌కౌంటర్ తర్వాత మావోయిస్టులు తెలంగాణ వైపు చూస్తున్నారన్న వార్తలు వినిపిస్తున్నాయి. 2026 మార్చి నాటికి మావోయిస్టులను లేకుండా చేస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ప్రకటించడంతో పాటు, మావోయిస్టు ప్రభావిత రాష్ట్రాల సీఎంలతో నిర్వహించిన సమావేశంలోనూ దీనిపై స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. పైగా రాష్ట్రాల పోలీసు బలగాలకుతోడు కేంద్ర సాయుధ బలగాలను మరింత ఎక్కువగా కదన రంగంలోకి దింపుతున్న వేళ మావోయిస్టులు దిక్కుతోచని స్థితిలోకి చేరుకుంటున్నారు. ఇందుకు రెండు ప్రధాన కారణాలుగా విశ్లేషకులు చెబుతున్నారు. మావోయిస్టు అగ్ర నాయకత్వం వృద్ధాప్యంతోపాటు ఆరోగ్య సమస్యలతో సతమతమవుతోంది. అదే సమయంలో తమకు దశాబ్దాలుగా సేఫ్‌జోన్లుగా ఉన్న ఒక్కో స్థావరాన్ని కోల్పోతున్నారు. దీంతో కొత్త ప్రదేశాల వైపు చూస్తున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. మావోయిస్టులకు శత్రు దుర్భేద్యంగా ఉన్న అబూజ్‌మడ్ సైతం భద్రతా బలగాల గుప్పిట్లోకి వెళుతుండటం మావోయిస్టు నాయకత్వాన్ని మరింత కలవర పరుస్తోంది. మావోయిస్టులు తమను తాము కాపాడుకునేందుకు సేఫ్ జోన్లు వెతికే పనిలో ఉన్నారు. మరోవైపు రిక్రూట్‌మెంట్లు తగ్గటం, వచ్చినవారు కూడా ఎక్కువ కాలం ఉండటం లేదన్న వార్తలు వినిపిస్తున్నాయి. మావోయిస్టు కేంద్ర కమిటీలో కీలక నేతల్లో ఎక్కువ మంది తెలంగాణ ప్రాంతానికి చెందిన వారే ఉన్నారు. ఇక్కడా పట్టున్న ప్రాంతాలూ ఉన్నందున తెలంగాణను షెల్టర్ జోన్‌గా మార్చుకునే యోచనలో మావోయిస్టులు ఉన్నట్టు చెబుతున్నారు. అయితే అది ఎట్టి పరిస్థితుల్లోనూ సాధ్యం కాదని ఓ పోలీసు ఉన్నతాధికారి వ్యాఖ్యానించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కరకగూడెంలో ఆరుగురు మావోయిస్టులు తెలంగాణ పోలీసుల చేతిలో ఎన్‌కౌంటర్ కావడం, గ్రేహౌండ్స్, ప్రత్యేక బలగాలు నిత్యం జల్లెడపడుతుండటాన్ని ఉదహరిస్తున్నారు.

ఆరు పదుల వయసు దాటిన అగ్రనేతలు

మావోయిస్టు అగ్రనేతల్లో చాలామంది ఆరుపదుల వయస్సు దాటిన వారే ఉన్నారు. ఈ వయస్సులో వారికి మెరుగైన వైద్యం అందించడం సైతం కష్టంగా మారింది. మావోయిస్టు సెంట్రల్ కమిటీలో ఉన్న తెలంగాణ ప్రాంతానికి చెందిన వారిలో కరీంనగర్‌కు చెందిన భూపతి అలియాస్ లచ్చన్న వయస్సు 63 ఏళ్లు, తిప్పరి తిరుపతికి 60 ఏళ్లు, నల్లగొండకు చెందిన పాక హన్మంతుకు 60 ఏళ్లు, హైదరాబాద్‌కు చెందిన మోడెం బాలకృష్ణకు 59 ఏళ్లు, పెద్దపల్లికి చెందిన పుల్లూరి ప్రసాదరావుకు 62 ఏళ్లు.

విశ్వసనీయ సమాచారం మేరకు కొందరు అగ్రనేతల ఆరోగ్య పరిస్థితి ఇలా..

- మావోయిస్టు మాజీ జనరల్ సెక్రెటరీ, ప్రస్తుతం సెంట్రల్ కమిటీ సభ్యుడు ముప్పాల లక్ష్మణ్‌రావు అలియాస్ గణపతి అలియాస్ రామన్న అలియాస్ దయానంద్ అలియాస్ గుడ్సా దాదా అలియాస్ చంద్రశేఖర్ 74 ఏళ్లకు చేరారు. ఆయన స్వస్థలం జగిత్యాల జిల్లా. ఆయన లో బీపీ, డయాబెటిస్, మోకాళ్ల నొప్పులు, అల్జీమర్స్ సమస్యలతో ఇప్పుడు దాదాపు మంచానికే పరిమితమయ్యారు.
- గాజర్ల రవి అలియాస్ ఉదయ్ అలియాస్ గణేశ్ అలియాస్ ఆనంద్ అలియాస్ సాగ్రము దాదా సెంట్రల్ కమిటీ సభ్యుడిగా, ఏఓబీ స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడిగా ఉన్నారు. భూపాలపల్లికి చెందిన రవికి 59 ఏళ్లు, డయాబెటిస్‌కు ఇన్సులిన్ వాడుతున్నారు. కిడ్నీలు చెడిపోయి కాళ్ల వాపులు, మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్నారు.
- సిరిసిల్ల జిల్లాకు చెందిన కడారి సత్యనారాయణరెడ్డి అలియాస్ కోస అలియాస్ సాధు అలియాస్ గోపన్నకు ఇప్పుడు 66 ఏళ్లు. సెంట్రల్ కమిటీ సభ్యుడిగా ఉన్న కోస ఒబెసిటీ, మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్నారు.
- రామచంద్రారెడ్డి ప్రతాప్‌రెడ్డి అలియాస్ అప్పారావు అలియాస్ చలపతి స్వస్థలం చిత్తూరు జిల్లా. కేంద్ర కమిటీ సభ్యుడిగా కొనసాగుతున్నారు. మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్నారు. కర్రల సాయంతో నడుస్తున్నారు.
- హైదరాబాద్‌కు చెందిన కేంద్ర కమిటీ సభ్యుడు మోడెం బాలకృష్ణ అలియాస్ భాస్కర్ డయాబెటిస్, గ్యాంగ్రిన్‌తో బాధపడుతున్నారు.

'మేడిగడ్డ'పై తుది నివేదిక ఇవ్వండి

ఎన్డీఎస్‌ఏ చైర్మన్‌ను కోరనున్న మంత్రి ఉత్తమ్

- 11న ఢిల్లీకి వెళ్లనున్న నీటిపారుదల శాఖ మంత్రి
- మేడిగడ్డకు ప్రత్యామ్నాయాలపై సర్కారు దృష్టి



సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల శాశ్వత పునరుద్ధరణకు తీసుకోవాల్సిన చర్యలను సిఫారసు చేస్తూ తుది నివేదికను వెంటనే అందించాలని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్‌ఏ)కి నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మరోసారి విజ్ఞప్తి చేయనున్నారు. ఈ నెల 11న ఢిల్లీకి వెళ్లనున్న ఆయన... ఎన్డీఎస్‌ఏ చైర్మన్ అనిల్ జైన్, ఇతర అధికారులతో భేటీ కానున్నారు. ఎన్డీఎస్‌ఏ నిపుణుల కమిటీ గతంలో అందించిన మధ్యంతర నివేదికలో చేసిన సిఫారసుల ఆధారంగా ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం బరాజ్‌లకు తాత్కాలిక మరమ్మతులు నిర్వహించింది. అయితే ప్రభుత్వం వివిధ సాంకేతిక పరీక్షలు నిర్వహించి తమకు నివేదికలు సమర్పించాకే తుది నివేదిక ఇస్తామని ఎన్డీఎస్‌ఏ గతంలో స్పష్టం చేసింది. శాశ్వత పునరుద్ధరణ పనులు నిర్వహించే వరకు నీళ్లను నిల్వ చేయరాదని ఎన్డీఎస్‌ఏ నిపుణుల కమిటీ కోరడంతో ప్రస్తుతానికి మూడు బరాజ్‌లు ఉపయోగంలోకి లేవు. మరోవైపు వర్షాలతో గోదావరిలో వరద ఉధృతి పెరగడం వల్ల కొన్ని పరీక్షలను మాత్రమే నీటిపారుదల శాఖ పూర్తి చేయగలిగింది. వాటికి సంబంధించిన నివేదికలను అధికారులు ఢిల్లీకి వెళ్లి ఎన్డీఎస్‌ఏ నిపుణుల కమిటీకి అందజేశారు. సెంట్రల్ సాయిల్ అండ్ మెటీరియల్ రీసెర్చ్ స్టేషన్ మేడిగడ్డ బరాజ్ కు పరీక్షలు నిర్వహించి అందించిన నివేదికను సైతం ఎన్డీఎస్‌ఏకు ఇటీవల అప్పగించారు. శాశ్వత పునరుద్ధరణ చర్యలపై తుది నివేదికను అందజేయాలని రాష్ట్ర అధికారులు కోరగా, మిగిలిన పరీక్షలను సైతం పూర్తి చేసి నివేదికలు సమర్పిస్తేనే తుది నివేదిక ఇస్తామని ఎన్డీఎస్‌ఏ అధికారులు తేల్చి చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ అధికారుల విజ్ఞప్తుల కు ఎన్డీఎస్‌ఏ యంత్రాంగం స్పందించకపోవడంతో స్వయంగా ఢిల్లీ వెళ్లాలని మంత్రి ఉత్తమ్ నిర్ణయించారు. మంగళవారం సచివాలయంలో ఆయన నీటిపారుదల శాఖ ఈఎన్‌సీలు అనిల్‌కుమార్, నాగేంద్రరావు, హరిరామ్‌లతో సమావేశమయ్యారు.

మేడిగడ్డకు ప్రత్యామ్నాయాలు..

గోదావరికి ఉపనది అయిన వార్ధాపై బరాజ్‌తో పాటు ప్రాణహితపై తమ్మిడిహట్టికి దిగువన రబ్బర్ డ్యామ్ కట్టాలన్న ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వం పరిశీలిస్తోంది. ఈ రెండింటి నీళ్లను గ్రావిటీ ద్వారా సుందిళ్ల బరాజ్‌కు తరలించి అక్కడి నుంచి ఎల్లంపల్లి బరాజ్‌లోకి పంపింగ్ చేయాలని యోచిస్తోంది. మేడిగడ్డ బరాజ్‌కు ప్రత్యామ్నాయంగా ఈ రెండు బరాజ్‌లు ఉపయోగపడనున్నాయి. మేడిగడ్డకు వెంటనే శాశ్వత మరమ్మతులు సాధ్యం కాకుంటే ప్రత్యామ్నాయాలుగా వాటిని నిర్మించే అంశంపై ఎన్డీఎస్‌ఏతో సమావేశం అనంతరం ప్రభుత్వం ఓ నిర్ణయం తీసుకొనే అవకాశం ఉంది.

మూసీ కాల్వలకు సత్వర అనుమతులు..

నల్లగొండ జిల్లాలోని మూసీ ప్రాజెక్టుకు సంబంధించిన బునాదిగాని కాలువ, ధర్మారెడ్డి కాలువ, పిల్లాయిపల్లి కాలువ పనులకు పరిపాలనా అనుమతులు పొందాలని అధికారులను మంత్రి ఉత్తమ్ ఆదేశించారు. పాలమూరు-రంగారెడ్డి, సీతారామ, డిండి, దేవాదుల తదితర ఎత్తిపోతల పథకాల పెండింగ్ భూసేకరణను వేగంగా పూర్తి చేయాలన్నారు. కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) పరిధిలోని సాంకేతిక సలహా మండలి పరిశీలనలో ఉన్న సీతమ్మసాగర్ ప్రాజెక్టు డీపీఆర్‌కు వెంటనే ఆమోదం లభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమ్మక్కసాగర్ బరాజ్ నిర్మాణం విషయంలో ఛత్తీస్‌గఢ్‌తో నెలకొన్న వివాదాన్ని పరిష్కరించుకొని ఎన్ఓసీ పొందడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు.

త్వరగా ఇంజనీర్లకు పదోన్నతులు

నీటిపారుదల శాఖలో ఇంజనీర్ల పదోన్నతులపై మంత్రి ఉత్తమ్ అధికారులతో చర్చించారు. పదోన్నతులపై హైకోర్టులో కేసు సోమవారం కొలిక్కి వచ్చే అవకాశముందని అధికారులు ఆయనకు వివరించారు. ఆ వెంటనే ఇంజనీర్లకు పదోన్నతులు జారీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

రాహుల్‌ను కలవలేకపోయిన రేవంత్



ఢిల్లీకి వచ్చి.. ఇలా తిరిగి హైదరాబాద్‌కు రావడం నాలుగోసారి

హుడా కుటుంబాన్ని కలుద్దామని భావించినా హరియాణాలో ఓటమితో వెనక్కి

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీలో జరిగిన వామపక్ష తీవ్రవాద ప్రభావిత రాష్ట్రాల భేటీకి హాజరైన సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీని కలవకుండానే హైదరాబాద్‌కు తిరుగు పయనమయ్యారు. రాహుల్‌గాంధీ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌ను కలిసి రాష్ట్ర రాజకీయాలపై చర్చించాలని రేవంత్ అనుకున్నా, వారి నుంచి పిలుపు రాకపోవడంతో వెనుదిరిగారు. సోమవారం జరిగిన హోంశాఖ సదస్సుకు హాజరైన సీఎం రేవంత్.. వివిధ శాఖల కేంద్ర మంత్రులను కలిసిన విషయం తెలిసిందే. రాష్ట్రంలో మంత్రివర్గ విస్తరణ, నామినేటెట్ పదవుల భర్తీ, ఇతర ప్రాయోజిత కార్యక్రమాలపై పార్టీ పెద్దలతో చర్చించేందుకు రేవంత్ అపాయింట్‌మెంట్లు కోరారు. సోమవారం రాత్రే కేసీతో భేటీ ఉంటుందని భావించినా కుదరలేదు. మంగళవారం కేసీతోపాటు రాహుల్‌గాంధీ, హరియాణా మాజీ సీఎం భూపేందర్‌సింగ్ హుడా, ఎంపీ దీపేందర్ హుడాలతో భేటీ కావాలని అనుకున్నారు. హరియాణా ఎన్నికల్లో కాంగ్రెస్ కచ్చితంగా గెలుపు తీరాలను చేరుతుందన్న ఎగ్జిట్ పోల్స్ అంచనాల నేపథ్యంలో హుడా కుటుంబాన్ని కలిసి శుభాకాంక్షలు తెలపాలని భావించినట్టు ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. అయితే హరియాణా ఎన్నికల్లో కాంగ్రెస్ పరాజయంతో పార్టీ అగ్ర నాయకత్వం నైరాశ్యంలో ఉండడంతో రాహుల్ సహా ఇతర నేతలను కలవడం రేవంత్‌కు వీలు కాలేదు. గతంలోనూ ఆగస్టు 15న ఒకసారి, సెప్టెంబర్ 12న మరోమారు, సెప్టెంబర్ 30న ఇంకోమారు ఢిల్లీకి వచ్చినా, రాహుల్‌గాంధీని కలవకుండానే వెనుతిరిగిన రేవంత్‌రెడ్డి, తాజా పర్యటనలోనూ కలవలేకపోయారు. నాలుగుసార్లు ఢిల్లీ పర్యటనల్లో రాహుల్‌గాంధీని రేవంత్ కలవకపోవడం ఇక్కడి వర్గాల్లో చర్చనీయాంశమైంది.

రేవంత్‌తో అసద్ భేటీ.. హైడ్రాపై చర్చ

ఢిల్లీ పర్యటనలో ఉన్న రేవంత్‌రెడ్డితో ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ భేటీ అయ్యారు. తుగ్లక్‌రోడ్డులోని సీఎం అధికారిక నివాసంలో రేవంత్‌ను కలిసిన ఒవైసీ గంటపాటు హైడ్రా, మూసీ అభివృద్ధి సహా ఇతర రాజకీయ అంశాలపై చర్చించినట్టు తెలిసింది. మూసీ అభివృద్ధి పేరిట జరిగే కార్యక్రమంలో మైనారిటీ వర్గాలకు నష్టం జరగకుండా చూడాలని, వారిని ఆదుకునే విషయంలో ఉదారంగా వ్యవహరించాలని ఒవైసీ కోరినట్టు తెలిసింది.

రాజకీయ లబ్ధికి మా పరువు తీశారు

- మంత్రి కొండా సురేఖపై పరువు నష్టం కేసులో హీరో నాగార్జున వాంగ్మూలం



మంగళవారం నాంపల్లి కోర్టు నుంచి బయటకు వస్తున్న నాగార్జున, అమల, నాగచైతన్య, సుప్రియ

సిటీ కోర్టులు: రాజకీయ లబ్ధి కోసమే మంత్రి కొండా సురేఖ తమ కుటుంబంపై తప్పుడు వ్యాఖ్యలు చేశారని సినీ నటుడు నాగార్జున నాంపల్లి కోర్టులో పేర్కొన్నారు. ఆమె చేసిన వ్యాఖ్యలన్నీ అవాస్తవాలేనని.. వాటిలో ఎలాంటి నిజం లేదన్నారు. మంత్రిపై వేసిన క్రిమినల్ పరువునష్టం కేసు విచారణలో భాగంగా మంగళవారం నాగార్జున తన సతీమణి అమల, కుమారుడు నాగచైతన్యతో కలిసి నాంపల్లిలోని స్పెషల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఎక్సైజ్ కోర్టుకు హాజరయ్యారు. జడ్జి ఎస్.శ్రీదేవి ఎదుట ఈ మేరకు వాంగ్మూలం ఇచ్చారు.

నాలుగు దశాబ్దాలుగా గౌరవప్రదంగా జీవిస్తున్నా

అక్కినేని వారసుడిగా తెలుగు చిత్ర పరిశ్రమలో నాలుగు దశాబ్దాల గౌరవప్రదమైన జీవితాన్ని కొనసాగిస్తున్నానని నాగార్జున కోర్టుకు తెలిపారు. నటుడిగా, నిర్మాతగా, టీవీ వ్యాఖ్యాతగా, స్టూడియో యజమానిగా తాను, తన కుటుంబం ప్రజల ఆదరాభిమానాలు పొందుతున్నామన్నారు. తన కుమారుడు నాగచైతన్య సైతం సినీ నట వారసత్వాన్ని కొనసాగిస్తూ ప్రేక్షకుల ప్రశంసలు పొందుతున్నాడన్నారు. కానీ తన కుమారుడి వైవాహిక జీవితాన్ని ఉద్దేశించి కొండా సురేఖ మాట్లాడిన మాటలు ప్రజలను తప్పుదోవ పట్టించాయని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన వీడియోలు, పేపర్ క్లిప్పింగ్‌ల వల్ల తమ కుటుంబం పరువు పోయిందని.. తాము ఎంతో కలత చెందామని చెప్పారు. అందుకే మంత్రిపై క్రిమినల్ చర్యలు తీసుకుని తమ కుటుంబ పరువు కాపాడాలని కోరారు. నాగార్జునతోపాటు ఆయన తరఫు సాక్షిగా సుప్రియ వాంగ్మూలాన్ని కూడా కోర్టు నమోదు చేసింది. అనంతరం నాగార్జున తరఫు న్యాయవాది అశోక్‌రెడ్డి కొండా సురేఖ మాట్లాడిన వీడియోతో కూడిన పెన్‌డ్రైవ్, పేపర్ క్లిప్పింగ్‌లను మెమోతోపాటు కోర్టుకు సమర్పించారు. సాక్షుల స్టేట్‌మెంట్ సమయంలో కొండా సురేఖ తరఫు న్యాయవాది, టీపీసీసీ లీగల్ సెల్ వైస్ చైర్మన్ తిరుపతి వర్మ, సురేఖ కూడా హాజరయ్యారు. ఈ మేరకు విచారణ చేపట్టిన కోర్టు విచారణను ఈ నెల 10కి వాయిదా వేసింది.

వ్యవసాయ కార్పొరేషన్ల పనితీరు కుంటు పడింది

వాటిని గాడిలో పెట్టాలని యంత్రాంగానికి మంత్రి తుమ్మల పిలుపు



సాక్షి, హైదరాబాద్: వ్యవసాయ శాఖలోని అన్ని కార్పొరేషన్ల పనితీరు ఐదేళ్లుగా కుంటుపడిందని, వాటన్నింటినీ గాడిలో పెట్టి పునర్వైభవం తెచ్చే దిశగా చైర్మన్లు, ఎండీలు కృషి చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ప్రభుత్వం తరఫున తమ సహకారం ఎల్లవేళలా ఉంటుందన్నారు. అందరి బాధ్యత రైతన్న, నేతన్న సంక్షేమమని చెప్పారు. మంగళవారం సచివాలయంలో వ్యవసాయ, చేనేత అనుబంధ కార్పొరేషన్ల చైర్మన్లు, ఎండీలతో మంత్రి తుమ్మల సమీక్షించారు. ఈ సందర్భంగా వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ కార్యక్రమాలన్నింటినీ డిజిటలైజేషన్ చేసే క్విక్సీ సాఫ్ట్‌వేర్‌ను ప్రారంభించారు. క్రమంగా ఇతర కార్పొరేషన్లకూ ఈ సాఫ్ట్‌వేర్‌ను విస్తరిస్తామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం నేత కార్మికుల సంక్షేమానికి చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తుందన్నారు. ఈ- కామర్స్, చేనేత లక్ష్మి వంటి కార్యక్రమాలను ప్రచారం చేసి, టెస్కో ద్వారా అమ్మకాలు పెంచేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అన్ని రకాల సదుపాయాల తో టెస్కో ఆధ్వర్యంలోని పోచంపల్లి టెక్స్‌టైల్ పార్కును అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ఆయిల్ పామ్ సాగు లక్ష్యాన్ని జనవరి 25వ తేదీకల్లా పూర్తి చేయాలని ఆదేశించారు. సిద్దిపేటలో నిర్మాణంలో ఉన్న ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీని వచ్చే ఆగస్టు నెల వరకు వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు.

ఒకేచోట ఎంఎస్‌ఎంఈ పథకాల సమాచారం

ప్రత్యేక పుస్తకాన్ని విడుదల చేసిన మంత్రి శ్రీధర్‌బాబు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

సాక్షి, హైదరాబాద్: సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు (ఎంఎస్‌ఎంఈ) సంబంధించి అనేక పథకాలు ఉన్నా వాటిపై ఔత్సాహిక లబ్ధిదారులకు అవగాహన ఉండటం లేదని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. అందుకే ఎంఎస్‌ఎంఈ పథకాలకు సంబంధించిన సమాచారం అంతా ఒకే చోట అందుబాటులోకి తెస్తున్నట్లు ప్రకటించారు. పథకాలకు అర్హత, లక్ష్యాలు, అమలుచేసే విభాగం, దరఖాస్తు చేయాల్సిన తీరు తదితరాలపై అవగాహన కల్పించేందుకు పరిశ్రమల శాఖ రూపొందించిన పుస్తకాన్ని మంత్రి శ్రీధర్‌బాబు మంగళవారం విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా రూపొందించిన ఎంఎస్‌ఎంఈ పాలసీపై అవగాహన కల్పించేందుకు జరిగిన సమావేశంలో శ్రీధర్‌బాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రభుత్వ ఎంఎస్‌ఎంఈ విభాగాల అధిపతులు, పరిశ్రమల శాఖ అధికారులు, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్లు తదితరులు ఈ భేటీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎంఎస్‌ఎంఈ పాలసీ మహిళలు, దళితులతో పాటు అన్ని వర్గాల ఆంట్రప్రెన్యూర్లకు చేరేలా చూడాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను ప్రభుత్వ విభాగాలు సమన్వయంతో అమలు చేయాలన్నారు. ముద్ర, సీజీటీఎంఎస్‌ఈ వంటి పథకాలపైనా విస్తృత ప్రచారం చేయాలని, ఎంఎస్‌ఎంఈలకు మద్దతు పలికేందుకు రూపొందించిన 'ర్యాంప్'ను అమలు చేయాలని చెప్పారు. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, డైరెక్టర్ మల్సూర్ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో తెలంగాణ పర్యాటక విధానం

అమెరికాలో తెలంగాణ టూరిజం రోడ్‌షోలో మంత్రి జూపల్లి



అమెరికాలో జరిగిన తెలంగాణ టూరిజం రోడ్‌షోలో పాల్గొన్న మంత్రి జూపల్లి కృష్ణారావు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ప్రాంతానికి పర్యాటకులు పెద్ద సంఖ్యలో వచ్చేలా చర్యలు చేపడుతున్నామని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. త్వరలో తెలంగాణ పర్యాటక విధానాన్ని అమల్లోకి తెస్తామని వెల్లడించారు. ప్రపంచవ్యాప్తంగా తెలంగాణకు పెట్టుబడులు, పర్యాటకులు వచ్చేలా ఇక్కడ మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. అమెరికాలోని లాస్‌ఏంజెలిస్‌లోని డబుల్ ట్రీ హోటల్‌లో ఏర్పాటుచేసిన తెలంగాణ టూరిజం రోడ్‌షోలో ఆయన పాల్గొని ప్రసంగించారు. తెలంగాణ సంప్రదాయ వేడుకలు, ప్రకృతి రమణీయ ప్రాంతాలు, ఎకో, మెడికల్ టూరిజం తదితర అంశాలను ప్రస్తావిస్తూ తెలంగాణ ప్రత్యేకతలను సందర్శకులకు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన ఫ్యూచర్ సిటీ వివరాలను కూడా వివరించారు. కార్యక్రమంలో తెలంగాణ పర్యాటకాభివృద్ధి సంస్థ ఎండీ ప్రకాశ్‌రెడ్డి, కాలిఫోర్నియా కాన్సుల్ జనరల్ చిట్టిరెడ్డి శ్రీపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మొత్తం చెరువులెన్ని.. ఎన్ని మిగిలాయి?

- లెక్క తేల్చడంపై దృష్టిపెట్టిన హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్
- సర్వే ఆఫ్ ఇండియా అధికారులతో సమావేశం
- ఆ డేటాతో సమగ్ర నివేదిక రూపొందించాలని నిర్ణయం



సమావేశంలో అధికారులతో రంగనాథ్

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ మహా నగరం పరిధిలో మొత్తంగా ఎన్ని చెరువులు ఉండేవి? ప్రస్తుతం ఎన్ని ఉన్నాయి? ఎంత మేర ఆక్రమణలకు గురయ్యాయి? అనే లెక్కలను శాస్త్రీయంగా తేల్చాలని 'హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా)' నిర్ణయించింది. దీని కోసం సర్వే ఆఫ్ ఇండియా సహకారం తీసుకోనుంది. ఈ మేరకు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్, ఇతర అధికారులు మంగళవారం హబ్సిగూడలో ఉన్న సర్వే ఆఫ్ ఇండియా కార్యాలయానికి వెళ్లారు. సర్వే ఆఫ్ ఇండియా డైరెక్టర్ బీసీ పరీడా, సూపరింటెండెంట్ ఆఫ్ సర్వే దేబబ్రత పాలిత్‌తోపాటు ఇతర అధికారులతో సమావేశమై చర్చించారు. సర్వే ఆఫ్ ఇండియా గతంలో రూపొందించిన మ్యాప్‌లను రంగనాథ్ పరిశీలించారు. 1971–72 నాటి సర్వే ప్రకారం నగరంలో ఎన్ని చెరువులు ఉన్నాయి? అప్పట్లో వాటి విస్తీర్ణం ఎంత? నాలాలు ఎక్కడెక్కడ, ఎంత విస్తీర్ణంలో ఉండేవి? తదితర విషయాలు పరిశీలించారు. తాజా మ్యాప్‌లతో వాటిని సరిపోల్చి చూశారు. ఈ అంశాలను సర్వే ఆఫ్ ఇండియా అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా హైడ్రా బృందానికి వివరించారు.

పూర్తి వివరాలతో నివేదిక రూపకల్పనపై దృష్టి

చెరువుల ఫుల్ ట్యాంక్ లెవల్, మాగ్జిమమ్ వాటర్ స్ప్రెడ్ ఏరియాలను గుర్తించడానికి, తాజాగా నిర్ధారించడానికి ఇప్పటికే హెచ్ఎండీఏ, ఇరిగేషన్, జీహెచ్ఎంసీలతో కలిసి ముందుకు వెళ్తున్న హైడ్రా.. ఇప్పటికే ఆయా విభాగాల నుంచి సమాచారం సేకరించింది. ఆ డేటాను సర్వే ఆఫ్ ఇండియా డేటాతో క్రోడీకరించనుంది. మంగళవారం సర్వే ఆఫ్ ఇండియా అందించిన వివరాలతో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల్లోని చెరువుల పరిస్థితిపై సమగ్ర నివేదిక తయారు చేయాలని నిర్ణయించింది. సర్వే ఆఫ్ ఇండియా డేటాను డిజిటలైజ్ చేయడంతోపాటు చెరువుల విస్తీర్ణం, నాలాల పొడవు, వెడల్పులను నిర్ధారించి ఈ నివేదికలో పొందుపర్చనుంది. నివేదికకు తుదిరూపు ఇచ్చాక తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకోనుంది. ప్రాధాన్యత క్రమంలో చెరువులను గుర్తించి పునరుద్ధరించడంపై దృష్టి పెట్టాలని భావిస్తున్నట్టు హైడ్రా అధికారులు తెలిపారు.

డిజిటల్ క్రాప్ సర్వేకు ఏఈవోలు ఓకే

ఫలించిన తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చొరవ

సాక్షి, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వ డిజిటల్ క్రాప్ సర్వేను తెలంగాణ రాష్ట్రంలోనూ అమలు చేసేందుకు వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈవో)లు అంగీకరించారు. బుధవారం నుంచే సర్వే ప్రక్రియ ప్రారంభం కానుంది. సర్వే అమలు క్రమంలో కలిగే ఇబ్బందులపై పది రోజులుగా ఏఈవోలు నిరసన తెలుపుతున్న విషయం తెలిసిందే. ఇదే విషయాన్ని తెలంగాణ వ్యవసాయ అధికారుల జేఏసీ సంఘాల నాయకులు.. తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి, నాయకుడు కె.రామకృష్ణ దృష్టికి తెచ్చారు. దీంతో ఏఈఓలతో లచ్చిరెడ్డి, రామకృష్ణ మంగళవారం చర్చలు జరిపారు. అనంతరం వారు ఏఈఓలను వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు దగ్గరకు తీసుకెళ్లారు. దీనిపై రఘునందన్‌రావు సానుకూలంగా స్పందిస్తూ, 'యాప్ డౌన్లోడ్ చేసుకొని సర్వే ప్రారంభించండి. ఇబ్బందులను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తాను. నేను దగ్గరుండి మీ ప్రతి సమస్యా పరిష్కరిస్తా'నని చెప్పడంతో ఏఈఓలు డిజిటల్ క్రాప్ సర్వేను చేపట్టాలని నిర్ణయించారు.



ఇక్కడున్న అందరమూ ఏదో ఒక రోజున కచ్చితంగా చనిపోయేవాళ్లమే అని చాలామంది గ్రహించరు. అది తెలిసినవాళ్లకు గొడవలన్నీ సమసిపోతాయి.
– బౌద్ధ ధర్మం

సాక్షి
బుధవారం, 9 అక్టోబర్ 2024

అనుకున్నదొకటి... అయ్యిందొకటి!

నాలుగు రోజుల క్రితం ఎగ్జిట్‌పోల్స్ అంచనాలు వచ్చాయి. మంగళవారం కౌంటింగ్ మొదలయ్యాక ఉదయం 9 గంటల వేళ తొలి ఫలితాల సరళి వచ్చింది. కానీ, ఆశ్చర్యకరంగా అంతా మారిపోయింది. హర్యానా, జమ్ము–కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో అంచనాలు, ఆశాభావాలు తలకిందులయ్యాయి. పోటాపోటీతో హంగ్ అవుతుందని బీజేపీ ఆశపడ్డ జమ్ము – కశ్మీర్‌లో నేషనల్ కాన్ఫరెన్స్ – కాంగ్రెస్ కూటమి గెలిచింది. హర్యానాలో కాంగ్రెస్‌దే విజయం అని ఎగ్జిట్‌పోల్స్ కోడై కూసినచోట అవన్నీ తోసిరాజని విజయంతో బీజేపీ అబ్బురపరిచింది. 1966 హర్యానా ఏర్పాటయ్యాక ఇప్పటి దాకా ఏ పార్టీ సాధించని హ్యాట్రిక్‌తో రికార్డ్ సృష్టించింది. పార్టీల నుంచి ఎగ్జిట్ పోల్స్ నిర్వాహకుల దాకా ప్రతి ఒక్కరికీ ఈ ఫలితాలు పాఠాలు నేర్పడం గమనార్హం. ఏ ఎన్నికా చిన్నది కాదనీ, ప్రతిదీ కీలకమేననీ, అతి విశ్వాసం పనికిరాదనీ మరోసారి ఈ ఫలితాలు తేల్చాయి.

దశాబ్దం తర్వాత, అదీ 2019 ఆగస్టులో ఆర్టికల్ 370 రద్దు చేశాక, జమ్ము–కశ్మీర్‌ను రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజించాక... తొలిసారిగా జరిగిన ఎన్నికల్లో ప్రజాతీర్పు ఆసక్తికరమే. కొన్నేళ్ళుగా 'నయా కశ్మీర్'గా ఎంతో చేశామని చెప్పుకున్నప్పటికీ, జమ్మూను దాటి కశ్మీర్ లోయలో బీజేపీ తన ప్రభావం చూపలేకపోయింది. దోడా స్థానం గెలిచి, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) కశ్మీర్‌లో ఖాతా తెరవడం విశేషం. మరోపక్క హర్యానాలో 'తిమ్మిని బమ్మిని చేసి బీజేపీ తెచ్చుకున్న గెలుపు' అని కాంగ్రెస్ వ్యాఖ్యానించింది. ఎన్నికల సంఘం (ఈసీ) వెబ్‌సైట్ ఫలితాల సరళిని చూపిన తీరు, ఈవీఎంల బ్యాటరీల శాతమూ అనుమానాస్పదమన్నది ఆ పార్టీ ఆక్షేపణ, ఆరోపణ. ఆ మధ్య లోక్‌సభ ఎన్నికల్లో లానే ఇప్పుడూ ఈసీ ఆ ఆరోపణల్ని బాధ్యతారహితమంటూ కొట్టిపారేసింది. ఆరోపణల్ని పక్కనబెట్టి అసలు జరిగింది ఇప్పటికైనా పరిశీలించుకోవడం అన్ని వర్గాలకూ కీలకం.

కశ్మీర్ సంగతి అటుంచి, హర్యానానే తీసుకుంటే... 'జవాన్... కిసాన్... పహిల్వాన్' నినాదంతో ముందుకెళ్ళిన కాంగ్రెస్ హర్యానాలో ఆ అంశాలు బీజేపీని మట్టికరిపిస్తాయని భావిస్తూ వచ్చింది. కానీ, జరిగింది వేరు. పదేళ్ళుగా హర్యానాను పాలిస్తున్న బీజేపీ పట్ల అధికారపక్ష వ్యతిరేకత ఒకటికి రెండింతలు ఉన్నప్పటికీ దాని నుంచి ఎందుకు ప్రతిపక్ష కాంగ్రెస్ లబ్ధి పొందలేకపోయింది. అందుకు కారణాలను ఇప్పటికైనా ఆత్మావలోకనం చేసుకోవాలి. సమైక్య ప్రతిపక్షంగా బీజేపీకి అడ్డుకట్ట వేయాల్సింది పోయి, కాంగ్రెస్ తన బలాన్ని అతిగా అంచనా వేసుకొని భంగపడింది. ఆప్‌కి హర్యానాలో చెప్పుకోదగిన స్థాయిలో ఓటు బ్యాంకు ఉందని తెలిసినా, సీట్ల సర్దుబాటు, పొత్తు విషయంలో కాంగ్రెస్ మొండిపట్టుతో పోవడం గట్టి దెబ్బ తీసింది. ఆప్ సీట్ల డిమాండ్ 20 దగ్గర మొదలై, 10 దగ్గరకు వచ్చి ఆగి, చివరకు 5 స్థానాల దగ్గరకు వచ్చి ఆగినా, పొత్తు పొడవనే లేదు. తప్పక గెలిచే 3 సీట్లిచ్చినా చాలు... 'ఆప్' ఓకే అంటుందని తెలిసినా, ఆఖరికి రాహుల్ సైతం పొత్తుకే మొగ్గ చూపినా, కాంగ్రెస్ దూతలు పడనివ్వలేదు. చివరకు మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చింది.


అధిష్ఠానం జోక్యం చేసుకొని పరాజయానికి బాధ్యులెవరో చూడాలంటూ కుమారి సెల్జా గొంతు విప్పారు. దీన్నిబట్టి ఆ రాష్ట్రంలో కాంగ్రెస్‌లో వర్గవిభేదాలకు కొదవ లేదని అర్థమవుతోంది. సీట్ల పంపిణీ వేళ భూపీందర్ సింగ్ హుడా తన వర్గం వారికే ఎక్కువ సీట్లివ్వడం ఇతర సీనియర్ నేతల్లో అసంతృప్తికి దారి తీసింది. ఆ అంతర్గత కుమ్ములాటలు ఆఖరికి మొత్తంగా రాష్ట్రంలో పరాజయానికీ దారి తీశాయన్నది ప్రాథమిక విశ్లేషణ. కాంగ్రెస్ ప్రధానంగా నిరుద్యోగం, ద్రవ్యోల్బణం సహా జాతీయ అంశాలపై ఎక్కువగా దృష్టి పెట్టింది. స్థానిక అంశాలతో పాటు సూక్ష్మపరిశీలనతో ఎన్నికల మేనేజ్‌మెంట్‌పై శ్రద్ధ పెట్టడం, సీఎంనూ, కొన్నిచోట్ల అభ్యర్థులనూ మార్చడం కమలనాథులకు కలిసొచ్చింది. ఇటీవల లోక్‌సభ ఎన్నికల్లో కనిపించని ఆర్‌ఎస్‌ఎస్ ఈసారి ప్రభావం చూపింది.

అలాగే, ప్రధాని మోదీ సభలు, మాటలు నాన్ – జాట్ వర్గాలను ఆకర్షించాయని చెప్పక తప్పదు. కాంగ్రెస్ పూర్తిగా జాట్లు – దళితుల ఓట్‌బ్యాంక్‌పైనే అతిగా ఆధారపడి, జాట్లు మినహా మిగతా వర్గాలు, ఓబీసీలు కాషాయఛత్రం కింద ఏకమవుతున్న సంగతి కనిపెట్టలేకపోవడం ఘోర తప్పిదమైంది. కాంగ్రెస్ పక్షాన సీఎం అభ్యర్థి ఎవరన్నదానిపై నెలకొన్న గందరగోళం, గతంలో సాగిన హుడా హయాం పట్ల అసంతృప్తి, ఆయనే మళ్ళీ సీఎం కావచ్చనే అభిప్రాయం ఓటర్లను కాంగ్రెస్ వైపు మొగ్గకుండా ఆపింది. మొత్తంగా రెండు పార్టీల మధ్య ఓట్ల శాతంలో తేడా 1 శాతం కన్నా తక్కువే. అయితే, సీట్ల పరంగా బీజేపీ గణనీయ విజయం సొంతం చేసుకోవడం క్షేత్రస్థాయి వ్యూహ ఫలితం. ఎగ్జిట్ పోల్స్‌లో ఓట్ల శాతం అంచనా కాస్త అటూ ఇటూగా అంతేవున్నా, వచ్చే సీట్ల సంఖ్యపై అతిగా జోస్యం చెప్పడం ఎదురుతన్నింది. వెరసి, ఎగ్జిట్ పోల్స్ కచ్చితత్వాన్ని అనుమానంలోకీ, నిర్వాహకుల్ని ఆత్మపరిశీలనలోకీ నెట్టాయి.

ఆప్, కాంగ్రెస్ గనక కలసి పోటీ చేసివుంటే, ఆ రాష్ట్ర ఫలితాలు కచ్చితంగా మరోలా ఉండేవని ఓట్ షేర్ శాతాన్ని బట్టి విశ్లేషణ. కశ్మీర్‌లో వాస్తవం గుర్తించి, పొత్తు పెట్టుకున్న కాంగ్రెస్ ఆ పని హర్యానాలో చేయకపోవడమే విడ్డూరం. ఇప్పుడిక రానున్న మహారాష్ట్ర, జార్ఖండ్, ఢిల్లీ ఎన్నికలపైకి ఫోకస్ మారనుంది. ఇప్పటికే హర్యానా ఫలితానికి కాంగ్రెస్‌ను ఆప్ తప్పుబట్టడం మొదలుపెట్టింది. మరి, ఫిబ్రవరిలోగా జరగనున్న ఢిల్లీ ఎన్నికలకైనా ఈ పార్టీలు జత కడతాయో, లేదో చూడాలి. ఏమైనా, తప్పక గెలుస్తారనుకున్న ఎన్నికల్లో సైతం ఆఖరి క్షణంలో కోరి చేతులారా ఓటమి కొని తెచ్చుకోవడం కాంగేయులకు పరిపాటి అయింది. క్షేత్రస్థాయి లోపాల్ని సరిదిద్దక, పోటీకి ముందే గెలుపు ధీమాతో అతిగా వ్యవహరిస్తే ఎవరికైనా ఎదురుదెబ్బలు ఖాయమని గుర్తిస్తే మంచిది.

అధిక నిధులతోనే రైతుకు మేలు

విశ్లేషణ



దేవీందర్ శర్మ

దేశంలో దాదాపు 60 శాతం మంది రైతులు ఏమాత్రం అవకాశం ఉన్నా సరే... వ్యవసాయం మానేయాలని కోరుకుంటున్నారని పలు అధ్యయనాలు చెబుతున్నాయి. దీనికి ప్రధాన కారణం నష్టాలు! 54 ప్రధాన ఆర్థిక వ్యవస్థలలో వ్యవసాయ నష్టాలను పూడ్చేందుకు బడ్జెట్ మద్దతును అందించని ఏకైక దేశం భారత్ మాత్రమే. ఇప్పటికీ వ్యవసాయ రంగ వృద్ధి కేవలం 1.4 శాతం మాత్రమే. వ్యవసాయాన్ని ఉద్దేశపూర్వకంగా దారిద్ర్యంలో ఉంచడం దీనికి కారణం. అసమానతలను పెంచిపోషిస్తున్న ఆర్థిక సిద్ధాంతాలను ఇంకా పట్టుకుని వేలాడటంలో అర్థం లేదు. అత్యధిక జనాభా వ్యవసాయంలో ఉన్న దేశంలో దానికి అనులోమంగానే బడ్జెట్‌లో స్థిరంగా కొన్నేళ్లు కనీసం 50 శాతం వ్యవసాయ, గ్రామీణ రంగాలకు కేటాయించాలి.

అది 1996వ సంవత్సరం. ఎన్నికల ఫలితాలు వెలువడి అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రధానమంత్రిగా ఎన్నికైనట్లు ప్రకటించారు. ఒకటీ రెండు రోజుల తర్వాత, న్యూఢిల్లీలో కొంతమంది ఆర్థికవేత్తలతో ఆంతరంగిక సమావేశం జరిగింది. ప్రధానమంత్రిగా ఎన్నికైన వాజ్‌పేయి రాకపోవడంతో, మరో రాజకీయ ప్రముఖుడు మురళీ మనోహర్ జోషి ఆ సమావేశానికి అధ్యక్షత వహించారు.

ప్రజా వ్యతిరేకతను ఎదుర్కోకుండా ఉండాలంటే, ఎన్డీఏ ప్రభుత్వం ఎలాంటి ఆర్థిక విధానాలను తీసుకురావాలో సూచించాలని ఆ సమావేశంలో ఆర్థికవేత్తలను కోరారు. హాజరైన చాలామంది ద్రవ్య లోటును నిశితంగా పరిశీలించాలనీ, కరెంట్ ఖాతా లోటును తగ్గించే మార్గాలను కనుగొనాలనీ అభిప్రాయం వెలిబుచ్చారు. కీలకమైనవిగా గుర్తించిన సమస్యలపై చాలా చర్చ జరిగింది. ఉపాధిని సృష్టించడం, తయారీని పెంచడం, ఎగుమతుల ఆర్థిక వ్యవస్థను నిర్మించడం వంటి ఇతర ముఖ్యమైన సమస్యలపై కూడా చర్చ జరిగింది.

విధానపరమైన ప్రాధాన్యం దేనిపై ఉండాలో సూచించమని నన్ను అడిగినప్పుడు, వ్యవసాయంలో నిమగ్నమై ఉన్న 60 శాతం జనాభాకు బడ్జెట్‌లో 60 శాతం మేరకు అందించాలని నేను సమాధానమిచ్చాను. అక్కడ ఉన్న నా సహచరుల్లో చాలామంది నాతో ఏకీభవించలేదు. వ్యవసాయానికి 60 శాతం బడ్జెట్‌ను కేటాయిస్తే ఆర్థిక వ్యవస్థ పతనమవుతుందని కొందరు హెచ్చరించారు. పరిశ్రమలు, మౌలిక సదుపాయ రంగాలకు భారీ కేటాయింపులు జరపాలనీ, దాన్నే అధిక ఆర్థిక వృద్ధికి దారితీసే కచ్చితమైన మార్గంగా తీసుకోవాలనీ వారు నొక్కి చెప్పారు. అయితే కొత్త నమూనాకూ, ఆర్థిక చింతనకూ ఇదే సమయమనీ, వ్యవసాయానికి తగిన బడ్జెట్ కేటాయింపు చేయకపోతే దేశం సర్వతోముఖంగా అభివృద్ధి చెందదనీ నేనూ నొక్కిచెప్పాను. నా సలహా ప్రధాన స్రవంతి ఆర్థికవేత్తల ఆలోచనతో పొసగదని నాకు తెలుసు. కానీ, ప్రభుత్వ వ్యతిరేకతను తప్పించుకోవడానికి ఉన్న ఏకైక మార్గం వ్యవసాయంలో, గ్రామీణాభివృద్ధిలో తగినంత పెట్టుబడి పెట్టడమేనని నా అవగాహన. మా అభిప్రాయాలను ప్రధానికి తెలియజేస్తానని జోషి చెప్పడంతో సమావేశం ముగిసింది.

కొన్ని రోజుల తర్వాత, కొత్త ప్రభుత్వం వ్యవసాయానికి 60 శాతం బడ్జెట్‌ను కేటాయించాలనే ఉద్దేశాన్ని ప్రకటించినప్పుడు నేను ఆశ్చర్యపోయాను. వ్యవసాయంలో చాలా వనరులను అందుబాటులో ఉంచాల్సిన అవసరం గురించి మీడియాలో కోలాహలం చెలరేగింది. చాలామంది నిపుణులు దీనివల్ల ఆర్థిక వ్యవస్థ తిరోగమిస్తుందని అన్నారు. నా వాదన ఏమిటంటే, భారతదేశం అధిక వృద్ధి పథం వైపు సాగుతున్నప్పుడు, గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న తన జనాభాలో మూడింట రెండు వంతుల మందిని వెనుకే విడిచిపెట్టడం సాధ్యం కాదు.



ఇది సాధ్యం చేయాలంటే, రాజకీయ తత్వవేత్త జాన్ రాల్ సూచించిన న్యాయసూత్రాలకు అనుగుణంగా నడుచుకోవాలంటే, మన విధాన ప్రయత్నం భిన్నంగా ఉండాలి. మానవ మూలధన పెట్టుబడికి, వ్యవసాయాన్ని పునర్నిర్మించడానికి, ఆరోగ్యం, విద్యారంగాలతో సహా గ్రామీణ మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయడానికి తగిన ఆర్థిక వనరులను కల్పించాలి. ఈ క్రమంలో, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పునరుజ్జీవింపజేయవచ్చు. క్లుప్తంగా చెప్పాలంటే, ఆర్థిక చింతనలో, విధానాల్లో కీలక మార్పు తేవడం వల్లనే, ప్రధానమంత్రి ఇప్పుడు చెబుతున్న 'సబ్ కా సాథ్, సబ్ కా వికాస్'ను నిజం చేయవచ్చు. అయితే, వాజ్‌పేయి ప్రభుత్వం 13 రోజులు మాత్రమే కొనసాగింది. దాంతో మార్పునకు బలమైన పునాది వేయగలిగే ఆశ కూడా ఉనికిలో లేకుండా పోయింది.

నేను దీన్ని ఎందుకు పంచుకుంటున్నానంటే, మొత్తం బడ్జెట్‌లో వ్యవసాయానికి కేటాయింపులు మరింత తగ్గాయి. లక్షలాదిమంది జీవనోపాధికి వ్యవసాయం బాధ్యత వహిస్తున్న నేపథ్యంలో ఇది ఆందోళనకరం. బడ్జెట్‌లో వ్యవసాయం వాటా 2019–20లో అప్పటికే కనిష్ఠంగా ఉన్న 5.44 శాతం నుంచి, 2024–25లో 3.15 శాతానికి పడి పోయింది. వనరుల కేటాయింపులపై ఆధిపత్యం చలాయించేది రాజకీయ ఆర్థిక కారకాలు (బడా వ్యాపారులచే ఎక్కువగా ప్రభావితమవుతాయి) అని గ్రహించినప్పుడు, తప్పు మార్గాలేమిటో స్పష్టంగా కనిపిస్తాయి. జనాభాలో 42.3 శాతం మంది ఇప్పటికీ వ్యవసాయంలో నిమగ్నమై ఉండగా, దాని వృద్ధి కేవలం 1.4 శాతంగా ఉంటోందంటే ఆశ్చర్యపోనవసరం లేదు. ఇంకా దారుణంగా, సగటు వ్యవసాయ ఆదాయాలు బాగా క్షీణించాయి. వాస్తవ గ్రామీణ వేతనాలు దశాబ్ద కాలంగా స్తబ్దుగా కొనసాగుతున్నాయి. నేను తరచుగా చెప్పినట్లు, వ్యవసాయాన్ని ఉద్దేశపూర్వకంగా దారిద్ర్యంలో ఉంచడం దీనికి కారణం.

దేశంలో దాదాపు 60 శాతం మంది రైతులు ఏమాత్రం అవకాశం ఉన్నా సరే... వ్యవసాయం మానేయాలని కోరుకుంటున్నారని పలు అధ్యయనాలు చెబుతున్నాయి. మరి భారతీయ రైతులు ఇంత దారుణంగా ఎలా నష్టపోతున్నారని మీరు ఆలోచిస్తున్నట్లయితే, 'ఆర్గనైజేషన్ ఫర్ ఎకనామిక్ కోఆపరేషన్ – డెవలప్‌మెంట్' (ఓఈసీడీ) చేసిన ఇటీవలి అధ్యయనం పనికొస్తుంది. భారతీయ వ్యవసాయం అట్టడుగున ఉండటమే కాక, 2022లో 20.18 శాతం ప్రతికూల స్థూల వ్యవసాయ జమను (మైనస్) అందుకుంది. అయితే, 54 ప్రధాన ఆర్థిక వ్యవస్థలలో ఈ వ్యవసాయ నష్టాలను పూడ్చేందుకు బడ్జెట్ మద్దతును అందించని ఏకైక దేశం భారత్ మాత్రమే.

జనాభాలో దాని వాటాకు అనులోమానుపాతంలో కొన్ని సంవత్సరాలపాటు వ్యవసాయానికి సరైన వనరులను అందించినట్లయితే, అది అద్భుతమైన ఆర్థిక పరిపుష్టిని సంతరించుకుంటుంది. వనరుల కేటాయింపులు తగ్గుముఖం పట్టిన తర్వాత, వ్యవసాయ రంగంలో అద్భుతం జరుగుతుందని ఆశించడం వ్యర్థం. 1996లో అప్పటి ఎన్డీఏ ప్రభుత్వం వ్యవసాయం, గ్రామీణాభివృద్ధికి బడ్జెట్‌లో 60 శాతం వాటాను అందించడానికి అంగీకరించి ఉంటే, నేటివరకు అది కొనసాగి ఉంటే, భారతదేశ గ్రామీణ ముఖచిత్రం పూర్తిగా మారిపోయి ఉండేది.

ఇప్పుడు కూడా, వ్యవసాయంలో జనాభా 42.3 శాతంగా ఉన్నందున, రూ.48 లక్షల కోట్ల వార్షిక బడ్జెట్‌లో కనీసం 50 శాతం వ్యవసాయ, గ్రామీణ రంగాలకు కేటాయించాలని చెప్పడానికి బలమైన కారణాలు ఉన్నాయి. పేదలు, మహిళలు, యువత, అన్నదాత అనే నాలుగు కొత్త 'కులాలను' చేరుకోవడానికి బహుశా ఇది ఉత్తమ మార్గం. వాస్తవానికి, వ్యవసాయం అన్ని రకాల కుల రూపాలకు జీవనోపాధిని అందిస్తుంది. వ్యవసాయంలో తగిన వనరులను ఉంచడం, పనితీరును మెరుగుపర్చడం వల్ల స్థిరమైన జీవనోపాధిని నిర్మించడమే కాకుండా వ్యాపారాన్ని సమర్థంగా నిర్వహించే ఆకాంక్షలను కూడా ప్రోత్సహిస్తుంది. వ్యవసాయంలో తగిన పెట్టుబడులను కల్పిస్తే అవి ప్రపంచంలోని 75 శాతం మంది పేదల పేదరికాన్ని తగ్గించడంలో సహాయపడతాయని ప్రపంచ బ్యాంకు కూడా ఎక్కడో అంగీకరించింది.

ప్రపంచంలోని అత్యంత సంపన్నులైన 1 శాతం మంది, దిగువన ఉన్న 95 శాతం కంటే ఎక్కువ సంపదను కూడబెట్టుకున్న తరుణంలో... అసమానతలను మరింత పెంచిన ఆర్థిక సిద్ధాంతాలను పట్టుకుని వేలాడటంలో అర్థం లేదు. కాబట్టి భారతదేశం, దాని సొంత గాథను లిఖించవలసిన అవసరం ఉంది. ఇదంతా వ్యవసాయాన్ని పునరుజ్జీవింపజేయడం ద్వారా ప్రారంభమవుతుంది.

వ్యాసకర్త ఆహార, వ్యవసాయ రంగ నిపుణులు
ఈ–మెయిల్: hunger55@gmail.com

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఎన్నికల కుస్తీలోనూ...



మల్లయోధురాలు వినేశ్ ఫోగాట్ జులానా (హరియాణా) నియోజకవర్గం నుంచి 6,015 ఓట్ల ఆధిక్యంతో విజేతగా నిలిచింది (బీజేపీ అభ్యర్థి మీద). ఇది నిజంగా ఈ రోజు అత్యంత తృప్తినిచ్చిన వార్త. ఇది నాకు వ్యక్తిగత విజయంలా అనిపిస్తోంది.

– అంకిత్ మయాంక్, కాంగ్రెస్‌వాది

తప్పు ఎత్తుగడ



జమ్ము కశ్మీర్ ఎన్నికల్లో ప్రచారం చేయడానికి ఇంజినీర్ రషీద్‌ను ఎందుకు విడుదల చేశామని బహుశా బీజేపీ పశ్చాత్తాప పడుతూ ఉండాలి. కశ్మీర్‌లో అది పార్టీకి సాయ పడకపోగా, పార్టీ ప్రయోజనాలను దెబ్బ తీసింది.

– ఆదిత్య రాజ్ కౌల్, జర్నలిస్ట్

ఐకమత్యం లేక...



ఒకవేళ భూపీందర్ హుడా, సెల్జా కుమారి నిజంగా కలిసి పనిచేసివుంటే; వాళ్లిద్దరితో కలిసి రాహుల్ గాంధీ హరియాణాలో కనీసం డజను ప్రదర్శనలు చేసివుంటే బహుశా కాంగ్రెస్ మరో 1 లేదా 2 శాతం ఓట్లను అధికంగా సంపాదించి వుండేదేమో (దాని ఓటు షేరు 2019లోని 28 శాతం నుంచి ఇప్పుడు 40 శాతానికి చేరింది). ఒక ఆలోచన! (హరియాణాలో బీజేపీ మళ్లీ గెలిచిన నేపథ్యంలో.)

– ఎం.కె. వేణు, సంపాదకుడు

అన్నీ తప్పాయి!



భారతీయ ఓటర్లు ఎన్నో విధాలుగా విభజితం అయి వుండొచ్చుగాక. కానీ ముందస్తు ఎన్నికల అంచనాలను తిప్పికొట్టడంలో మాత్రం ఐకమత్యంగా ఉంటారు. (హరియాణా శాసనసభ ఫలితాల అంచనాలు తప్పిన నేపథ్యంలో.)

– సంజీవ్ సన్యాల్, ఆర్థికవేత్త

థాంక్యూ హరియాణా!




హరియాణా ఓటర్లకు ఢిల్లీ ధన్యవాదాలు చెప్పాలి – మేము మిమ్మల్ని వరుస నిరసనలు, ధైరాయింపులు, రోడ్డు దిగ్బంధనాల నుంచి కాపాడాము.

– అద్వైత కళ, స్క్రీన్ రైటర్

ఇన్ బాక్స్

ప్రపంచ విప్లవ జ్వాల

ప్రజల కోసం సర్వస్వం త్యజించిన విప్లవ నేత చే గువేరా! ఆయన అసలు పేరు ఎర్నెస్టో గెవారా! ఆయన పెట్టుబడిదారీ వ్యవస్థతో పాటు సామ్యవాదంలోని సంప్రదాయ వాదాన్ని కూడా వ్యతిరేకించాడు. అర్జెంటీనాలోని రొసారియా అనే పట్టణంలో 1928 జూన్ 14న ఒక మధ్య తరగతి కుటుంబంలో జన్మించాడు. 1953లో బ్యూనస్ ఎయిర్స్ విశ్వవిద్యాలయం నుండి వైద్య విద్యలో పట్టా పొందాడు. ఆ తదుపరి మోటారు సైకిల్‌పై దక్షిణ అమెరికా ఖండమంతటా పర్యటిస్తున్న సమయంలో ప్రజల జీవన స్థితిగతుల గురించి తెలుసుకున్నాడు. విప్లవమొక్కటే సామాజిక అసమానతలను తొలగించగలదని భావించాడు. 1954లో గౌటిమాలలో ప్రజాబాహుళ్యపు అభ్యున్నతికి కృషి చేస్తున్న సామ్యవాద అనుకూల ప్రభుత్వంతో కలిసి పనిచేశాడు. కానీ అదే సంవత్సరం అమెరికా సాయంతో జరిగిన కుట్ర మూలంగా ఆ ప్రభుత్వం కూలిపోయింది. అక్కడి నుంచి మెక్సికో వెళ్ళిపోయాడు. ఈ ఘటనతో అతని విప్లవ దృక్పథం మరింత బలపడింది. మెక్సికోలో ఫిడెల్ క్యాస్ట్రో నాయకత్వంలో అక్కడికి ప్రవాసం వచ్చిన క్యూబా విప్లవకారులతో చేతులు కలిపాడు. 1950వ దశకం చివరలో అప్పటి క్యూబా నియంత బాటిస్టాకు వ్యతిరేకంగా కాస్ట్రో ఆధ్వర్యంలో జరిగిన గెరిల్లా పోరాటం (1956–1959)లో చే గువేరా ముఖ్య పాత్ర పోషించాడు. డాక్టర్‌గా, మిలిటరీ కమాండర్‌గా అంకిత భావంతో సేవలందించాడు.



చే గువేరా

పోరాటం విజయవంతమైన తరువాత, కాస్ట్రో 1959 జనవరిలో క్యూబా ప్రభుత్వాధికారాన్ని చేపట్టాడు. ఆ ప్రభుత్వంలో చే పరిశ్రమల మంత్రిగా, క్యూబా జాతీయ బ్యాంకు అధ్యక్షునిగా పనిచేశాడు. క్యూబా ప్రతినిధిగా అనేక దేశాలు పర్యటించాడు. ఈ పర్యటనలలో భాగంగానే 1959 జూలై నెలలో భారతదేశంలో కూడా పర్యటించాడు. తన రచనలలో వర్ధమాన దేశాలలో రైతాంగ విప్లవోద్యమాలు నిర్మింపబడాలని కోరుకున్నాడు! పేద దేశాలలో విప్లవాన్ని వ్యాప్తిచేయ తలపెట్టి ఆయన 1965లో క్యూబాలో తన అత్యున్నత స్థానాన్ని, పలుకుబడిని వదలి పెట్టి కాస్ట్రో వారిస్తున్నా వినకుండా దేశం నుండి అదృశ్యమయ్యాడు. కొద్దిమంది అనుచరులతో రహస్యంగా ఆఫ్రికా దేశమైన కాంగోలో కొంతకాలం గడిపాడు. ఆ సమయంలో ఆ దేశం తూర్పు ప్రాంతంలో గెరిల్లా తిరుగుబాటుకు ప్రయత్నించి విఫలమయ్యాడు. 1966 చివరిలో మళ్ళీ దక్షిణ అమెరికాకు వచ్చాడు! బొలీవియా దేశంలో మిలిటరీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడుతున్న విప్లవకారులకు నాయకత్వం వహించాడు! ఈ సమయంలోనే బొలీవియన్ సైన్యానికి చిక్కాడు! 1967 అక్టోబర్ 9న వల్లెగ్రాండె అనే ప్రాంతంలో ఆ సైన్యం ఆయన్ని చంపివేసింది. అలా ఓ ప్రపంచ విప్లవ జ్వాల ఆరిపోయింది!

– ఎమ్‌డీ మునీర్, సీనియర్ జర్నలిస్ట్
(నేడు చే గువేరా వర్ధంతి)

మానసిక ఆరోగ్యంతోనే అభివృద్ధి

సందర్భం



డా॥ ఇండ్ల రామసుబ్బారెడ్డి

మానవ సమాజంలో పని అనేది ఒక అంతర్భాగం. మానవుడు ఆహారం కోసం చేసే వెదుకులాట/ వేట మొట్టమొదటి పనిగా చెప్తారు. 18వ శతాబ్దంలో వచ్చిన పారిశ్రామిక విప్లవం పని గంటలు, పని 'సంస్కృతి'లో అనేక మార్పులు తీసుకువచ్చింది. పరిశ్రమలు, కార్మికులు కలసి ఒక సంస్థాగత వ్యవస్థగా ఏర్పడ్డారు. టెక్నాలజీ అభివృద్ధి చెందడం, ఇంటర్నెట్ ప్రవేశంతో కొత్తకొత్త ఉద్యోగాల రూపకల్పన జరగడం ప్రారంభమయింది. యాంత్రీకీకరణ, కృత్రిమ మేధ అభివృద్ధితో ఇది మరింత కొత్త పుంతలు తొక్కుతోంది. ఒక మనిషి తన జీవిత కాలంలో సుమారుగా తొంభైవేల నుండి ఒక లక్ష గంటల పాటు పని ప్రదేశంలోఉంటాడని అంచనా. అంటే యుక్త వయసు నుండి రిటైరయ్యే వరకు ఉన్న జీవిత కాలంలో ఇది సుమారు మూడు వంతుల సమయం. ఒక ఉద్యోగస్థుడు తన సహచరులతో ఇంతకాలం గడపడం వలన వారితో ప్రత్యేక అనుబంధం ఏర్పరుచుకుంటాడు. ఈ బంధాలు, పనిచేసే వాతావరణం, యాజమాన్యంతో ఉండే సంబంధం... ఇవన్నీ ఒక వ్యక్తి మానసిక ఆరోగ్యాన్ని చాలావరకు ప్రభావితం చేస్తాయి. కనుకనే ప్రపంచ మానసిక ఆరోగ్య సంస్థ 'పని చేసే ప్రదేశంలో మానసిక ఆరోగ్యానికి ప్రాముఖ్యత ఇవ్వాలి' అనే నినాదంతో ఈ సంవత్సరం ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని జరుపుకుంటోంది.

పని ప్రదేశాల్లో ఒత్తిడి అనేది అత్యంత సహజమైన విషయం. అయితే ఈ ఒత్తిడిని ఎలా ఎదుర్కోవాలో తెలియకపోతే పలు రకాల శారీరక, మానసిక సమస్యలు ఉత్పన్నం అయ్యే అవకాశం ఉంది. ఒక సర్వే ప్రకారం ప్రతీ పదిమందిలో ఎనిమిది మంది ఏదో ఒక రకమైన ఒత్తిడిని ఎదుర్కొంటున్నట్లు తేలింది. ప్రతి నలుగురిలో ఒకరు చికిత్స అవసరం అయిన మానసిక సమస్యను ఎదుర్కొంటున్నారు. ఇలా బాధపడే వారిలో కేవలం నలభై శాతం మంది మాత్రమే సరైన వైద్య సహాయం పొందుతున్నారు.

అయితే ఇది ఉద్యోగి ఆరోగ్యాన్ని ప్రభావితం చేయడం ద్వారా ఉత్పాదకతను కూడా తగ్గిస్తుంది. ఇది మిగిలిన ఉద్యోగుల మీద కూడా ప్రభావం చూపే అవకాశం ఉంది. కనుక ఉద్యోగితో పాటుగా యాజమాన్యాలు / సంస్థలు తమ ఉద్యోగుల మానసిక ఆరోగ్యం మీద తగిన జాగ్రత్తలు తీసుకోవలసిన అవసరం ఉంది. సరైన సమయపాలన పాటించడం, ఒత్తిడికి గురైనపుడు సహచరుల,



యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్ళి సహాయం పొందడం; పనికి, వ్యక్తిగత జీవితానికి హద్దులు పెట్టుకొని కొంత సమయం తనకోసం మాత్రమే కేటాయించుకోవడం, వారాంతాల్లో కుటుంబ సభ్యులతో సమయం గడపడం, పనిలో అప్పుడప్పుడు కొంత విరామం తీసుకోవడం లాంటివి చేయడం ద్వారా ఉద్యోగి ఒత్తిడిని కొంత వరకు తగ్గించవచ్చు. విభిన్న షిఫ్ట్ సిస్టమ్‌లో పనిచేసే దంపతులు కలిసి ఉండే సమయం తక్కువ అవడంవల్ల కలిసి క్వాలిటీ టైమ్ గడిపే అవకాశాలు సన్నగిల్లి వీరి మధ్య కొన్ని మనస్పర్థలు, అనుమానాలు తలెత్తే అవకాశముంది.

సమర్థంగా పనిచేసే వారిని యాజమాన్యం ఎప్పటికప్పుడు ప్రోత్సహించి తగిన ప్రోత్సాహకాలు ఇవ్వడం వల్ల వీరిలో మానసిక స్థైర్యం పెంపొందుతుంది. మహిళా ఉద్యోగులు, ఒకవైపు ఇంటి బాధ్యతలు, పిల్లల సంరక్షణ; మరోవైపు ఉద్యోగ బాధ్యతల వల్ల తీవ్ర మానసిక ఒత్తిడికి గురయ్యే అవకాశముంది. అలాంటి వారి ఎడల సంస్థలు కొన్ని వెసులుబాట్లు ఇస్తే, వీరు ఒత్తిడికి లోను కాకుండా ఉండగలరు.

కంపెనీలు కూడా ఈ మధ్య కాలంలో 'వర్క్ ఫ్రమ్ హోమ్'ను ప్రోత్సహించడం వలన ఉద్యోగుల్లో ఉత్పాదకత పెరిగినట్లు గణాంకాలు చెబుతున్నాయి. ప్రతి సంస్థ అర్హత కలిగిన మానసిక వైద్యులు లేదా క్లినికల్ సైకాలజిస్టుల సేవలు తమ ఉద్యోగులకు కల్పించాలి. యోగా, ధ్యానం, ఒత్తిడి గురించి వర్క్‌షాప్స్ వంటి కార్యక్రమాలు తరచుగా తమ సంస్థల్లో జరిగేలా ఏర్పాట్లు చేయాలి. ఒక క్రమ పద్ధతిలో నైపుణ్య పరీక్షలు జరిపి అర్హులైన వారికి ఇంక్రిమెంట్లు, పదోన్నతులు, ఇతర వసతులు కల్పించడం ద్వారా ఉద్యోగస్థుల్లో సంతృప్తి శాతాన్ని పెంచవచ్చు. ఎప్పుడైతే ఉద్యోగస్థులు తమ పనిపట్ల తృప్తితో ఉంటారో వారు మరింత పాజిటివ్ దృక్పథంతో, సంస్థ అభివృద్ధికి కృషిచేస్తారు. వారు మిగిలిన వారికి ఒక మంచి ఉదాహరణగా నిలిచి, ఒక చక్కని పని సంస్కృతి అనేది సంస్థలో అభివృద్ధి చెందుతుంది.

ప్రభుత్వ, ప్రైవేటు రంగంలోని అన్ని సంస్థలు పని ప్రదేశాల్లో ఉద్యోగుల, కార్మికుల మానసిక ఆరోగ్యానికి అత్యంత ప్రాముఖ్యాన్ని ఇవ్వవలసిన అవసరం ఎంతైనా ఉంది. జీవితంలోగాని, వృత్తిలో గాని విజయం సాధించాలంటే మనసును స్థిరంగా, ప్రశాంతంగా ఉంచుకోవడమనేది చాలా ముఖ్యమని అందరూ గుర్తించాలి.

వ్యాసకర్త ప్రముఖ మానసిక వైద్యనిపుణులు
(రేపు ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం)

సాటిలేని పూల పండగ



పువ్వుల పండగలు చాలా ప్రాంతాలలో జరుగుతాయి. కానీ, బతుకమ్మ పండగ లాంటి పువ్వుల పండగ మాత్రం ప్రపంచంలో మరొకటి లేదంటే అతిశయోక్తి కాదు. కారణం, బతుకమ్మ పండగలో ఉన్న ఎన్నో ప్రత్యేకతలు. స్త్రీ, పురుష, బాల, వృద్ధులందరూ పాలు పంచుకొనే తొమ్మిదినాళ్ళ పువ్వులపండగ, బతుకమ్మ పండుగ గాక మరొక్కటెక్కడుంది? వరసగా 9 రోజులపాటు, ప్రతిరోజూ, పువ్వులెన్నింటినో పుష్కలమైన మోతాదులో ప్రకృతి ఒడి నుంచి ప్రియంగా తెచ్చుకొని, అన్ని పూవులనూ అందంగా అమర్చుకొని, ఆ అమరికను యావత్ ప్రకృతికీ ప్రతీకగా, ప్రత్యక్ష దైవంగా భావన చేసి, నృత్య గానాది ఉపచారాలతో ఆరాధిస్తూ, అపారమైన కృతజ్ఞతా ప్రకటన చేస్తూ ఆనందించే సామాజిక సంస్కార వైభవం... ఇంత స్ఫుటంగా మరే పండగలో గోచరిస్తుంది?

ప్రకృతి అనునిత్యం ప్రదర్శించే అవధులు లేని సౌందర్యం ముందు, ధన కనకాలు వెలబోసి తెచ్చుకొనే ఏ అందమైనా దిగదుడుపే. తల్లీతండ్రి కంటె మిన్నగా, అన్ని అవసరాలనూ ఔదార్యంతో తీర్చే ప్రకృతిపట్ల కృతజ్ఞతా భావన కలిగి ఉండని మనిషి మానవత్వం అసంపూర్ణం అనిపించుకొంటుంది. కేవలం ప్రకృతి మాత దయాదాక్షిణ్యాల ఆధారంగా మాత్రమే బతికి బట్ట కడుతున్న మానవాళికి పర్యావరణం పట్ల బాధ్యతతో మెలగటం ప్రథమ కర్తవ్యం. ఇటువంటి ప్రాథమిక సత్యాలను బతుకమ్మ పండగ ఏటేటా వచ్చి, మృదువుగా గుర్తు చేసి వెళుతుంది.

బతుకమ్మ పండగ లాంటి పండగను జరుపుకోవాలనే సమష్టి సంకల్పమే సంపన్నతకూ, భావపుష్టికీ నిదర్శనం. బతుకమ్మ అమరిక కళాత్మకం. అందరి బతుకమ్మల పొందికైన కూడిక అంతకంటె సుందరం. దాని చుట్టూ అకృత్రిమంగా, ముగ్ధమోహనంగా, ఆడబిడ్డలు ఆడే ఆటలు, ఈ గడ్డ జానపదుల స్వతస్సిద్ధమైన సృజనాత్మక శక్తికి సాక్ష్యాలు. శ్రావ్యంగా, 'చల్లంగా', లయబద్ధంగా, స్ఫూర్తిదాయకంగా, సందేశాత్మకంగా సాగే బతుకమ్మ పాటలు, బతుకు విలువల బహు రమ్య ఆవిష్కరణలు. సామరస్యం గల సామాజిక జీవనం సౌందర్యానికి ప్రతిబింబాలు. జానపద కళల జాను సొబగుల అన్ని పార్శ్వాలనూ జలజలా జాలువార్చే అసదృశమైన సందర్భం బతుకమ్మ పండగ శుభసందర్భంలో అందరికీ శుభాకాంక్షలు!

– ఎం. మారుతి శాస్త్రి
(రేపు సద్దుల బతుకమ్మ)



గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజ మాసం, **తిథి:** శు.షష్ఠి ఉ.7.22 వరకు, తదుపరి సప్తమి, **నక్షత్రం:** మూల రా.1.41 వరకు, తదుపరి పూర్వాషాఢ, **వర్జ్యం:** ఉ.9.13 నుండి 10.43 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.11.25 నుండి 12.13 వరకు, **అమృత ఘడియలు:** సా.6.55 నుండి 8.32 వరకు, సరస్వతీదేవి పూజ; **రాహుకాలం:** ప.12.00 నుండి 1.30 వరకు, **యమగండం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **సూర్యోదయం:** 5.55, **సూర్యాస్తమయం:** 5.41.

ఎదురుకాల్పుల్లో మావోయిస్టు మృతి

దుమ్ముగూడెం: ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో పోలీసు బలగాలు – మావోయిస్టుల నడుమ జరిగిన ఎదురుకాల్పుల్లో కిష్టారం ఏరియా కమిటీ సభ్యుడు లోకేశ్ మృతి చెందాడు. కిష్టారం పోలీస్‌స్టేషన్ పరిధి పామలూరు గ్రామ అటవీ ప్రాంతాన మావోయిస్టులు ఉన్నారనే సమాచారంతో ప్రత్యేక బలగాలు దబ్బకొండ, అంతపాడ్, బుర్కలంక, పామలూర్, సింఘనమడ్గు పరిసరాల్లో కూంబింగ్ చేపట్టాయి. ఈ క్రమంలో మంగళవారం ఉదయం మావోయిస్టులు తారసపడ్డారు. దీంతో పరస్పరం కాల్పులు జరుపుకున్నారు. ఆ తర్వాత గాలించగా మావోయిస్టు ఏసీఎం లోకేశ్ మృతదేహంతో పాటు ఆయుధాలు లభ్యమయ్యాయి. ఈ ఘటనలో పలువురు మావోయిస్టులు గాయపడినట్లు తెలుస్తుండగా వారి కోసం భద్రతా బలగాలు గాలిస్తున్నాయి.

ఇన్‌ఫార్మర్ నెపంతో గిరిజనుడి హత్య

- ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల ఘాతుకం


కన్నయ్య మృతదేహం

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో మావోయిస్టులు ఇన్‌ఫార్మర్ నెపంతో గిరిజనుడిని దారుణంగా హతమార్చారు. భోపాలపట్నం పోలీస్‌స్టేషన్ పరిధి పోచనపల్లికి చెందిన తాటి కన్నయ్య (55)ను మావోయిస్టులు రెండ్రోజుల క్రితం అపహరించారు. అతడిని కత్తులు, గొడ్డళ్లతో దాడిచేసి హతమార్చిన మావోయిస్టులు.. మృతదేహాన్ని మంగళవారం తెల్లవారుజామున దబ్బపార గ్రామ పాఠశాల సమీపంలో పడేశారు. పోలీస్ ఇన్‌ఫార్మర్‌గా వ్యవహరిస్తున్నందునే హతమార్చామంటూ మద్దేడు ఏరియా కమిటీ పేరిట మృతదేహం వద్ద లేఖను వదిలారు. ఇటీవల ఆ రాష్ట్రంలోని దంతెవాడ – నారాయణపూర్ జిల్లాల సరిహద్దులో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 31 మంది మావోయిస్టులు మృతిచెందగా.. ప్రతీకారంతో రగిలిపోతున్న మావోయిస్టులు ఇన్‌ఫార్మర్లపై దృష్టి పెట్టినట్లు ఈ ఘటనతో అర్థమవుతోంది.


కాత్యాయనీ దేవిగా
బాసర శ్రీజ్ఞాన సరస్వతి (నిర్మల్ జిల్లా)


భవాని అలంకారంలో
వరంగల్ శ్రీభద్రకాళి అమ్మవారు


కాత్యాయనీ దేవిగా
అలంపూర్ జోగులాంబ


రూ. 1.61 కోట్ల నగదు అలంకరణలో ఓంకార రూపిణి

అమ్మవారికి నోట్ల మాల

నందిపేట్(ఆర్మూర్): నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం నిజామాబాద్ జిల్లా నందిపేట మండలం పాతూర్‌లోని శ్రీ ఓంకార రూపిణి దుర్గాభవాని మాతను రూ.1.61 కోట్ల నగదుతో అలంకరించారు. దుర్గాదేవి కమిటీ సభ్యులు ఈ అలంకరణకు రూ.500, 200, 100 నోట్లను ఉపయోగించారు.

50 లక్షల టన్నుల సన్నాలు!



- రేషన్ సరఫరాకు సరిపడా సన్నరకాల ధాన్యం సేకరణపై పౌరసరఫరాల శాఖ ప్రత్యేక దృష్టి
- గుర్తించిన 33 రకాలతోపాటు నిర్ణీత పరిమాణంలో ఉన్న ధాన్యానికి రూ.500 బోనస్
- గ్రెయిన్ కాలిపర్ పరికరం ద్వారా సన్నాల గుర్తింపు
- ఖరీఫ్ సీజన్‌లో కొనుగోలు కేంద్రాలకు మొత్తంగా 91 లక్షల టన్నుల ధాన్యం వస్తుందని అంచనా
- మరో వారంలో కొనుగోళ్లు షురూ.. రాష్ట్రవ్యాప్తంగా 7,185 కేంద్రాలు
- ఇందులో సన్నరకాల సేకరణ కోసం ప్రత్యేక కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్ల కోసం పౌర సరఫరాల సంస్థ ఏర్పాట్లు చేస్తోంది. దసరా పండుగ తర్వాత వరి కోతలు మొదలయ్యే అవకాశమున్న నేపథ్యంలో.. జిల్లాల్లోని పౌర సరఫరాల శాఖ, కార్పొరేషన్ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. అదనపు కలెక్టర్ల నేతృత్వంలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ డిసెంబర్ నెలాఖరు వరకు సాగనుంది. రాష్ట్రంలోని 32 జిల్లాల్లో (హైదరాబాద్ మినహా) 7,185 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

వ్యవసాయ శాఖ వివరాల ఆధారంగా..

రాష్ట్రవ్యాప్తంగా ఖరీఫ్‌లో 60.8 లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగింది. మొత్తంగా 146.70 లక్షల మెట్రిక్ టన్నులు (ఎంఎల్‌టీ) దిగుబడి వస్తుందని వ్యవసాయశాఖ అంచనా వేసింది. ఇందులో 91 లక్షల టన్నుల మేర కొనుగోలు కేంద్రాలకు వస్తుందని.. అందులో 50 లక్షల టన్నుల మేర సన్న ధాన్యం వచ్చే అవకాశం ఉందని భావిస్తోంది. ఈ నేపథ్యంలో వ్యవసాయ శాఖ నుంచి ఆయా వివరాలు తీసుకొని జిల్లాల వారీగా సన్నాల కోసం ప్రత్యేకంగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని పౌరసరఫరాల శాఖ నిర్ణయించింది. మొత్తంగా 7,185 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తుండగా.. ఇందులో సగానికిపైగా సన్న ధాన్యం సేకరణ మాత్రమే చేస్తాయని ఆ శాఖ అధికారి ఒకరు తెలిపారు. వ్యవసాయ శాఖ లెక్కల ఆధారంగా జిల్లా కలెక్టర్లే సన్న ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఎక్కడెక్కడ ఏర్పాటు చేయాలనే దానిపై నిర్ణయం తీసుకుంటారని వివరించారు. ఐకేపీ, పీఏసీఎస్‌తోపాటు ఇతర సహకార సంఘాల నేతృత్వంలో కొనుగోలు కేంద్రాలు ఉంటాయన్నారు.

ఎంపిక చేసిన రకాలు, కొలతలతో.. 'బోనస్'

రాష్ట్రంలో పండించే ధాన్యానికి కనీస మద్దతు ధర గ్రేడ్–ఏ రకాలకు రూ.2,320 సాధారణ రకాలకు రూ.2,300గా నిర్ణయించారు. సన్నరకాలకు రూ.500 బోనస్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించడంతో.. ఆయా రకాల ధాన్యానికి క్వింటాల్‌కు రూ.2,800 చొప్పున చెల్లించనున్నారు. వ్యవసాయ శాఖ ఇప్పటికే 33 రకాలను సన్నాలుగా గుర్తించింది. బీపీటీ–5204, ఆర్ఎన్ఆర్– 15048, హెచ్ఎంటీ, సోనా, జైశ్రీరాం తదితర రకాలను ప్రామాణికంగా తీసుకుంటారు. ఇవేకాకుండా.. బియ్యం గింజ పొడవు 6 మిల్లీమీటర్లు, వెడల్పు 2 మిల్లీమీటర్ల కన్నా తక్కువగా ఉన్న ఇతర రకాలను కూడా సన్నాలుగా గుర్తిస్తారు. బియ్యం గింజ పరిమాణాన్ని గుర్తించడానికి 'గ్రెయిన్ కాలిపర్'యంత్రాలను వినియోగిస్తారు. ఈ మేరకు కొనుగోలు కేంద్రాల కోసం అవసరమైన గ్రెయిన్ కాలిపర్లను కొనుగోలు చేసినట్లు ప్రొక్యూర్‌మెంట్ విభాగం అధికారి ఒకరు తెలిపారు.

పెరిగిన సన్నాల సాగు..

సన్న ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో.. చాలా జిల్లాల్లో సన్నాల సాగు పెరిగింది. వ్యవసాయ శాఖ నిర్దేశించిన 33 రకాల్లో మేలిమి రకమైన హెచ్ఎంటీ, జైశ్రీరాం వంటి వాటితోపాటు ఎక్కువ దిగుబడి ఇచ్చే బీపీటీలోని పలు వెరైటీలను రైతులు భారీ ఎత్తున సాగు చేశారు. ఆసిఫాబాద్ జిల్లాలో వరి వేసిన 45 వేల ఎకరాల్లో పూర్తిస్థాయిలో సన్నాల సాగే జరగగా.. పెద్దపల్లి, నిజామాబాద్, కామారెడ్డి, జగిత్యాల, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, మంచిర్యాల జిల్లాల్లోనూ సన్నాల సాగు ఎక్కువగా జరిగింది. జనవరి నుంచే రేషన్ దుకాణాలకు ఇవ్వాలని భావిస్తున్న సన్న బియ్యానికి అవసరమైన ధాన్యం సమకూరుతుందని పౌరసరఫరాల శాఖ భావిస్తోంది.

జోగులాంబకు పట్టువస్త్రాలు

రాష్ట్ర ప్రభుత్వం తరఫున సమర్పించిన మంత్రి కొండా సురేఖ

జోగుళాంబ శక్తిపీఠం: రాష్ట్రంలోని ఏకైక శక్తిపీఠమైన అలంపూర్ జోగుళాంబ అమ్మవారికి దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవారికి శ్రీచక్రార్చనలు, చండీహోమాలు, బాలబ్రహ్మేశ్వరుడికి రుద్రాభిషేకాలు నిర్వహించారు. ఆలయ ఈఓ, ప్రధాన అర్చకుడితో మాట్లాడి ఆలయంలో ఉన్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. సీఎం సొంత జిల్లా కాబట్టి అలంపూర్ ఆలయాల అభివృద్ధికి తొలి ప్రాధాన్యత ఇస్తూ త్వరలోనే



అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేస్తానని మంత్రి హామీనిచ్చారు. అనంతరం మంత్రికి ఈఓ, ప్రధాన అర్చకుడు అమ్మవారి జ్ఞాపికను అందజేశారు.

అయ్యగారూ! అభినందనలు

'సాక్షి' కథనానికి స్పందించిన పురోహితుడు • ముత్యాలమ్మ కుంట కట్టకు మరమ్మతులు


కోతకు గురైన సీసీ రోడ్డుతోపాటు బీటీ రోడ్డుకు మరమ్మతు పనులు చేయిస్తున్న పురోహితుడు వీరన్న (పంచె కట్టుకున్న వ్యక్తి)

సాక్షి ఎఫెక్ట్


వరదలతో కోతకు గురైన సీసీ రోడ్డు కింది భాగంలో కర్రను పెట్టిన దృశ్యం(ఫైల్)

కురవి: మహబూబాబాద్ జిల్లా కురవి మండల కేంద్రంలోని ముత్యాలమ్మ కుంట కట్టపై గుడికి వెళ్లేందుకు నిర్మించిన సీసీరోడ్డు కిందిభాగం ఇటీవల కురిసిన వర్షాలకు కోతకు గురికాగా మరమ్మతు చేపట్టారు. కాగా, గత నెల 24న 'సాక్షి'ప్రధాన సంచికలో 'కర్ర జారిందా..ప్రాణం గోవిందా'అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి గ్రామ పురోహితుడు బుక్కామఠం వీరన్న స్పందించారు. మంగళవారం తన సొంత ఖర్చులతో మొరం పోయించి జేసీబీ సాయంతో చదును చేయించారు. అలాగే కట్టకింద ధ్వంసమైన బీటీ రోడ్డు మరమ్మతులు చేయించారు. కాగా సీసీరోడ్డు కిందిభాగం కోతకు గురై నెలరోజులు దాటినా అధికారులెవరూ స్పందించలేదని..అయ్యగారు మరమ్మతులు చేయించడం అభినందనీయమని గ్రామస్తులు ప్రశంసిస్తున్నారు.

హరియాణా ప్రజలు తప్పుడు ప్రచారాన్ని తిరస్కరించారు. అభివృద్ధికి గ్యారంటీని గెలిపించారు. భగవద్గీత బోధించిన నేలపై సత్యం, అభివృద్ధి, సుపరిపాలనకు దక్కిన విజయమిది. ఏ రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేసినా దీర్ఘకాలం పాటు ప్రజలు మద్దతిస్తూ వచ్చారు. అక్కడ కాంగ్రెస్‌కు 'నో ఎంట్రీ'చూపించారు. అధికారాన్ని జన్మహక్కుగా భావించే కాంగ్రెస్‌కు మళ్లీ అవకాశమివ్వడం చాలా అరుదు. వరుసగా మూడోసారి బీజేపీకి మెజారిటీ ఇచ్చిన హరియాణా ప్రజలకు హృదయపూర్వక ధన్యవాదాలు. కూటములు కడుతూ భాగస్వాములపై ఆధారపడే కాంగ్రెస్ పార్టీ పరాన్నజీవి. ఒక్కోసారి ఆ పార్టీలనే మింగేస్తుంటుంది.

జమ్మూకశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడం భారత రాజ్యాంగం, ప్రజాస్వామ్యం సాధించిన విజయం. మంచి ఫలితాలు సాధించిన నేషనల్ కాన్ఫరెన్స్‌కు అభినందనలు. బీజేపీ సాధించిన ఫలితాలను చూసి గర్వంగా ఉంది. మా పార్టీపై నమ్మకముంచి, ఓటేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు

- బీజేపీ కార్యాలయంలో మోదీ



బీజేపీ హ్యాట్రిక్

అంచనాలను తలకిందులు చేస్తూ హరియాణాలో విజయభేరి

- ప్రభుత్వ వ్యతిరేకతను అలవోకగా అధిగమించిన కమలనాథులు
- 48 చోట్ల విజయపతాక ఎగరేసిన విజయభేరి
- 37 సీట్లతో సరిపెట్టుకున్న కాంగ్రెస్
- ఇరు పార్టీలకు పడిన ఓట్లలో తేడా కేవలం 0.85%

చండీగఢ్: పదేళ్ల ప్రభుత్వ వ్యతిరేకతను పటాపంచలు చేస్తూ, ఎగ్జిట్ పోల్స్ అంచనాలను తలకిందులు చేస్తూ బీజేపీ మూడోసారీ హరియాణాలో అధికార పగ్గాలు చేపట్టేందుకు సిద్ధమైంది. జాట్‌లనే నమ్ముకున్న కాంగ్రెస్ చతికిలపడితే ఓబీసీ, దళితులు, బ్రాహ్మణుల ఓట్లను సమీకరించి బీజేపీ జయకేతనం ఎగరేసింది. దీంతో లోక్‌సభ ఎన్నికల్లో తగ్గిన ఎంపీ సీట్లతో కుదుపులకు లోనైన కమలనాథుల విజయ రథ జైత్రయాత్ర.. హరియాణాలో మాత్రం సాఫీగా సాగింది. మంగళవారం ఉదయం కౌంటింగ్ మొదలయ్యాక ఆరంభ రౌండ్లలో కాంగ్రెస్ ఆధిక్యత స్పష్టంగా కనిపించింది. తర్వాత ఉదయం 10, 11 గంటల సమయం దాటగానే ఫలితాల సరళిలో నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. కాంగ్రెస్ ఆధిక్యత క్రమంగా తగ్గుతూ బీజేపీ పుంజుకుంది. అది అలాగే తుదికంటా కొనసాగి కమలనాథులకు విజయాన్ని కట్టబెట్టింది. మంగళవారం వెల్లడైన హరియాణా శాసనసభ ఎన్నికల ఫలితాల్లో బీజేపీ 48 సీట్లను కైవసం చేసుకుని అతిపెద్ద పార్టీగా అవతరించింది. కాంగ్రెస్ పార్టీ 37 స్థానాలతో సరిపెట్టుకుంది. అయితే బీజేపీకి 39.94 శాతం ఓట్లు పడగా దాదాపు అదే స్థాయిలో కాంగ్రెస్‌కు 39.09 శాతం ఓట్లు పడ్డాయి. కాంగ్రెస్ కంటే కేవలం 0.85 శాతం ఓట్ల ఆధిక్యతతో బీజేపీ ఏకంగా 11 సీట్లను ఎక్కువ గెల్చుకోవడం గమనార్హం. చాలా చోట్ల అత్యల్ప తేడాతో కాంగ్రెస్ ఓడినట్లు వార్తలొచ్చాయి. ఈవీఎంలలో అవకతవకలు జరిగాయని కాంగ్రెస్ ఆరోపించగా వాటిని నిరాధార ఆరోపణలుగా కేంద్ర ఎన్నికల సంఘం కొట్టిపారేసింది. ఇండియన్ నేషనల్ లోక్‌దళ్(ఐఎన్‌ఎల్‌డీ) పార్టీ కేవలం రెండు చోట్ల గెలిచింది. స్వతంత్రులు మూడు స్థానాల్లో నెగ్గారు. దుష్యంత్ చౌతాలా సారథ్యంలోని జననాయక్ జనతా పార్టీ(జేజేపీ) ఎన్నికల్లో ఎలాంటి ప్రభావం చూపలేకపోయింది. సొంతంగా బరిలో దిగిన ఆమ్ ఆద్మీ పార్టీ కేవలం 1.79 శాతం ఓట్లతో గెలుపు బోణీ కొట్టలేక ఉసూరుమంది.

ఓట్ల శాతం	
పార్టీ	ఓట్ల శాతం
బీజేపీ	39.94
కాంగ్రెస్	39.09
ఐఎన్‌ఎల్‌డీ	4.14
ఆప్	1.79
జేజేపీ	0.90
బీఎస్పీ	1.82
నోటా	0.38
ఇతరులు	11.64

మల్లయోధురాలి గెలుపు పట్టు

బీజేపీ నేత, ప్రస్తుత ముఖ్యమంత్రి నయాబ్ సింగ్ సైనీ(లాద్వా), కాంగ్రెస్ నేత భూపీందర్ సింగ్ హుడా(గర్హీ సాంప్లా-కిలోయీ) విజయం సాధించారు. ఒలింపిక్స్‌లో స్వర్ణం కొద్దిలో చేజార్చుకున్న మల్లయోధురాలు వినేశ్ ఫొగాట్ ఎన్నికల్లో మాత్రం విజయాన్ని తొలి ప్రయత్నంలోనే ఒడిసిపట్టుకున్నారు. ఇటీవల కాంగ్రెస్ కండువా కప్పుకున్న ఈమె జులానా నియోజకవర్గంలో విజయకేతనం ఎగరేశారు. హిసార్‌లో కాంగ్రెస్ అభ్యర్థి రామ్‌నివాస్ రాణాపై దేశంలోనే అత్యంత ధనిక మహిళ సావిత్రి జిందాల్ స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి గెలిచారు. జేజేపీ నేత, మాజీ ఉపముఖ్యమంత్రి దుష్యంత్ చౌతాలా, హరియాణా కాంగ్రెస్ చీఫ్ ఉదయ్ భాన్, మాజీ సీఎం భజన్‌లాల్ మనవడు, బీజేపీ నేత భవ్య బిష్ణోయ్ ఓటమిని చవిచూశారు. భవ్య ఓడిపోయిన అదమ్‌పూర్ స్థానం గత ఐదు దశాబ్దాలుగా బిష్ణోయ్‌లకు కంచుకోటగా ఉంది. ఐఎన్‌ఎల్‌డీ నేత అభయ్ సింగ్ చౌతాలా సైతం ఓడిపోయారు. ఎగ్జిట్ పోల్స్‌ను తలకిందులు చేసిన బీజేపీ తన కేబినెట్ మంత్రులను మాత్రం గెలిపించుకోలేకపోయింది. అసెంబ్లీ స్పీకర్, బీజేపీ నేత జ్ఞాన్‌చంద్ గుప్తా, ఎనిమిది మంది మంత్రులు ఓడిపోయారు. 2019 ఎన్నికల్లో 15 శాతం ఓట్లతో 10 స్థానాల్లో గెలిచిన జననాయక్ జనతా పార్టీ ఈసారి పూర్తిగా తుడిచిపెట్టుకుపోయింది.

13 మంది మహిళల విజయం

90 స్థానాలున్న అసెంబ్లీలోకి ఈసారి 13 మంది మహిళలు అడుగుపెట్టబోతున్నారు. వినేశ్ ఫొగాట్, సావిత్రి జిందాల్‌సహా 13 మంది గెల్చారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో 8 మంది మహిళా అభ్యర్థులు గెలిచారు. బీజేపీ నుంచి ఐదుగురు, కాంగ్రెస్ నుంచి ఏడుగురు మహిళలు విజయం సాధించారు.

ప్రభుత్వ పథకాలకు ప్రజామోదం: సీఎం సైనీ

పార్టీని విజయతీరాలకు చేర్చినందుకు ఓటర్లకు బీజేపీ నేత, ముఖ్యమంత్రి సైనీ కృతజ్ఞతలు తెలిపారు. '' మోదీ నాయకత్వంలో ప్రభుత్వ విధానాలకు ప్రజలు పట్టంకట్టారు. ప్రభుత్వ పథకాలకు ప్రజామోదం దక్కిందనడానికి ఈ ఫలితాలే నిదర్శనం. ఈ గెలుపు ఘనత పూర్తిగా మోదీజీదే' అని సీఎం అన్నారు.

మరిన్ని ఎన్నికల ఫలితాల వార్తలు.. ఈ-పేపర్‌లో

కశ్మీరంలో కూటమి

- మొత్తం 90 స్థానాలకు గాను 49 స్థానాలు కూటమి కైవసం
- నేషనల్ కాన్ఫరెన్స్‌కు 42, కాంగ్రెస్‌కు 6, సీపీఎంకు ఒకటి
- బలం పుంజుకున్న బీజేపీ.. సొంతంగానే 29 స్థానాల్లో గెలుపు
- 3 సీట్లకే పరిమితమైన పీడీపీ.. ఏడుగురు స్వతంత్రుల విజయం
- అనూహ్యంగా ఒక స్థానం గెలుచుకున్న ఆమ్ ఆద్మీ పార్టీ
- జమ్మూకశ్మీర్ నూతన ముఖ్యమంత్రిగా ఒమర్ అబ్దుల్లా

శ్రీనగర్/జమ్మూ: జమ్మూకశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దయ్యి, కేంద్ర పాలిత ప్రాంతంగా మారిన తర్వాత జరిగిన తొలి శాసనసభ ఎన్నికల్లో ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చారు. మూడు పార్టీలతో కూడిన విపక్ష 'ఇండియా' కూటమికే పట్టంగట్టారు. శాసనసభలో మొత్తం 90 స్థానాలకు గాను ఆ కూటమి 49 స్థానాలు సొంతం చేసుకుంది. ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన మెజార్టీ సాధించింది. ఇండియా కూటమిలోని నేషనల్ కాన్ఫరెన్స్ 42 స్థానాలు గెలుచుకుంది. కాంగ్రెస్ ఆరు, సీపీఎం ఒక స్థానం దక్కించుకున్నాయి. మూడు పార్టీలు కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతున్నాయి. జమ్మూకశ్మీర్‌లో మంగళవారం ఓట్ల లెక్కింపు చేపట్టారు. ప్రధాన ప్రాంతీయ పార్టీ అయిన నేషనల్ కాన్ఫరెన్స్ బలం పెరిగింది. ఆ పార్టీ ఓట్లశాతం 2014లో 20.77 ఉండగా, ఇప్పుడు 23.43 శాతానికి చేరుకుంది. మరో ప్రాంతీయ పార్టీ పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ(పీడీపీ) ఈ ఎన్నికల్లో కేవలం 3 సీట్లకే పరిమితమైంది. ఆ పార్టీ ఓట్ల శాతం 22.67 నుంచి 8.87కు పడిపోయింది. ఈ ఎన్నికల్లో ఒంటరిగా బరిలోకి దిగిన బీజేపీ మెరుగైన ఫలితాలే సాధించింది. సొంతంగా 29 సీట్లలో జెండా ఎగురవేసింది. 2014 ఎన్నికల్లో ఆ పార్టీకి 25 స్థానాలు దక్కగా, ఈసారి మరో నాలుగు స్థానాలు పెరగడం గమనార్హం. అంతేకాకుండా ఓట్ల శాతం 23 శాతం నుంచి 25.64 శాతానికి పెరిగింది. కానీ, జమ్మూకశ్మీర్ బీజేపీ అధ్యక్షుడు రవీంద్ర రైనా ఓటమి పాలయ్యారు.

మహిళలు ముగ్గురే

తమ కూటమికి అధికారం దక్కినప్పటికీ కాంగ్రెస్‌కు మాత్రం ఈ ఎన్నికల ఫలితాలు నిరాశ కలిగించాయి. పదేళ్ల క్రితం ఆ పార్టీ 12 సీట్లు గెలుచుకోగా, ప్రస్తుతం కేవలం ఆరు సీట్లు దక్కాయి. కశ్మీర్ లోయలో ఐదు స్థానాలు, జమ్మూ ప్రాంతంలో కేవలం ఒక స్థానం లభించింది. ఓట్ల శాతం కూడా 18 నుంచి 12 శాతానికి తగ్గిపోయింది. ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ అనూహ్య విజయం సాధించింది. ఒక స్థానంలో పాగా వేసింది. జమ్మూకశ్మీర్ పీపుల్స్ కాన్ఫరెన్స్(జేపీసీ)కు ఒక స్థానం లభించింది. ఏడుగురు స్వతంత్ర అభ్యర్థులు విజయం సాధించారు. మొత్తం 90 మంది నూతన ఎమ్మెల్యేల్లో మహిళలు ముగ్గురే ఉన్నారు. నేషనల్ కాన్ఫరెన్స్ నుంచి సకీనా మసూద్, షమీమా ఫిర్దోస్, బీజేపీ నుంచి షగున్ పరిహార్ గెలిచారు. జమ్మూకశ్మీర్ నూతన ముఖ్యమంత్రిగా నేషనల్ కాన్ఫరెన్స్ ఉపాధ్యక్షుడు ఒమర్ అబ్దుల్లా బాధ్యతలు స్వీకరిస్తారని పార్టీ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా ప్రకటించారు.

ఏ పార్టీకి ఎంత శాతం ఓట్లు	
పార్టీ	ఓట్ల శాతం
నేషనల్ కాన్ఫరెన్స్	23.43
బీజేపీ	25.64
కాంగ్రెస్	11.97
పీడీపీ	8.87


కౌంటింగ్, ఈవీఎంల పనితీరుపై అనుమానాలున్నాయ్!

- హరియాణా ఫలితాలను అంగీకరించం
- ఈసీ వెబ్‌సైట్‌లో అప్‌డేట్స్ ఆలస్యమెందుకు?
- నిలదీసిన కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్

న్యూఢిల్లీ: ప్రతికూల ఫలితాలిచ్చిన హరియాణా అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ పద్ధతి, ఈవీఎంల పనితీరును కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా తప్పుబట్టింది. కొన్ని జిల్లాల్లో ఓట్ల లెక్కింపు ప్రక్రియలో అవకతవకలు జరిగాయని ఆరోపించింది. '' ఈ ఎన్నికల్లో ప్రజాస్వామ్యం(లోక్‌తంత్ర) ఓడిపోయింది. మరో వ్యవస్థ(తంత్ర) అక్రమంగా గెలిచింది'' అంటూ బీజేపీ నేతృత్వంలోని కేంద్రప్రభుత్వం కుట్రకు పాల్పడిందని పరోక్షంగా విమర్శించారు. ఢిల్లీలో ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో పార్టీ ప్రధాన కార్యదర్శి(కమ్యూనికేషన్స్) జైరాం రమేశ్ మీడియా సమావేశంలో మాట్లాడారు.

99 శాతం బ్యాటరీతో బీజేపీ గెలిస్తే.. 70 శాతంతో కాంగ్రెస్ గెల్చింది

'' ప్రజాతీర్పును అపహాస్యం చేస్తూ, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ వెల్లడైన ఫలితాలివి. వీటిని మేం ఒప్పుకోం. పారదర్శకమైన, ప్రజాస్వామ్యయుత పద్ధతి ఓటమిపాలైంది. హరియాణా అంకం ఇక్కడితో ముగిసిపోలేదు. ఇది ఇంకా కొనసాగుతుంది. బ్యాటరీ 99 శాతం నిండిన ఈవీఎంలలో బీజేపీ గెలిస్తే, 70 శాతం బ్యాటరీ ఉన్న ఈవీఎంలలో కాంగ్రెస్ గెలిచింది. ఇందులో కుట్ర దాగుంది.



12 నుంచి 14 నియోజకవర్గాల్లో అభ్యర్థుల నుంచి ఇలాంటి ఫిర్యాదులే వెల్లువెత్తుతున్నాయి. ఎన్నికల ప్రక్రియలో అన్యాయం జరిగితే మొదట ఆశ్రయించేది ఎన్నికల సంఘాన్నే. పారదర్శకంగా పనిచేయాల్సిన రాజ్యాంగబద్ధ సంస్థ అది. అందుకే తీవ్రమైన ఈ అంశంపై లిఖితపూర్వకంగా కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదుచేస్తాం. నిర్ణీత గడువులోగా చర్యలు తీసుకోవాలని పట్టుబడతాం. ఓట్ల లెక్కింపు, ఈవీఎంల పనితీరుపై చాలా నియోజకవర్గాల్లో సందేహాలు పెరిగాయి. ప్రతి ఒక్కరితో మాట్లాడాం. ఇది విశ్లేషణల సమయం కాదు. మా నుంచి విజయాన్ని లాక్కున్నారు. వ్యవస్థను అధికార పార్టీ దుర్వినియోగం చేసింది. క్షేత్రస్థాయిలో మార్పు కోరుకుంటున్నారనే వాస్తవం ప్రతి ఒక్కరికీ తెలుసు. దీనికి ఫలితాలు దర్పణం పట్టట్లేవు. ఫలితాలను కాంగ్రెస్ అంగీకరించకపోవడానికి ప్రధాన కారణం కౌంటింగ్, ఈవీఎంల పనితీరు, సమగ్రత ప్రశ్నార్థకంలో పడటమే. దాదాపు 3-4 జిల్లాల్లోని 12-14 నియోజకవర్గాల్లో ఓట్ల లెక్కింపు విధానం, ఈవీఎంల పనితీరుపై అనుమానాలు రేకెత్తుతున్నాయి. స్థానిక యంత్రాంగంపై తీవ్రమైన ఒత్తిడి మోపారు. ఇదంతా కేంద్ర, రాష్ట్రాల్లోని డబుల్ ఇంజిన్ ప్రభుత్వ ఒత్తిడే'' అని జైరాం రమేశ్ అన్నారు.

200 ఓట్ల తేడాతో ఓడారు : '' 200 ఓట్లు, 300 ఓట్లు, 50 ఓట్లు.. ఇలా అత్యల్ప ఓట్ల తేడాతో అభ్యర్థులు ఓడారు. చక్కని ఆధిక్యత కనబరిచిన అభ్యర్థులు హఠాత్తుగా 100-200 ఓట్ల తేడాతో ఓడిపోవడమేంటి?. అవకతవకలు, అక్రమాల వల్లే ఇది సాధ్యం. అనూహ్య, దిగ్భ్రాంతికర పరిణామమిది. మార్పును కోరుకుంటూ హరియాణా ప్రజలు ఆశించిన దానికి, వాస్తవ పరిస్థితులకు విరుద్ధంగా వెల్లడైన ఫలితమిది'' అని జైరాం ఆరోపించారు.

ఎందుకంత నెమ్మది? : అంతకుముందు మధ్యాహ్నం వేళ జైరాం కేంద్ర ఎన్నికల సంఘానికి ఒక లేఖ రాశారు. '' ఉదయం 9 గంటల నుంచి 11 గంటల దాకా ఈసీఐ వెబ్‌సైట్‌లో అప్‌డేట్స్ అనూహ్యంగా నెమ్మదించాయి. దీనికి కారణమేంటి? అదమ్‌పూర్ కాంగ్రెస్ అభ్యర్థి చందర్ ప్రకాశ్ 1,268 ఓట్ల తేడాతో విజయం సాధించారు. కానీ ఆయనకు గెలుపు సర్టిఫికెట్ ఇవ్వట్లేదు. ఈసీ వెబ్‌సైట్‌లో కూడా ఆయన గెలిచినట్లుగా చూపించట్లేదు. చివరి మూడు రౌండ్ల అప్‌డేట్స్ ఇవ్వట్లేదు. అనవసర ఆలస్యానికి కారణమేంటి?' అని జైరాం ప్రశ్నించారు.

ఆలస్యం జరగలేదు: ఈసీ : ఈసీ అప్‌డేట్స్ ఆలస్యమయ్యాయని కాంగ్రెస్ చేసిన ఆరోపణలపై కేంద్ర ఎన్నికల సంఘం స్పందించింది. '' ఆరోపణల్లో నిజం లేదు. బాధ్యతారాహిత్యంతో, తప్పుడు ఉద్దేశాలతో నిరాధార ఆరోపణలు చేస్తున్నారు. ఎన్నికల నిబంధనల రూల్ నంబర్ 60 ప్రకారం ఆయా కౌంటింగ్ కేంద్రాల అధికారులు నడుచుకున్నారు. హరియాణా, జమ్మూకశ్మీర్‌లో లెక్కింపుపై అప్‌డేట్స్ ఆలస్యమయ్యాయన్న మీ మెమొరాండంలో ఎలాంటి వాస్తవాలు లేవు. ప్రతి ఐదు నిమిషాలకు అన్ని నియోజకవర్గాల నుంచి 25 రౌండ్ల ఫలితాలు అప్‌డేట్ అవుతూనే ఉంటాయి' అని ఈసీ వివరణ ఇచ్చింది. ఈసీ వివరణపై కాంగ్రెస్ అసహనం వ్యక్తంచేసింది. '' తటస్థ వైఖరిని అవలంబించాల్సిన ఈసీ ఏకపక్షంగా విపక్ష పార్టీ విన్నపాలను తోసిపుచ్చడం సహేతుకం కాదు. ఫిర్యాదుపై సంప్రదింపుల స్థాయిని ఈసీ దిగజార్చింది'' అని జైరాం అన్నారు.

హస్తం అస్తవ్యస్తం

- హరియాణా రాష్ట్ర నాయకత్వంలో లోపించిన ఐక్యత
- గెలుపు గుర్రాలను వదిలేసి అస్మదీయులకే టికెట్లు
- జాట్‌యేతర వర్గాలను తమ వైపు తిప్పుకోలేకపోయిన కాంగ్రెస్

హరియాణాలో ఈసారి కాంగ్రెస్ క్లీన్‌స్వీప్ చేయనుందన్న ఎగ్జిట్ పోల్స్ అంచనాలు, తీవ్రంగా నెలకొన్న ప్రభుత్వ వ్యతిరేకత, ఎలాగూ గెలిచేది మేమేనన్న కాంగ్రెస్ నేతల అతి ఆత్మవిశ్వాసం.. వెరసి హస్తం పార్టీని మరోసారి అధికారానికి దూరంచేశాయి. మోదీ-షా ద్వయం రాజకీయ చతురత ధాటికి కాంగ్రెస్ మూడోసారీ ఓటమిని మూటగట్టుకుంది. స్వీయ తప్పిదాలు సైతం కాంగ్రెస్‌ను విజయానికి ఆమడదూరంలో ఆపేశాయి. కేవలం జాట్ వర్గం పైనే గంపెడాశలు పెట్టుకోవడం, రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నేత భూపీందర్ సింగ్ హుడా అడుగుజాడల్లో నడవడం, కుమారి సెల్జా వంటి దళిత నాయకురాలికి ప్రాధాన్యత తగ్గించడం, అగ్రనేతల మధ్య లోపించిన ఐక్యత వంటి అంశాలు కాంగ్రెస్‌ను పదేళ్ల తర్వాత అధికారం పీఠంపై కూర్చోనివ్వకుండా చేశాయి.

ఏకమైన జాట్ వ్యతిరేక ఓట్లు

మొదట్నుంచీ రాష్ట్రంలోని జాట్ ఓట్లనే కాంగ్రెస్ నమ్ముకుంది. జాట్‌యేతర దళితులు, ఓబీసీలు బీజేపీ వైపు మొగ్గుచూపుతున్నారన్న సంకేతాలను కాంగ్రెస్ పసిగట్టలేకపోయింది. ఇది కాంగ్రెస్ ఓటమికి ప్రధాన కారణం. బీజేపీ అత్యధిక టికెట్లను ఓబీసీలు, బ్రాహ్మణులకే ఇచ్చింది. అయితే కాంగ్రెస్ పార్టీ ఎక్కువ భూపీందర్ నిర్ణయాలపై ఆధారపడింది. దీన్ని అలుసుగా తీసుకున్న భూపీందర్ కేవలం తన అనుచరగణానికే పెద్దపీట వేశారు. ఎక్కువ మందికి టికెట్లు ఇప్పించుకున్నారు. కాంగ్రెస్ రాష్ట్ర రాజకీయాలను శాసించే భూపీందర్ పరోక్షంగా పార్టీ ఓటమికి కారణమయ్యారు. గెలుపు గుర్రాలా? కాదా? అనేది చూసుకోకుండా తన అనుచరవర్గానికే అత్యధికంగా పార్టీ టికెట్లు దక్కేలాచేశారు. రాష్ట్రంలో 90 స్థానాలుంటే 72 చోట్ల కాంగ్రెస్ టికెట్ పొందిన వాళ్లు భూపేందర్ మనుషులే. తాను గెలిచి తన వారినీ గెలిపించుకుంటానన్న భూపీందర్ అతివిశ్వాసమే కాంగ్రెస్ పుట్టి ముంచిందని తెలుస్తోంది. కుమారి సెల్జా తన అనుచరుల్లో 9 మందికి టికెట్ దక్కేలా చేశారు. రణ్‌దీప్ సూర్జేవాలా సైతం తన వారికి టికెట్లు ఇప్పించుకున్నారు. దీంతో గెలుపు గుర్రాలను పక్కనబెట్టిన కాంగ్రెస్ భారీ మూల్యం చెల్లించుకుంది.

దూరంగా ఉండిపోయిన సెల్జా

బీజేపీకి దగ్గరవుతున్న దళితులను కాంగ్రెస్ వైపునకు తిప్పే సత్తా ఉన్న దళిత నాయకురాలు కుమారి సెల్జా. అయితే ఈమె ఎన్నికల్లో క్రియాశీలక పాత్ర పోషించలేదు. సిర్సా ఎంపీ అయిన సెల్జాను పార్టీ అధిష్టానమే హరియాణా ఎన్నికల్లో కలగజేసు కోవద్దని సూచించినట్లు సమాచారం. దీని వెనుక భూపీందర్ హస్తముందని వార్తలొచ్చాయి. పార్టీ మేనిఫెస్టో విడుదల కార్యక్రమంలోనూ సెల్జా పాల్గొనలేదు. కీలక ప్రచార ఘట్టాల్లోనూ ఆమె జాడ లేదు.

ఒకే పార్టీలో వేర్వేరుగా ప్రచారం

రాష్ట్ర నేతలంతా కలిసి ఒకే ప్రచార కార్యక్రమం చేస్తే అది ప్రజల్లోకి బలంగా వెళ్తుంది. అందుకు భిన్నంగా ముఖ్య నేతలు ఎవరికి వారే భిన్న కార్యక్రమాలు చేపట్టి దేనికీ అగ్రతాంబూలం దక్కకుండా చేసుకున్నారు. భూపీందర్ వర్గం విడిగా 'ఘర్ ఘర్ కాంగ్రెస్' అంటూ ఇంటింటికీ ప్రచారం మొదలెట్టింది. వీళ్లకు పోటీగా కాంగ్రెస్‌లోనే సెల్జా, రణ్‌దీప్ సూర్జేవాలాలు 'కాంగ్రెస్ సందేశ్' యాత్రను మొదలెట్టారు. హరియాణా జనాభాలో 26-28 శాతం మంది జాట్‌లు ఉంటారు. ఇక్కడ 17 ఎస్సీ రిజర్వ్‌డ్ స్థానాలున్నాయి. మెజారిటీ మార్కును చేరుకోవడానికి అవకాశాలను పెంచే ఈ ఎస్సీ స్థానాలపై కాంగ్రెస్ పెద్దగా దృష్టిపెట్టలేదు.

దెబ్బకొట్టిన ప్రాంతీయ పార్టీలు, స్వతంత్రులు

ప్రభుత్వ వ్యతిరేకతను ఓట్లుగా మార్చుకోవడంలో కాంగ్రెస్ విఫలమైంది. దీనిని ప్రాంతీయ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు అవరోధంగా తయారయ్యారు. ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు కాంగ్రెస్‌తోపాటు ప్రాంతీయ పార్టీలు, స్వతంత్రులకు మళ్లాయి. దీంతో ఎవరికీ సరైన మెజారిటీ రాలేదు. ఇది బీజేపీకి లాభం చేకూర్చింది. చాలా స్థానాల్లో గెలుపు మార్జిన్లు చాలా స్వల్పంగా ఉండటం చూస్తుంటే ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు బాగా చీలినట్లు అర్థమవుతోంది. బీజేపీకి, కాంగ్రెస్‌కు మధ్య ఓట్ల తేడా కేవలం 0.85 శాతం కాగా, ఒంటరిగా పోటీ చేసిన ఆప్‌కు 1.79 శాతం ఓట్లు రావడం గమనార్హం. మరోవైపు దళితుల ఓట్లు పెద్దగా కాంగ్రెస్‌కు పడలేదు. జననాయక్ జనతా పార్టీ, ఇండియన్ నేషనల్ లోక్‌దళ్, ఆజాద్ సమాజ్ పార్టీ, బహుజన్ సమాజ్ పార్టీలు ప్రధానంగా దళితుల ఓట్లపై దృష్టిపెట్టాయి. దీంతో దళితులు కేవలం ఒక్క పార్టీకే ఓటేయకుండా వేర్వేరు పార్టీలకు ఓట్లేయడంతో ఓట్లు చీలాయి. ఇవి పరోక్షంగా బీజేపీకి లాభం చేకూర్చగా కాంగ్రెస్ నష్టపోయింది. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మళ్లీ జాట్‌ల ఆధిపత్యం కొనసాగుతుందన్న భావనతో ఇతర కులాలు, వర్గాలు ఉద్దేశపూర్వకంగానే ఒక్క బీజేపీకే ఓటేశాయని రాజకీయ పండితులు చెబుతున్నారు. బరిలో నిల్చొని దాదాపు 10 స్థానాల్లో విజయావకాశాలను కాంగ్రెస్ రెబల్స్ దెబ్బతీశారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

కమలం కమాల్!

- బీజేపీ అనూహ్య విజయం వెనుక కారణాలెన్నో..
- సీఎంను మార్చి, కొత్త ముఖాలకు ఛాన్సిచ్చి పదేళ్ల ప్రభుత్వ వ్యతిరేకతను అధిగమించిన కమలదళం
- జాట్ వ్యతిరేక ఓట్లను ఏకం చేయడంలో సఫలం

హరియాణా. వివాదాస్పద మూడు సాగు చట్టాలపై రైతుల ఉద్యమానికి వేదికగా నిలిచిన రాష్ట్రం. అగ్నివీర్ పథకంతో ఆర్మీలో శాశ్వత నియామక అవకాశాలను కోల్పోతామని యువత తీవ్ర నిరాశంలో నిండిపోయిన రాష్ట్రం. ప్రతి అంశంపై ప్రభుత్వాన్ని విమర్శిస్తూ కాంగ్రెస్ చూపిన దూకుడు, ఆపార్టీ అతి ఆత్మవిశ్వాసాన్ని కళ్లారా చూసిన రాష్ట్రం. ఇలాంటి రాష్ట్రం పదేళ్ల ప్రభుత్వ వ్యతిరేకతనూ కూడా పక్కనబెట్టి మళ్లీ కమలదళానికి అధికార పగ్గాలు అప్పజెప్పిన తీరు ఎగ్జిట్‌పోల్ సర్వేలనేకాదు రాజకీయ విశ్లేషకులనూ ఆశ్చర్యానికి గురిచేసింది. 1966లో రాష్ట్రంగా ఏర్పడ్డాక హరియాణాలో బీజేపీ హ్యాట్రిక్ కొట్టడం ఇదే తొలిసారి.

ఏకమైన జాట్ వ్యతిరేక వర్గాలు

ఎగ్జిట్ పోల్ సర్వేలు సైతం తలకిందులైన ఈ బీజేపీ విజయం వెనుక జాట్‌యేతర వర్గం ఓటర్లు ఉన్నారని అర్థమవుతోంది. ''జాట్‌లు కాంగ్రెస్‌కు ఓటేశారు. అయితే బలమైన జాట్‌లను ఎదుర్కొనేందుకు జాట్‌యేతర వర్గాలైన ఓబీసీలు, దళితులు, అగ్రవర్ణాల ఓటర్లను తమ వైపునకు తిప్పుకోవడంలో బీజేపీ నేతలు సఫలీకృతులయ్యారు. జాట్‌లు పూర్తిగా ఒక్క కాంగ్రెస్‌కే ఓటేయకపోవడమూ బీజేపీకి లాభించింది'' అని సెంటర్ ఫర్ పాలసీ రీసెర్చ్‌లో అధ్యయనకారుడు రాహుల్ వర్మ విశ్లేషించారు.

బీజేపీ వెంటే అహిర్వాల్

దక్షిణ హరియాణాలోని అహిర్వాల్ ప్రాంత ప్రజలు బీజేపీకి అనుకూలంగా ఉంటారు. 2014, 2019లో బీజేపీ విజయానికి ఈ ప్రాంత ఓటర్ల మద్దతే ప్రధాన కారణం. ఈసారి కూడా అహిర్వాల్ ఓటర్లు బీజేపీ పట్ల తమ అభిమానాన్ని చాటుకున్నారు. దీంతో ఈసారీ అహిర్వాల్ ప్రాంతంలోని మెజారిటీ సీట్లను బీజేపీ కైవసం చేసుకుంది. ఇటీవల ముగిసిన లోక్‌సభ ఎన్నికల్లోనూ 11 అసెంబ్లీ సెగ్మెంట్లలో 10 చోట్ల బీజేపీ ఘన విజయం సాధించడం గమనార్హం. హరియాణా సైబర్ కేంద్రంగా కీర్తికెక్కిన గురుగ్రామ్ సైతం బీజేపీ వెంటే నిలిచింది. ఫరీదాబాద్‌సహా చాలా పట్టణ ప్రాంతాల ప్రజలు మొదట్నుంచీ బీజేపీకి వెంటే నడవటం ఆ పార్టీ విజయాన్ని సులభతరం చేసింది.

నాయబ్ సింగ్ సైనీ నాయకత్వం

కేవలం 210 రోజుల క్రితమే సీఎంగా పగ్గాలు చేపట్టిన 54 ఏళ్ల నయాబ్ సింగ్ సైనీ తన ప్రజాకర్షక పాలనతో ఓటర్లను తన వైపునకు తిప్పుకున్నారు. గెలిస్తే ఈయననే మళ్లీ సీఎంను చేస్తానని బీజేపీ ప్రకటించడంతో ఖట్టర్ నిష్క్రమణ తర్వాత రాష్ట్రంలో పార్టీ అగ్రనేతగా అవతరించారు. హరియణా బీజేపీ మాజీ చీఫ్ అయిన సైనీ కేవలం 'డమ్మీ సీఎం' అంటూ కాంగ్రెస్ చేసిన వ్యాఖ్యలు తప్పు అని నిరూపించారు. గ్రామపంచాయతీల వ్యయ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.21 లక్షలకు పెంచడం, గృహ వినియోగదారులకు విద్యుత్ బిల్లులో కనీసం చార్జీల రద్దు, ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన సహా పలు అభివృద్ధి పథకాలు సైనీ నాయకత్వంపై ప్రజల్లో నమ్మకాన్నిపెంచాయి. అగ్నివీర్‌లకు ఆర్మీ నుంచి బయటికొచ్చాక ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చి యువతలో సైనీ మంచి క్రేజ్ సంపాదించుకున్నారు.

ప్రభుత్వ వ్యతిరేకతను అధిగమించి..

దాదాపు తొమ్మిదిన్నర ఏళ్ల పాటు సీఎంగా కొనసాగిన ఖట్టర్ పట్ల రాష్ట్ర ప్రజల్లో వ్యతిరేకత నెలకొంది. దీనిని ముందే పసిగట్టిన బీజేపీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ అకస్మాత్తుగా ఆయనను తప్పించి సైనీని సీఎంను చేసింది. ఎన్నికల ప్రచార కార్యక్రమాలకు ఖట్టర్‌ను పూర్తిగా పక్కనబెట్టింది. రాష్ట్రంలో ఎక్కడా పోస్టర్లలో కూడా ఖట్టర్ ఫొటో వేయలేదు. దీంతో సీఎం, ప్రభుత్వ వ్యతిరేకత చల్లబడిందని చెప్పొచ్చు.

సిట్టింగ్ ఎమ్మెల్యేలను పక్కనబెట్టిన బీజేపీ

ఏకంగా సీఎం ఖట్టర్‌ను పక్కనబెట్టిన కమలం పార్టీ తర్వాత సిట్టింగ్ ఎమ్మెల్యేలపై దృష్టిపెట్టింది. ఏఏ స్థానాల్లో ఎమ్మెల్యేలపై ప్రజల్లో వ్యతిరేకత ఉందో వారందరికీ టికెట్లు నిరాకరించింది. దీంతో స్థానిక ప్రజాప్రతినిధులపై ఉన్న వ్యతిరేకతకు పోగొట్టగలిగింది. దాదాపు 60 కొత్తముఖాలకు టికెట్ ఇచ్చి కొత్త ప్రయోగం చేసింది.

రైతులను బుజ్జగించే యత్నం..

వివాదాస్పద మూడు వ్యవసాయ చట్టాలపై హరియాణా రైతులు ఉద్యమించిన నేపథ్యంలో రైతాంగం ఆగ్రహం పోలింగ్‌లో బయటపడకుండా ఉండేందుకు ఈ ఏడాది ఆగస్టులో మరో 10 పంటలను జోడించి మొత్తంగా 24 పంటలకు కనీస మద్దతు ధర ఇవ్వాలని నిర్ణయించింది. ఈ ప్రకటనతో రైతన్నలు ప్రభుత్వానికి అనుకూలంగా మారారని తెలుస్తోంది.

రూ.500కే గ్యాస్ సిలిండర్

రూ.500కే ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ ఇస్తామని కమలనేతలు హామీ ఇచ్చారు. మహిళలకు నెలకు రూ.2,000 ఆర్థిక సాయం, యువతకు 2 లక్షల ఉద్యోగాలు వంటి వాగ్దానాలకు ఓటర్లు ఆకర్షితులయ్యారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

ఏఐ మార్గదర్శకులకు...

ఫిజిక్స్ నోబెల్


జెఫ్రీ హింటన్


జాన్ హాప్‌ఫీల్డ్

- జాన్ హాప్‌ఫీల్డ్, జెఫ్రీ హింటన్‌లకు పురస్కారం
- మెషీన్ లెర్నింగ్‌ను కొత్త పుంతలు తొక్కించిన ఘనులు

స్టాక్ హోం: వైద్య శాస్త్రం మాదిరిగానే ఫిజిక్స్‌లో కూడా ఈ ఏడాది నోబెల్ అవార్డు ఇద్దరు సైంటిస్టులను వరించింది. మెషీన్ లెర్నింగ్‌ను కొత్త పుంతలు తొక్కించి.. కృత్రిమ మేధ వికాసానికి మార్గదర్శకులుగా నిలిచిన సైంటిస్టులు జాన్ హాప్‌ఫీల్డ్, జెఫ్రీ హింటన్‌లు అత్యున్నత పురస్కారం అందుకోనున్నారు. రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ మంగళవారం ఈ మేరకు ప్రకటించింది. గతేడాది ఫిజిక్స్ నోబెల్‌ను ముగ్గురు సైంటిస్టులకు అందించడం తెలిసిందే.

హింటన్.. ఫాదర్ ఆఫ్ ఏఐ

హింటన్ ఫాదర్ ఆఫ్ ఏఐ (ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్)గా ప్రసిద్ధుడు. కెనడా, బ్రిటన్ పౌరసత్వమున్న ఆయన టొరంటో వర్సిటీలో పని చేస్తున్నారు. హాప్‌ఫీల్డ్‌ది అమెరికా. ప్రిన్స్‌టన్ వర్సిటీలో పని చేస్తున్నారు. వారు రూపొందించి, అభివృద్ధి చేసిన భౌతిక శాస్త్ర నియమాలు, పనిముట్లు నేటి శక్తిమంతమైన మెషీన్ లెర్నింగ్‌కు పునాదులని నోబెల్ కమిటీ కొనియాడింది. 'వారు అభివృద్ధి చేసిన ఆర్టిఫీషియల్ న్యూరల్ నెట్‌వర్క్స్ సహాయక మెమరీలుగా ఎన్నో రంగాల్లో కీలక సేవలు అందిస్తున్నాయి. ఫేషియల్ రికగ్నిషన్ మొదలుకుని, యాంత్రిక అనువాదం దాకా అన్నింటా అవి మన జీవితంలో భాగంగా మారాయి' అని ప్రశంసించింది. అయితే, ఈ సాంకేతిక ప్రగతి మన భవిష్యత్తుపై ఎన్నో సందేహాలను లేవనెత్తిందని అభిప్రాయపడింది. మానవాళికి మేలు జరిగేలా దీన్ని సురక్షిత, నైతిక పద్ధతుల్లో వాడటం చాలా ముఖ్యమని పేర్కొంది. ఈ ఆందోళనలు సహేతుకమేనని హింటన్ తరచూ చెబుతుంటారు. వీటిపై మరింత స్వేచ్ఛగా మాట్లాడేందుకు వీలుగా ఆయన గూగుల్‌లో ఉన్నతోద్యోగాన్ని కూడా వదులుకోవడం విశేషం. ఈ నేపథ్యం దృష్ట్యా తనకు అత్యున్నత పురస్కారం రావడం నమ్మశక్యంగా లేదని చెప్పారాయన. మానవాళిని ఏఐ కనీవినీ ఎరగని రీతిలో ప్రభావితం చేయడం ఖాయమని ఆయన ఇప్పటికే జోస్యం చెప్పారు. దీన్ని ఏకంగా పారిశ్రామిక విప్లవంతో పోల్చారు.

కాంగ్రెస్‌కు నో ఎంట్రీ బోర్డులు పెట్టేశారు

ఎన్నికల ఫలితాల వేళ కాంగ్రెస్‌ను ఉద్దేశించి ప్రధాని మోదీ విమర్శలు

న్యూఢిల్లీ: హరియాణాలో బీజేపీ ఘన విజయంవేళ ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్‌పై ప్రధాని మోదీ విమర్శల వాగ్బాణాలు సంధించారు. కాంగ్రెస్ ఓడిన రాష్ట్రాలు మరోసారి ఆ పార్టీకి అవకాశం ఇవ్వకుండా నో ఎంట్రీ బోర్డులు పెట్టేశాయని విమర్శించారు. భారత ఆర్థిక వ్యవస్థ, ప్రజాస్వామ్యాన్ని బలహీన పరిచేందుకు జరుగుతున్న అంతర్జాతీయ కుట్రలో కాంగ్రెస్ భాగస్వామిగా మారిందని మోదీ వ్యాఖ్యానించారు. హరియాణాలో హ్యాట్రిక్ విజయం తర్వాత మంగళవారం ఢిల్లీలో బీజేపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన విజయోత్సవ సభలో ప్రధాని మోదీ వందలాది మంది కార్యకర్తల సమక్షంలో ప్రసంగించారు. '' కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి రావడమనేది ఇప్పుడు అరుదైన విషయంగా మారింది. అస్సాంలో కాంగ్రెస్ పార్టీ ఎప్పుడో 13 సంవత్సరాల క్రితం అధికారంలో ఉండేది. కొన్ని రాష్ట్రాల్లో అయితే ఏకంగా ఆరు దశాబ్దాల నుంచి అస్సలు అధికారంలోకి రాలేకపోయింది. కాంగ్రెస్ ఓడిన రాష్ట్రాలు మరోసారి ఆ పార్టీకి అవకాశం ఇవ్వకుండా నో ఎంట్రీ బోర్డులు పెట్టేశాయి. అన్ని రకాలుగా దళితులు, గిరిజనులు, రైతులు, యువతను ప్రలోభపెట్టాలని కాంగ్రెస్ శాయశక్తులా ప్రయత్నించింది. హస్తం పార్టీ ఎత్తులను ఓటర్లు చిత్తుచేశారు. ఆ పార్టీని తిరస్కరించారు. గీతాభూమి(హరియాణా)లో సత్యం, అభివృద్ధి, సుపరిపాలన విజయం సాధించాయి. హరియాణా ప్రజలు మరోసారి అద్భుతాన్ని చేశారు. ప్రతిచోటా కమలం వికసిస్తుందని వాళ్లు నిరూపించారు. జమ్మూకశ్మీర్ కేంద్రపాలిత ప్రాంతంలో జరిగిన ఎన్నికలు.. భారత రాజ్యాంగం, ప్రజాస్వామ్యం విజయాన్ని చాటాయి'' అని మోదీ అన్నారు.


ఢిల్లీలోని బీజేపీ కేంద్ర కార్యాలయం పై నుంచి కార్యకర్తలకు అభివాదం చేస్తున్న మోదీ, చిత్రంలో నడ్డా

క్లుప్తంగా...

గురుకుల విద్యా సంస్థలు రద్దు చేస్తారా?



సాక్షి, హైదరాబాద్: మండల స్థాయిలో ఉన్న గురుకుల విద్యా సంస్థలను రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోందని బీఆర్ఎస్ నేత, మాజీ ఐపీఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ విమర్శించారు. గడిచిన పదేళ్లలో తెలంగాణలో విద్యా వ్యవస్థ శిథిలం అయిందని అబద్ధాలు చెప్తూ, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల పేరిట ప్రభుత్వం హడావుడి చేస్తోందన్నారు. సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు గురుకుల విద్యా వ్యవస్థపై అవగాహన లేదని విమర్శించారు. బీఆర్ఎస్ కార్యాలయం తెలంగాణ భవన్‌లో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మంగళ వారం మీడియాతో మాట్లాడారు. ప్రస్తుతమున్న అన్ని గురుకుల విద్యా సంస్థల్లో అన్ని సామాజికవర్గాలకు చెందిన విద్యార్థులు ఉన్నారని, కాంగ్రెస్ తెచ్చిన సామాజిక న్యాయం ఏమిటో చెప్పాలన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసే ఇంటిగ్రేటెడ్ స్కూళ్లలో 2,560 మంది విద్యార్థులను ఒకే చోట పెట్టి కోళ్ల ఫారాల్లా తయారు చేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. 2,560 మంది విద్యార్థులకు రూ.25 కోట్లతో భవన నిర్మాణం ఎలా సాధ్యమని ఆయన ప్రశ్నించారు. ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల పేరిట పది లక్షల మంది గురుకుల విద్యార్థులతో ప్రభుత్వం ఆటలాడుతోందని దుయ్యబట్టారు.

'పీజీ ఇంజనీరింగ్' అభ్యర్థుల రెండో జాబితా విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ: వివిధ పీజీ ఇంజనీరింగ్ కోర్సుల్లో సీటు సాధించిన అభ్యర్థుల రెండో, చివరి జాబితాను మంగళవారం విడుదల చేశారు. ఎంఈ, ఎంటెక్, ఎం.ఫార్మా, ఎం.ఆర్క్, ఫార్మా (పీబీ) కోర్సుల్లో కన్వీనర్ కోటాలోని 5,153 సీట్లకు 7,014 మంది అభ్యర్థులు వెబ్ఆప్షన్ ఇవ్వగా 4,221 మంది విద్యార్థులకు సీట్లను కేటాయించినట్లు టీజీపీజీఈసెట్–2024 అడ్మిషన్స్ కన్వీనర్ ప్రొ.రమేశ్‌బాబు వివరించారు. సీటు పొందిన విద్యార్థులు ఈ నెల 14 నుంచి 17 వరకు ఆయా కాలేజీలో రిపోర్టు చేయాలన్నారు. పూర్తి వివరాలు వెబ్‌సైట్లో చూడవచ్చు.

రైతు అనుకూల పరిశ్రమలను ప్రోత్సహించాలి

సాక్షి, హైదరాబాద్: భూమి సమస్యకు ప్రాధాన్యత ఇవ్వాలని, రైతు అనుకూల పరిశ్రమలను ప్రోత్సహించాలని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) తెలంగాణ కమిటీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలనుడిమాండ్ చేసింది. ఎస్‌కేఎం జాతీయ నాయకులు డాక్టర్ దర్శన్‌పాల్, డాక్టర్ సునీలం, కృష్ణ ప్రసాద్ అధ్యక్షతన ఐదు రాష్ట్రాల రైతు నాయకులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. ఆదివాసీ, మహిళ, వ్యవసాయ కార్మికులు, కౌలు రైతుల సమస్యలకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. రైతుల నుంచి భూములు తీసుకోవడం ఆపాలని, పరిశ్రమలకు ఇచ్చే భూమి రైతుల పేరు మీదే ఉండాలని తెలిపారు. సూక్ష్మరుణాల దోపిడీని అరికట్టాలని, రైతులను అప్పుల ఊబిలో చిక్కుకోకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. గ్రామాలలో మౌలిక సదుపాయాలను కల్పించాలని టోల్‌గేట్లలో రైతుల వద్ద ఎలాంటి రుసుము వసూలు చేయొద్దని కోరారు.

'సీతాకోక'..సర్వే

ఇప్పటికే 60 రకాల జాతుల బటర్ ఫ్లైల గుర్తింపు

మూడు నెలలుగా కవ్వాల్ టైగర్ రిజర్వులో పరిశీలన



సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: సీతాకోకచిలుక ఏ చెట్టుపై వాలుతుంది.. ఏ పువ్వులోని మకరందాన్ని స్వీకరిస్తుంది ? గతంలో ఉన్న సీతాకోక చిలుకలు.. ప్రస్తుతం ఉన్నాయా? వాటి ఆవాసం..అనుకూలత మెరుగుపడాలంటే ఏం చేయాలి? తదితర విషయాలు తెలుసుకుంటూ వాటి సంరక్షణకు కృషి చేస్తున్నారు. మంచిర్యాల జిల్లా అటవీ శాఖ అధికారులు. మూడు నెలలుగా కవ్వాల్ టైగర్ రిజర్వు ఫారెస్టులో బటర్ ఫ్లై జాతుల గుర్తింపునకు సర్వే జరుగుతోంది. డబ్ల్యూడబ్ల్యూఎఫ్(వరల్డ్ వైడ్ ఫండ్ ఫర్ నేచర్), మహారాష్ట్రకు చెందిన ప్రొఫెసర్ రాంజన్ విరాని, పక్షుల నిపుణులతో ముందుగా 30 మంది అధికారులకు శిక్షణ ఇచ్చారు. క్షేత్ర స్థాయిలో ఉండే అధికారులు ప్రతీరోజు సర్వే చేస్తున్నారు. రంగు, ఆకారం తదితర గుణాల ఆధారంగా సీతాకోక చిలుకలను గుర్తించి రికార్డు చేస్తున్నారు.

100 నుంచి 150 జాతులు ఉన్నట్టు అంచనా

కవ్వాల్ పరిధిలోని కోర్, బఫర్ ప్రాంతాల్లో 100 నుంచి 150 సీతాకోక చిలుకల జాతులు ఉంటాయని అంచనా. కడెం, గోదావరి, ప్రాణహితతోపాటు వాగులు, వంకలు, రిజర్వు ఫారెస్టు, మైదాన ప్రాంతాల్లోనూ సర్వే చేస్తున్నారు. ఇప్పటి వరకు 60 రకాల వరకు సీతాకోక చిలుకలను గుర్తించారు. వాటి ఫొటోలతోపాటు ఆవాసం, జీవన విధానం, ప్రత్యేకత తదితర వివరాలను నిక్షిప్తం చేస్తున్నారు. టైగర్ సఫారీకి వచ్చే పర్యాటకులకు బటర్‌ఫ్లై పార్కులు చూపిస్తూ ఓ ప్రత్యేక అనుభూతి కల్పించేలా చర్యలు తీసుకుంటున్నారు. జన్నారం పరిధిలో ఓ బటర్‌ఫ్లై పార్కును అభివృద్ధి చేశారు. ఇదే తరహాలో మంచిర్యాల పట్టణానికి సమీపంలో గాంధారి ఖిల్లా, చెన్నూరు అర్బన్ పార్కు, బెల్లంపల్లి డివిజన్లలోనూ సిద్ధం చేస్తున్నారు. వనదర్శినిలో భాగంగా స్థానికులు, పర్యాటకులకు అడవులు, వన్యప్రాణులపై అవగాహనతోపాటు ఇకపై సీతాకోక చిలుక జీవన విధానం, వాటి పరిరక్షణ చర్యలను ప్రత్యేకంగా వివరించనున్నారు.



లెమన్ పాన్సీ



ఓరియంటల్ ప్లేన్ టైగర్



నర్సరీలో ఏర్పాటు చేసిన బటర్‌ఫ్లై గార్డెన్

జీవ వైవిధ్యానికి గుర్తు

ప్రకృతిలో జీవ వైవిధ్యానికి గుర్తుగా సీతాకోక చిలుకను చెబుతారు. వీటి మనుగడే అక్కడి పర్యావరణ అనుకూలత, ప్రతికూలతను తెలియజేస్తుందని నిపు ణులు పేర్కొంటున్నారు. భూమిపై మొలిచే మొక్కలు, చెట్లు, గాలిలో ఎగిరే పక్షులు, ఇతర క్రిమికీటకాలు, జంతుజాలంతో ప్రత్యక్ష సంబంధముండే సీతాకోక చిలుకలు ఆ ప్రాంతం పర్యావరణ వ్యవస్థ, ఆహారపు గొలుసు లో కీలకంగా ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. పుష్పాల పుప్పొడి, మకరందం, ఆవాసాలు, విత్తన వ్యాప్తి, పక్షుల మనుగడ, క్రిమికీటకాలను సమతుల్యం చేయడం వంటివి సీతాకోకచిలుకకు ప్రధాన క్రియలుగా ఉంటాయి.

ప్రత్యేకంగా పార్కులు



కవ్వాల్‌లో కేవలం పులులే కాకుండా, అన్ని జీవులను సంరక్షించేవిధంగా ఏర్పాట్లు చేస్తున్నాం. ఇక్కడ ఎన్నో రకాల సీతాకోకచిలుకలు ఉన్నాయి. వాటిని సంరక్షిస్తే పర్యావరణానికి మేలు జరుగుతుంది. పర్యాటకులకు కొత్త అనుభూతిని ఇస్తుంది. ఇందుకు ప్రత్యేకంగా బటర్‌ఫ్లై పార్కులు ఏర్పాటు చేస్తున్నాం.

–శివ్‌ఆశిష్ సింగ్, జిల్లా అటవీ అధికారి, మంచిర్యాల

మీకంటే దత్తాత్రేయ నయం: కోదండరెడ్డి

సాక్షి, హైదరాబాద్: ఎంపీగా బండారు దత్తాత్రేయ సికింద్రాబాద్ అభివృద్ధికి ఎన్నో కొన్ని నిధులైనా తెచ్చేవారని, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మాత్రం రూపాయి నిధులు కూడా తేవడం లేదని తెలంగాణ రైతు కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి పేర్కొన్నారు. కేంద్రమంత్రి హోదాలో కిషన్‌రెడ్డి మాట్లాడుతున్న మాటలు అసహ్యం కలిగిస్తున్నాయని విమర్శించారు. హైదరాబాద్‌లో మంగళవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని రైతాంగానికి రూ.2లక్షల రుణమాఫీ చేసింది కాంగ్రెస్ ప్రభుత్వమేనన్నారు. సాంకేతిక కారణాలతో రుణమాఫీ జరగని రైతులు దరఖాస్తు చేసుకుంటున్నారని, వారికి కూడా రుణమాఫీ చేస్తామన్నారు. రుణమాఫీకి రేషన్‌కార్డు ప్రాతిపదిక కాదని స్పష్టం చేశారు.

దసరా తర్వాత 'స్కిల్స్' తొలి నోటిఫికేషన్

- మొదటి విడతలో నాలుగు కోర్సులు
- రూ.7 కోట్లతో లాజిస్టిక్ ల్యాబ్ ఏర్పాటుకు ముందుకొచ్చిన 'రెడింగ్టన్'

సాక్షి, హైదరాబాద్

స్కిల్స్ యూనివర్సిటీలో లాజిస్టిక్స్, మెడికల్ అండ్ హెల్త్, ఫార్మా రంగాల్లో అత్యధిక ఉద్యోగాల డిమాండ్ ఉన్న 4 కోర్సులను ప్రారంభించనున్నారు. దసరా సెలవుల తర్వాత ఈ కోర్సులకు సంబంధించిన అడ్మిషన్లు, అర్హతల పూర్తి వివరాలతో నోటిఫికేషన్ వెలువడనుంది. త్వరలోనే మరిన్ని కోర్సులనూ ప్రారంభించేందుకు స్కిల్స్ వర్సిటీ వివిధ కంపెనీలతో సంప్రదింపులు జరుపుతోందని యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ వీఎల్వీఎస్ఎస్.సుబ్బారావు తెలిపారు. ఆయా రంగాల్లో పేరొందిన కంపెనీలు, సంస్థల భాగస్వామ్యంతో ఈ కోర్సులకు అవసరమైన సిలబస్ రూపకల్పన చేస్తున్నారు. ఆయా రంగాల్లో నిపుణులతో విద్యార్థులకు బోధనా తరగతులతోపాటు ప్రాక్టికల్స్ కూడా నిర్వహించనున్నారు. ఇప్పటికే హైదరాబాద్‌లోని ఫ్యూచర్ సిటీలో 57 ఎకరాల విస్తీర్ణంలో ఈ వర్సిటీ భవనాలకు సీఎం రేవంత్‌రెడ్డి భూమిపూజ చేసిన విషయం తెలిసిందే. ఈ ఏడాది గచ్చిబౌలిలో ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీలో తాత్కాలికంగా వర్సిటీ తరగతులు ప్రారంభించాలని నిర్ణయించారు.

ఆయా కోర్సులు ఇలా...

- తాత్కాలిక క్యాంపస్‌లో లాజిస్టిక్స్ ల్యాబ్ ఏర్పాటుకు ప్రముఖ గ్లోబల్ లాజిస్టిక్స్ సొల్యూ షన్స్ కంపెనీ రెడింగ్టన్ ముందుకొచ్చింది. రూ.7 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ఆ సంస్థ సిద్ధపడింది. లాజిస్టిక్స్ రంగానికి సంబంధించి రెండు షార్ట్ టర్మ్ కోర్సులను వర్సిటీ ప్రారంభించనుంది. వీటి నిర్వహణకు లాజిస్టిక్స్ సెక్టార్ స్కిల్ కౌన్సిల్ సహకారం అందిస్తోంది.
- నర్సులకు ఉన్నత ఉపాధి అవకాశాల కల్పనకు ఫినిషింగ్ స్కిల్స్ ఇన్ నర్సింగ్ ఎక్సలెన్స్ (ఫైన్) కోర్సును ఈ ఏడాదే ప్రారంభిస్తారు.
- డాక్టర్ రెడ్డీస్ ఫార్మా అసోసియేట్ పేరుతో అప్రెంటిస్‌షిప్ ఇండక్షన్ కోర్సును ఈ ఏడాది ప్రారంభిస్తారు. ఈ కోర్సు వ్యవధి 6 నెలలు.
- స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులలో చేరిన విద్యార్థులకు క్యాంపస్ ప్లేస్‌మెంట్ గ్యారంటీగా వస్తుందని వీసీ సుబ్బారావు అభిప్రాయపడ్డారు. శిక్షణ అందుకున్న విద్యార్థులకు నెలకు రూ.20 వేల నుంచి రూ. 25 వేల వేతనం ఉండే ఉద్యోగాల్లో చేరే అవకాశాలుంటాయని తెలిపారు.

'దారి' తప్పిన ఇసుక!

▶ మొదటి పేజీ తరువాయి

మానిటరింగ్ సిస్టమ్ (ఎస్ఎస్ఎంఎంఎస్)'ను అమలు చేస్తోంది. అందరికీ అందుబాటు ధరలో ఇసుక అందాలన్నదే దీని లక్ష్యం. కానీ రీచ్‌ల నుంచి ఇసుక వెలికితీసే కాంట్రాక్టర్ల నుంచి రవాణా, వేబ్రిడ్జీల దాకా జరుగుతున్న అక్రమాలు ఇసుక ధరల పెరుగుదలకు దారితీస్తున్నాయి. ప్రస్తుత సీజన్‌లో వాగులు, నదుల్లో ప్రవాహాలతో ఇసుక తవ్వకాలు తగ్గిపోయాయి. ఈ కొరతను సొమ్ము చేసుకునేందుకు అక్రమార్కులు ప్రభుత్వ విభాగాలనూ వాడుకుంటున్నారు.

కాంట్రాక్టర్ల గుప్పిట్లో స్టాక్ పాయింట్లు: ప్రభుత్వం గుర్తించిన రీచ్‌ల నుంచి ఇసుకను తవ్వి వెలికితీసి, స్టాక్ పాయింట్లకు తరలించాల్సిన కాంట్రాక్టర్లు క్షేత్ర స్థాయిలో అంతా తామే అన్నట్లు చక్రం తిప్పుతున్నారు. ఇసుక రీచ్‌లు ఎక్కువగా ఉన్న భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, జయశంకర్ భూపాలపల్లి, పెద్దపల్లి జిల్లాల పరిధిలో వీరి కనుసన్నల్లోనే అక్రమాలు జరుగుతున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. శాండ్ సేల్ మేనేజ్‌మెంట్, మానిటరింగ్ విధానంలో కేవలం ఇసుక వెలికితీత, స్టాక్‌యార్డుకు తరలింపునకు మాత్రమే కాంట్రాక్టర్లు పరిమితం కావాలి. అయితే ఆన్‌లైన్ విధానంలో బుక్ చేసుకున్న లారీల్లో ఇసుకను లోడ్ చేయాల్సిన సందర్భంలోనే.. కాంట్రాక్టర్లు వారి నుంచి అదనంగా డబ్బులు వసూలు చేస్తూ, అక్రమాలకు తెరలేపుతున్నారు. ఒక్కో లారీలో అదనంగా రెండు, మూడు టన్నులు లోడ్ చేస్తూ రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ(టీజీఎండీసీ) ఆదాయానికి గండి కొడుతున్నారు. ఇలా లారీల్లో అక్రమంగా లోడ్ చేసే ఇసుక విలువ రోజుకు రూ.15 లక్షల నుంచి రూ.20లక్షలపైనే ఉంటుందని అంచనా. ఇందులో కాంట్రాక్టర్లు, పోలీసులు, వివిధ విభాగాల అధికారులు, నాయకుల వరకు ముడుపులు అందుతున్నట్టు ఆరోపణలున్నాయి. ఇటీవలే ఇసుక వ్యవహారాల్లో తలదూరుస్తున్నారని 16 మంది పోలీసు సిబ్బంది సస్పెండ్ కావడం గమనార్హం. ఇసుక వెలికితీత, విక్రయాలను పర్యవేక్షించాల్సిన మైనింగ్ అధికారులు.. కాంట్రాక్టర్ల కనుసన్నల్లో పనిచేస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి.

బహిరంగ మార్కెట్లో మూడు, నాలుగు రెట్ల ధర: ఆన్‌లైన్ విధానంలో ఒక్కో టన్ను ఇసుక ధర రూ.630 మాత్రమే. కానీ మార్కెట్లో ప్రస్తుతం సన్న ఇసుక టన్నుకు రూ.1,900, దొడ్డు ఇసుక రూ.1,600పైనే పలుకుతున్నాయి. ఇటీవలి భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో టన్ను ఇసుక ధర రూ.2,200కు కూడా చేరింది. రవాణా చార్జీలతోపాటు స్టాక్ పాయింట్ల నుంచి చివరికి చేర్చే దాకా.. వివిధ దశల్లో ఇవ్వాల్సిన ముడుపుల మూలంగా ఇసుక ధర భారీగా ఉంటోందని లారీల యజమానులు చెప్తున్నారు. ఇక కొందరు దళారులు, ఇసుక వ్యాపారులు వే బ్రిడ్జిల వారితో కుమ్మక్కై అదనంగా బరువు చూపుతూ కొనుగోలుదారులను మోసగిస్తున్నారు. ఒక్కో లారీపై కొనుగోలుదారులు రూ.8 వేల నుంచి రూ.10వేల వరకు నష్టపోతున్నట్టు అంచనా.

బహిరంగ మార్కెట్‌కు బల్క్ అలాట్‌మెంట్లు: రాష్ట్రంలో ఇసుకకు ఉన్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని కొందరు అక్రమార్కులు బల్క్ అలాట్‌మెంట్ల పేరిట దండుకుంటున్నారు. టీజీఎండీసీ ఏటా సగటున కోటిన్నర క్యూబిక్ మీటర్లకుపైగా ఇసుకను విక్రయిస్తుండగా.. అందులో సుమారు 10 నుంచి 15 శాతం ప్రభుత్వ అవసరాలకు కేటాయిస్తోంది. ప్రభుత్వ శాఖల అధికారులు టీజీఎండీసీ వద్ద ఆన్‌లైన్ ఖాతాను సృష్టించి, తమ లాగిన్ ద్వారా ప్రభుత్వ పనులకు సంబంధించిన పత్రాలను అప్‌లోడ్ చేసి, ఎంత మొత్తంలో ఇసుక అవసరమో పేర్కొనాలి. టీజీఎండీసీ ఆ పత్రాలను పరిశీలించి, ఏకమొత్తంలో ఇసుక కేటాయింపు (బల్క్ అలాట్‌మెంట్) చేస్తుంది. కొందరు అక్రమార్కులు ప్రభుత్వ శాఖల లాగిన్‌ను కూడా దుర్వినియోగం చేస్తున్నట్టు ఇటీవల జలమండలి పేరిట జరిగిన దందాతో వెల్లడైంది. 90లక్షల టన్నుల ఇసుక జలమండలి లాగిన్ ద్వారా కమర్షియల్ మార్కెట్‌కు చేరినట్టు ఫిర్యాదులు వెల్లువెత్తడంతో టీజీఎండీసీ అప్రమత్తమైంది. దీనిపై టీజీఎండీసీ పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. ప్రస్తుతం దీనిపై విచారణ జరుగుతుండటంతో పూర్తి వివరాలు వెల్లడించేందుకు టీజీఎండీసీ అధికారులు సుముఖత చూపడం లేదు.

మళ్లీ 'డెంగీ' పంజా!

▶ మొదటి పేజీ తరువాయి

మేడ్చల్ జిల్లాలో 700 కేసులు నమోదైనట్టు తెలిపింది. మెదక్ జిల్లాలో అత్యంత తక్కువగా 24 డెంగీ కేసులు నమోదైనట్టు పేర్కొంది. అయితే అధికారికంగా నమోదు కాని డెంగీ కేసులు ఇంకా పెద్ద సంఖ్యలో ఉంటాయని అంచనా. మరోవైపు ఇదేకాలంలో తెలంగాణవ్యాప్తంగా 397 చికున్‌గున్యా కేసులు నమోదయ్యాయి. ఒక్క హైదరాబాద్‌లోనే 204 కేసులు రికార్డయ్యాయి. ఇక 229 మలేరియా కేసులు నమోదవగా.. అందులో భద్రాద్రి జిల్లాలోనే 67 కేసులున్నాయి. డెంగీ, చికున్‌గున్యా కేసులు చాలా వరకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో మాత్రమే నమోదవుతున్నాయి. మొత్తం డెంగీ కేసుల్లో 8,409 కేసులు ప్రభుత్వ ఆస్పత్రుల్లో నమోదవగా.. ప్రైవేట్‌లో 845 కేసులే నమోదయ్యాయి. అనేక ప్రైవేట్ ఆస్పత్రులు డెంగీ, చికున్‌గున్యా కేసుల వివరాలను సరిగా అందజేయట్లేదనే విమర్శలున్నాయి. తమ వద్దకు వస్తున్న ప్రతీ 10 జ్వరం కేసుల్లో 2 – 3 చికున్‌గున్యా లక్షణాల కేసులుంటున్నట్టు వైద్యులు చెబుతున్నారు.

రాష్ట్రంలో 2,071 డెంగీ హైరిస్క్ ప్రాంతాలు

రాష్ట్రంలో డెంగీ ముప్పున్న 2,071 డెంగీ హైరిస్క్ ప్రాంతాలను వైద్యారోగ్యశాఖ ఇప్పటికే గుర్తించింది. గతంలో నమోదైన డెంగీ కేసుల ఆధారంగా ఈ ప్రాంతాలను నిర్ధారించింది. ప్రస్తుతం డెంగీ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా 33 ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లను ఏర్పాటు చేసింది. 42 డెంగీ పరీక్షా కేంద్రాలు, ఆస్పత్రులు, తెలంగాణ డయాగ్నొస్టిక్ సెంటర్లను గుర్తించి వాటిల్లో సౌకర్యాలు కల్పించింది. రాష్ట్రవ్యాప్తంగా 53 బ్లడ్ బ్యాంకులను గుర్తించగా.. అందులో 26 బ్లడ్ బ్యాంకుల్లో ప్లేట్‌లెట్ యూనిట్లు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టింది. అన్ని జిల్లాల్లోనూ శానిటైజేషన్, నీటి నిల్వ ప్రాంతాల్లో దోమలు రాకుండా చర్యలు తీసుకునేందుకు కలెక్టర్ల ఆధ్వర్యంలో సమావేశాలు నిర్వహించాలని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు ఇంటింటికీ వెళ్లాలని.. దోమల ఉత్పత్తిని నివా రించే చర్యలు, అవగాహన చేపట్టాలని సూచించా రు. మరోవైపు వైద్యారోగ్యశాఖలోని వివిధ విభాగాధిపతులంతా ఆస్పత్రులను పరిశీలించి, నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.

ఒకేసారి రకరకాల జ్వరాలు

ఈ ఏడాది రకరకాల వైరల్ జ్వరాలు కలిపి ఒకేసారి దాడి చేస్తున్నాయని వైద్య నిపుణులు చెప్తున్నారు. కొందరిలో డెంగీ, చికున్‌గున్యా రెండూ కూడా ఉంటున్నాయని అంటున్నారు. ఇక నడివయసువారు, వృద్ధుల్లో చికున్‌గున్యా లక్షణాలు ఎక్కువ కనిపిస్తున్నాయని వివరిస్తున్నారు. సరైన పరీక్షలు చేయించుకుని.. వ్యాధిని స్పష్టంగా నిర్ధారించుకుని, చికిత్స పొందాలని సూచిస్తున్నారు. డెంగీకి ప్లేట్‌లెట్ కౌంట్, డెంగీ స్ట్రిప్ టెస్ట్, సీరమ్ టెస్ట్ వంటివి సరిపోవని.. ఐజీఎం పరీక్ష చేయించాలని చెబుతున్నారు.

విద్యుత్‌శాఖలో ఖాళీలు భర్తీ చేస్తాం

దసరా కన్నా ముందే అన్ని పెండింగ్ బిల్లుల విడుదల

- కేబినెట్‌లో చర్చించాకే మూసీపై నిర్ణయం.. ఖమ్మంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క



సాక్షిప్రతినిధి, ఖమ్మం: 'విద్యుత్ శాఖలో పదేళ్లుగా ప్రమోషన్లు పెండింగ్‌లో ఉండగా, మా ప్రభుత్వమే ఇచ్చింది. ఎవరూ అడగక ముందే దీనిపై నిర్ణయం తీసుకున్నాం. ప్రస్తుతం ఈ శాఖలో ఖాళీల కారణంగా ఉన్న వారిపై పనిభారం పడుతోంది. నెల,రెండు నెలల్లో వీటి భర్తీకి నోటిఫికేషన్ ఇస్తాం'అని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. ఖమ్మం కలెక్టరేట్‌లో ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల అధికారులతో విద్యుత్, సంక్షేమ శాఖలపై మంగళవారం ఆయన సమీక్షించారు. అనంతరం విలేకరుల సమావేశంలో భట్టి మాట్లాడారు.

మార్పులపై ప్రత్యేక శిక్షణ

వరదల సమయంలో విద్యుత్ ఉద్యోగులు ఎంతో కష్టపడి పనిచేశారని భట్టి అభినందించారు. అయితే శాఖలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఉద్యోగ వ్యవస్థ అందుబాటులోకి రావాల్సి ఉందని, 20 నుంచి 30 ఏళ్లుగా పనిచేస్తున్న వారికి హైదరాబాద్‌లోని స్టాఫ్ కాలేజీలో శిక్షణ ఇస్తామని తెలిపారు. విద్యుత్‌కు సంబంధించి ఏ సమస్య వచ్చినా వినియోగదారులు 1912కు కాల్ చేయొచ్చని, 108 లాగే ఇది కూడా ఉపయోగపడుతుందన్నారు. పేరు, అడ్రస్ చెబితే అక్కడ సమస్య పరిష్కారానికి అధికారులు కృషి చేస్తారని తెలిపారు. ఆదిలాబాద్ నుంచి ఖమ్మం వరకు గోదావరి పరీవాహక ప్రాంతంలో లిఫ్ట్ ఇరిగేషన్లు ఉన్నందున ఉద్యోగులు చిన్నలోపం కూడా ఎదురుకాకుండా చూడాలన్నారు. మరమ్మతులు చేసిన కొన్నాళ్లకే ట్రాన్స్‌ఫార్మర్లు పేలిపోతున్నందున, వ్యవస్థలను తనిఖీ చేయాలని అధికారులకు సూచించారు.

మూసీ అంశం కొత్తది కాదు

రెవెన్యూ రికార్డుల అప్‌డేట్ అంటూ.. గత పాలకులు బినామీల పేర్లపైకి భూములను బదలాయించారని భట్టి ఆరోపించారు. తాము మాత్రమే ఆక్రమణకు గురైన చెరువులను సరిదిద్ది ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. గత ప్రభుత్వంలో కేసీఆర్ ఒక్కరే నిర్ణయాలు తీసుకునేవారని, అందుకే మూసీ అంశాన్ని కేబినెట్‌లో చర్చించారా అని జగదీశ్‌రెడ్డి ప్రశ్నిస్తున్నారన్నారు. మూసీపై కేబినెట్‌లో చర్చించడానికి కొత్త అంశమేమీ కాదన్నారు. మూసీని శుభ్రం చేసి నగరం నడిబొడ్డున స్వచ్ఛమైన నది ప్రవహించేలా సుందరీకరణ చేయబోతున్నామని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో మూసీని సుందరీకరణ చేస్తామని చెప్పి చేయలేదని, తాము చేసి చూపిస్తామని, నిర్వాసితులకు ఎట్టి పరిస్థితుల్లో అన్యాయం జరగనివ్వమన్నారు. మూసీ ప్రక్షాళనకు డీపీఆర్‌లు సిద్ధం కాకముందే రూ.1.50 లక్షల కోట్లు వ్యయమవుతుందని చెప్పడం సరికాదని చెప్పారు. తాము గడీల్లో లేమని, ఎవరైనా ఎప్పుడైనా వచ్చి సలహాలు ఇవొచ్చని భట్టి తెలిపారు.

మైనింగ్ వ్యవస్థపై అధ్యయనం చేశాం

అమెరికాలో జరిగిన అంతర్జాతీయ మైనింగ్ ఎక్స్‌పోలో పాల్గొని ఆధునిక యంత్ర పరికరాలు, సాంకేతికతను వినియోగించి ఎక్కువ బొగ్గు వెలికితీయడం, బొగ్గు ఉత్పత్తిలో భద్రతా చర్యలను పరిశీలించామని భట్టి తెలిపారు. సింగరేణి పెద్ద మైనింగ్ వ్యవస్థ కావడంతో ఆ శాఖ మంత్రిగా అమెరికా, జపాన్ దేశాల్లో పర్యటించానన్నారు. దసరా కన్నా ముందే అన్ని రకాల పెండింగ్ బిల్లులు విడుదల చేస్తామన్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ రెసిడెన్షియల్ స్కూళ్ల పెండింగ్ బిల్లులు రూ.114 కోట్లు, మధ్యాహ్న భోజన పథకం పెండింగ్ బిల్లులు విడుదల చేశామని, పిల్లల కాస్మోటిక్ చార్జీలను ఏ నెలకానెల అందజేస్తామని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు అన్నీ క్లియర్ చేస్తామన్నారు. 2029–2030 వరకు 20 వేల మెగావాట్ల గ్రీన్ ఎనర్జీని ఉత్పత్తి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో ఎన్పీడీసీఎల్ సీఎండీ కె.వరుణ్‌రెడ్డి, కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

హరియాణాలో హ్యాట్రిక్ విజయంపై బీజేపీ సంబరాలు



సాక్షి, హైదరాబాద్: హరియాణాలో వరుసగా మూడోసారి గెలిచి హ్యాట్రిక్ విజయాన్ని సాధించడం పట్ల బీజేపీ నాయకులు టపాకాయలు పేల్చి, స్వీట్లు పంపిణీచేసి సంబరాలు చేసుకున్నారు. మంగళవారం ఎన్నికల ఫలితాలు వెల్లడయ్యాక.. నాంపల్లిలోని బీజేపీ కార్యాలయం వద్ద నిర్వహించిన విజయోత్సవాల్లో ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి, నేతలు చింతల రామచంద్రారెడ్డి, శాంతికుమార్, ప్రేమ్ సింగ్‌రాథోడ్, సేవెళ్ల మహేందర్ పాల్గొన్నారు. అంతకుముందు మాజీ ఎమ్మెల్సీ రామచంద్రరావు, చింతల, కాసం వెంకటేశ్వర్లు మీడియాతో మాట్లాడుతూ... హరియాణాలో కాంగ్రెస్ విషప్రచారం చేసినా బీజేపీ గెలిచిందని, మోదీ సర్కార్‌పై సానుకూలతతోనే అక్కడ హ్యాట్రిక్ విజయం సాధ్యమైందన్నారు. బీజేపీ నేత పొంగులేటి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ... కాంగ్రెస్ దుష్ప్రచారాన్ని హరియాణా ప్రజలు తిప్పికొట్టి అక్కడ అభివృద్ధికి ప్రజలు పెద్దపీట వేశారన్నారు. ఎన్నికల ఫలితాల వెల్లడిలో ఎన్నికల కమిషన్ (ఈసీ)పై కాంగ్రెస్ నేతలు చేసిన వ్యాఖ్యలు సరికాదని చెప్పారు.

హరియాణాలో కాంగ్రెస్ పాచిక పారలేదు: ఈటల



సాక్షి, హైదరాబాద్: హరియాణాలో కాంగ్రెస్ వేసిన పాచిక పారలేదని బీజేపీ పని అయిపోయిందని కాంగ్రెస్ అబద్ధపు ప్రచారాన్ని ప్రజలు తిరస్కరించారని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ పేర్కొన్నారు. హరియాణాలో బీజేపీ విజయం సాధించడం పట్ల మంగళవారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఎన్నికల్లో హామీలు ఇవ్వడమే తప్ప వాటిని నెరవేర్చకుండా ప్రజల్ని మోసం చేయడం కాంగ్రెస్ నైజమని మండిపడ్డారు. ఆ పార్టీ ఎన్ని అడ్డదారులు తొక్కినా అధికారంలోకి రావాలనే ప్రయత్నాన్ని హరియాణా ప్రజలు తిప్పికొట్టారన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ అలవికాని హామీలు ఇస్తుందని హిమాచల్ ప్రదేశ్, కర్ణాటక, తెలంగాణలలో తేలిపోయిందని విమర్శించారు. హిమాచల్‌ప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రస్తుతం ఉద్యోగులకు జీతాలు కూడా చెల్లించలేని దుస్థితికి చేరుకుందని దుయ్యబట్టారు. అభివృద్ధి, దేశసమగ్రత, సుస్థిరత ఒక్క బీజేపీతోనే సాధ్యమని దేశ ప్రజలు నమ్మడం వల్లనే హరియాణాలో బీజేపీకి ప్రజలు పట్టంకట్టారన్నారు. ప్రధాని మోదీపై ప్రజలకున్న అచంచల విశ్వాసానికి ఈ విజయం తార్కాణమని పేర్కొన్నారు.

'ఈటల'కు కొత్త బాధ్యతలు

సాక్షి, న్యూఢిల్లీ: లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌కు నూతన బాధ్యతలు అప్పగించారు. 18వ లోక్‌సభ జాయింట్ కమిటీ ఆన్ ఆఫీసెస్ ఆఫ్ ప్రాఫిట్‌ను లోక్‌సభ స్పీకర్ ఏర్పాటు చేశారు. ఈ జాయింట్ కమిటీకి ఈటల రాజేందర్‌ను చైర్మన్‌గా నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

కాంగ్రెస్ నేతల కోసమే మూసీ ప్రాజెక్టు: జగదీశ్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ నేతల కడుపు నింపుకునేందుకే మూసీ ప్రాజెక్టును తెరమీదకు తెచ్చారని..డబ్బుల కోసం హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ని నాశనం చేస్తున్నారని మాజీ మంత్రి జి.జగదీశ్‌రెడ్డి విమర్శించారు. అబద్ధాలు చెప్పడంలో సీఎం రేవంత్‌ను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మించిపోయారని, డబ్బు సంపాదనలో సీఎంతో పోటీ పడుతున్నారన్నారు. తెలంగాణభవన్‌లో జగదీశ్‌రెడ్డి మంగళవారం మీడియాతో మాట్లాడారు. మూసీ ప్రాజెక్టుకు సంబంధించి ప్రభుత్వం వద్ద ఎలాంటి ప్రణాళిక లేకున్నా, బుకాయింపులతో కాలం గడుపుతున్నదని మండిపడ్డారు. ఈ ప్రాజెక్టు మూలంగా లక్ష కోట్ల రూపాయల ప్రజాధనం వృథా అవుతుందని, ఇప్పటికే రూ.వేయి కోట్లు విలువ చేసే పేదల ఇళ్లను ప్రభుత్వం కూల్చివేసిందన్నారు. ఢిల్లీకి కప్పం కట్టేందుకే మూసీ సుందరీకరణ పేరిట హైడ్రాను తెరమీదకు తెచ్చారని, తాబేదార్లకు మేలు చేసేందుకు ఈ ప్రాజెక్టు ఉపయోగపడుతుందని చెప్పారు. నోట్ల రద్దుతో దేశ ఆర్థికరంగం నాశనం కాగా, హైడ్రాతో హైదరాబాద్ నగరం దెబ్బతింటోందన్నారు. నల్లగొండ జిల్లాలో ఫ్లోరోసిస్ సమస్యకు కాంగ్రెస్ ప్రభుత్వమే కారణమని, సమస్యను రూపుమాపిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. రూ.16 కోట్లతో మూసీ ప్రక్షాళన చేసి..కొండపోచమ్మ సాగర్ నుంచి హిమాయత్ సాగర్‌కు నీరు తెచ్చేలా కేసీఆర్ ప్రణాళికలు రూపొందించారని తెలిపారు. 24 గంటల విద్యుత్, తులం బంగారం, వరికి బోనస్, రైతుబంధు సహా అనేక సంక్షేమ పథకాలకు కాంగ్రెస్ ప్రభుత్వం మంగళం పాడిందన్నారు. ప్రశ్నించిన వారిపై ఈ ప్రభుత్వం కేసులు పెడుతోందని, నియంతలు కాలగర్భంలో కలిసి పోయారని చెప్పారు. మూసీ పేరిట డబ్బులు దండుకునే ప్రయత్నాలు అడ్డుకుంటామని జగదీశ్‌రెడ్డి స్పష్టం చేశారు.

ఎస్సీ వర్గీకరణకు వన్‌మ్యాన్ జ్యుడీషియల్ కమిషన్

- సుప్రీంకోర్టు లేదా హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తితో ఏర్పాటు
- వర్గీకరణ అధ్యయనంపై కాలపరిమితి తప్పనిసరి
- 2011 జనగణన గణాంకాల ఆధారంగా వర్గీకరణకు చర్యలు
- వర్గీకరణ కమిటీ ఆధ్వర్యంలో త్వరలో జిల్లాలవారీగా పర్యటనలు
- మంత్రివర్గ ఉపసంఘం సమావేశంలో నిర్ణయం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి. చిత్రంలో సీఎస్ శాంతికుమారి, మంత్రులు దామోదర్ రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, సీతక్క, శ్రీధర్‌బాబు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో షెడ్యూల్డ్ కులాల (ఎస్సీ) వర్గీకరణ ప్రక్రియను అధ్యయనం చేసేందుకు వన్‌మ్యాన్ జ్యుడీషియల్ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని వర్గీకరణ కోసం ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం (కేబినెట్ సబ్ కమిటీ) నిర్ణయించింది. చట్ట సంబంధ చిక్కుల్లేకుండా అత్యంత పారదర్శకంగా కమిషన్ అధ్యయనం చేయాలని కమిటీ తీర్మానించింది. కమిషన్‌కు చైర్మన్‌గా సుప్రీంకోర్టు లేదా హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తిని నియమించాలని నిర్ణయం తీసుకుంది. కమిషన్ ఏర్పాటుకు ఇప్పటికే అడ్వొకేట్ జనరల్ (ఏజీ) నుంచి మంత్రివర్గ ఉపసంఘానికి టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్ ముసాయిదా సైతం అందింది. ఈ నేపథ్యంలో పలు సిఫారసులను రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించాలని మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయం తీసుకుంది. ఎస్సీ వర్గీకరణ కోసం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు కావడం తెలిసిందే. ఈ కమిటీ మంగళవారం సచివాలయంలో భేటీ అయింది. ఈ సమావేశంలో కమిటీ సభ్యులైన మంత్రులు శ్రీధర్‌బాబు, దామోదర్ రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, దనసరి అనసూయ సీతక్క, పార్లమెంటు సభ్యులు మల్లు రవితోపాటు సీఎస్ శాంతికుమారి, ఏజీ సుదర్శన్‌రెడ్డిలు పాల్గొన్నారు.

ఆర్థిక శాఖ నుంచి 30%సమాచారం: ఉత్తమ్

రాష్ట్రంలో వర్గీకరణ ప్రక్రియను 2011 జనగణన ఆధారంగా చేపట్టాలని కమిటీ దాదాపు నిర్ణయించింది. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌తో పాటు రాష్ట్రంలోని ఉద్యోగ నియామక బోర్డుల నుంచి ఎస్సీ ఉపకులాలవారీగా నియామకాల సమాచారాన్ని స్వీకరించామని, ఆర్థిక శాఖ నుంచి 30 శాతం సమాచారం వచ్చిందని మంత్రి ఉత్తమ్ వివరించారు. గత నెల 30 నుంచి విజ్ఞాపనల స్వీకరణ ప్రారంభించగా ఇప్పటివరకు 1,082 సూచనలు వచ్చినట్లు చెప్పారు.

ఆ రెండు రాష్ట్రాల్లో వన్‌మెన్ కమిషన్..

ఎస్సీ వర్గీకరణను అమలు చేస్తున్న పంజాబ్, తమిళనాడులలో అధికారుల బృందం అధ్యయనం చేసిందని, ఎన్నికల కోడ్ నేపథ్యంలో హరియాణాలో అధ్యయనం చేయలేదన్నారు. పంజాబ్‌లో ఎస్సీ కేటగిరీలో రెండు గ్రూపులుగా వర్గీకరణ చేశారని, తమిళనాడులో విద్య, ఉపాధిలో ఎస్సీలకు 18 శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్నారని, ఆ రాష్ట్రంలో 76 ఎస్సీ ఉపకులాలు ఉన్నట్లు ఉత్తమ్ వివరించారు. ఆ రెండు రాష్ట్రాల్లో వర్గీకరణ ప్రక్రియ చట్టపరమైన చిక్కుల్లేకుండా అమలు చేసేందుకు వన్‌మెన్ కమిషన్ ఏర్పాటు చేసిన విషయాన్ని ప్రస్తావించారు. వర్గీకరణ అధ్యయనాన్ని సకాలంలో పూర్తి చేయడానికి కమిషన్‌కు కాలపరిమితి విధించాలని మంత్రి సీతక్క అభిప్రాయపడ్డారు. జిల్లాలవారీగా పర్యటించి ఎస్సీ వర్గాల అభిప్రాయాలు తీసుకోవాలని మంత్రి దామోదర రాజనర్సింహ సూచించారు. దీంతో మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ వర్గీకరణపై ప్రజాభిప్రాయాన్ని కూడా సేకరించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ దిశగా ఉపసంఘం సభ్యులు త్వరలో జిల్లాల్లో పర్యటించాలని నిర్ణయించారు. వర్గీకరణ ప్రక్రియలో సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ స్టడీస్(సెస్) వంటి ప్రసిద్ధ ప్రభుత్వ సంస్థల సహకారం తీసుకోవాలన్నారు.

నెలలోనే కులగణన!

- ప్రారంభించిన రోజు నుంచి నెలలో పూర్తిచేసేలా కార్యాచరణ
- ఒకట్రెండు రోజుల్లో ముఖ్యమంత్రి అధ్యక్షతన సమావేశం!

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కులగణన చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో ఈ ప్రక్రియను నెల రోజుల వ్యవధిలో పూర్తిచేసేలా లక్ష్యాన్ని నిర్దేశించాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అభిప్రాయపడ్డారు. సర్వే ప్రక్రియ ప్రారంభించిన రోజు నుంచి నెలలోనే పూర్తిచేసేలా కార్యాచరణ రూపొందించాలన్నారు. మంగళవారం సచివాలయంలో మంత్రి పొన్నం చాంబర్‌లో బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్, సభ్యులు, ముఖ్యమంత్రి ప్రధాన సలహాదారుడు వేం నరేందర్, బీసీ సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు సమావేశమయ్యారు. మంత్రి మాట్లాడుతూ స్థానిక సంస్థల్లో బీసీ ప్రాతినిధ్యాన్ని జనాభా ప్రాతిపదికన పెంచాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించిందని, అందుకోసం డెడికేషన్ కమిషన్ ఏర్పాటు చేసిందన్నారు. రాష్ట్రంలో కులగణన పూర్తిచేస్తేనే బీసీ రిజర్వేషన్లపై స్పష్టత వస్తుందన్నారు. ఈ సందర్భంగా ఏపీ, కర్ణాటక, బిహార్ రాష్ట్రాల్లో నిర్వహించిన కులగణనపై చర్చించారు. ఈ మూడు రాష్ట్రాల్లో చేసిన సర్వేలోని ముఖ్యమైన అంశాల ఆధారంగా తెలంగాణలో సర్వే నిర్వహించాలన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ ప్రక్రియ కొనసాగుతోందని, కుల సర్వే నివేదిక ఎస్సీ వర్గీకరణకు కూడా అవసరమవుతుందని మంత్రి అభిప్రాయపడ్డారు. సర్వే కార్యాచరణపై రెండ్రోజుల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన లేదా సీనియర్ మంత్రులతో కీలక సమావేశం జరగనుందన్నారు. సీనియర్ ఐఏఎస్ అధికారి సర్వేను పర్యవేక్షించేలా చూస్తామన్నారు.

యుద్ధప్రాతిపదికన బీసీ సామాజిక, ఆర్థిక, కులగణన సర్వే: ఉత్తమ్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో బీసీ సామాజిక ఆర్థిక సర్వే, ఓటరు గణన యుద్ధప్రాతిపదికన చేపట్టాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం ఆయన చాంబర్‌లో జరిగిన మంత్రివర్గ ఉపసంఘం సమావేశంలో బీసీ సామాజిక, ఆర్థిక, కుల సర్వేపై చర్చించారు. రాష్ట్రంలో యుద్ధప్రాతిపదికన బీసీ ఓటర్ల గణనతోపాటు వెనుకబడిన తరగతుల (బీసీ) సామాజిక-ఆర్థిక సర్వే నిర్వహించాలని ప్రభుత్వానికి సిఫార్సు చేస్తామన్నారు. నిర్ణీత గడువులోగా పూర్తి చేసేందుకు బీసీ సామాజిక-ఆర్థిక సర్వే, ఓటర్ల గణన రెండింటినీ త్వరగా ప్రారంభించాలని మంత్రివర్గ ఉపసంఘం సిఫార్సు చేసింది. హైకోర్టు నిర్దేశించినట్లుగా డిసెంబరు 9 కల్లా రెండు ప్రక్రియల్ని ఏకకాలంలో నిర్వహించాలని సూచించారు. సర్వే ప్రొఫార్మా, చట్టబద్ధత, నోడల్ ఏజెన్సీ బాధ్యతలతోపాటు సాంకేతిక అంశాలపై సమావేశంలో చర్చించారు. తదుపరి మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకోనున్నట్లు మంత్రి తెలిపారు.

ఎస్సీ వర్గీకరణపై అన్యాయం జరుగుతోంది

నేడు రాష్ట్ర వ్యాప్తంగా నల్లజెండాలతో నిరసనలు: మందకృష్ణ మాదిగ




సాక్షి, హైదరాబాద్: ఎస్సీ వర్గీకరణలో జరుగుతున్న అన్యాయంపై బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా నల్లజెండాలతో నిరసన కార్యక్రమాలతో రోడ్డెక్కుతామని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ప్రకటించారు. అన్ని జిల్లా కేంద్రాల్లోని అంబేడ్కర్ విగ్రహాల నుంచి జిల్లా కలెక్టర్ల కార్యాలయాల వరకు ర్యాలీగా వెళ్లి, కలెక్టర్లకు వినతి పత్రాలు ఇస్తామన్నారు. హైదరాబాద్‌లో ట్యాంక్‌బండ్ దగ్గరున్న అంబేడ్కర్ విగ్రహం నుంచి బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహిస్తామని చెప్పారు. అదేవిధంగా ఈనెల 15న ఎమ్మార్పీఎస్ అనుబంధ నేతలతో సమావేశంలో భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని స్పష్టం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లో మందకృష్ణ విలేకరులతో మాట్లాడారు. టీపీసీసీ చీఫ్‌గా, నేడు సీఎంగా తన పదవి కోసం రేవంత్‌రెడ్డి మాదిగ జాతికి అన్యాయం చేస్తున్నారని అన్నారు. మాలలైన ఏఐసీసీ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, కొప్పుల ఈశ్వర్‌కు ఆయన భయపడుతున్నాడని మంద కృష్ణ ఆరోపించారు. నిండు శాసనసభలో సీఎం వర్గీకరణపై హామీ ఇచ్చి, ఇప్పుడు కమిటీ పేరుతో కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. బీసీ కులగణన కోసం మంత్రి పొన్నం ప్రభాకర్ పోరాటం చేస్తుంటే.. మాదిగ జాతికి చెందిన మంత్రి దామోదర మాత్రం వర్గీకరణపై నోరుమెదపడం లేదని ఆరోపించారు.

ఆర్టీసీకి మహిళా సంఘాల అద్దెబస్సులు


- కార్యాచరణను సిద్ధం చేస్తోన్న ప్రభుత్వశాఖలు
- మంత్రులు పొన్నం, సీతక్క ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో చర్చ

సాక్షి, హైదరాబాద్: మహిళా స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు రుణాలిచ్చి వారి ద్వారా బస్సులను కొనుగోలు చేయించి వాటిని ఆర్టీసీకి అద్దెకు ఇచ్చేలా ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది. రాష్ట్రంలో బస్సుల సంఖ్య పెంచాలని డిమాండ్ వస్తుండటంతో మహిళా సంఘాలకు ఉపాధి కల్పించేందుకు వారి బస్సులను అద్దెకు తీసుకోవాలని ఆర్టీసీ ఇప్పటికే నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మంగళవారం సచివాలయంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క ఆధ్వర్యంలో రవాణా శాఖ, పంచాయతీ రాజ్, మహిళా సంక్షేమ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా సంఘాలకు ఆర్టీసీ అద్దె బస్సుల కేటాయింపు విధి విధానాలపై చర్చించారు. తొలి దశలో మహిళా సంఘాల ద్వారా 100 నుంచి 150 బస్సులను కొనుగోలు చేయాలని అధికారులు నిర్ణయించారు. వీటిని ప్రయోగాత్మకంగా మహబూబ్‌నగర్, కరీంనగర్ జిల్లాల్లో మహిళా సంఘాలకు ఆర్టీసీ అద్దె బస్సులను కేటాయించాలని భావిస్తున్నారు. మహిళా సంఘాలు కొనుగోలు చేసే ఆర్టీసీ అద్దె బస్సుల నిర్వహణ బాధ్యతల కోసం ప్రత్యేక వ్యవస్థ ను ఏర్పాటు చేయనున్నారు. ఆర్టీసీ బస్సుల కొనుగోలుకు అయ్యే ఖర్చు, వచ్చే ఆదాయం, నిర్వహణ ఖర్చు తదితర అంశాలన్నింటితో కూడిన సమగ్ర నివేదికను సిద్ధం చేసి సమర్పించాక దీనిపై ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోనుంది.

పీఆర్‌టీయూటీఎస్ రాష్ట్ర అధ్యక్షుడుగా పింగిలి శ్రీపాల్‌రెడ్డి



శ్రీపాల్‌రెడ్డి



దామోదర్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: పీఆర్‌టీయూటీఎస్ రాష్ట్ర అధ్యక్షుడుగా పింగిలి శ్రీపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా పుల్గం దామోదర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లో 2 రోజుల పాటు జరిగిన సంఘం 35వ కౌన్సిల్ సమావేశాలు మంగళవారంతో ముగిశాయి. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల స్థానాలకు నాలుగు నామినేషన్లు వచ్చాయి. దీంతో సంఘ పెద్దలు సమన్వయం చేసి, ఏకగ్రీవ ఎన్నికకు తోడ్పడ్డారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీలు బి.మోహన్‌రెడ్డి, పూల రవీందర్, సంఘ మాజీ బాధ్యులు పేరి వెంకట్‌రెడ్డి, బీరెల్లి కమలాకర్‌రావు, గుర్రం చెన్నకేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'బిల్లులు ఇవ్వకపోతే ఉద్యమం'

రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న టీచర్ల సరెండర్ లీవ్, జీపీఎఫ్, మెడికల్, ఇతర బిల్లులను దసరాలోపు చెల్లించాలని, లేనిపక్షంలో ఉద్యమ కార్యాచరణ చేపడతామని ఎమ్మెల్సీ కూర రఘోత్తమ్‌రెడ్డి ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

ఎస్టీ వర్గీకరణ ఇప్పట్లో లేనట్లే!

- ఈ దిశగా కసరత్తు మొదలుపెట్టని రాష్ట్ర ప్రభుత్వం
- ఎస్సీ వర్గీకరణపై మాత్రం వన్‌మెన్ జ్యుడీషియల్ కమిషన్ ఏర్పాటుకు వర్గీకరణ కమిటీ సిఫార్సు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో షెడ్యూల్డ్ తెగల (ఎస్టీ) వర్గీకరణ ప్రక్రియ ఇప్పట్లో ముందుకు కదిలే అవకాశం కనిపించట్లేదు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ ఉపకులాల వర్గీకరణ కోసం ప్రత్యేకంగా కమిటీని ఏర్పాటు చేయగా.. ఆ కమిటీ మాత్రం కేవలం ఎస్సీ వర్గీకరణపైనే ప్రధానంగా దృష్టి సారిస్తోంది. దీంతో ఎస్సీ వర్గీకరణకు సంబంధించిన అంశాల్లో పురోగతి కనిపిస్తున్నప్పటికీ ఎస్టీ వర్గీకరణపై మాత్రం కమిటీ చర్యలు చేపట్టకపోవడం గమనార్హం. దీంతో ఎస్టీ వర్గీకరణ అంశం కాస్త వెనకబడిపోయింది.

అసెంబ్లీలో సీఎం ప్రకటన..: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ చేపట్టి రిజర్వేషన్లు అమలు చేసే అధికారాలను రాష్ట్ర ప్రభుత్వాలకు కల్పిస్తూ సుప్రీంకోర్టు ఆగస్టు ఒకటిన తీర్పు చెప్పడం తెలిసిందే. ఈ తీర్పు వెలువడిన వెంటనే దేశంలోకెల్లా ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను అమలు చేసే మొదటి రాష్ట్రం తెలంగాణ అవుతుందని సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీ వేదికగా ప్రకటించారు. ఇప్పటికే జారీ చేసిన ఉద్యోగ నియామక నోటిఫికేషన్లకు కూడా వర్గీకరణను అమలు చేస్తామని స్పష్టం చేశారు. ఇందులో భాగంగా గత నెల 12న రాష్ట్ర ప్రభుత్వం నీటిపారుదల, పౌరసరఫరాల శాఖల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన వర్గీకరణ కమిటీని ఏర్పాటు చేసింది. సుప్రీంకోర్టు తీర్పునకు అనుగుణంగా చేపట్టాల్సిన చర్యలు, ఇందుకు అవసరమైన సూచనలను తమకు తెలియజేయాలని కమిటీని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. ఇప్పటివరకు మూడుసార్లు సమావేశమైన కమిటీ.. వర్గీకరణపై ప్రత్యేక కార్యాచరణ తయారు చేయాలని ఎస్సీ అభివృద్ధి శాఖను ఆదేశించడంతోపాటు పంజాబ్, హరియాణా, తమిళనాడులో అమలవుతున్న వర్గీకరణపై అధ్యయనానికి అధికారుల బృందాన్ని ఆయా రాష్ట్రాలకు పంపింది. అధికారులు ఆ అధ్యయనాన్ని పూర్తి చేసి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. తాజాగా ఎస్సీ వర్గీకరణకు వన్‌మెన్ జ్యుడీషియల్ కమిషన్ ఏర్పాటు చేయాలని కమిటీ నిర్ణయించింది. కానీ ఎస్టీ వర్గీకరణకు సంబంధించిన ప్రక్రియ మాత్రం ముందుకు కదలడం లేదు.

వర్గీకరణ జాప్యంతో...: సీఎం ప్రకటనకు భిన్నంగా టీచర్ ఉద్యోగాల భర్తీకి సంబంధించి ఫలితాలను సీఎం రేవంత్‌రెడ్డి తాజాగా విడుదల చేశారు. మొత్తం 11 వేల టీచర్ ఉద్యోగాలకు 1:3 నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపిక చేసి ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియను సైతం పూర్తి చేశారు. ఈ నెల 9న టీచర్ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు నియామకపత్రాలు సైతం ఇచ్చేందుకు పాఠశాల విద్యాశాఖ చర్యలు చేపట్టింది. మరోవైపు గ్రూప్–4 ఉద్యోగాల భర్తీకి సంబంధించి దాదాపు 9 వేల ఉద్యోగాలకు 1:3 నిష్పత్తిలో అభ్యర్థుల ఎంపిక, ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ పూర్తయింది. వైద్య విద్య అడ్మిషన్ల ప్రక్రియలోనూ దాదాపు 8 వేల సీట్లకు అడ్మిషన్ల ప్రక్రియలో రెండో విడత వెబ్‌ఆప్షన్ల ప్రక్రియ సైతం పూర్తి కావచ్చింది. వర్గీకరణ ప్రక్రియను తేల్చకపోవడంతో ఎస్సీ, ఎస్టీల్లోని ఉపకులాలకు సరైన న్యాయం జరగడం లేదనే వాదన రోజురోజుకు పెరుగుతోంది.

తెలంగాణలో వైఫల్యంతోనే హరియాణాలో కాంగ్రెస్ ఓటమి

- డొల్ల గ్యారంటీల గారడీని ప్రజలు తిరస్కరించారు: కేటీఆర్
- కాంగ్రెస్ చేసిన మోసాన్ని ప్రజలు గమనిస్తున్నారు
- బీజేపీని ఢీకొనే సత్తా ప్రాంతీయ పార్టీలకే ఉందని స్పష్టమైంది
- 2029లో కేంద్రంలో బలమైన ప్రాంతీయ పార్టీలదే కీలక పాత్ర అని వ్యాఖ్య



సాక్షి, హైదరాబాద్: ''కర్ణాటకలో ఐదు గ్యారంటీలు, తెలంగాణలో ఆరు గ్యారంటీల పేరిట డొల్ల హామీలతో ప్రజలను నిలువునా మోసం చేసిన కాంగ్రెస్.. హరియాణాలోనూ ఏడు గ్యారంటీల పేరిట మభ్యపెట్టాలని చూసింది. కర్ణాటక, తెలంగాణ, హిమాచల్‌ప్రదేశ్‌లలో గ్యారంటీల పేరిట కాంగ్రెస్ చేసిన మోసాన్ని ప్రజలు గమనిస్తున్నారు. దీనికి హరియాణాలో ప్రజలు కాంగ్రెస్‌ను తిరస్కరించడమే నిదర్శనం..''అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల సందర్భంగా ఒక్కో రాష్ట్రంలో ఒక్కోలా గ్యారంటీలు ప్రకటిస్తూ వచ్చిన కాంగ్రెస్.. చివరికి బొక్కబోర్లా పడిందని విమర్శించారు. కాంగ్రెస్ గ్యారంటీ కార్డులు చిత్తు కాగితంలా మారాయని, అలవికాని హామీలతో గద్దెనెక్కాలని భావించిన కాంగ్రెస్‌కు జనం కర్రు కాల్చి వాత పెట్టారని పేర్కొన్నారు. తెలంగాణ, కర్ణాటక, హిమాచల్ ప్రజలకు కాంగ్రెస్ గ్యారంటీల డొల్లతనం పూర్తిగా అర్థమైందని.. రాష్ట్రాల్లో కాంగ్రెస్ పాలన వైఫల్యాలే హరియాణాలో ఓటమికి దారితీశాయని విమర్శించారు. సోషల్ మీడియా విస్తృతి పెరుగుతున్న ప్రస్తుత సమయంలో ప్రజల నుంచి వాస్తవాలు దాచడం సాధ్యం కాదని స్పష్టం చేశారు.

బీజేపీని ఢీకొట్టే శక్తి ప్రాంతీయ పార్టీలకే ఉంది

కాంగ్రెస్‌తో ముఖాముఖి పోరు ఉన్న రాష్ట్రాల్లోనే బీజేపీ గెలుస్తోందని.. రాహుల్ బలహీన నాయకత్వం కూడా కాంగ్రెస్ ఓటమికి కారణమని కేటీఆర్ వ్యాఖ్యానించారు. బీజేపీని ఢీకొని నిలువరించే శక్తి కేవలం ప్రాంతీయ పార్టీలకు మాత్రమే ఉందన్నారు. ప్రస్తుత ఫలితాల సరళిని బట్టి 2029లో కేంద్రంలో జాతీయ పార్టీలు బీజేపీ, కాంగ్రెస్‌కు మెజారిటీ సాధ్యం కాదని.. బలమైన ప్రాంతీయ పార్టీలే కేంద్ర ప్రభుత్వ ఏర్పాటులో కీలకంగా పనిచేస్తాయని పేర్కొన్నారు. దేశంలో సమాఖ్య స్ఫూర్తిని, సమగ్రతను, సెక్యులరిజాన్ని కాపాడాలని కోరుకునే మేధావులు, ప్రజలంతా ప్రాంతీయ పార్టీలకు మద్దతు తెలపాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో బుల్డోజర్‌రాజ్, పార్టీ ఫిరాయింపులు, రాజ్యాంగాన్ని తుంగలో తొక్కే వ్యవహారాలు నడుస్తున్నా రాహుల్ గాంధీ చూసీ చూడనట్టు వ్యవహరించిన తీరును దేశం మొత్తం గమనిస్తోందని పేర్కొన్నారు. కాంగ్రెస్ గ్యారంటీ కార్డులకు ప్రజాక్షేత్రంలో కాలం చెల్లిందనే విషయాన్ని ఇప్పటికైనా కాంగ్రెస్ గుర్తుపెట్టుకోవాలని వ్యాఖ్యానించారు.

పండుగ పూట పస్తులు

రాష్ట్రంలో కాంగ్రెస్ దండగగా మారి పాలనలో పండుగ పూట కూడా పస్తులు తప్పడం లేదని.. ప్రభుత్వ విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ సిబ్బందికి ఐదారు నెలలుగా వేతనాలు లేవని కేటీఆర్ ఆరోపించారు. పంచాయతీ, మున్సిపల్ కార్మికులు, ఆస్పత్రుల సిబ్బంది, హాస్టల్ వర్కర్స్, గెస్ట్ లెక్చరర్స్ మొదలుకుని ప్రతీ ప్రభుత్వ శాఖలో వేతనాల్లేక చిరుద్యోగులు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. ఒకటో తారీఖునే జీతాలు ఇస్తామని ప్రభుత్వం ప్రగల్బాలు పలికిందని.. దసరా పండుగ వచ్చినా చిరుద్యోగుల చేతిలో చిల్లిగవ్వ లేదని విమర్శించారు. నెలల తరబడి వేతనాలు ఇవ్వకపోతే.. చిరుద్యోగుల బతుకు బండి ఎలా సాగుతుందని కేటీఆర్ ప్రశ్నించారు.

హరియాణా ప్రజలు కాంగ్రెస్‌ను నమ్మలేదు

- ఫలితాలు చూసిన తర్వాత అయినా రేవంత్ పాలనతీరు మారాలి
- మాజీ మంత్రి హరీశ్‌రావు



సాక్షి, హైదరాబాద్: హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన గ్యారంటీల గారడీని అక్కడి ప్రజలు విశ్వసించలేదని, మంగళవారం వెలువడిన ఎన్నికల ఫలితాలు తేల్చి చెప్పాయని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. తెలంగాణ, కర్ణాటక ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ గ్యారంటీలు ఇచ్చి మోసగించిన తీరును హరియాణా ప్రజలు నిశితంగా గమనించారని చెప్పారు. గ్యారంటీల అమల్లో కాంగ్రెస్ మోసపూరిత వైఖరి హర్యానా ఎన్నికల ఫలితాల్లో స్పష్టంగా కనిపించిందన్నారు. హరియాణా ఫలితాల తర్వాత అయినా రేవంత్ ప్రభుత్వం ప్రతీకార, దృష్టి మళ్లింపు రాజకీయాలు మానుకొని 6 గ్యారంటీలు, 420 హామీలను చిత్తశుద్ధితో అమలు చేయాలని తెలిపారు. కశ్మీర్‌లో బీజేపీని, హరియాణాలో కాంగ్రెస్‌ను ప్రజలు విశ్వసించలేదని, రెండు జాతీయపార్టీలపై ప్రజల్లో విముఖత ఉందని ఎన్నికల ఫలితాలే స్పష్టం చేశాయని హరీశ్‌రావు మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

విద్యార్థుల జీవితాలతో చెలగాటం

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకుండా..13 లక్షల మంది విద్యార్థుల జీవితాలతో రాష్ట్ర ప్రభుత్వం ఆటలాడుతోందని హరీశ్‌రావు ఆగ్ర హం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రైవే ట్ డిగ్రీ, పీజీ కాలేజీల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ సభ్యులు మంగళవారం హరీశ్‌ను కలిశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రాకపోవడంతో దసరా, దీపావళి పండుగ సమయాల్లోనూ సిబ్బందికి వేతనాలు చెల్లించలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం ఏటా రూ.2వేల కోట్ల చొప్పున తొమ్మిదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో రూ.19 వేల కోట్లు విడుదల చేసినట్లు హరీశ్‌రావు వెల్లడించారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం గడిచిన పదినెలల్లో ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద ఒక్క రూపాయి ఇవ్వలేదన్నారు.

ఉపసంఘం పేరిట కాలయాపన

రైతుల తరహాలో రేవంత్ మాదిగలనూ మోసం చేస్తున్నారు: బీఆర్‌ఎస్ నేతలు



మాట్లాడుతున్న రాజయ్య. చిత్రంలో ఎర్రోళ్ల శ్రీనివాస్, గువ్వల బాలరాజు తదితరులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అమలుపై ఉపసంఘం పేరిట కాంగ్రెస్ సర్కార్ కాలయాపన చేస్తోందని బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యేలు మండిపడ్డారు. రైతులను మోసగించిన తరహాలో మాదిగలను కూడా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మోసం చేస్తున్నారని వారు మండిపడ్డారు. తెలంగాణభవన్‌లో మంగళవారం మాజీ ఉపముఖ్యమంత్రి తాటికొండ రాజయ్యతో కలసి బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యేలు గువ్వల బాలరాజు, సుంకె రవిశంకర్, పార్టీ నేత ఎర్రోళ్ల శ్రీనివాస్ మీడియాతో మాట్లాడారు. ఇతర రాష్ట్రాలకంటే ముందుగానే తెలంగాణలో ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తానని అసెంబ్లీ సాక్షిగా సీఎం ఉత్తర కుమార ప్రగల్భాలు పలికారన్నారు. లోక్‌సభ ఎంపీ టికెట్లు, మంత్రివర్గంలో మాదిగలకు ప్రాతినిధ్యం లేకుండా పోయిందని రాజయ్య ఆవేదన వ్యక్తం చేశారు. మాలలకు కాంగ్రెస్ పార్టీ అనుకూలంగా పనిచేస్తోందని ఆరోపించారు. సుంకె రవిశంకర్ మాట్లాడుతూ... ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తే డీఎస్సీ తాజా నియామకాల్లో 1,200 ఉద్యోగాలు మాదిగ సామాజికవర్గానికి దక్కేవన్నారు. సీఎం రేవంత్‌కు హైడ్రాపై ఉన్న ప్రేమ మాదిగలపై లేదని, ఆయన మాదిగ ద్రోహిగా మారారని మండిపడ్డారు. రాష్ట్రంలో మాదిగలకు మంత్రివర్గంలో, నామినేటెడ్ పదవుల్లో చోటు దక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ నియంతలా వ్యవహరిస్తూ మాదిగలను మోసం చేయాలని భావిస్తున్నారని గువ్వల బాలరాజు విమర్శించారు. ఎస్సీ వర్గీకరణ అమలు చేయకుంటే జాతీయస్థాయిలో మాదిగ ఉద్యమానికి శ్రీకారం చుడతామని హెచ్చరించారు. ఎస్సీ వర్గీకరణ అమలుపై ప్రభుత్వం రోడ్‌మ్యాప్ ప్రకటించకుంటే కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులను అడ్డుకోవాలని ఎర్రోళ్ల శ్రీనివాస్ పిలుపునిచ్చారు.

టీఎస్‌యూటీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా అలుగుబెల్లి

ఇంకా తేల్చని పీఆర్‌టీయూ, ఇతర సంఘాలు



సాక్షి, హైదరాబాద్/నల్లగొండ: వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉపాధ్యాయ నియోజకవర్గం ఎమ్మెల్సీ అభ్యర్థిగా అలుగుబెల్లి నర్సిరెడ్డినే మరోమారు నిలపాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) రాష్ట్ర కమిటీ ఏకగ్రీవంగా నిర్ణయించింది. టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య అధ్యక్షతన సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం మంగళవారం వర్చువల్‌గా జరిగింది. నర్సిరెడ్డికే మరోసారి అవకాశం ఇవ్వాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి ప్రతిపాదించగా సభ్యులు ఆమోదించారు. సమావేశంలో ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, ఉపాధ్యక్షులు రాములు, దుర్గాభవాని, కోశాధికారి లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా ఇటీవల జిల్లాల కమిటీలను నియమించిన పీఆర్‌టీయూ రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకుంది. ఈ సమావేశంలో వరంగల్ – ఖమ్మం – నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎవరిని అభ్యర్థిగా నిలుపుతారనే అంశంపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి పేరు వినిపించినప్పటికీ ఆయననే మళ్లీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన నేపథ్యంలో ఈసారి ఆయన ఎన్నికల్లో పోటీ చేస్తారా? లేదా? తేలాల్సి ఉంది. మరోవైపు మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ పీఆర్‌టీయూ తరపున ఎమ్మెల్సీ అభ్యర్థి గా బరిలో నిలవాలని భావిస్తున్నారు. ఆయనతో పాటు మరికొంతమంది కూడా సంఘం నేతలు పోటీకి ఉవ్విళ్లూరుతున్నట్లు తెలుస్తోంది.



సాక్షి హైదరాబాద్

బుధవారం । 9 । అక్టోబర్ । 2024



సర్టిఫి'కేటుగాళ్లు'

జిరాక్స్ సెంటర్‌లో తయారైన నకిలీ విద్యార్హత పత్రాలను రేటు కట్టి విక్రయిస్తున్న ముఠాకు సౌత్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు చెక్ చెప్పారు.

-10లో



గెట్ రెడీ.. ఇట్స్ త్రీడీ..

త్రీడీ ప్రింటింగ్‌లో 21 ఏళ్ల కుర్రాడు క్రవీంతర్ కమల్ వినూత్నంగా ముందడుగు వేశాడు. నగరంలోనే త్రీడీ ప్రింటింగ్‌లో సత్తా చాటుకున్నాడు.

- సిటీప్లస్‌లో

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 32.0/24.0

నగరంలో బుధవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. తేలికపాటి వర్షం కురిసే అవకాశముంది. గరిష్ఠంగా 32, కనిష్ఠంగా 24 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

కూకట్‌పల్లిలో బతుకమ్మతో యువతి



డీజీపీ కార్యాలయంలో బతుకమ్మ ఆడుతున్న ఐపీఎస్ అధికారిణులు, మహిళా పోలీసులు



లేడీ ఐపీఎస్.. బతుకమ్మతో హ్యాపీస్!

వారంతా ఐపీఎస్ అధికారిణులు, మహిళా పోలీసులు. నిత్యం ఖాకీ దుస్తుల్లో కనిపించేవారు మంగళవారం మాత్రం సంప్రదాయ వస్త్రధారణల్లో తళుక్కుమన్నారు. చీరకట్టులో ఆకట్టుకున్నారు. నగరంలోని డీజీపీ కార్యాలయంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో అంటూ మహిళా ఐపీఎస్‌లు శిఖా గోయల్, స్వాతి లక్రా తదితరులు ఆడిపాడారు.

ఎల్బీ స్టేడియం కేంద్రంగా ట్రాఫిక్ ఆంక్షలు నేడు

సాక్షి, సిటీబ్యూరో: ఎల్బీ స్టేడియంలో బుధవారం 'డీఎస్సీ–2024 కొలువుల పండగ' కార్యక్రమం జరగనుంది. ఇందులో పాల్గొనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి డీఎస్సీకి ఎంపికైన 11 వేల మంది అభ్యర్థులకు నియామక పత్రాలు అందించనున్నారు. ఈ కార్యక్రమం నేపథ్యంలో ఎల్బీ స్టేడియం కేంద్రంగా ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తూ ఆ విభాగం చీఫ్ పి.విశ్వప్రసాద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. బుధవారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రాత్రి 8 గంటల వరకు స్టేడియం చుట్టు పక్కల మార్గాల్లో సాధారణ వాహనాలకు మళ్లింపులు వర్తిస్తాయి. వాహన చోదకులు వీటిని దృష్టిలో పెట్టుకుని తమకు సహకరించాలని పోలీసులు కోరారు.

కావాలి రూ. 1,000 కోట్లు

మూసీ నిర్వాసితులకు 1,5000 డబుల్ బెడ్రూం గృహాల కోసం..

- ప్రస్తుతం సిద్ధంగా ఉన్న 1,600 ఇళ్లలో ఇప్పటికే 280 మందికి కేటాయింపు

సాక్షి, సిటీబ్యూరో: మూసీ ప్రక్షాళన.. రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ పనుల కోసం సంబంధిత ప్రభుత్వ విభాగాలు మూసీ రివర్‌బెడ్, బఫర్ జోన్‌లలోని ప్రజలను ఖాళీ చేయిస్తున్నాయి. ఆ ప్రాంతాల్లో ఇళ్లు కోల్పోతున్నవారికి డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మూసీ రివర్‌బెడ్, బఫర్‌జోన్లలో తొలగించాల్సిన ఇళ్లు దాదాపు 15వేలు ఉన్నాయని అధికారులు అంచనా వేశారు. ఆ ఇళ్లు కోల్పోయే వారందరికీ ప్రత్యామ్నాయంగా కనీసంగా 15వేల డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించాల్సి ఉంది. వాటిలోని ఉమ్మడి కుటుంబాలు, ఎక్కువ విస్తీర్ణంలోని ఇళ్లు కోల్పోయే వారి డిమాండ్లతో పాటు నిర్వాసితులయ్యే కుటుంబాలు ఇంకా ఎక్కువే ఉండవచ్చనే అంచనాలున్నాయి. ఈ నేపథ్యంలో వారందరికీ ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించగలదా? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ నేపథ్యంలో 'సాక్షి' పరిశీలనలో వెల్లడైన అంశాలిలా ఉన్నాయి.

పంపిణీకి సిద్ధంగా 1,660 మాత్రమే..

జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లలో పేద లబ్ధిదారులకు ఇప్పటికే కేటాయించినవి పోను ప్రస్తుతం దాదాపు 3,900 ఇళ్లు వివిధ ప్రాంతాల్లోని డబుల్ బెడ్రూం హౌసింగ్ కాలనీల్లో ఉన్నాయి. అన్నీ ఒకేచోట లేవు. వీటిలో దాదాపు 1,660 ఇళ్లు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉండగా, వాటిలో 280 మందికి ఇప్పటికే కేటాయించారు. మరో 1,380 ఇళ్లు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్నాయి. ఖాళీగా ఉన్న మిగతా 2,240 ఇళ్లలో తాగునీరు, విద్యుత్ తదితర మౌలిక సదుపాయాలు కల్పించాల్సి ఉంది. అందుకు దాదాపు నెల రోజుల సమయం పట్టనుంది. అప్పటి వరకు ఇళ్ల కేటాయింపులకు ఇబ్బందులు ఉండకపోవచ్చు.



ప్రభుత్వానికి లేఖ ..

- కూల్చివేతలు ముమ్మరం చేసి పనులు త్వరితంగా చేయాలనుకుంటే నిరాశ్రయులయ్యే వారికి ప్రభుత్వ అంచనాల మేరకే మొత్తం 15వేల ఇళ్లు కావాలి. ఈ నేపథ్యంలో నెలరోజుల్లో కేటాయింపులకు సిద్ధం కానున్న ఇళ్లు కాక, మరో 15 వేల ఇళ్లు రెడీ చేయడానికైనా తాము సిద్ధంగా ఉన్నామని, అయితే అందుకు రూ. 1000 కోట్ల నిధులవసరమని జీహెచ్‌ఎంసీ ఇంజినీర్లు అంచనా వేశారు. తుది దశలో ఉన్న ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు, కనీస మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ఆ నిధులవసరం.
- అదే విషయాన్ని తెలియజేస్తూ మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ప్రభుత్వానికి లేఖ రాసినట్లు సమాచారం. ప్రభుత్వం రూ.1,000 కోట్లు మంజూరు చేస్తే పనులు మొదలు పెట్టేందుకు వీలవుతుంది. మూడు నుంచి ఆర్నెల్లలోపు ఆ ఇళ్లు పూర్తవుతాయి. అవి కూడా పూర్తయితే దాదాపు 19వేల డబుల్‌బెడ్రూం ఇళ్లు కేటాయించేందుకు రెడీగా ఉంటాయి. క్షేత్రస్థాయి పరిస్థితులతో లబ్ధిదారుల కుటుంబాలు పెరిగినా అవి సరిపోతాయి. లేదా ఇతర కారణాలతో నిరాశ్రయులయ్యే వారికి, అర్హులైన ఇళ్లులేని పేదలకు అవి ఉపకరిస్తాయి. అయితే ఇప్పుడు కావాల్సింది వెయ్యికోట్ల నిధులు. అందుకు ప్రభుత్వం ఎలా స్పందిస్తుందో వేచి చూడాల్సిందే !

ఈ ప్రాంతాల్లో ..

ప్రస్తుతం మూసీ నిర్వాసితులకు ఆయా కాలనీల్లో ఖాళీగా ఉన్న డబుల్‌బెడ్రూం ఇళ్లను కేటాయిస్తున్నారు. వీటిలో గతంలో ఉన్న పాత ఇళ్లను కూల్చివేసి అక్కడే నిర్మించిన (ఇన్‌సిటు) డబుల్ బెడ్రూం ఇళ్లలో స్థానిక లబ్ధిదారులకు కేటాయించినవి పోను ఇంకా ఖాళీగా ఉన్న ఇళ్లున్నాయి. ఇప్పుడు వాటిని కూడా మూసీ నిర్వాసితులకు కేటాయిస్తున్నారు. ప్రస్తుతం కేటాయించేందుకు అందుబాటులో ఉన్న ఇళ్లు దిగువ ప్రాంతాల్లో ఉన్నాయి.

హైదరాబాద్ జిల్లాలోని వారికి కేటాయించేందుకు..

జియాగూడ, మలక్‌పేట పిల్లిగుడిసెలు, జంగమ్మెట్, కొల్లూరు–1, ప్రతాపసింగారం, కంటోన్మెంట్ గాంధీనగర్, ముషీరాబాద్ సాయిచరణ్ కాలనీ, జూబ్లీహిల్స్ కమలానగర్.

రంగారెడ్డి జిల్లాలోని వారికి..


రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని బైరాగిగూడ, నార్సింగి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని బాచుపల్లి, డి.పోచంపల్లి–2.

మేడ్చల్ జిల్లాలోని వారికి..

ఎల్బీనగర్ నియోజకవర్గంలోని జైభవానీనగర్ (రైతుబజార్ హట్స్), ఇబ్రహీం పట్నం నియోజకవర్గంలోని తిమ్మాయిగూడ, మేడ్చల్ నియోజకవర్గంలోని ప్రతాపసింగారం.

మూసీ మెరిసేలా..

హైదరాబాద్ సమగ్ర సీవరేజీ మాస్టర్ ప్లాన్



సీవరేజీ మాస్టర్ ప్లాన్- క్యాచ్‌మెంట్ ఏరియాలు, సీవరేజీ జోన్‌లు

- నదిలోకి మురుగును కట్టడి చేసేలా చర్యలు
- అంచనా వ్యయం రూ.17,212 కోట్లు
- 7,034 కి.మీ మేర సీవరేజీ పైపులైన్ నెట్‌వర్క్
- మరోవైపు కొత్త సీవరేజీ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు
- కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర సర్కారు ప్రతిపాదనలు

సాక్షి, సిటీబ్యూరో: మూసీ ప్రక్షాళనలో భాగంగా మురుగు నీరు చేరకుండా కట్టడి చేసేందుకు ప్రత్యేక కార్యాచరణకు రాష్ట్ర ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. రూ.17,212.69 కోట్ల అంచనా వ్యయంతో హైదరాబాద్ 'సమగ్ర సీవరేజీ మాస్టర్ ప్లాన్'కు రూపకల్పన చేసింది. కేంద్ర ప్రభుత్వ అమృత్ పథకం 2.0 కింద మాస్టర్ ప్లాన్‌ను చేర్చాలని లేదా ప్రత్యేక ప్రాజెక్టుగా చేపట్టేందుకు ఆర్థిక చేయూత అందించాలని ప్రతిపాదించింది. చారిత్రక హైదరాబాద్ నగరంలో ఏళ్లనాటి మురుగు నీటి పైపులైన్ వ్యవస్థ కొనసాగుతోంది. శివారుతో పాటు ఓఆర్‌ఆర్ పరిధిలో సైతం సరైన మురుగు నీటి పారుదల వ్యవస్థ లేకుండాపోయింది. గతంలో పంచాయతీలుగా ఉన్నప్పుడు వేసిన మురుగు కాల్వలే ఇప్పటికీ కొనసాగుతున్నాయి. మొత్తమ్మీద ప్రస్తుతం 9,769 కిలోమీటర్లు మాత్రమే పైపులైన్ నెట్‌వర్క్ విస్తరించి ఉంది. కొత్తగా జీహెచ్‌ఎంసీ పరిధిలో 2,656 కి.మీ, ఓఆర్‌ఆర్ పరిధిలో 4,378 కి.మీ మేర విస్తరించాలని ప్రతిపాదనలు ఉన్నా.. పెండింగ్‌లోనే మగ్గుతున్నాయి. దీంతో సమగ్ర కార్యాచరణలో మురుగు నీటి వ్యవస్థను మెరుగుపర్చేందుకు ప్రభుత్వం సిద్ధమైనట్లు సమాచారం.

80 శాతం మురుగు..

మహా నగరంలోని 80 శాతం మురుగు మూసీలో చేరుతోంది. మిగిలిన 20 శాతం స్థానిక చెరువుల్లో కలుస్తోంది. నగరంలో మూసీ నది సుమారు 55 కిలోమీటర్ల మేర ప్రవహిస్తోంది. దానికి ఇరువైపులా కలిపి 110 కిలోమీటర్ల పొడవునా మురుగు కలుస్తోంది. ప్రస్తుతం హైదరాబాద్ అర్బన్ ఆగ్లోమెరేషన్ పరిధిలో రోజువారీగా 2,815 ఎంఎల్డీల మురుగు నీరు ఉత్పన్నమవుతోంది. జీహెచ్‌ఎంసీ పరిధిలో 1650 ఎంఎల్డీలు ఉండగా, మురుగు శుద్ధి కేంద్రాల (ఎస్టీపీ) ద్వారా 772 ఎంఎల్డీల మురుగు నీటిని (46 శాతం) శుద్ధి చేసి మూసీలోకి వదులుతున్నారు.

– తాజాగా రాష్ట్ర ప్రభుత్వం మూసీ సుందరీకరణను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న నేపథ్యంలో మురుగు నీరు మూసీలో చేరకుండా కట్టడి చేసేందుకు ప్రత్యేక కార్యాచరణకు సిద్ధమైంది. అందులో భాగంగానే పైపులైన్ నెట్‌వర్క్ వ్యవస్థ విస్తరణతో పాటు ట్రంక్ సీవర్స్ మెయిన్స్, లార్జ్ సైజ్ బాక్స్ డ్రెయిన్స్, కొత్త సీవరేజీ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల నిర్మాణాల ప్రాజెక్టుకు రూపకల్పన చేసి కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించినట్లు తెలుస్తోంది.

7,034 కి.మీ సీవరేజీ నెట్‌వర్క్..

హైదరాబాద్‌తో పాటు శివారు, అవుటర్ రింగ్ రోడ్డు వరకు విస్తరించిన స్థానిక సంస్థల (యూఎల్‌బీ) పరిధిలో సుమారు 7,034 కి.మీ పొడవున మురుగు నీటి పైపులైన్ నెట్‌వర్క్ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. మొత్తమ్మీద ఓఆర్‌ఆర్ యూఎల్‌బీల పరిధిలో 27 పురపాలక సంఘాలను కలుపుకొని సుమారు 4,378 కి.మీ, జీహెచ్‌ఎంసీ పరిధిలోని శివారు, కోర్ సిటీ పరిధిని కలుపుకొని దాదాపు 2,656 కి.మీ పొడవున సీవరేజీ నెట్‌వర్క్ పైపులైన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. అందులో జీహెచ్‌ఎంసీలోని శివారు పరిధిలో మూడు ప్యాకేజీల్లో తొమ్మిది సర్కిల్స్ కలుపుకొని 2,232 కి.మీ, కోర్ సిటీ పరిధిలోని 4 జోన్లలో 424 కి.మీ పైపులైన్ నెట్‌వర్క్‌ను విస్తరించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది.



ప్రక్షాళన పూర్తయితే మూసీ ఇలా..

ప్రతిపాదిత సమగ్ర సీవరేజీ మాస్టర్ ప్లాన్ ఇలా..

శివార్లలో పైపులైన్ నెట్‌వర్క్

ప్యాకేజీ–1
కిలోమీటర్లు : 756.85
సర్కిళ్లు : ఉప్పల్, కాప్రా, మల్కాజిగిరి. అల్వాల్, శేరిలింగంపల్లి

ప్యాకేజీ–2
కిలోమీటర్లు : 643.29
సర్కిళ్లు: రాజేంద్రనగర్, ఎల్బీనగర్

ప్యాకేజీ –3
కిలోమీటర్లు : 831.78
సర్కిళ్లు: కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్

కోర్‌సిటీ పైపులైన్ నెట్‌వర్క్ (కి.మీలలో)	జోన్–1	81
	జోన్–4	92
	జోన్– 5	77
	జోన్– 6	174

రూ.4వేల కోట్లతో సీవరేజీ ప్లాంట్లు..

మరోవైపు మూసీపై మురుగు నీటిశుద్ధి కోసం సుమారు 62 సీవరేజీ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల నిర్మాణాలకు రూ.4 వేల కోట్ల అంచనా వ్యయంతో రాష్ట్ర సర్కారు ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. ఈ ప్రాజెక్టును సైతం కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదించింది. ఇప్పటికే మూడు ప్యాకేజీల్లో మొత్తం 31 మురుగు నీటి శుద్ధి కేంద్రాలు (ఎస్టీపీ) నిర్మాణాల ద్వారా సుమారు 1259.50 ఎంఎల్డీల మురుగునీటి శుద్ధి చేయాలని నిర్ణయించింది. ఇటీవల అమృత్ పథకం కింద 39 ఎస్టీపీలకు గ్రీన్ సిగ్నల్ లభించింది. తాజాగా మూసీలో పూర్తిగా శుద్ధి చేసిన జలాలనే వదిలేలా మరికొన్ని ఎస్టీపీల నిర్మాణాలకు ప్రతిపాదించింది.

ఇల్లాలిని చంపిన భర్త

- కుటుంబ కలహాలే కారణం
- ఠాణాలో లొంగిపోయిన నిందితుడు



కృష్ణవేణి (ఫైల్)

మణికొండ: కుటుంబ కలహాలతో భార్యను చంపాడు ఓ భర్త. ఈ ఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని హైదర్‌షాకోట్ మాధవీనగర్ కాలనీలో మంగళవారం జరిగింది. స్థానికులు, నార్సింగి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్రకు చెందిన శ్రీనివాస్ సాగర్, కృష్ణవేణి (32)కి పన్నెండేళ్ల క్రితం వివాహమైంది. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. బతుకుదెరువు కోసం నగరానికి వచ్చిన శ్రీనివాస్ సాగర్ హైదర్‌షాకోట్‌లోని ఓ టెంట్‌హౌస్‌లో పని చేస్తున్నాడు. కుటుంబ కలహాలతో దంపతులిద్దరూ తరచూ గొడవపడేవారు. ఈ విషయంలో కృష్ణవేణి నార్సింగి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కక్ష గట్టిన శ్రీనివాస్ సాగర్.. సోమవారం తెల్లవారుజామున ఇంట్లో నిద్రిస్తున్న ఆమె తలపై సుత్తితో బాదాడు. తీవ్ర రక్తస్రావం కావడంతో కృష్ణవేణి అక్కడికక్కడే మృతి చెందింది. అనంతరం పిల్లలను తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి తన భార్యను చంపానంటూ శ్రీనివాస్ సాగర్ లొంగిపోయాడు. కాగా.. కృష్ణవేణి హత్య విషయం తెలుసుకుని హైదర్‌షాకోట్‌కు చేరుకున్న ఆమె బంధువులు పోలీస్‌స్టేషన్‌లో ఉన్న శ్రీనివాస్ సాగర్‌ను తమకు అప్పగించాలని ఆందోళనకు దిగారు. మూడు గంటల పాటు వారిని పోలీసులు సముదాయించి ఫిర్యాదు తీసుకుని కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

మంత్రాలతో మర్డర్ చేస్తా!

చేతబడితో చంపేస్తానంటూ నకిలీ బాబా ప్రచారం

- తన అత్తింటి వారిని హత్య చేయాలంటూ అతడితో ఓ మహిళ డీల్
- క్షుద్రపూజలు చేసి ఆ వీడియోలను అత్తింటికి పంపిన వైనం
- వీరికి చెక్ చెప్పిన సౌత్–ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు

సాక్షి, సిటీబ్యూరో: నకిలీ బాబాగా అవతారం ఎత్తిన ఓ మాజీ రౌడీషీటర్ మంత్రాలతో మర్డర్లు చేస్తానంటూ ప్రచారం చేసుకున్నాడు. ఈ క్రమంలో తన అత్తింటి వారిపై ఉన్న కక్షను ఇతడి ద్వారా తీర్చుకోవాలని భావించిందో మహిళ. అత్తింటికి వ్యతిరేకంగా క్షుద్ర పూజలు చేయిస్తూ తీసిన వీడియోను వారికి చేరేలా చేసింది. ఈ పరిణామంతో తీవ్ర భయాందోళనకు గురైన బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నకిలీ బాబాకు సౌత్–ఈస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు చెక్ చెప్పారు. పరారీలో ఉన్న మహిళ కోసం గాలిస్తున్నట్లు మంగళవారం అదనపు డీసీపీ అందె శ్రీనివాస రావు వెల్లడించారు. కేసు పూర్వాపరాలను ఆయన ఇలా వివరించారు.

ష్యూరిటీ నేపథ్యంలో బాబా పరిచయం..

నగరంలోని బహదూర్‌పురా హసన్‌నగర్‌కు చెందిన మహ్మద్ కలీంకు నేరచరిత్ర ఉండటంతో గతంలో కాలాపత్థర్ పోలీసులు రౌడీషీట్ తెరిచారు. హత్య, హత్యాయత్నం సహా అయిదు కేసుల్లో నిందితుడైన ఇతగాడు 2022 నుంచి కాలీగా పేరు మార్చుకుని నకిలీ బాబా అవతారం ఎత్తాడు. ఇళ్లకు రంగులు వేసే పని చేస్తూనే పూజలు, మంత్రాల పేరుతో పలువురిని బురిడీ కొట్టిస్తున్నాడు. అనారోగ్యం తగ్గడానికి తాయత్తులు, తాళ్లు కడుతూ డబ్బు వసూలు చేస్తున్నాడు. పాతబస్తీకే చెందిన నజియా కొన్నాళ్ల క్రితం ఓ మహిళకు రూ.50 వేలు అప్పుగా ఇచ్చింది. అప్పట్లో ఆమె తరఫున ష్యూరిటీ ఇవ్వడానికి వచ్చిన కాలీతో నజియాకు పరిచయం ఏర్పడింది.

అత్తింటి వారిపై కక్ష తీర్చుకోవాలని..

నజియాకు తన అత్తింటి వారితో స్పర్థలు వచ్చాయి. దీంతో వారిపై కక్షగట్టిన ఆమె హత్య చేయించాలని భావించింది. దీనికోసం కాలీని సంప్రదించగా రూ.10 వేలు ఇస్తే చేతబడితో చంపేస్తానంటూ ఒప్పందం చేసుకున్నాడు. ఆ మొత్తం తీసుకున్న అతగాడు నజియా అత్త, ఆడపడుచు, మరిది పేరుతో బొమ్మలు తయారు చేసి క్షుద్రపూజలు చేశాడు. ఈ తతంగం మొత్తాన్ని నజియా వీడియో చిత్రీకరించింది. గత నెల 2న నజియా మరిదికి ఫోన్ చేసిన కాలీ... క్షుద్రపూజల విషయం చెప్పడంతో పాటు 48 గంటల్లో చనిపోతారంటూ అల్టిమేటం ఇచ్చాడు. ఆ వెంటనే వాట్సాప్ ద్వారా చేతబడి చేస్తున్న వీడియోను పంపాడు.



క్షుద్ర పూజలు చేస్తున్న కాలీ

నిద్రాహారాలు మానేసిన కుటుంబం..

ఈ పరిణామంతో తీవ్ర భయాందోళనలకు గురైన ఆ కుటుంబం నిద్రాహారాలు మానేసింది. తమకు ఏదో జరుగుతోందని భయపడుతూ దైనందిన వ్యవహారాలకు దూరంగా ఉంది. ఎట్టకేలకు ధైర్యం చేసిన నజియా మరిది ఇర్ఫాన్ మాలిక్ బండ్లగూడ ఠాణాలో ఫిర్యాదు చేశారు. కోర్టు అనుమతితో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. నిందితుల కోసం సౌత్–ఈస్ట్ జోన్ ఇన్‌స్పెక్టర్ కేఎస్ ప్రసాద్ వర్మ నేతృత్వంలో ఎస్సైలు షేక్ కవియుద్దీన్, ఎం.మధు, పి.సాయిరాం రంగంలోకి దిగారు. మంగళవారం కాలీని పట్టుకుని అతడి నుంచి చేతబడి సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని బండ్లగూడ పోలీసులకు అప్పగించి పరారీలో ఉన్న నజియా కోసం గాలిస్తున్నారు.

భగ్గున బియ్యం

రికార్డు స్థాయిలో మండుతున్న ధరలు

- గ్రేటర్‌లో మొదటి రకం బియ్యం కిలో రూ.70–80
- నెల రోజుల్లోనే కేజీపై రూ.20 పెరుగుదల
- ఉత్పత్తులు పెరిగినా దిగిరాని ధరలు
- పన్నులు ఎత్తివేసినా రేట్లు తగ్గించని వ్యాపారులు
- ఇబ్బందుల్లో వినియోగదారులు



సాక్షి సిటీబ్యూరో: గతంలో ఎన్నడూ లేని విధంగా గ్రేటర్‌లో బియ్యం ధరలు రికార్డు స్థాయికి చేరాయి. నాణ్యమైన సన్న బియ్యం కొనాలంటే కిలోకు రూ.65 నుంచి రూ. 55కి పైగానే చెల్లించాల్సి వస్తోంది. గతేడాది ఫస్ట్ క్వాలిటీ పాత సన్నబియ్యం కిలోకు రూ.45 నుంచి 50లోపు లభించేవి. ప్రస్తుతం కిలో రూ.65 నుంచి రూ 75 చెల్లిస్తే కాని మార్కెట్‌లో లభించడం లేదు. ఇక ఫస్ట్‌క్లాస్ కొలమ్ బియ్యం తినాలంటే మాత్రం రూ.80–85 చెల్లించాల్సిందే. గత, ఈ ఏడాది ఖరీఫ్, రబీ సీజన్‌లలో రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 75 నుంచి 80 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం సేకరించినట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. గతంలో కంటే 15 నుంచి 20 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం అధికంగా సేకరణ జరిగిందని పౌరసరఫరాల అధికారులకు లెక్కలు చెబుతున్నాయి. డిమాండ్ కంటే ఎక్కువగా బియ్యం మార్కెట్‌కు వచ్చినా ధరలు మాత్రం తగ్గడం లేదు. ఏటేటా పెరుగుతూనే ఉన్నాయి. ధరల నియంత్రణలో పౌర సరఫరాల అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు.

మిల్లర్లు, రిటైల్ వ్యాపారుల దగా..

- జీఎస్టీ రాకముందు మిల్లర్లు, వ్యాపారులు ప్రతి క్వింటాల్‌పై 4 శాతం పన్నులు చెల్లించేవారు. కానీ జీఎస్టీ అమలులోకి వచ్చాక వ్యవసాయ ఆధారిత ఉత్పత్తులపై పన్నులను పూర్తిగా తొలగించారు. అందులో భాగంగానే బియ్యంపై వ్యాట్‌ను కూడా పూర్తిగా ఎత్తివేశారు. దీంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న రైస్ మిల్లర్లు వరిని ధాన్యం రూపంలో చేసి తెలంగాణ వ్యాపారులకు అమ్మితే గతంలో ఉన్న 1 శాతం పన్నును 2019 జీవో నంబర్ 219 ద్వారా ప్రభుత్వం ఎత్తివేసింది. రైస్ మిల్లర్లు కేవలం 1 శాతం ప్యాడీపై మాత్రమే మార్కెట్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. జీఎస్టీ వచ్చాక 4 శాతం వ్యాట్‌ను ఎత్తివేశారు. 1 శాతం పన్నును కూడా ఎత్తి వేశారు. అయినా ధరలు మాత్రం పెరుగుతూనే ఉన్నాయి కానీ తగ్గడం లేదు.
- వ్యవసాయాధారిత ఉత్పత్తులు వినియోగదారులకు తక్కువ ధరలకే అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పన్నులు ఎత్తివేసింది. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి ఇందుకు పూర్తి భిన్నంగా ఉంది. వ్యాపారులు పన్నులు చెల్లించినప్పుడు బియ్యం ధరలు తక్కువగా ఉన్నాయి. ప్రస్తుతం పన్నులు రద్దు అయిన తర్వాత బియ్యం ధరలు విపరీతంగా పెరిగాయి. మిల్లర్లు, రిటైల్ వ్యాపారులు కొనుగోలుదారులను దోచేస్తున్నారు. ప్రభుత్వం సరైన రీతిలో పర్యవేక్షణ చేయని కారణంగానే వ్యాపారులు ఇష్టారాజ్యంగా ధరలు పెంచేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

పొంతన లేని ధరలు..

గ్రేటర్ పరిధిలో అధికారుల పర్యవేక్షణలో లేకపోవడంతో హోల్‌సేల్ మార్కెట్‌లో బియ్యం ధరలకు, రిటైల్ ధరలకు పొంతన ఉండడం లేదు. గ్రేటర్ పరిధిలో 250 రైస్‌మిల్లర్లు ఉన్నట్లు తెలిసింది. ప్రతి సంవత్సరం ఒక్కో మిల్లర్ వద్ద 40 నుంచి 50 టన్నుల బియ్యం నిల్వలు పెరుగుతున్నట్టు పౌరసరఫరాల వద్ద లెక్కలు ఉన్నట్లు సమాచారం. గ్రేటర్‌లో రోజుకు 35 నుంచి 40 వేల క్వింటాళ్ల బియ్యం వినియోగం అవుతున్నట్టు అధికారుల అంచనా. బియ్యం వినియోగం కూడా రోజురోజుకూ పెరుగుతోంది. ప్రస్తుతం మిల్లర్ ధర క్వింటాల్‌కు రూ.3200 నుంచి రూ.3500 పలుకుతోంది. మార్కెట్‌కు చేరిన తర్వాత రిటైల్ వ్యాపారులు చెప్పిందే ధర. ప్రస్తుతం పాత సన్నబియ్యం ఫైన్ క్వాలిటీ క్వింటాల్‌కు రూ.6500 నుంచి రూ.7500 చేరింది.

ఉత్పత్తులు పెరిగినా..

రాష్ట్ర వ్యాప్తంగా ఈ సంవత్సరం వరిధాన్యం ఉత్పత్తులు భారీగా పెరిగాయి. ఖరీఫ్, రబీ సీజన్లలో కలిపి దాదాపు 80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ జరిగిందని ఇప్పటికే పౌరసరఫరాల శాఖ అధికారులు తెలిపారు. ప్రభుత్వం సేకరించిన బియ్యాన్ని మిల్లర్లకు అందజేశారు. ప్రస్తుతం మిల్లర్ల వద్ద భారీఎత్తున బియ్యం నిల్వలు ఉన్నాయి. గ్రేటర్ పరిధిలోని మిల్లర్ల వద్ద కూడా ప్రస్తుతం లక్షన్నర మెట్రిక్ టన్నులకు పైగానే బియ్యం నిల్వలు ఉన్నట్టు సమాచారం.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు అరగంటలో అందజేత



బాధితుడికి సెల్‌ఫోన్లను అందజేస్తున్న ఆసిఫ్‌నగర్ పోలీసు అధికారులు

విజయనగర్‌కాలనీ: ఫ్లిప్ కార్ట్ సంస్థ డెలివరీ బాయ్ పోగొట్టుకున్న 7 సెల్‌ఫోన్లను అరగంట వ్యవధిలో స్వాధీనం చేసుకొని బాధితుడికి పోలీసులు అందజేశారు. ఈ ఘటన ఆసిఫ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ జి.వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం..ఆసిఫ్‌నగర్ శ్యామ్ నగర్‌లో నివసించే జి.నరేష్ ఈకార్ట్–ఫ్లిప్‌కార్ట్ సంస్థలో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. విధుల్లో భాగంగా మంగళవారం ఉదయం 7 గంటలకు 16 సెల్‌ఫోన్లు డెలివరీ చేసేందుకు బయల్దేరాడు. మధ్యాహ్నం 12 గంటల వరకు 9 సెల్‌ఫోన్లు డెలివరీ చేశాడు. మిగతా 7 సెల్‌ఫోన్లు బ్యాగ్‌లో వేసుకుని ద్విచక్ర వాహనానికి తగిలించి మురాద్‌నగర్‌లో ఓ వస్తువును డెలివరీ చేయడానికి వెళ్లాడు. తిరిగి వచ్చి చూసేసరికి తన వాహనానికి ఉన్న బ్యాగ్ కనిపించలేదు. ఆందోళన చెందిన బాధితుడు వెంటనే ఆసిఫ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సమాచారం అందుకున్న పోలీసులు పరిసర ప్రాంతాల్లోని 10 సీసీటీవీ కెమెరాలను పరిశీలించి కనిపించకుండా పోయిన సెల్‌ఫోన్ బ్యాగ్‌ను అరగంట వ్యవధిలో బాధితుడికి అందజేశారు. కాగా వీటిని ఎవ్వరూ చోరీ చేయలేదని, బైకు నుంచి బ్యాగు జారిపోయిందని పోలీసులు గుర్తించారు. ఓ వ్యక్తి వాటిని భద్రపర్చగా స్వాధీనం చేసుకున్నారు. ఆసిఫ్‌నగర్ పోలీస్ డివిజన్ ఏసీపీ విజయ్ శ్రీనివాస్, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ పి.రఘునాథరావు తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ జిల్లాలో 616 మంది అభ్యర్థులకు నియామక పత్రాలు

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ జిల్లాలో ఉపాధ్యాయ పోస్టులకు 616 మంది అభ్యర్థులు ఎంపికయ్యారు. ఎంపికైన అభ్యర్థులకు బుధవారం ఎల్‌బీ స్టేడియంలో సీఎం రేవంత్ రెడ్డి చేతులు మీదుగా నియామక పత్రాలు అందజేస్తారు. ఇందుకు విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. హైదరాబాద్ జిల్లాలో మొత్తం 878 పోస్టులకు గాను 262 పోస్టులకు అభ్యర్థుల ఎంపిక పెండింగ్‌లో పడింది. ఉర్దూ మీడియంలో రిజర్వేషన్ కేటగిరిలో అభ్యర్థులు లేకపోవడంతో పోస్టులు పెండింగ్‌లో ఉంచినట్లు అధికారులు తెలిపారు. అదేవిధంగా ఇన్ సర్వీస్‌లో ఉండి సెలవులు పెట్టకుండానే బీఈడీ చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న సుమారు 8 మంది అభ్యర్థుల ఎంపిక పెండింగ్‌లో పడిపోయినట్లు తెలుస్తోంది.

సర్టిఫి'కేటుగాళ్లు'!

జిరాక్స్ సెంటర్ కేంద్రంగా నకిలీ ధ్రువపత్రాల తయారీ

- టెన్త్ నుంచి డిగ్రీ వరకు అన్ని బోర్డుల వాటికి రూపం
- అవసరాన్ని బట్టి ఒక్కో సర్టిఫికెట్ రూ.వేలల్లో విక్రయం
- వలపన్ని ఇద్దరిని పట్టుకున్న సౌత్ జోన్ టాస్క్‌ఫోర్స్

సాక్షి, సిటీబ్యూరో: టెన్త్ క్లాస్ రూ.10 వేలు..ఇంటర్మీడియట్ రూ.15 వేలు..డిగ్రీ రూ.20 వేలు..టెక్నికల్ ఎడ్యుకేషన్ రూ.25 వేలు..జిరాక్సు సెంటర్ కేంద్రంగా తయారు చేసిన నకిలీ విద్యార్హత పత్రాలను ఇలా రేటు కట్టి విక్రయిస్తున్న ముఠాకు సౌత్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు చెక్ చెప్పారు. ఇద్దరు నిందితులను అరెస్టు చేసి వీరి నుంచి భారీగా నకిలీ సర్టిఫికెట్లు స్వాధీనం చేసుకున్నట్లు అదనపు డీసీపీ అందె శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. మౌలాలీకి చెందిన మహ్మద్ మహఫూజ్ ఇక్బాల్ అంబర్‌పేట ఒవైసీ నగర్‌లో ఎంఎస్ ఎంటర్‌ప్రైజెస్ పేరుతో జిరాక్సు సెంటర్ నిర్వహిస్తున్నాడు. ఇందులోనే వివిధ రకాలైన ఆన్‌లైన్ సేవలను అందిస్తున్న ఇతగాడు కొన్నాళ్లుగా తీవ్రనష్టాలు చవి చూస్తున్నాడు. దీంతో తేలిగ్గా డబ్బు సంపాదించినే ఉద్దేశంతో నకిలీ సర్టిఫికెట్ల తయారీకి సిద్ధమయ్యాడు. తన స్నేహితుడైన ప్రేమ్‌నగర్ వాసి షేక్ ఇలియాస్ అహ్మద్‌తో కలిసి రంగంలోకి దిగాడు. ఇతగాడు నకిలీ సర్టిఫికెట్లు అవసరమైన వారిని తీసుకువస్తుండగా...ఇక్బాల్ తన జిరాక్సు సెంటర్‌లోనే ఫొటోషాప్ పరిజ్ఞానంతో వీటిని తయారు చేస్తున్నాడు. ఎదుటి వారి అవసరాన్ని బట్టి ఈ సర్టిఫికెట్లు అధిక ధరలకు విక్రయించి ఇద్దరూ సొమ్ము చేసుకుంటున్నారు. వీరి వ్యవహారంపై దక్షిణ మండల టాస్క్‌ఫోర్స్‌కు సమాచారం అందింది. ఇన్‌స్పెక్టర్ ఎస్.రాఘవేంద్ర నేతృత్వంలో ఎస్సైలు కె.నర్సింహులు, జి.ఆంజనేయులు, ఎస్.నవీన్ తమ బృందాలతో దాడి చేసి ఇద్దరు నిందితులను పట్టుకున్నారు. వీరి నుంచి 84 నకిలీ సర్టిఫికెట్లు, నాలుగు ఖాళీ సర్టిఫికెట్లతో పాటు కంప్యూటర్ తదితరాలు స్వాధీనం చేసుకున్నారు. తదుపరి చర్యల నిమిత్తం నిందితులను అంబర్‌పేట పోలీసులకు అప్పగించారు. వీరి నుంచి ఈ నకిలీ సర్టిఫికెట్లను ఎవరెవరు కొన్నారు? దేని కోసం వినియోగించారు? అనే అంశాల పైనా పోలీసులు దృష్టి పెట్టారు.



పట్టుబడిన నిందితులు

రాచకొండలో 27 మంది ఇన్‌స్పెక్టర్ల బదిలీ

సాక్షి, సిటీబ్యూరో: రాచకొండ పోలీసు కమిషనరేట్ పరిధిలో ఒకేసారి 27 మంది ఇన్‌స్పెక్టర్లు (సివిల్) బదిలీ అయ్యారు. ఈమేరకు పోలీసు కమిషనర్ జి.సుధీర్ బాబు ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీల వివరాలిలా ఉన్నాయి.

ఎస్‌ఐ పేరు	బదిలీ అయిన స్థానం
ఎం. సుధాకర్	బాలాపూర్ ఎస్‌హెచ్‌ఓ
ఎ.సూర్య నాయక్	నాగోల్ ఎస్‌హెచ్‌ఓ
ఎ.సుధీర్ కృష్ణ	సైబర్ క్రైమ్ పీఎస్
జి.వెంకటేశ్వర్ రావు	చైతన్యపురి ఎస్‌హెచ్‌ఓ
జి.వెంకటేశ్వర్లు	కుషాయిగూడ డీఐ
జి.నాగరాజు	సైబర్ క్రైమ్ పీఎస్
ఎస్.సైదయ్య	జవహర్‌నగర్ ఎస్‌హెచ్‌ఓ
ఎల్.కృష్ణంరాజు	హైదరాబాద్ గ్రీన్ ఫార్మా సిటీ ఎస్‌హెచ్‌ఓ
ఎ.నర్సింహారావు	మహేశ్వరం ట్రాఫిక్ పీఎస్
ఎం.ప్రభాకర్ రెడ్డి	బీబీనగర్ ఎస్‌హెచ్‌ఓ
ఎస్.చంద్రబాబు	భువనగిరి రూరల్ సర్కిల్
ఎ.మధు	మంచాల్ ఎస్‌హెచ్‌ఓ
పి.పరుశురాం	ఘట్‌కేసర్ ఎస్‌హెచ్‌ఓ
సీహెచ్. జితేందర్ రెడ్డి	పహాడిషరీఫ్ డీఐ
జి. నాగాచారి	సైబర్ క్రైమ్ పీఎస్
ఎం. ముని	ఉమెన్ సేఫ్టీ వింగ్
భూక్యా రాజేశ్	వనస్థలిపురం డీఐ
జి. కోటేశ్వర్ రావు	ఎస్‌బీ
డి. నాగేశ్వర రావు	ఎస్‌బీ
ఎస్. దేవేందర్	సీసీఎస్, ఎల్బీనగర్
ఎ.నందీశ్వర్ రెడ్డి	సీసీఎస్, మల్కాజిగిరి
టి.భూపతి	సీసీఎస్, భువనగిరి
ఆర్. బాబ్యానాయక్	ఉప్పల్ ట్రాఫిక్–2 పీఎస్
సోలోమాన్ రాజు	ఆత్మకూర్ ఎస్‌హెచ్‌ఓ
సీహెచ్. శ్రీనివాస రావు	వనస్థలిపురం ఎస్‌హెచ్‌ఓ
వై. రవీందర్	ఘట్‌కేసర్ ట్రాఫిక్ పీఎస్
వై. అశోక్ రెడ్డి	సైబర్ క్రైమ్

అప్పుడే పుట్టిన బిడ్డకు సీపీఆర్



కీసర: అప్పుడే పుట్టిన బిడ్డకు కీసర 108 సిబ్బంది సీపీఆర్ చేసి ప్రాణాలను కాపాడిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్లితే కీసర పరిధిలోని కుందనపల్లి గ్రామానికి చెందిన రమ్య పురిటి నొప్పులతో మంగళవారం సాయంత్రం 4 గంటలకు కీసరలోని ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చారు. కీసర ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు ఆమెను హాస్పిటల్‌లో చేర్చుకొని నార్మల్ డెలివరీ చేశారు. పుట్టిన బిడ్డలో కదలిక లేకపోవడంతో 108 సిబ్బందికి సమాచారం ఇచ్చారు. దీంతో అంబులెన్స్ సిబ్బంది చిత్రం రవి, పైలట్ రాంబాబు ఆస్పత్రికి చేరుకొని అప్పుడే పుట్టిన పాపను 108 అంబులెన్స్‌లోకి తీసుకొచ్చి అత్యవసర వైద్య పరీక్షలు నిర్వహించారు. అపస్మారక స్థితిలో ఉన్న పాపకు శ్వాస అందడం లేదని గుర్తించారు. వెంటనే అంబులెన్స్‌లో ఉన్న అంబుబాగ్‌ను ఉపయోగించి (కృత్రిమ శ్వాస యూనిట్) శ్వాసను అందిస్తూ.. సీపీఆర్ చేస్తూ తక్కువ సమయంలోనే నగరంలోని ఓ ఆసుపత్రికి తరలించారు. దీంతో పూర్తిస్థాయి చికిత్స పొంది పాప క్షేమంగా ఉంది. పాపను బతికించేందుకు తీవ్రంగా శ్రమించిన సిబ్బందికి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

కోడలు వరకట్నం కేసు పెట్టిందని...

ఒకే కుటుంబంలోని ముగ్గురి ఆత్మహత్యాయత్నం

రాంగోపాల్‌పేట్: భర్తతో పాటు అత్తా, మామలపైన కోడలు వరకట్న వేధింపుల కేసు నమోదు చేయించడంతో మనస్థాపం చెందిన ఓ కుటుంబంలోని ముగ్గురు ట్యాబ్లెట్లు, ఇంజక్షన్ తీసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ ఘటన మహంకాళి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం నాగోల్‌కు చెందిన తోట భావనారాయణ (52), పద్మావతి (47) భార్యాభర్తలు, వీరి కుమారుడు సుజన్ (23). భావనారాయణ, సుజన్‌లు ప్రైవేటు కంపెనీలో మార్కెటింగ్ విభాగంలో పనిచేస్తుండగా పద్మావతి గృహిణి. సుజన్(23)కు కొత్తగూడెం చుంచుపల్లి ప్రాంతానికి చెందిన కావ్యశ్రీతో ఇదే ఏడాది ఫిబ్రవరి 14వ తేదీన వివాహం చేశారు. వివాహం జరిగిన కొద్ది రోజులకే భార్యాభర్తల మధ్య గొడవలు మొదలయ్యాయి. దీంతో కావ్యశ్రీ ఇటీవల చుంచుపల్లి పోలీస్ స్టేషన్లో వరకట్న వేధింపుల కేసు నమోదు చేయించింది. చుంచుపల్లి పోలీసులు సుజన్‌కు ఫోన్ చేసి తల్లిదండ్రులతో పాటు కౌన్సిలింగ్ కోసం రావాలని ఇటీవల కోరగా రెండు మూడు రోజులు టైం అడిగారు. మంగళవారం ఉదయం పోలీస్ స్టేషన్‌కు రావాలని మరోమారు పోలీసులు సూచించారు. దీంతో ఈ నెల 5వ తేదీ ఉదయం ఆన్‌లైన్ ద్వారా సికింద్రాబాద్ ప్రాంతంలోని తాజ్ ట్రిస్టార్ హోటల్ మూడవ అంతస్తులోని 308 గదిని బుక్ చేసుకుని ముగ్గురు అక్కడ దిగారు. సోమవారం రాత్రి కోడలు కావ్యశ్రీకి ఫోన్ చేసి కేసు విత్‌డ్రా చేసుకోవాలని, లేకపోతే తాము కుటుంబంతో సహా ఆత్మహత్య చేసికుంటామని చెప్పారు. ఆ తర్వాత వారి మధ్య సంభాషణ ఏమి జరిగిందో తెలియదు కానీ..మంగళవారం ముగ్గురు డైజోఫాం ట్యాబ్లెట్లు, షుగర్‌కు వాడే ఇన్సులిన్ ఎక్కువ మోతాదులో తీసుకున్నారు. ఉదయం 10.30 గంటల వరకు వీరి గది తలుపులు తెరవకపోవడంతో పాటు హోటల్ సిబ్బంది తలుపు కొట్టినా ఎలాంటి స్పందన రాలేదు. దీంతో మరో తాళం చెవితో తాళం తెరిచి చూడగా ముగ్గురు అపస్మారక స్థితిలో ఉన్నారు. దీంతో వెంటనే మహంకాళి పోలీసులకు సమాచారం అందించి వారిని యశోద ఆస్పత్రికి తరలించారు. ఆ తర్వాత పద్మావతి సోదరి అక్కడికి చేరుకుని ఆర్థిక పరిస్థితి బాగాలేదని గాంధీకి తీసుకుని వెళ్లారు. ప్రస్తుతం వారి ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉందని, ఇప్పటికిప్పుడు ఏమీ చెప్పలేమని వెల్లడించారు. మహంకాళి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చైన్ స్నాచర్‌కు దేహశుద్ధి

వెంగళరావునగర్ : చైన్‌స్నాచర్‌కు దేహశుద్ధి చేసిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. ఏపీలోని పొన్నూరు ప్రాంతానికి నాగసాయి లహరి ఎల్లారెడ్డిగూడలో నివాసం ఉంటూ అమీర్‌పేటలో ప్రైవేట్ ఉద్యోగం చేస్తుంది. మంగళవారం ఉద్యోగానికి వెళుతుండగా వెనుక నుంచి వచ్చిన గుర్తు తెలియని వ్యక్తి ఆమె మెడలోని బంగారు చైన్ లాక్కుని పారిపోవడానికి ప్రయత్నించాడు. ఆమె కేకలు వేయగా స్థానికులు అతనిని పట్టుకుని దేహశుద్ధి చేసి మధురానగర్ పీఎస్‌లో అప్పగించారు.

అంతర్రాష్ట్ర 'ధార్' ముఠాలకు చెక్

- రెండేళ్లుగా రాత్రి సమయంలో 35 ఇళ్లలో చోరీ
- 2 కిలోల బంగారం, 10 కిలోల వెండి, రూ.8.5 లక్షల నగదు కొల్లగొట్టిన వైనం
- రెండు గ్యాంగ్‌లను అరెస్ట్ చేసిన సీసీఎస్ పోలీసులు
- 6 కత్తులు, సెల్‌ఫోన్లు స్వాధీనం
- సొత్తు రికవరీ కోసం యాక్షన్ ప్లాన్



వివరాలను వెల్లడిస్తున్న సైబరాబాద్ క్రైమ్స్ డీసీపీ నర్సింహ, రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్

గచ్చిబౌలి: చోరీ సమయంలో అడ్డు వస్తే అంతమొందించే కరుడుగట్టిన రెండు అంతర్రాష్ట్ర ముఠాలను సీసీఎస్ మియాపూర్, సీసీఎస్ బాలానగర్ పోలీసులు అరెస్ట్ చేశారని సైబరాబాద్ క్రైమ్స్ డీసీపీ నర్సింహ తెలిపారు. మంగళవారం మాదాపూర్ డీసీపీ కార్యాలయంలో రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్‌తో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన కేసు వివరాలను వెల్లడించారు. ఇటీవల రాత్రి ఇళ్లలో చోరీ కేసులు జరిగిన నేపథ్యంలో సీసీఎస్ పోలీసులు స్థానిక పోలీసులతో కలిసి పలు చోట్ల నిఘా ఉంచారని పేర్కొన్నారు. ఈ క్రమంలో మియాపూర్ పీఎస్ పరిధిలోని మక్తాలో అనుమానాస్పదంగా తిరుగుతున్న మధ్యప్రదేశ్ ధార్ జిల్లా కనియంబాకు చెందిన కరన్ మనోహర్ బాబర్, ప్యార్ సింగ్ బహలా, దేబేంద్ర బహలాను అదుపులోకి తీసుకున్నారు. సోదా చేయగా వారి వద్ద పదునైన కత్తులు, కట్టర్లు, రాడ్లు లభించాయి. కరణ్ మనోహర్ నాయకత్వంలో ఇళ్లలో చోరీలు చేసినట్లు అంగీకరించారు. మరో ముగ్గురు పరారీలో ఉన్నారు. పేట్‌బషీరాబాద్ పీఎస్ పరిధిలో గుండ్లపోచంపల్లిలో అనుమానాస్పదంగా తిరుగుతున్న ధార్ జిల్లా కనియంబాకు చెందిన కడక్ సింగ్, ఠాకేర్ ఎడియా, కుమన్ ఎడియాలను అదుపులోకి తీసుకొని విచారించగా రాత్రి సమయంలో ఇళ్లలో చోరీలు చేసినట్లు అంగీకరించారు. మరో ముగ్గురు నిందితులు పరారైనట్లు తెలిపారు. సైబరాబాద్‌లో 17, రాచకొండలో 9, మెదక్ 4, సంగారెడ్డి 5, నల్గొండ జిల్లాలో 1 కేసులో నిందితులుగా ఉన్నారు. నిందితుల నుంచి 6 కత్తులు, చోరీకి ఉపయోగించే రెండు సెట్ల పనిముట్లు, 4 సెల్ ఫోన్లు, రూ.11.500 నగదు స్వాధీనం చేసుకున్నారు.

రికవరీ కోసం యాక్షన్ ప్లాన్

35 చోరీ కేసుల్లో రెండు కిలోల బంగారం, 10 కిలోల వెండి, రూ.8.5 లక్షల నగదు కొల్లగొట్టారని డీసీపీ నర్సింహ్మా తెలిపారు. పరారీలో ఉన్న ఆరుగురు నిందితులను అరెస్ట్ చేయడం, సొత్తును రికవరీ చేసేందుకు యాక్షన్ ప్లాన్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు.

కుల దైవానికి పూజలు చేసి..

ధార్ జిల్లాలోని అటవీ ప్రాంతాలలో నివసించే ముఠా సభ్యులైన గిరిజనులు చోరీలో భారీ మొత్తంలో సొత్తు, నగదు దక్కాలని తమ ఇష్ట దైవానికి పూజలు చేస్తారు. అనంతరం ఆటోలో ఇండోర్ నగరానికి వచ్చి అక్కడి నుంచి ప్రైవేట్ ట్రావెల్స్‌లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు వస్తారు. గేటెడ్ కమ్యూనిటీలు, ధనవంతులు నివాసం ఉండే ప్రాంతాలను ఎంచుకొని పగలు రెక్కీ నిర్వహిస్తారు. తాళం వేసి ఉన్న ఇళ్లను ఎంచుకొని పరిసరాలలోని చెట్ల పొదల్లో దాక్కుంటారు. రాత్రి 1 గంట నుంచి తెల్లవారు జామున 4 గంటల వరకు ఇళ్లలో చోరీచేసి ఉడాయిస్తారు. ప్రతి వ్యక్తి వద్ద పదునైన కత్తి, రాడ్లు, ఇతర సామాగ్రి ఉంటుంది. ఎవరైనా అడ్డుకోవడానికి, లేదా ప్రతిఘటించేందుకు ప్రయత్నిస్తే చంపేందుకు వెనకాడరు. కొల్లగొట్టిన సొత్తును ఇండోర్‌లో నమ్మకమైన రిసీవర్లకు సొత్తును విక్రయిస్తారు. వచ్చిన డబ్బుతో వ్యవసాయం చేయడంతో పాటు విలాసవంతంగా గడుపుతారు. సొత్తు కొనుగోలు చేసిన రిసీవర్లను గుర్తించాల్సి ఉంది. ఈ సమావేశంలో మాదాపూర్ ఏడీసీపీ జయరాం, ఏసీపీలు నర్సింహ్మారావు, శశాంక్ రెడ్డి, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్లు వినాయక రెడ్డి, అక్రం బాబా, సీహెచ్ రాజు తదితరులు ఉన్నారు.

నయనానందకరం







బతుకమ్మ ఉత్సవాలను పురస్కరించుకొని తెలంగాణ సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో యువ కళోత్సవం పేరిట రవీంద్రభారతిలో నిర్వహించిన నృత్య ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. మంగళవారం కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కార గ్రహీత డాక్టర్ ఆనందశంకర్ జయంతి, కూచిపూడి నృత్య గురువు దీపికారెడ్డి, కథక్ నృత్యకారులు రాఘవరాజ్ భట్, నాట్యగురువు కళాకృష్ణల శిష్య బృందాలు వివిధ అంశాలపై చేసిన నృత్యాలు అలరించాయి. – గన్‌ఫౌండ్రీ

శ్రీ ప్రత్యంగిరా దేవికి బంగారు మంగళసూత్రాలు

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురంలోని కుర్తాళం పీఠం వారాహీ సమేత శ్రీ ప్రత్యంగిరా పరమేశ్వరి దేవాలయంలో దేవీ శరన్నవరాత్రుల సందర్భంగా మంగళవారం అమ్మవారు శ్రీ మహా సరస్వతీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కాగా నగరానికి చెందిన డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ లీలా సరస్వతీ దంపతులు అమ్మవారికి బంగారు మంగళ సూత్రాలు సమర్పించారు. ఉదయం అమ్మవారికి 18 రకాల విశేష అభిషేకాలు, సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలకు పుస్తకాలు, పెన్నులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సెక్రెటరీ మునిపల్లె శ్రీనివాస్, విఠల్ శర్మ, సువర్ణలత, హేమంత్‌శర్మ, రామ శర్మ, నిఖిల్ వర్మ, శ్రీపతి, అశ్వంత్, అరుణ పాల్గొన్నారు..



డాక్టర్ రాజశేఖర్ దంపతులకు జ్ఞాపికను అందజేస్తున్న ఆలయ సెక్రటరీ మునిపల్లె శ్రీనివాస్ దంపతులు



అమ్మవారికి అందించిన బంగారు మంగళసూత్రాలు

రెండు కేసులు.. రూ.21 లక్షలు!

పదిలంగా వెనక్కి ఇప్పించిన సిటీ సైబర్ కాప్స్

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు 'గోల్డెన్ అవర్'లో తమ దృష్టికి వచ్చిన నేరాల్లో బాధితులకు సత్వర న్యాయం చేస్తున్నారు. వీరి కృషి ఫలితంగా రూ.21,55,331 కోల్పోయిన ఇద్దరు బాధితులకు ఆ మొత్తం పదిలంగా వెనక్కు వచ్చింది. న్యాయస్థానం అనుమతితో నగదు మంగళవారం బాధితులకు చేర్చినట్లు డీసీపీ దార కవిత పేర్కొన్నారు. ఈ కేసుల్లో బాధితులు ఇద్దరూ వృద్ధులు కావడం, జీవిత చరమాంకంలో తమకోసం దాచుకున్న మొత్తం సైబర్ నేరగాళ్ల పాలు కావడంతో తీవ్ర ఆందోళన పడ్డారు. అయితే సైబర్ క్రైమ్ పోలీసుల చొరవతో ఆ మొత్తం వారికి తిరిగి వచ్చింది. నగరానికి చెందిన ఓ వృద్ధుడికి ట్రాయ్, సీబీఐ అధికారుల పేరుతో సైబర్ నేరగాళ్లు ఫోన్ చేశారు. ఆయన్ను తీవ్రంగా భయపెట్టి, రూ.8,05,331 కాజేశారు. మరో వృద్ధుడికి ఫోన్ చేసిన సైబర్ నేరగాళ్లు నువామా సెక్యూరిటీలో పెట్టుబడుల పేరుతో ఎర వేశారు. తొలుత లాభాలు చూపించి ఆపై భారీ మొత్తం ఇన్వెస్ట్ చేయించుకున్నారు. అలా దఫదఫాలుగా రూ.13.5 లక్షలు కాజేసి మోసం చేశారు. వీరి నుంచి ఫిర్యాదులు వచ్చిన వెంటనే స్పందించిన సైబర్ క్రైమ్ పోలీసులు బ్యాంకు అధికారులను సంప్రదించి నేరగాళ్ల ఖాతాలు ఫ్రీజ్ చేయించారు. ఈ విషయాన్ని న్యాయస్థానం దృష్టికి తీసుకువెళ్లిన అధికారులు ఫ్రీజ్ అయిన మొత్తం బాధితులకు అందించడానికి అనుమతి కోరారు. ఆ ప్రక్రియలు పూర్తి చేసిన తర్వాత నిర్ణీత మొత్తాలను బాధితుల ఖాతాలకు బదిలీ చేయించారు.

ట్రెండ్‌కు తగినట్టు కోర్సులు ఎంచుకుంటేనే భవిష్యత్తు

సింఘానియా వర్సిటీ వైస్ చాన్సలర్ పృథ్వీ యాదవ్


కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న పృథ్వీ యాదవ్

శ్రీనగర్ కాలనీ: ప్రపంచవ్యాప్తంగా ప్రస్తుత ట్రెండ్ పరిస్థితులకు అనుగుణంగా విద్యావ్యవస్థలో మార్పులు రోజురోజుకూ చోటుచేసుకుంటున్నాయని ట్రెండ్‌కి తగినట్లు సరైన కోర్సులను ఎంచుకొని ముందుకు సాగేవారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని రాజస్థాన్ ఉదయపూర్‌కు చెందిన సర్ పడంపట్ సింఘానియా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ పృథ్వీ యాదవ్ అన్నారు. మంగళవారం అమీర్‌పేట్ ఎంపీఎంమాల్‌లో యూనివర్సిటీ సౌత్ ఇండియన్ రీజినల్ కార్యాలయాన్ని ఆయన అడ్మిన్ డైరెక్టర్ అలుగాని సంజీవతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి, ఇంటర్మీడియట్లలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు ఉత్తమమైన ఉపకార వేతనాలు అందించి విభిన్న రకాల కోర్సులను అందిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం అన్ని వర్సిటీలలో కాంబినేషన్ కోర్సులకు మంచి డిమాండ్ ఉందని అన్నారు. ప్రత్యేకంగా డేటా సైన్స్, ఐటీ, సైబర్ సెక్యూరిటీ, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్ కోర్సులలో విద్యార్థులు చేరేందుకు ఎక్కువగా ఆసక్తి చూపిస్తున్నారన్నారు. ప్రస్తుతం కొన్ని కంపెనీలు వారి ఉత్పత్తులకు సంబంధించిన కోర్సులను ప్రకటిస్తూ ఆ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు వారి సంస్థలోని ఉపాధి అవకాశాలు కూడా కల్పిస్తుండడం అభినందనీయమని అన్నారు. తమ విశ్వవిద్యాలయంలో వచ్చే విద్యా సంవత్సరం నుంచి పెయింట్ టెక్నాలజీని కూడా పరిచయం చేస్తునట్టు వెల్లడించారు.

మానసిక దివ్యాంగులపై ఆదరణ చూపించాలి


మెంటర్ హెల్త్ అవేర్‌నెస్ వీక్‌లో వెస్ట్‌జోన్ పోలీసులు

శ్రీనగర్‌కాలనీ: మానసిక దివ్యాంగుల పట్ల ఆదరణ చూపించాలని వెస్ట్‌జోన్ ఏసీపీ వెంకటరమణ అన్నారు. మంగళవారం మానసిక ఆసుపత్రిలో వరల్డ్ మెంటల్ హెల్త్ అవేర్‌నెస్ వీక్ కార్యక్రమంలో భాగంగా వెస్ట్‌జోన్ ఏసీపీ వెంకటరమణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మానసిక దివ్యాంగులకు ఉండే చట్టాలను వివరించారు. అనంతరం ఎర్రగడ్డ మానసిక ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనిత రాయిరాల మాట్లాడుతూ ఈనెల 10 వరకూ అవేర్‌నెస్ వీక్‌కు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుధారాణి, ఆర్ ఎంఓ ఫణికాంత్, డాక్టర్ పద్మజ, డాక్టర్ విశ్వాస్, డాక్టర్ ఓమేష్, డాక్టర్ రఘువీర్, డాక్టర్ రమేష్, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఓపెన్ జిమ్ నిర్వహణ గాలికి..!

విరిగిపోయి మూలనపడ్డ పరికరాలు


కేబీఆర్ జీహెచ్ఎంసీ వాక్‌వేలో విరిగిపోయిన జిమ్ పరికరాలు

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కును ఆనుకుని ఉన్న జీహెచ్ఎంసీ వాక్‌వేలో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ పరికరాలు అధికారుల నిర్వహణ లేక విరిగిపోయి మూలనపడ్డాయి. ఐదేళ్ల క్రితం వాక్‌వేలో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేశారు. అయితే అధికారులు దాని నిర్వహణను పట్టించుకోకపోవడంతో కొన్ని పరికరాలు పనికిరాకుండాపోయాయి. రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో 200 మందికి పైగా ఈ ఓపెన్ జిమ్‌లో కసరత్తు చేస్తుంటారు. అయితే కొత్త జిమ్ ఏర్పాటు చేయడం మాట అటుంచితే, ఉన్న జిమ్‌లో సౌకర్యాలు కల్పించడం లేదని పలువురు వాకర్లు వాపోతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ వాక్‌వేలో రోజూ వాకింగ్‌కు వస్తున్నా ఓపెన్ జిమ్‌లో విరిగిపోయిన పరికరాలు మాత్రం వీరికి కనిపించడం లేదా అని వాకర్లు ప్రశ్నిస్తున్నారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్లను సందర్శించిన అధికారులు


బాధితులతో మాట్లాడుతున్న అధికారులు

రహమత్‌నగర్: మూసీ నది పరీవాహక ప్రాంతాలకు చెందిన వారికి ఇళ్లు కేటాయించాలన్న ప్రభుత్వ నిర్ణయం మేరకు కమలానగర్ డబుల్ బెడ్‌రూం నివాసాలకు జీహెచ్ఎంసీ అధికారులు మంగళవారం సందర్శించారు. జీహెచ్ఎంసీ సర్కిల్–19 డీఎంసీ జకీయా సుల్తానా, ప్రాజెక్ట్ ఆఫీసర్ వెంకటకృష్ణతో పాటు ఇతర అధికారులు డబుల్ నివాసాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఇళ్లు రాని బాధితులు తమకు కేటాయించిన తరువాతే మిగతా వారికి కేటాయించాలని అధికారులను కోరారు. అయితే తాము నివేదికలు మాత్రమే రూపొందించి ఉన్నతాధికారులకు పంపించడం జరుగుతుందని, ఇళ్ల కేటాయింపులు తమ పరిధిలో లేదని అధికారులు స్పష్టం చేశారు.

తెలంగాణలో బీజేపీని బలోపేతం చేస్తాం

బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్


సభ్యత్వాలు ఇస్తున్న చంద్రశేఖర్, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

బంజారాహిల్స్: తెలంగాణలో బీజేపీని బలోపేతం చేస్తామని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ అన్నారు. బంజారాహిల్స్ డివిజన్ ఎన్‌బీటీనగర్ బూత్‌నెంబర్ 235, 239లలో మంగళవారం బీజేపీ సభ్యత్వ నమోదు నిర్వహించారు. బంజారాహిల్స్ డివిజన్ అధ్యక్షులు వినయ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డిలు హాజరై పలువురికి సభ్యత్వాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణలో బీజేపీ మరింత శక్తివంతం చేసే సంకల్పంతో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుని ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షులు గౌతమ్‌రావు, నేతలు మేచినేని శ్రీనివాస్, బద్దం మహిపాల్‌రెడ్డి, పల్లె వీణారెడ్డి, వెంకట్‌రెడ్డి, కృష్ణవేణి, వెంకట్‌రెడ్డి, కృష్ణవేణి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

దీర్ఘకాలిక సమస్యలకు త్వరలోనే పరిష్కారం

జలమండలి జీఎం హరిశంకర్


బస్తీవాసులతో మాట్లాడుతున్న జలమండలి జీఎం హరి శంకర్

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్ బస్తీల్లో సుదీర్ఘకాలంగా పరిష్కారం కానీ సీవరేజీ, మంచి నీటి సమస్యలను త్వరలోనే పరిష్కరించబోతున్నట్లు జలమండలి జీఎం హరిశంకర్ తెలిపారు. మంగళవారం ఆయన ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆదేశాల మేరకు ఫిలింనగర్‌లోని మాగంటి కాలనీ, భగత్‌సింగ్ కాలనీ, గౌతంనగర్, బాల్‌రెడ్డినగర్‌తో పాటు జూబ్లీహిల్స్ రోడ్‌నెం. 46 అంబేడ్కర్‌నగర్ బస్తీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా బస్తీల్లో పరిష్కారం కాని సమస్యలకు సీవరేజీ, మంచినీటి పైప్‌లైన్ల సామర్థ్య పెంపుతో పాటు నూతన లైన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు త్వరలోనే వాటిని పరిష్కరిస్తామని ఆయన బస్తీ వాసులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 18 బస్తీల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మామిడి నర్సింగ్ రావు, కాంగ్రెస్ నేత కాటూరి రమేష్, ఆకుల రాజు, లక్ష్మయ్య, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సవాహ్నిక బ్రహ్మోత్సవాలు

సర్వభూపాల వాహనంపై ఊరేగిన శ్రీవారు



వెంకటేశ్వరకాలనీ: శ్రీనగర్‌కాలనీ వేంకటేశ్వర స్వామి నవాహ్నిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. వేడుకల్లో భాగంగా మంగళవారం స్వామివారిని ఉదయం సర్వభూపాల వాహనంలో, సాయంత్రం గజవాహనంలో ఊరేగించారు. మేళతాళాల మధ్య జరిగిన ఈ ఊరేగింపు ఉత్సవంలో భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. గజవాహన సేవ అనంతరం నిర్వహించిన స్వామివారి ఎదుర్కోళ్ళ ఉత్సవం వేడుకగా జరిగింది.


రాజరాజేశ్వరి దేవి అలంకారంలో పెద్దమ్మతల్లి


స్కందమాతగా శ్రీనగర్ కాలనీలోని శ్రీ భ్రమరాంబికా దేవి


శ్రీ మహాలక్ష్మి దేవిగా దైవసన్నిధానంలోని రాజరాజేశ్వరి దేవి


మహాలక్ష్మి దేవిగా మాగంటి కాలనీలోని విజయ కనకదుర్గా దేవి


లక్ష్మీ దేవి అలంకారంలో బంజారాహిల్స్‌లోని కనకదుర్గా దేవి

అమ్మవారి దర్శనం.. భక్తుల పరవశం..!

- వివిధ రూపాల్లో భక్తులకు అమ్మవారి దర్శనం
- ఆలయాల్లో వైభవంగా కొనసాగుతున్న నవరాత్రి ఉత్సవాలు


ఇందిరానగర్ నల్లపోచమ్మ ఆలయంలో చండీ హోమంలో పి. విజయారెడ్డి


హోమంలో భక్తులు...

బంజారాహిల్స్: దసరా నవరాత్రి ఉత్సవాల్లో అమ్మవారి ఆలయల్లో వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం ఆలయాల్లో అమ్మవారి అలంకారాలను దర్శించుకుని, సామూహిక కుంకుమార్చన పూజల్లో పాల్గొనేందుకు ఆయా ఆలయాల్లో భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. స్కందమాతగా శ్రీనగర్‌కాలనీ భ్రమరాంబికా దేవి అమ్మవారు దర్శనమివ్వగా, మహాలక్ష్మి దేవిగా దైవసన్నిదానం రాజరాజేశ్వరి దేవి, శ్రీ మహాలక్ష్మిగా బంజారాహిల్స్ కనకదుర్గా దేవి, మాగంటి కాలనీ విజయ కనకదుర్గా దేవిగా అమ్మవార్లు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారిని ఆయా ఆలయాల్లో కరెన్సీ నోట్లతో అలంకరించారు. బంజారాహిల్స్ రోడ్ నెం. 2లోని ఇందిరానగర్ బస్తీలో నల్లపోచమ్మ ఆలయంలో నిర్వహించిన చండీహోమం వైభవంగా జరిగింది. ఈ పూజా వేడుకల్లో టీపీసీసీ కార్యదర్శి పి. విజయారెడ్డి, స్థానిక నేతలు మోహన్ యాదవ్, బాబా గౌడ్ తదితరులు పాల్గొన్నారు. పూర్ణాహుతి వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రాజరాజేశ్వరీ దేవిగా జూబ్లీహిల్స్ పెద్దమ్మతల్లి

జూబ్లీహిల్స్ పెద్దమ్మతల్లి శ్రీ రాజరాజేశ్వరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చింది. నగర నలుమూలల నుంచి భక్తులు ఆలయానికి తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి వేకువజామునే అభిషేకం, అర్చన, ప్రత్యేక పూజాధికాలు నిర్వహించారు.


సీతారామ దేవాలయంలో మహాలక్ష్మీ అలంకారంలో శ్రీపర్వతవర్ధిని అమ్మవారు


కుంకుమార్చన సేవలో మహిళలు


అమ్మవారి పూజల్లో మహిళా గ్రూపు అధ్యక్షురాలు ముప్పిడి అనూష దంపతులు


దేవీ శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా జూబ్లీహిల్స్‌లోని సీతారామ స్వామి ఆలయంలో మంగళవారం శివపార్వతులను వైభవంగా ఊరేగించారు. అనంతరం ఆలయంలో కుంకుమార్చన పూజలు ఘనంగా నిర్వహించారు. – బంజారాహిల్స్

యువతి అదృశ్యం

వెంగళరావునగర్: కుమార్తె అదృశ్యమైందని తండ్రి మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... రహమత్‌నగర్‌లో నివాసం ఉండే మహ్మద్ ఇజాజ్ ఆలీ ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 7వ తేదీన ఇంట్లో ఎవరూ లేని సమయంలో అతడి కుమార్తె ఇంట్లో ఉన్న రూ.35 వేలు తీసుకుని ఎవరికీ చెప్పకుండా వెళ్ళిపోయింది. ఆమె తరచూ పక్కింట్లో నివాసం ఉండే ఆరీఫ్ అనే యువకుడితో ఫోన్‌లో మాట్లాడుతుండేది. కాగా యువతి కనిపించకుండా పోయిన నాటి నుంచి ఇద్దరికీ ఫోన్లు చేయగా ఇరువురి ఫోన్లు స్విచ్ఛాఫ్ వస్తున్నాయి. దీంతో తన కుమార్తెను ఆరీఫ్ తీసుకెళ్ళాడని అనుమానిస్తూ ఇజాజ్ మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నవరాత్రుల్లో నృత్యకళ

వివిధ బృందాల ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు



బంజారాహిల్స్: దేవీ నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా అమ్మవారి సన్నిధిలో కళాకారులు నృత్య ప్రదర్శన చేస్తూ ఆధ్యాత్మికతను పంచుతున్నారు. అమ్మవారి మండపాల వద్ద చేస్తున్న భరతనాట్యం, కూచిపూడి విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. జూబ్లీహిల్స్‌లోని సీతారామస్వామి ఆలయంలో ప్రతి రోజూ సాయంత్రం 6 నుంచి నృత్య కార్యక్రమాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే అనూష శ్రీనివాస్‌చే కూచిపూడి, మాయ డ్యాన్స్ కంపెనీ వారి భరతనాట్యం, సంజన సిరిపురం వారి కూచిపూడి నృత్యం, శంకరానంద కళాక్షేత్ర బృందం, ఐశ్వర్యవల్లిచే భరతనాట్యం, టెంపుల్ డ్యాన్స్ స్ట్రీట్‌చే కూచిపూడి, సురేంద్రనాథ్ శిష్యులచే కూచిపూడి, అదితిరావు అష్టపుత్రే భరతనాట్యం ఇలా ప్రతిరోజూ కళాకారులు నృత్యాలతో అమ్మవారి సన్నిధి కళకళలాడుతోంది. నృత్య కార్యక్రమాలు తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేస్తున్నారు. ఆలయంలో కొలువుదీరిన పర్వతవర్ధిని దేవి రోజుకొక అలంకారంలో భక్తులకు దర్శనమిస్తుండగా అమ్మవారి సన్నిధిలో ఆధ్యాత్మిక నృత్యాలు మరింత ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఆలయ నిర్వాహకులు చక్కని ఏర్పాట్లు చేయడంతో కళాకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డునెంబర్-45లో ట్రాఫిక్‌పై సమీక్ష


ట్రాఫిక్ పరిస్థితిని సమీక్షిస్తున్న ట్రాఫిక్ అదనపు కమిషనర్ విశ్వప్రసాద్

బంజారాహిల్స్: దేవీ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా జూబ్లీహిల్స్ శ్రీపెద్దమ్మ తల్లి దేవాలయానికి రోజురోజుకు భక్తులు పోటెత్తుండడంతో ట్రాఫిక్ సమస్యపై పోలీసులు దృష్టిపెట్టారు. ఈ మేరకు ట్రాఫిక్ అడిషనల్ కమిషనర్ విశ్వప్రసాద్, డీసీపీ రాహుల్ హెగ్డే, వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరిప్రసాద్, జూబ్లీహిల్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ తదితరులు జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్–45 ఫ్లైఓవర్ కింద మంగోలియా బేకరీ చౌరస్తా నుంచి ట్రాఫిక్‌ను పరిశీలించారు. పెద్దమ్మ గుడికి వెళ్లే వాహనదారులు కేబుల్ బ్రిడ్జి నుంచి సర్వీసు రోడ్డులోకి తీసుకుని రోడ్డునెంబర్–45 మీదుగా హార్ట్‌కప్ చౌరస్తా నుంచి కూడా పెద్దమ్మ గుడికి వెళ్ల వచ్చన్నారు. ఈ మేరకు వాహనదారులను అప్రమత్తం చేస్తూ సిగ్నల్స్ ఏర్పాటు చేశారు. హార్ట్‌కప్ చౌరస్తాలో ఇప్పటి వరకు వన్‌వే ఉండగా గత మూడు రోజుల నుంచి తొలగించడం జరిగిందన్నారు. పెద్దమ్మ గుడికి వచ్చే భక్తుల వాహనాలు ట్రాఫిక్‌లో చిక్కుకోకుండా కొంత మేరనా ట్రాఫిక్ తగ్గించే ప్రయత్నంలో భాగంగా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. రోడ్డునెంబర్–45 ఫ్లైఓవర్ మీదుగా ముందుకువచ్చి పెద్దమ్మ గుడికి వెళ్లే వాహనదారులకు ట్రాఫిక్ దిగ్బంధం నుంచి గత ఊరట కలిగించే దిశలో ఈ చర్యలకు ఉపక్రమించారు.

ఆపరేషన్ 'కగార్'ను వెంటనే నిలిపివేయాలి

సమావేశంలో ప్రొఫెసర్ హరగోపాల్

కాచిగూడ: ఆదివాసీలను నిర్మూలించడానికి చేపట్టిన ఆపరేషన్ కగార్‌ను నిలిపి వేయాలని ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక ప్రతినిధి ప్రొఫెసర్ హరగోపాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అటవీ ఖనిజ సంపదను కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేయడానికి కేంద్ర పాలకులు రూపొందించిన అభివృద్ధి నమూనాను పునర్ పరిశీలించాలని అన్నారు. ఖనిజ అటవీ సంపదను పరిరక్షించడానికి రాజ్యాంగబద్ధంగా వ్యవహరించాలని సూచించారు. కేంద్ర పాలకులు చట్టాలను తమ చేతుల్లోకి తీసుకుని ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ ఆదివాసీలను అడవుల నుంచి తరిమివేయడానికి కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ఛత్తీస్‌ఘఢ్ అబూజ్‌మడ్‌లోని తెల్తులి – నెండూర్ వద్ద ఈ నెల 4వ తేదీన జరిగిన ఆదివాసీ హత్యాకాండ రాజ్యాంగ మానవ హక్కులకు వ్యతిరేకమని, ఈ ఘటనపై సమగ్ర న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ మాట్లాడుతూ బూటకపు ఎన్‌కౌంటర్లను నిరసిస్తూ నవంబర్ 3వ తేదీన ఇందిరాపార్కు వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫాణి, సాగర్, ప్రొఫెసర్ అన్వర్‌ఖాన్, నారాయణరావు, బల్లా రవీంద్రనాథ్, చంద్రమౌళి, జాన్, ఎం. సుదర్శన్, కె.గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు ప్రాధాన్యం ఇవ్వాలి

లిబర్టీ: ప్రభుత్వ పదవుల నియామకాల్లో బీసీలకు ప్రాధాన్యం ఇవ్వాలని బీసీ దళ్ జాతీయ అధ్యక్షులు దుండ్ర కుమారస్వామి కోరారు. బీసీల జనాభాకు అనుగుణంగా నియామకాల్లో సముచిత స్థానం కల్పించి న్యాయం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విన్నవించారు. మంగళవారం జరిగిన విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం ఇప్పటికే టీపీసీసీ అధ్యక్షుడిగా బి.మహేష్‌కుమార్‌గౌడ్‌కు ఇచ్చి బీసీలను గౌరవించిందని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వ పరిధిలో కార్పొరేషన్ల చైర్మన్లను నియమించిందని ఆయన గుర్తు చేశారు. ఇంకా అనేక కార్పొరేషన్లలో ఖాళీలు ఉన్నాయని వాటిలో బీసీలకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.

కార్పొరేటర్ ఫోన్ చేస్తున్నా స్పందించరా..?

జలమండలి అధికారులపై కార్పొరేటర్ ఫైర్


ఫోన్‌లో జలమండలి అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ కవిత

వెంకటేశ్వరకాలనీ: ఒక సమస్యపై ఎన్నిసార్లు ఫిర్యాదు చేయాలి... కార్పొరేటర్‌గా ప్రజా సమస్యలపై ఓ ఫిర్యాదు చేస్తే పట్టించుకోరా.. ఇంత నిర్లక్ష్యమెందుకు అని వెంకటేశ్వరకాలనీ డివిజన్ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి జలమండలి అధికారులపై ఫైర్ అయ్యారు. మంగళవారం ఆమె వెంకటేశ్వరకాలనీ డివిజన్‌లోని వెంకటేశ్వరనగర్ కమ్యూనిటీ హాల్ వద్ద పర్యటించారు. కొద్ది రోజుల క్రితం ఇక్కడ సీసీ రోడ్డు మంజూరు కాగా జీహెచ్ఎంసీ అధికారులు పనులు ప్రారంభించారు. కానీ ఇక్కడ సీవరేజీ నీళ్లు ముందుకు సాగక మురుగునీరు ఇళ్ళల్లోకి వస్తున్నాయని స్థానికులు కార్పొరేటర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఘటనా స్థలానికి వెళ్లి సంబంధిత అధికారుల విషయాన్ని తెలుపగా ఈ సీవరేజీ లైన్ మాది కాదంటే మాది కాదని బంజారాహిల్స్, తట్టికాన సెక్షన్ మేనేజర్లు అంటున్నారని జలమండలి అధికారులు ఇలా ఒకరిపై ఒకరు చెప్పుకుంటూ కాలం వెళ్లదీస్తున్నారని దీంతో ఇక్కడ సీసీ రోడ్డు పనులు నిలిచిపోయా యని ఆమె అసహనం వ్యక్తం చేశారు. ఆ తరువాత కమ్యూనిటీ హాల్ ముందున్న సీవరేజీ లైన్‌కు మెడ్‌ప్లస్ వైపు ఎగ్జిట్ లేకపోవడంతో నీళ్ళు ఇళ్లల్లోకి వస్తున్నాయని అధికారులు గుర్తించారు. అనంతరం బంజారాహిల్స్ సెక్షన్ మేనేజర్ శివకుమార్ సంఘటన స్థలానికి చేరుకొని సమస్యను రెండు రోజుల్లో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

సాక్షి బుధవారం । 9 । అక్టోబర్ । 2024

ప్రజావాణికి 395 అర్జీలు

• డబుల్ ఇళ్ల కోసం అత్యధిక దరఖాస్తులు

లక్డీకాపూల్: ప్రజావాణిలో అత్యధికంగా డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కోసం లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో దరఖాస్తులు సమర్పించారు. మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో మొత్తం 395 దరఖాస్తులు అందాయి. అందులో గృహ నిర్మాణ శాఖకు సంబంధించి 125 అర్జీలు వచ్చాయి. రెవెన్యూ పరమైన సమస్యల పరిష్కారం కోరుతూ 50 దరఖాస్తులు, విద్యుత్ శాఖకు సంబంధించి 200 యూనిట్ల ఉచిత కరెంట్ సరఫరాపై 36, మైనార్టీ సంక్షేమ శాఖకు 30, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 28, ఇతర శాఖలకు సంబంధించి 121 దరఖాస్తులు అందాయి. వీటితో పాటు ప్రవాసీ ప్రజావాణికి ఐదు అర్జీలు వచ్చాయని అధికారులు తెలిపారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డా.చిన్నారెడ్డి, ప్రజాపాలన ప్రత్యేక అధికారి దివ్య దరఖాస్తులు స్వీకరించారు. ప్రజాభవన్‌కు వచ్చిన వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

నిమ్స్ లైజనింగ్ ఆఫీసర్‌గా రాంబాబు

• నియామక పత్రాన్ని అందజేసిన డైరెక్టర్ బీరప్ప


రాంబాబుకు నియామక పత్రాన్ని అందజేస్తున్న డైరెక్టర్ బీరప్ప

లక్డీకాపూల్: నిజామ్స్ వైద్య విజ్ఞాన సంస్థ (నిమ్స్) లైజనింగ్ అధికారిగా రిటైర్డ్ గ్రేడ్–1 ల్యాబ్ టెక్నీషియన్ ఏ.రాంబాబు నియమితులయ్యారు. ఈ మేరకు నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప మంగళవారం నియామక పత్రాన్ని రాంబాబుకు అందజేసినట్లు నిమ్స్ ఎగ్జిక్యూటివ్ రిజిస్ట్రార్ డాక్టర్ శాంతివీర్ తెలిపారు. ఇప్పటి వరకు నిమ్స్ లైజనింగ్ అధికారిగా డాక్టర్ మార్త రమేష్ వ్యవహరించిన సంగతి తెలిసిందే.. ఆ బాధ్యతలను తాత్కాలికంగా రాంబాబు మంగళవారం నుంచి నిర్వర్తిస్తారని చెప్పారు. నిమ్స్‌కు, ప్రభుత్వానికి అనుసంధానకర్తగా ఆయన పాలనాపరమైన అంశాలు, ఆర్థిక వ్యవహారాలు, ఉద్యోగుల సంక్షేమానికి సంబంధించిన అంశాలపై పరిష్కారానికి కృషి చేస్తారన్నారు. ప్రభుత్వం వద్ద అపరిష్కృతంగా ఉన్న ఉద్యోగుల సమస్యలపై ఆయన ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాల్సి ఉందన్నారు. ఈ క్రమంలో సచివాలయంలోని సీఎంఓ, వైద్య ఆరోగ్య శాఖల సంబంధించిన అధికారులకు, నిమ్స్ యాజమాన్యానికి మధ్య సంబంధాలను మెరుగుపర్చేందుకు ఆయన పాటుపడతారని ఎగ్జిక్యూటివ్ రిజిస్ట్రార్ పేర్కొన్నారు.

దోమల నియంత్రణకు కూల్ ఫాగింగ్ మిషనరీ



సాక్షి, సిటీబ్యూరో: దోమల నియంత్రణకు కొత్తగా కూల్ ఫాగింగ్ మిషనరీ తీసుకొచ్చినట్లు మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తెలిపారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం ఆవరణలో కమిషనర్ ఆమ్రపాలితో కలిసి మేయర్ కూల్ ఫాగింగ్ మిషనరీ పనితీరును మంగళవారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంతకుముందు వాడిన హాట్ ఫాగింగ్ మిషనరీ ద్వారా ఆరోగ్య సమస్యలు ఎదురవుతున్నాయని, కూల్ ఫాగింగ్ ద్వారా ఆరోగ్య సమస్య ఉండదని తెలిపారు. కమిషనర్ ఆమ్రపాలి మాట్లాడుతూ దక్షిణ భారత దేశంలోనే తొలిసారిగా ఈ మిషనరీని ప్రవేశపెట్టారని, పైలట్ ప్రాజెక్టు కింద మూడు కూల్ ఫాగింగ్ మిషన్లను ఉపయోగిస్తున్నారని తెలిపారు. కూల్ ఫాగింగ్ ద్వారా అరగంటలోనే దోమలు చనిపోతాయని, డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులు నియంత్రణలో ఉంటాయన్నారు. గుజరాత్‌లో ఇప్పటికే ఈ విధానం సక్సెస్ అయ్యిందని, హాట్ ఫాగింగ్ ద్వారా ఖర్చయ్యే డీజిల్ ధరతో ఏడాదికి కూల్ ఫాగింగ్ మిషన్లు కొనుగోలు చేయవచ్చని చెప్పారు.

డీఎస్సీలో ఎంపికైన టీచర్లు నేడు హాజరుకావాలి

సాక్షి, సిటీబ్యూరో: మేడ్చల్– మల్కాజిగిరి జిల్లాలో డీఎస్సీ– 2024 ఉపాధ్యాయుల రిక్రూట్‌మెంట్‌లో భాగంగా మొత్తం ఖాళీగా ఉన్న 109 టీచర్ పోస్టులకు 83 మంది అభ్యర్థులు ఎంపికైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఐ.విజయకుమారి తెలిపారు. టీచర్లుగా ఎంపికైన అభ్యర్థులకు బుధవారం హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో సాయంత్రం 4 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతులమీదుగా నియామకపు పత్రాలను అందజేయనున్నట్లు ఆమె పేర్కొన్నారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా నుంచి డీఎస్సీ–2024లో ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులు బుధవారం ఉదయం 10 గంటలకు మల్కాజిగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(బాలురు)లో జిల్లా విద్యాశాఖ అధికారికి రిపోర్ట్ చేయాలని ఆమె సూచించారు. టీచర్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులను ఎల్బీస్టేడియం సభావేదిక వద్దకు తీసుకెళ్లడానికి రెండు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. టీచర్లుగా ఎంపికైన అభ్యర్థులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆమె కోరారు.

హైదరాబాద్ పోలీస్ పేరుతో..

• అక్రమ లావాదేవీ అంటూ భయపెట్టి నగదు స్వాహా
• మరో ఉదంతంలో నగర మహిళకు నేరగాళ్ల టోకరా

ముంబైలో మహిళను డిజిటల్ అరెస్టు చేసిన సైబర్ క్రిమినల్



సాక్షి, సిటీబ్యూరో: 'డ్రగ్స్ పార్సిల్ అంటూ ఫెడెక్స్ కంపెనీ పేరుతో', 'అక్రమ ద్రవ్య మార్పిడి అంటూ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్బీఐ) పేరుతో' 'బ్యాంకు ఖాతా అక్రమ వినియోగం అంటూ ఆయా బ్యాంకుల అధికారుల పేరుతో' ఫోన్లు చేసి, బెదిరించి డబ్బు గుంజడాన్ని ఇంపర్సినేషన్ స్కామ్‌గా పిలుస్తారు. తీవ్రత ఎక్కువగా ఉంటే డిజిటల్ అరెస్టు స్కామ్‌గానూ సంబోధిస్తారు. ఉత్తరాదికి చెందిన ఈ ముఠాలు నగరంతో పాటు రాష్ట్రంలో అనేక మందికి కాల్స్ చేసి డబ్బు గుంజుతున్నాయి. ఈ సందర్భాల్లో వాళ్ల ఫోన్ కాల్‌ను ముంబై లేదా ఢిల్లీ పోలీసులకు బదిలీ చేస్తున్నట్లు చెప్తుంటారు. అయితే ముంబైకి చెందిన ఓ మహిళను ముంచడానికి ఈ–కేటుగాళ్లు హైదరాబాద్ పోలీసుల పేరు చెప్పారు. ఇక్కడి అధికారిగా మాట్లాడుతూ భయపెట్టి రూ.7 లక్షలు కాజేశాడు. దీనిపై గత వారం కేసు నమోదు చేసుకున్న విఖ్రోలీ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ముంబైలోని మలాడ్ ప్రాంతానికి చెందిన ఓ మహిళ అక్కడి ఓ ప్రైవేట్ సంస్థలో మేనేజర్‌గా పని చేస్తున్నారు. గత నెల 23న సీబీఐ అధికారి పేరుతో ఓ వ్యక్తి ఫోన్ చేశాడు. ఆమె బ్యాంకు ఖాతాలో రూ.1.8 లక్షలు అక్రమ లావాదేవీ జరిగిందని, అది ఓ సైబర్ నేరానికి సంబంధించిన సొమ్ము అని చెప్పాడు. దీనిపై హైదరాబాద్‌లో కేసు నమోదైందని, ఆ అధికారులు మాట్లాడతారని చెప్పాడు. నగర పోలీసు మాదిరిగా వీడియో కాల్ చేసిన మరో నేరగాడు డిజిటల్ అరెస్టు పేరుతో కొన్ని గంటలు ఆమెను కదలనీయలేదు. తన వాట్సాప్ డీపీగా, స్టేటస్‌గా పోలీసు యూనిఫాంలో ఉన్న, వెనుక హైదరాబాద్ పోలీసు లోగో కనిపిస్తున్న ఫొటోలు పెట్టి పూర్తిగా నమ్మించాడు. ఇలా తీవ్రంగా భయపెట్టిన తర్వాత కేసు క్లోజ్ చేస్తానంటూ రూ.7 లక్షలు కాజేశాడు. ఎట్టకేలకు ధైర్యం చేసిన బాధితురాలు రెండు రోజుల క్రితం విఖ్రోలీ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. మరోపక్క నగరానికి చెందిన ఓ ప్రైవేట్ ఉద్యోగినికి ఫెడెక్స్ కొరియర్‌లో డ్రగ్ పార్శిల్ అంటూ ఫోన్ వచ్చింది. ఆమె ఆధార్ నెంబర్ సైతం చెప్పిన నేరగాళ్లు తాము ముంబై క్రైమ్ బ్రాంచ్ అధికారులుగా పరిచయం చేసుకున్నారు. ఆ యూనిఫాంలోనే స్కైప్ ద్వారా వీడియో కాల్ చేసి డిజిటల్ అరెస్టు చేశామంటూ ఆమెను కదలనీయలేదు. ఆపై అసలు కథ మొదలెట్టిన నేరగాళ్లు ఆమె నుంచి రూ.1.49 లక్షలు కాజేశారు. బాధితురాలు మంగళవారం సిటీ సైబర్ క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకున్న అధికారులు దర్యాప్తు ప్రారంభించారు.

డిజిటల్ అరెస్టు అమలులో లేదు..

ఈ తరహా డిజిటల్ అరెస్టు స్కామ్స్ ఇటీవల కాలంలో గణనీయంగా పెరిగిపోయాయి. కేవలం నగరంలోనే కాదు.. దేశవ్యాప్తంగా చోటు చేసుకుంటున్నాయి. నేరగాళ్లు ప్రధానంగా డ్రగ్స్, మనీ లాండరింగ్, అక్రమ లావాదేవీ, బెదిరింపు కాల్స్ అంటూ భయపెడుతున్నారు. పోలీసులతో పాటు సైబర్ కాప్స్, ఈడీ, సీబీఐ, ఆర్బీఐ, కస్టమ్స్ అధికారులు, న్యాయమూర్తులు, నార్కోటిక్ వింగ్స్, బీఎస్ఎన్ఎల్, ట్రాయ్ సంస్థల పేర్లతో ఫోన్లు చేస్తున్నారు. ఏ ప్రభుత్వ విభాగామూ వీడియో కాల్స్, స్కైప్ కాల్స్ చేసి విచారించదు. డిజిటల్ అరెస్టులు అనేది ఎక్కడా అమలులో లేదు. ఇలాంటి ఫోన్లు వస్తే భయపడకూడదు. కాల్స్ అందుకున్నా, మోసపోయినా తక్షణం 1930కు ఫోన్ చేసి లేదా 8712665171 నంబర్‌కు వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేయండి.

– సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు

స్మార్ట్‌గా.. పారిశుద్ధ్యం కోసం..



సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్‌లో మెరుగైన పారిశుద్ధ్యం కోసం ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్(ఐసీసీసీ) ఏర్పాటుకు జీహెచ్ఎంసీ ఆసక్తి వ్యక్తీకరణలకు స్పందిస్తూ 11 సంస్థలు తమ సాంకేతికత, పనివిధానం వివరిస్తూ ప్రెజెంటేషన్ ఇచ్చాయి. వాటిల్లో అత్యాధునిక, ఉపకరించే విధానాన్ని జీహెచ్ఎంసీ ఎంపిక చేయనుంది. జీహెచ్ఎంసీకి సాంకేతిక సహకారం అందిస్తున్న ఆస్కి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి, అడిషనల్ కమిషనర్లు స్నేహశబరీష్, రఘుప్రసాద్, సీతకోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు మంచి చేయండి

• హైడ్రా పేరుతో భయపెడుతున్నారు
• పేదల ప్రాణాలు పోతున్నాయి
• రేవంత్‌రెడ్డికి మంచి బుద్ధి ప్రసాదించాలని కోరుకున్నా..
• అమ్మవారి పూజల్లో మాజీ మంత్రి హరీష్‌రావు


అమ్మవారి మండపంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీష్‌రావు

మల్కాజిగిరి: రాష్ట్ర ప్రజలు ఇచ్చిన అవకాశంతో పేదలకు మంచి చేయాలని మాజీ మంత్రి హరీష్‌రావు సూచించారు. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మల్కాజిగిరి గాంధీ పార్కులో జైభవానీ ఫ్రెండ్స్ అసోషియేషన్ నిర్వాహకుడు, మాజీ కార్పొరేటర్ నిరుగొండ జగదీష్‌గౌడ్ ఏర్పాటు చేసిన అమ్మవారి వద్ద మాజీ మంత్రి హరీష్‌రావు, ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేవీ శరన్నవరాత్రులు శ్రేష్టమైనవన్నారు. చెడు మీద మంచి విజయానికి సంకేతమన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం హైడ్రా, మూసీ పేరుతో నిద్రలేకుండా చేస్తోందన్నారు. పేదల ఉసురు పోసుకోవద్దని, ప్రాణాలు పోతున్నాయన్నారు. రేవంత్‌రెడ్డికి మంచి బుద్ధి ప్రసాదించాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంబీసీ మాజీ చైర్మన్ నందికంటి శ్రీధర్, కార్పొరేటర్ మురుగేష్, నాయకులు వెంకన్న, రాముయాదవ్, బద్దం పరశురామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నగరంలో నేడు

❖ బెంగాలీ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బంజారాహిల్స్ రోడ్ నెం.1లోని బంజారా ఫంక్షన్ హాల్‌లో దుర్గపూజ రాత్రి 7.15 గంటల నుంచి..

❖ ముషీరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రి ఎదురుగా ఉన్న శృంగేరి జగద్గురు మహాసంస్థానానికి చెందిన శ్రీజ్ఞాన సరస్వతి ఆలయంలో దసరా శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా మూల నక్షత్రాన్ని పురస్కరించుకుని అక్షరాభ్యాసం, ఉదయం 9 గంటలకు సరస్వతి హోమం నిర్వహిస్తారు.

❖ జూబ్లీహిల్స్ రోడ్ నెం.36లోని ఫార్చ్యూన్ ఆట్రియంలో సాయంత్రం 5 గంటల నుంచి జైపూర్ స్టోర్ అందుబాటులో ఉంటుంది.

❖ హైడ్రా పనితీరుపై సోమాజీగూడలోని హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో మధ్యాహ్నం 12 గంటలకు సమావేశం ఉంటుంది.

❖ అలాయ్ బలాయ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అమీర్‌పేటలోని హోటల్ ఆదిత్య పార్క్‌లో మధ్యాహ్నం 2 గంటలకు సమావేశం నిర్వహిస్తారు.

6. ప్రపంచ మానసిక ఆరోగ్యం వారోత్సవాల సందర్భంగా ఇందిరా పార్క్‌లో ఉదయం 8 గంటలకు పండుగలు మానసిక ఆరోగ్యంపై అవగాహన నడస్సు నిర్వహిస్తారు.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

జీహెచ్ఎంసీలో ఉచిత కేన్సర్ స్క్రీనింగ్

సాక్షి, సిటీబ్యూరో: ఉచిత వైద్య క్యాంపులతో ప్రమాదకరమైన వ్యాధులను ముందస్తుగా గుర్తించి, తగిన చికిత్సలు పొంది ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చని జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో మంగళవారం కిమ్స్ సన్‌షైన్ హాస్పిటల్ సహకారంతో టీమ్ విమలాకర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ విమలాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉచిత కేన్సర్ స్క్రీనింగ్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ జీహెచ్ఎంసీ సిబ్బంది ఆరోగ్యంపై తగిన శ్రద్ధ తీసుకోవాలన్నారు.

వర్షపు నీరు వృథా కాకుండా పటిష్ట చర్యలు చేపట్టాలి


సమీక్ష సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో వర్షపు నీరు వృథా కాకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. హైదరాబాద్‌లో వరద నీటి సమస్యలను ఎదుర్కోవడం, వర్షపు నీటిని ఒడిసిపట్టే వ్యవస్థలను మరింత మెరుగు పరిచేందుకు చేపట్టాల్సిన చర్యలపై ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిషోర్, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి, హైదరాబాద్ జిల్లా కలెక్టర్, వాటర్‌బోర్డు ఎండీ, జోనల్ కమిషనర్లు తదితర ఉన్నతాధికారులతో కలిసి మంగళవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వర్షపు నీటిని భూగర్భ జలాలుగా మార్చేందుకు నగరంలో విరివిగా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని, ఇవి నీటి నిల్వకు సమర్థవంతంగా ఉపయోగపడతాయన్నారు. వర్షపు నీటి నిలువ తగ్గించేందుకు ఇంజెక్షన్ వెల్స్ నిర్మాణానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఈ చర్యలు నగరంలో ప్రధానంగా వర్షపు నీరు నిలిచే ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేయడానికి తీసుకోవాలన్నారు. ప్రతి ఇంటికీ ఇంకుడు గుంత తప్పనిసరిగా ఉండాలని, ఆ దిశగా ప్రజలకు అవగాహన కల్పించి చైతన్య పర్చాలన్నారు. వర్షపు నీటిని వృథా చేయకుండా ఇంకుడు గుంతల ద్వారా భూగర్భ జలాలు పెంపొందిలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నగర ప్రజలు వేసవిలో తాగునీటికి ఇబ్బంది లేకుండా, వర్షపు నీటిని వృథా కానీయకుండా వాటిని ప్రిజర్వ్ చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు.

పనుల నాణ్యతలో రాజీవద్దు

• కాంట్రాక్టర్లకు జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి సూచన

సాక్షి, సిటీబ్యూరో: వాటర్, సీవరేజీ పనుల నాణ్యతలో రాజీపడకుండా సీవరేజీ, వాటర్ పనులు చేపట్టాలని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి కాంట్రాక్టర్లకు సూచించారు. ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో ఏఎంఎస్ ఏజెన్సీ కాంట్రాక్టర్లతో ఆయన మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్దేశిత సమయంలో పనులను పూర్తి చేయాలన్నారు. సకాలంలో పనులు చేపట్టడంతో పాటు నిధులు దుర్వినియోగం కాకుండా చూడాలని సూచించారు. కాంట్రాక్టర్లు చేసే పనుల మీద అధికారులు దృష్టి సారించాలన్నారు. ముఖ్యంగా క్వాలిటీ కంట్రోల్‌పై ఫోకస్ పెట్టాలని చెప్పారు. సరైన పనితీరు లేని కాంట్రాక్టర్లకు వచ్చే ఏడాది పనులు అప్పగించేలా ధ్రువపత్రం జారీ చేయకూడదని ఆదేశించారు. పని విషయంలో తేడా వస్తే అలాంటి వాళ్లను బ్లాక్ లిస్టులో పెడతామని హెచ్చరించారు. సీవరేజ్ ఓవర్ ఫ్లో నివారణపై జలమండలి చేపడుతున్న 90 రోజుల స్పెషల్ డ్రైవ్‌లోనూ భాగస్వామ్యం కావాలన్నారు. ధ్వంసమైన మ్యాన్ హోళ్లను పునర్నిర్మించాలని సూచించారు. బోర్డు ప్రతిష్ట పెరిగేలా పనులు చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఆపరేషన్స్–2 స్వామి, డైరెక్టర్ ఆపరేషన్స్– 1 విజయరావు, సీజీఎంలు, జీఎంలు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

మన భాషా సంస్కృతులను పరిరక్షించుకుందాం


సమావేశంలో అభివాదం చేస్తున్న పలువురు వక్తలు

• భాషా సంరక్షణ సమావేశంలో వక్తలు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: మన భాషా సంస్కృతులను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పలువురు వక్తలు తెలిపారు. బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో భాషా సంరక్షణ సమితి ఆధ్వర్యంలో తెలుగు, హిందీ, ఉర్దూ, మరాఠీ, ఇంగ్లిష్ భాషల సంఘాల కమిటీ సమావేశం మంగళవారం జరిగింది. సమావేశంలో సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. తెలుగు భాష అధ్యక్షుడిగా బి.వివేకానంద స్వామి, ప్రధాన కార్యదర్శిగా విజయమోహన్‌ను ఎన్నుకున్నారు. హిందీ భాష అధ్యక్షుడిగా ఎండీ అమీర్ భాష, ప్రధాన కార్యదర్శిగా ఎంఎస్ విజయ్ కుమార్, ఉర్దూ భాష అధ్యక్షులు ఎం.డి అమీద్ ఖాన్, ప్రధాన కార్యదర్శి హుస్సేన్ అమీర్, మరాఠి అధ్యక్షులు సంధ్యారాణి, ప్రధాన కార్యదర్శి పోనేరావును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 20 ఏళ్ల నుంచి భాషా పండితులు అప్‌గ్రేడ్ కాకుండా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అనేక ఇబ్బందులు ఎదుర్కొని సుప్రీంకోర్టు వరకు వెళ్లి భాషా పండితులకు ప్రమోషన్లు ఇప్పించారని అన్నారు. ఈ ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే చెందుతుందని చెప్పారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షులు చిందం ఆశన్న, హిందీ అకాడమిక్ పండిత్ భాస్కరరావు, సలహాదారులు విజయభాస్కర్ పాల్గొన్నారు.

ప్రజామోదం తర్వాతే మూసీ ప్రక్షాళన చేపట్టాలి

• సీపీఎం నగర కార్యదర్శి ఎం.శ్రీనివాస్


మాట్లాడుతున్న సీపీఎం నగర కార్యదర్శి శ్రీనివాస్

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: పేదల ఇళ్లకు నష్టం లేకుండా మూసీ ప్రక్షాళన చేపట్టాలని సీపీఎం నగర కార్యదర్శి ఎం.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మూసీ సుందరీకరణ కోసం వందలాది మంది పేదలు, మధ్య తరగతి ప్రజల ఇళ్లను తొలగించాలనుకోవడం సరైంది కాదన్నారు. టూరిజం అభివృద్ధి కోసం, కార్పొరేట్ కంపెనీల వ్యాపారాల కోసం పేదల ఇళ్లను తొలగించాలనుకోవడం దుర్మార్గమైన చర్య అని విమర్శించారు. మూసీ ప్రాజెక్టుకు సంబంధించి డీపీఆర్‌తో సహా ఎలాంటి ప్రతిపాదనలు ప్రజల ముందు ఉంచకుండానే ఇళ్ల తొలగింపునకు చర్యలు తీసుకోవడం అప్రజాస్వామికం అన్నారు. మూసీ ప్రాజెక్టులో ప్రభుత్వం చేపట్టనున్న అభివృద్ధిపై విస్తృత చర్చలు జరిపి ప్రజల ఆమోదం పొందిన తర్వాతే ముందుకు వెళ్లాలన్నారు. బఫర్ జోన్‌ను ముట్టుకోబోమని డిప్యూటీ సీఎం చెబుతుండగా 50మీటర్ల వరకు బఫర్ జోన్‌గా గుర్తించి భూసేకరణ చట్టప్రకారం ముందుకు వెళ్తామని మున్సిపల్ శాఖ ప్రిన్సిపాల్ సెక్రెటరీ చెబుతున్నారని, ఇలాంటి గందరగోళ ప్రకటనల వల్ల ప్రజలు ఆందోళనకు గురవుతున్నారన్నారు. మూసీ నిర్వాసిత ప్రజలతో వారి నివాస హక్కుల కోసం ప్రభుత్వం బెదిరింపులకు వ్యతిరేకంగా వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాలు ఐక్య ఉద్యమాలు చేపడతాయని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.మహేందర్, వివిధ పార్టీల నాయకుడు ఎం.వరలక్ష్మి, జి.ఝాన్సీ, పద్మ, అనురాధ, అనిల్ కుమార్, సంధ్య, సయ్యద్‌బిలాల్, స్వరూప, భారతి, అనసూయ, అరుణ పాల్గొన్నారు.

బతుకమ్మ జనజీవనానికి మూలాధారం


ఇందిరాపార్కులో బతుకమ్మ వేడుకల్లో ఎమ్మెల్సీ ప్రొ.కోదండరాం, వెన్నెల గద్దర్

• ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం

కవాడిగూడ: బతుకమ్మ పండుగ జనజీవనానికి మూలాధారమని, ఈ పండుగ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో గుర్తింపునకు నోచుకోలేదని ఎమ్మెల్సీ ప్రొ.కోదండరాం అన్నారు. తెలంగాణ జనసమితి నగర కమిటీ ఆధ్వర్యంలో ఇందిరాపార్కులో మంగళవారం రాత్రి ఘనంగా బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో పెద్ద ఎత్తున మహిళలు ఆడిపాడారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్సీ కోదండరాం, గద్దర్ కూతురు వెన్నెల గద్దర్, ప్రొఫెసర్ జయధీర్ తిరుమలరావు, టీజేఎస్ నగర అధ్యక్షుడు నర్సయ్య, ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ప్రొ.కోదండరాం మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో బతుకమ్మ భాగమైందన్నారు. తెలంగాణ ఉద్యమం ద్వారా బతుకమ్మ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిందని పేర్కొన్నారు. బతుకమ్మ పండుగతో మనల్ని మనం వ్యక్తీకరించుకునే అవకాశం లభించిందన్నారు. వెన్నెల గద్దర్ మాట్లాడుతూ.. తెలంగాణ జీవితాలను ప్రతిబింబించేది బతుకమ్మ పండుగ అన్నారు. కార్యక్రమంలో టీజేఎస్ నాయకులు మెరుగు శ్రీనివాస్‌తో పాటు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అమెరికాలో ఘనంగా బతుకమ్మ సంబరాలు



సాక్షి, సిటీబ్యూరో: అమెరికాలోని నార్త్ కరోలినా కాంకార్డ్ కానస్ రన్ ప్రస్థమ్‌లో బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. తెలంగాణ సంప్రదాయం ఉట్టిపడేలా తీరొక్క పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి బతుకమ్మ పాటలు పాడుతూ సందడి చేశారు. సంప్రదాయ వస్త్రధారణలో మహిళలు తళుక్కుమన్నారు.

ఆబ్కారి భవన్‌లో.. ఉత్సాహంగా..



సాక్షి, సిటీబ్యూరో: నాంపల్లిలోని ఆబ్కారి భవన్‌లో మంగళవారం బతుకమ్మ పండుగ ఘనంగా జరిగింది. మహిళా అధికారులు, ఉద్యోగులు ఈ వేడుకలో పాల్గొన్నారు. శంషాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కృష్ణప్రియ, కె.విజయలక్ష్మి, విజయ తదితరులు ఈ వేడుకలో పాల్గొన్నారు.

సోలార్ ఎనర్జీపై ఉచిత శిక్షణ

16వ వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం

లక్డీకాపూల్: జాతీయ సోలార్ ఎనర్జీ సంస్థ 'సూర్యమిత్ర స్కిల్ డెవలప్‌మెంట్' పథకం ద్వారా నిరుద్యోగులకు ఉచిత శిక్షణ ఇవ్వనుంది. అందుకు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 16 వరకు గడువు పొడిగించినట్లు గ్రీన్ ఉర్జా టెక్నాలజీస్ అండ్ సిస్టమ్స్ ప్రాజెక్ట్ డైరెక్టర్ అమిత్ తెలిపారు. నిరుద్యోగులు జాతీయ సోలార్ ఎనర్జీలో ఉచిత శిక్షణ పొందేందుకు అవకాశం కల్పించామన్నారు. అభ్యర్థులు 16వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 3 నెలల ఉచిత శిక్షణ అనంతరం ఉపాధి కల్పిస్తామన్నారు. కోర్సుకు ఐటీఐ, డిప్లమో, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, సివిల్, ఫిట్టర్, వెల్డర్, మెకానికల్ అభ్యర్థులు 18 నుంచి 30 ఏళ్ల వయసు కలిగిన వారు అర్హులని చెప్పారు. వివరాలకు ఫోన్: 8333837632.

సాక్షి సిటీ ప్లస్
13
హైదరాబాద్, బుధవారం, 9, అక్టోబర్, 2024

వరుసగా రెండు పెద్ద పండుగలు వచ్చేస్తున్నాయి. పుట్టినరోజులు, నైట్‌పార్టీలు, వార్షికోత్సవాలు తదితర సందర్భాల్లో ధరించే దుస్తులతో నగరవాసులు అత్యాధునిక ఫ్యాషన్‌కు కేరాఫ్ అ'డ్రెస్'లా మారిపోతారు. అయితే పండుగల సందర్భం మాత్రం పూర్తిగా విభిన్నం. తమ ఫెస్టివల్ లుక్ మోడ్రన్‌గా మెరిపించడంతో పాటు ట్రెడిషన్‌కు కేరాఫ్‌గా కూడా చూపించాలని తపిస్తారు. అలాంటి ఫ్యాషన్ ప్లస్ ట్రెడిషన్ ప్రియులైన నగర యువత కోసం నగరానికి చెందిన హామ్‌స్టెక్ ఫ్యాషన్ డిజైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ఫ్యాకల్టీ పలు సూచనలు అందిస్తోంది.

– సాక్షి, సిటీబ్యూరో

ఫెస్టివ్ లుక్..

ఫ్యాషన్ క్లిక్..







స్టైల్‌గా.. సౌకర్యవంతంగా..
సంప్రదాయం ఉట్టిపడేలా..
అందుబాటులో శారీ డ్రేపింగ్స్..
ఫ్యాషన్ ప్రియులను ఆ'కట్టుకునే' మోడల్స్

హామ్‌స్టెక్ ఫ్యాషన్ డిజైనింగ్

ఇటీవల గ్లోబల్ ఫ్యాషన్ ట్రెండ్ ద్వారా శారీ డ్రేపింగ్ స్టైల్స్ ప్రభావితమవుతున్నాయి. ముందుగా కుట్టిన చీరలు, ధోతీ స్టైల్ ప్యాంట్ తరహా చీరలు, కేప్ స్టైల్ డ్రేప్స్.. వంటి వినూత్న పద్ధతులు ప్రాచుర్యం పొందుతున్నాయి. ఈ స్టైల్స్‌లో అసిమెట్రికల్ కట్స్, స్ట్రక్చర్డ్ సిల్హౌట్‌లతో సహా పాశ్చాత్య ఫ్యాషన్ మేళవింపులతో విభిన్న రకాల మోడళ్లు మార్కెట్‌ను ముంచెత్తుతున్నాయి. ఇవి సంప్రదాయ చీరల్ని అత్యాధునికంగా మారుస్తాయి. వీటితోపాటు అనేక రకల సంప్రదాయ దుస్తులు ఫ్యాషన్ ప్రియులను ఆకర్షిస్తున్నాయి..

పురుషుల కోసం..

ఎత్నిక్‌వేర్‌తో పండుగ లుక్‌ను మార్చుకోవాలని భావిస్తే.. కుర్తా కరెక్ట్. ఏ సందర్భానికైనా నప్పే కాలాతీత ఫ్యాషన్‌గా కుర్తాను ఎంచుకోవచ్చు. సరైన రీతిలో ఫిట్ అయ్యే కుర్తా–పైజామా ఎల్లప్పుడూ స్టైలిష్ లుక్‌ని అందిస్తాయి. ఇంకొంచెం కొత్తగా కనిపించాలంటే.. కుర్తాకి నెహ్రూ జాకెట్‌ని జత చేయవచ్చు. మొత్తంగా మెరిపించే సత్తా ఈ కాంబినేషన్‌కి ఉంది. అదే విధంగా షేర్వానీలు కూడా వేడుకలకు నప్పే ఎంపికలు. పండుగలకు ఇవి సరైన ఛాయిస్. అలాగే దీపావళి పార్టీలకు కూడా కరెక్ట్‌గా నప్పుతాయి. ఎరుపు రంగు షేడ్.. సంప్రదాయ పండుగల్లో చాలా అర్థవంతమైన వర్ణంగా పేర్కొంటారు. నేవీబ్లూ, బ్లాక్, వైట్, ఫ్లమ్, ఆలివ్ గ్రీన్.. కూడా నప్పే ఎంపికలే.

యాక్సెసరీస్...

భారీ ఆభరణాలను ఉపయోగించే బదులు బ్యాంగిల్స్, జూకాలు (చెవిపోగులు), బిందీలు, హెయిర్‌పిన్ వంటి తక్కువ బరువున్న వాటిని యాక్సెసరీస్‌గా ఎంచుకోవాలి.

డిజైనర్స్ సూచనలు..

- పేస్టెల్, బ్రైట్ కలర్స్‌తో ఓ సరికొత్త చిక్ కాంబినేషన్. ఈ ఆఫ్–వైట్– పింక్ కేడియా టాప్, షెల్– మిర్రర్ ఎంబ్రాయిడరీ వర్క్ చేసిన షార్ట్ అవుట్‌ఫిట్‌తో ప్రకాశవంతమైన పసుపు ధోతీతో జతగా ధరించవచ్చు.
- ఎంబ్రాయిడరీ చేసిన ఐవరీ కో–ఆర్డ్ షరారా పండుగ దుస్తులకు పర్ఫెక్ట్ క్లాసిక్ చిక్ రూపాన్ని అందిస్తుంది.
- బ్లేజర్లు కార్పొరేట్ స్టైల్‌కి మాత్రమే పరిమితం అనుకుంటారు. కానీ, ఇటీవల ఆల్–టైమ్ ఫేవరెట్‌గా మారాయి. ఒక ఎంబ్రాయిడరీ బ్లేజర్‌ను డ్రేప్డ్ స్కర్ట్ లేదా ధోతీ ప్యాంట్‌తో మేళవించాలి. నడుముకు బెల్ట్‌తో ఏ సమయంలోనైనా ఈ డ్రెస్ బెస్ట్ ఎంపికగా నిలుస్తుంది.
- ఈ నవరాత్రి రోజుల్లో మస్టర్డ్ షరారా చీర ధరిస్తే చాలా స్టైలిష్‌గా, తేలికగా, సౌకర్యవంతంగా ఉంచుతుంది.
- డ్రేప్డ్ బాటమ్‌తో సెట్ చేసే డ్రెస్సులు ఇటీవల ట్రెండ్‌లో ఉన్నాయి. పర్ఫెక్ట్ ఈవెనింగ్ వేర్ కోసం డ్రేప్డ్ స్కర్ట్, ఎంబ్రాయిడరీ క్రేప్‌తో జత చేయాలి. అదనపు డోస్ కోసం సీక్వెన్స్ జుతీస్ బెస్ట్.
- పండుగ సీజన్‌లో స్టైలిష్‌గా, సౌకర్యవంతంగా ఉండటానికి లైమ్ గోటా పట్టి ఉన్న చందేరి కార్డ్ సూట్ సెట్‌ను ఎంచుకోవచ్చు. ఇది మోనోక్రోమాటిక్ లుక్స్‌కి రంగురంగుల వైబ్స్‌ని జోడిస్తుంది.
- ఆధునిక– సంప్రదాయాల సమ్మేళనంతో డిజైన్ చేసిన ఫ్లోరల్ ఎంబ్రాయిడరీ ప్యాటర్న్ ఉన్న స్కార్లెట్ సిల్క్ లెహెంగా పలాజో సెట్ ధరిస్తే..కలల రూపం సొంతమవుతుంది..
- సల్వార్ కమీజ్ అందంగానూ, సౌకర్యవంతంగానూ ఉంటుంది. ప్రకాశవంతమైన రంగులతో కాటన్ ఫ్యాబ్రిక్ ఉన్నవి ఎంచుకోవచ్చు.
- వివాహాలు, పండుగలు.. వంటి ప్రత్యేక సందర్భాల్లో చనియా చోళీ ధరిస్తారు. వీటికి ఆధునిక ఉపకరణాలు, ఆభరణాలను జత చేస్తున్నారు. పిల్లల కోసమైతే తక్కువ బరువున్న ఆభరణాలను ఎంచుకోవాలి.
- పిల్లల దుస్తులను సొంతంగా లేదా ఒకదానితో ఒకటి సమన్వయం చేసుకోవచ్చు. పిల్లలతో సరిపోలే దుస్తులను ధరించడం వల్ల యూనిక్ ఫ్యామిలీ అనిపించుకోవచ్చు.
- పిల్లల దుస్తులు సౌకర్యంతో పాటు భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి. పండుగ వేడుకల్లో డ్యాన్స్ చేసేటప్పుడు జారిపడకుండా ఉండేలా పొడవును, సౌకర్యాన్ని నిర్ధారించుకోవాలి. ప్రమాదాన్ని కలిగించేలా పదునైన ఉపకరణాలు, ఆభరణాలకు దూరంగా పెట్టాలి.

వైభవంగా 'శ్రీ శక్తి మహోత్సవం సీజన్ 2'

'ది శ్రేయాస్ లైవ్' ఆధ్వర్యంలో ఉత్సవాలు



సాక్షి, సిటీబ్యూరో: నవరాత్రి ఉత్సవాలు నగరంలో అంగరంగ వైభవంగా జరుగుతున్న విషయం తెలిసిందే. హైదరాబాద్‌లోని జూబ్లీ హిల్స్‌లో 'ది శ్రేయాస్ లైవ్' ఆధ్వర్యంలో అక్టోబరు 3న ఈ ఉత్సవాలు ఘనంగా ఆరంభమయ్యాయి. ఈ నెల 12 వరకూ పది రోజుల పాటు జరగనున్న ఈ ఉత్సవాల్లో రోజుకొక విధంగా అమ్మవారిని అలంకరిస్తున్నామని సంస్థ అధినేత గంధ్ర శ్రీనివాస్ తెలిపారు. 'నవరాత్రి నేపథ్యంలో గత ఏడాది 'శ్రీ శక్తి మహోత్సవం సీజన్ 1' ప్రారంభించాం. మేము అనుకున్న విధంగా నిర్వహించగలిగాం. తొలి ఏడాది ఉత్సాహంతో ఈ యేడు సీజన్ 2 ఉత్సవాలను ఆరంభించాం. ఈ వేడుకల్లో భాగంగా విశిష్ట అర్చనలు, అభిషేకాలు, హోమాలు, బతుకమ్మ.. ఇలా పలు కార్యక్రమాలు జరుపుతున్నాం' అని పేర్కొన్నారు. తొమ్మిది రోజులూ తొమ్మిది అవతారాల్లో అమ్మవారిని అలంకరించనున్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1వరకూ, సాయంత్రం ఐదు నుంచి 9 గంటల వరకూ భక్తులు అమ్మవారిని దర్శించుకోవచ్చని శ్రీనివాస్ తెలిపారు.

రన్ ఫర్ 'ఫారెస్ట్ బై హార్ట్‌ఫుల్‌నెస్'

- భారత్‌తో పాటు యూఎస్ఏ, కెనడా దేశాల్లోని వంద ప్రాంతాల్లో
- 15 వేల మొక్కలు పెంచడమే లక్ష్యంగా లక్ష మందితో రన్..



పర్యావరణ పరిరక్షణ, వేల మొక్కలను నాటి పర్యవేక్షించడమే లక్ష్యంగా హార్ట్‌ఫుల్‌నెస్, మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్, గ్రాన్యూల్స్ ఇండియా లిమిటెడ్ సంయుక్తంగా అతిపెద్ద 'గ్రాన్యూల్స్ గ్రీన్ హార్ట్‌ఫుల్‌నెస్ రన్'ను నిర్వహించనున్నారు. దాదాపు 15 వేల మొక్కలు నాటడమే లక్ష్యంగా నిర్వహిస్తున్న ఈ రన్ తెలుగు రాష్ట్రాలతో పాటు ఢిల్లీ, గోవా, జమ్మూ కాశ్మీర్, పుదుచ్చేరి, తమిళనాడు, కేరళ వంటి ప్రాంతాలతో పాటు 20 రాష్ట్రాల్లోని 20 విశ్వవిద్యాలయాల్లో.. యూఎస్ఏ, కెనడా వంటి దేశాల్లో మొత్తం వంద ప్రాంతాల్లో నిర్వహించనున్నారు. మూడో ఎడిషన్ రన్‌లో భాగంగా 'ఫారెస్ట్ బై హార్ట్‌ఫుల్‌నెస్' చొరవతో నవంబర్ 17న జరగనున్న ఈ ప్రతిష్టాత్మక రన్‌లో లక్ష మంది పాల్గొననున్నారు. ఈ రన్‌కు సంబంధించిన టీ–షర్ట్, మెడల్‌ను హోటల్ మేరీ గోల్డ్ వేదికగా గ్రాన్యూల్స్ ఇండియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఉమా చిగురుపాటి, అంతర్జాతీయ టేబుల్ టెన్నిస్ క్రీడాకారిణి డా.నైనా జైస్వాల్, పారిస్ ఒలింపియన్ అథ్లెట్ జ్యోతిక శ్రీ దండి, హార్ట్‌ఫుల్‌నెస్ ట్రస్టీ సంజయ్ సెహగల్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నైనా జైస్వాల్ మాట్లాడుతూ.. ప్రకృతిని కాపాడటం, భూగ్రహాన్ని రక్షించడం మనందరి బాధ్యత. ఇందులో భాగంగా కన్హ శాంతి వనం ఆధ్వర్యంలో జరిగే ఈ రన్‌లో పాల్గొని మద్దతు తెలపడం సంతోషంగా ఉందన్నారు. పర్యావరణాన్ని, ఫిట్‌నెస్‌ను సమ్మిళితం చేసి నిర్వహిస్తున్న ఇలాంటి రన స్ఫూర్తిదాయకమని ఒలింపియన్ అథ్లెట్ జ్యోతిక శ్రీ దండి పేర్కొన్నారు. 1.5 కిమీల, 5కె, 10కెతో పాటు హాఫ్ మారథాన్ వంటి విభిన్న రేసులను నిర్వహిస్తున్నట్లు ఉమా చిగురుపాటి వెల్లడించారు.

–సాక్షి, సిటీబ్యూరో


గెట్ రెడీ.. ఇట్స్ త్రీడీ.. !



- త్రీడీ రంగంలో 'మేకర్ గ్లోబల్' వెలుగులు
- 21 ఏళ్లకే స్టార్టప్..నడిపిస్తున్న క్రవీంతర్ కమల్
- స్కైరూట్ ఏరోస్పేస్ సంస్థకు 'రాకెట్' తయారీ

ఇప్పుడంటే త్రీడీ ప్రింటింగ్ సాంకేతికత గురించి అందరికీ తెలిసింది. ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని అందరికీ అవగాహన వచ్చింది. కానీ 8 ఏళ్ల క్రితం త్రీడీ ప్రింటింగ్ గురించి ఎవరికీ తెలియదనే చెప్పొచ్చు. కానీ 21 ఏళ్ల కుర్రాడు త్రీడీ ప్రింటింగ్‌లో భవిష్యత్తు ఉందని గుర్తించాడు. త్రీడీ ప్రింటింగ్‌లో ఏదైనా వినూత్నంగా చేయాలని ఆలోచించాడు. ఆ ఆలోచనకు పదును పెట్టాడు. ఓ స్టార్టప్ కూడా స్థాపించాడు. ఓ మధ్య తరగతి కుటుంబం నుంచి వచ్చి కంపెనీ స్థాపించాలంటే చాలా ధైర్యం ఉండాలి. ఎన్నో అవమానాలు.. ఎన్నో భయాలు.. వాటన్నింటినీ దాటుకుని ముందడుగు వేశాడు.. ఇప్పుడు ఏకంగా హైదరాబాద్‌లోని త్రీడీ ప్రింటింగ్ కంపెనీల్లో ఒకటిగా నిలిచి.. తన సత్తా చాటుకున్నాడు. అతడి పేరే.. క్రవీంతర్ కమల్.. అతని సక్సెస్ స్టోరీ గురించి మరిన్ని విశేషాలు..

– సాక్షి, సిటీబ్యూరో



మేకర్ గ్లోబల్ పేరుతో 2016లో త్రీడీ ప్రింటర్స్ తయారుచేసే చిన్న స్టార్టప్ ఏర్పాటు చేశాడు. ఇప్పుడు సక్సెస్‌ఫుల్ ఎంటర్‌ప్రెన్యూర్‌గా నలుగురికీ ఆదర్శంగా నిలుస్తుండటమే కాకుండా.. పలువురికి ఉపాధి కల్పిస్తున్నాడు. ఒకప్పుడు అసలు భవిష్యత్తు ఉంటుందా లేదా అని అనుమానం వ్యక్తం చేసిన వారికి ఇప్పుడు త్రీడీ ప్రింటింగ్‌తోనే భవిష్యత్తు ఉంది అని నిరూపిస్తూ కమల్ ముందుకు సాగుతున్నాడు.

మొక్కవోని ధైర్యంతో..

కంపెనీ స్థాపించిన సమయంలో త్రీడీ ప్రింటింగ్‌పై డెలాయిట్, టాటా ఏరోస్పేస్ వంటి కంపెనీల వద్దకు వెళ్లి అవగాహన కల్పించేవాడినని కమల్ గుర్తుచేసుకున్నాడు. ఆ తర్వాత త్రీడీ ప్రింటింగ్ మెషీన్లను సొంతంగా తయారు చేసి, కంపెనీలకు విక్రయించేవాడినని చెప్పుకొచ్చాడు. త్రీడీ ప్రింటింగ్ ఉత్పత్తులకు డిమాండ్ పెరిగిన తర్వాత వాటిని తయారుచేయడం మొదలుపెట్టారు. అప్పటి నుంచి ఎన్నో పెద్ద పెద్ద కంపెనీలు మేకర్ గ్లోబల్‌కు క్లయింట్స్‌గా మారారు. వారికి కావాల్సిన త్రీడీ ప్రింటింగ్ ఉత్పత్తులను వీరి దగ్గరి నుంచే చేయించుకోవడం మొదలు పెట్టారు.

ఎన్నో సినిమాలకు సాయం..

త్రీడీ ప్రింటింగ్‌లో రోజువారీ ఉపయోగించే ఎన్నో వస్తువులు, ఉత్పత్తులను మేకర్ గ్లోబల్ తయారుచేస్తోంది. హైదరాబాద్‌లోని స్కైరూట్ కంపెనీకి రాకెట్ మోడల్స్‌ను త్రీడీ ప్రింటింగ్‌లో రూపొందించి ఇచ్చామని కమల్ పేర్కొన్నాడు. అది చాలా గర్వకారణంగా ఉందని చెప్పాడు. ఇక, ఎన్నో సినిమాల ఆర్ట్ డైరెక్టర్లకు కావాల్సిన వస్తువులను సులువుగా తయారు చేసి ఇస్తుంటామని, ఏటా కనీసం నాలుగు సినిమాలకు పనిచేస్తుంటామని వివరించాడు. ఇక, ఆర్ఆర్ఆర్, హనుమాన్, ఆపరేషన్ వాలెంటైన్, పుష్ప వంటి సినిమాలకు అవసరమైన వస్తువులను నటీనటులకు ఇబ్బంది కాకుండా తేలికగా ఉండేలా తయారు చేసి ఇచ్చామని చెబుతున్నారు.

అప్పటి నుంచే ఆసక్తి..

తమిళనాడులోని తిరుచ్చిలో జన్మించిన కమల్.. చెన్నైలోని లయోలా కాలేజీలో 2015లో ఇంజనీరింగ్ పూర్తి చేశాడు. కాలేజీ రోజుల్లోనే ఎక్స్‌చేంజ్ ప్రోగ్రామ్‌లో భాగంగా పారిస్‌లోని తులుజ్‌లో ఏరోస్పేస్ హబ్‌లో నెల రోజుల పాటు ఉండే అవకాశం కమల్‌కు వచ్చింది. అక్కడే తొలిసారి త్రీడీ ప్రింటింగ్‌తో ఉన్న లాభాల గురించి తెలుసుకున్నాడు. అక్కడి నుంచి తిరిగి వచ్చాక.. డిజైనింగ్‌పై ఇష్టంతో హైదరాబాద్‌లోని ఓ కంపెనీలో చేరాడు. కానీ ఉద్యోగం చేయడం కన్నా సొంతంగా ఎదగాలని, నలుగురికీ ఉపాధి కల్పించాలని ఆలోచన చేశాడు. అప్పుడే త్రీడీ ప్రింటింగ్ గురించి వచ్చిన ఆలోచనతో వెంటనే మేకర్ గ్లోబల్ స్టార్టప్ స్థాపించాడు. ఇప్పుడు ఏటా రెండున్నర కోట్ల టర్నోవర్‌తో ముందుకు వెళ్తున్నాడు. భవిష్యత్తులో సంస్థను మరింత విస్తరించడమే లక్ష్యంగా శ్రమిస్తున్నానని చెబుతున్నాడు.



కృతి సనన్ 'కలర్ సహీ ట్రాన్స్‌ఫర్ నహీ'



ప్రస్తుత పండుగల నేపథ్యంలో 'కలర్ సహీ ట్రాన్స్‌ఫర్ నహీ' అనే థీమ్‌తో ప్రముఖ సినీనటి కృతి సనన్ సందడి చేస్తున్నారు. బ్యూటీ ఫేమ్ సుగర్ పాప్ ఆధ్వర్యంలోని అల్ట్రా స్టే ట్రాన్స్‌ఫర్ ప్రూఫ్ లిప్‌స్టిక్ ఆవిష్కరించారు. దేశంలోని ప్రతి ఒక్క ప్రాంతానికీ అనుకూలంగా మగువల కోసం ప్రత్యేకంగా రూపొందించిన ఈ సౌందర్య ఉత్పత్తి వారి ఆత్మస్థైర్యానికి నిదర్శనంగా నిలుస్తుందని కృతి సనన్ పేర్కొన్నారు. అమ్మాయిల సౌందర్యాన్ని సంరక్షించడానికి దీర్ఘకాలిక మేకప్‌ను ప్రోత్సహించడంలో భాగంగా ఈ వినూత్న ఉత్పత్తిని ఆవిష్కరించారని తెలిపారు. సుగర్ పాప్ తమ ఉత్పత్తులను 2020లో ప్రారంభించినప్పటి నుంచి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ వేదికల్లో ఆకర్షణీయమైన అమ్మకాలతో రూ.100 కోట్లు దాటిందని కాస్మెటిక్స్ సహ వ్యవస్థాపకురాలు, సీఈఓ వినీతా సింగ్ తెలిపారు. -సాక్షి, సిటీబ్యూరో

నగరంలోనూ అక్టోబర్ ఫెస్ట్

సాక్షి, సిటీబ్యూరో: అంతర్జాతీయంగా ఈ నెలలో జరిపే అక్టోబర్ ఫెస్ట్‌లో భాగంగా నగరంలోనూ మగ్ ఇట్ అప్ పేరుతో ఈవెంట్ నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని నిర్వాహక సంస్థ కింగ్ ఫిషర్ ప్రతినిధులు తెలిపారు. జర్మన్ సంస్కృతిలో భాగంగా బీర్, మ్యూజిక్, ఫుడ్ మేళవింపుగా నిర్వహించే అక్టోబర్ ఫెస్ట్‌ను దేశవ్యాప్తంగా 40 నగరాలకు తీసుకొస్తున్నామని, అందులో భాగంగా నగరంలోనూ ఏర్పాటు చేస్తున్నట్టు వివరించారు. బీర్ గార్డెన్, బీర్ మేళవించిన ఫుడ్ వెరైటీలతో మెనూ.. వంటి విశేషాలతో బీర్ ప్రియులను అలరించే ఈ ఈవెంట్ దేశవ్యాప్తంగా ఇంత పెద్ద ఎత్తున నిర్వహించడం ఇదే ప్రథమం అన్నారు.

కేఎల్‌హెచ్‌లో టెక్నో కల్చరల్ ఫెస్ట్

సాక్షి, సిటీబ్యూరో: నగరానికి చెందిన విద్యాసంస్థ కేఎల్‌హెచ్ వర్సిటీ ఆవరణలో నిర్వహించిన వార్షిక టెక్నో–కల్చరల్ ఫెస్ట్ అవిన్య.. సందడిగా సాగింది. అజీజ్‌నగర్‌లోని క్యాంపస్‌లో నిర్వహించిన ఈ ఫెస్ట్‌లో భాగంగా ఐక్యూ క్విజ్, డేటా ఆల్కెమీ, స్కావెంజర్ హంట్, బాటిల్ బాట్.. తదితర పేర్లతో నిర్వహించిన విభిన్న రకాల ఈవెంట్లు ఆకట్టుకున్నాయి. డీజే నైట్‌లో విద్యార్థుల నృత్యం, సంగీతంతో పరవళ్లు తొక్కారు. సినిమా నటులు షఫీ, గౌతమ్, కిరణ్ అబ్బవరం, కల్లు కాంపౌండ్ సినిమా బృందం.. హాజరై యువతలో ఉత్సాహాన్ని నింపారు.



వార్నింగ్‌లు.. వాటాలు!

టీడీపీ కూటమి ఎమ్మెల్యేల బెదిరింపులతో మద్యం వ్యాపారుల హడల్

ఇతరులెవరైనా దుకాణాలకు దరఖాస్తు చేస్తే అంతు చూస్తామంటూ సిండికేట్ల హెచ్చరికలు

- ఒక్క దరఖాస్తు కూడా రాని దుకాణాలు 56.. ఒక్క దరఖాస్తే వచ్చినవి 116.. రెండేసి వచ్చినవి 254
- వాటికి చివరిరోజు సిండికేట్ ద్వారా దరఖాస్తు ఎత్తుగడ
- లాటరీకి ముందే 426 దుకాణాలు పచ్చముఠాల చేతికి..
- బెదిరింపుల్లో తిరుపతి, కృష్ణా, కాకినాడ టాప్
- మద్యం దోపిడీకి 'ముఖ్య'నేత కనుసన్నల్లో పక్కా ప్రణాళిక



సాక్షి, అమరావతి:

"మద్యం దుకాణం లైసెన్స్ దక్కించుకోవడం కాదు కదా.. కనీసం లైసెన్స్‌కు దరఖాస్తు చేసినా సరే అంతు చూస్తాం...!"

టీడీపీ కూటమి ఎమ్మెల్యేలు బరితెగించి సాగిస్తున్న బెదిరింపుల పర్వం ఇదీ...!! అధికార పార్టీ ప్రజాప్రతినిధులు అంత 'మర్యాదగా' చెప్పిన తరువాత మద్యం దుకాణం లైసెన్స్‌కు దరఖాస్తు చేసేందుకు ఇతరులు సాహసిస్తారా..?

టీడీపీ మద్యం సిండికేట్ దోపిడీకి రాచబాట పరుస్తూ మద్యం దుకాణాల లైసెన్స్‌ల కేటాయింపునకు రంగం సిద్ధమవుతోంది. అదే సమయంలో అంతా పారదర్శకంగా నిర్వహిస్తున్నామని మభ్యపుచ్చేందుకు టీడీపీ కూటమి ఎమ్మెల్యేలు మరో ఎత్తుగడ వేశారు. తమ సిండికేట్ ద్వారానే భారీగా దరఖాస్తులు చేయిస్తూ బురిడీ కొట్టించేందుకు యత్నిస్తున్నారు. ప్రభుత్వ ముఖ్య నేత కనుసన్నల్లో పక్కా పన్నాగంతో మద్యం దోపిడీకి వేసిన స్కెచ్ ఇలా ఉంది..

రాత్రికి రాత్రే తమ వారితో ఏకంగా 16 వేల దరఖాస్తులు

టీడీపీ ఎమ్మెల్యేల హెచ్చరికలతో మద్యం దుకాణాలకు దరఖాస్తు చేయాలని ఆలోచించేందుకు సైతం సామాన్య వ్యాపారులు హడలెత్తిపోతున్నారు. మొత్తం 3,396 మద్యం దుకాణాలకు టెండర్ల ప్రక్రియ చేపట్టిన విషయం తెలిసిందే. మరొక్క రోజు మాత్రమే గడువు ఉండగా మద్యం సిండికేట్ సోమవారం రాత్రికి రాత్రే తమ వారితో ఏకంగా 16 వేల దరఖాస్తులు దాఖలు చేయించింది. దీంతో మంగళవారం సాయంత్రానికి దరఖాస్తుల సంఖ్యను 39,259కు చేర్చారు.

- ఇప్పటికీ కూడా రాష్ట్రంలో 56 మద్యం దుకాణాలకు ఒక్కటంటే ఒక్క దరఖాస్తు కూడా రాకపోవడం గమనార్హం. దీనిబట్టి టీడీపీ కూటమి ఎమ్మెల్యేలు ఏ స్థాయిలో బెదిరింపులకు పాల్పడ్డారో స్పష్టమవుతోంది. ఆ దుకాణాలకు చివరి రోజు టీడీపీ కూటమి ఎమ్మెల్యేల బంధువులే దరఖాస్తు చేసి ఏకపక్షంగా దక్కించుకుంటారన్నది సుస్పష్టం.
- ఇక 116 మద్యం దుకాణాలకు కేవలం ఒక్కో దరఖాస్తు మాత్రమే వచ్చాయి. టీడీపీ కూటమి ఎమ్మెల్యేల బెదిరింపుల ప్రభావం ఇదీ! ఇక ఆ మద్యం దుకాణాలన్నీ కూడా టీడీపీ సిండికేట్ పరమైనట్లే!
- 254 మద్యం దుకాణాలకు రెండేసి చొప్పున మాత్రమే దరఖాస్తులు వచ్చాయి. ఆ రెండు కూడా టీడీపీ సిండికేట్‌కు చెందినవే. ఆ దుకాణాలను సైతం టీడీపీ సిండికేట్ గుప్పిట పట్టినట్టే.
- ఈ విధంగా లాటరీ ద్వారా ఎంపిక ప్రక్రియతో నిమిత్తం లేకుండా ఏకంగా 426 మద్యం దుకాణాలను టీడీపీ సిండికేట్ హస్తగతం చేసుకుందన్న విషయం స్పష్టమవు తోంది. ఇందులో తిరుపతి, కృష్ణా, కాకినాడ జిల్లాలు మొదటి మూడు స్థానాల్లో ఉన్నాయి.
- తమను కాదని ఎవరైనా దరఖాస్తు చేసి దుకాణం దక్కించుకున్నా తన సహకారం లేకుండా వ్యాపారం చేయలేరని పత్తికొండలో అధికార పార్టీ ముఖ్యనేత హెచ్చరిస్తున్నారు. లాటరీలో దుకాణం దక్కించుకున్న వారు తనకు 30 శాతం వాటా ఇవ్వాల్సి ఉంటుందని ఆదోని మాజీ ఎమ్మెల్యే తన అనుచరులతో ఫోన్ల ద్వారా బెదిరిస్తున్నారు. ఎమ్మిగనూరు, కోడుమూరు, ఆలూరు నియోజకవర్గాల్లో కూడా ఇదే పరిస్థితి. ఆలూరులో టీడీపీ నేతలు మూడు గ్రూపులుగా విడిపోయి పర్యవేక్షిస్తున్నారు. కర్నూలులో ఓ మాజీ మంత్రి సోదరుడి కనుసన్నల్లో పాత సిండికేట్ నాయకులంతా కలసి దరఖాస్తులు వేయిస్తున్నారు.

రూ.2 కోట్లు పెట్టి 100 దరఖాస్తులు వేయించా

సాక్షి, టాస్క్‌ఫోర్స్: తెలుగు తమ్ముళ్లకు మద్యం షాపులు కట్టబెట్టేందుకు టీడీపీ నేతలు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. బయటి వ్యక్తులకు షాపులు దక్కకుండా బెదిరింపులకూ దిగుతున్నారు. ఈ క్రమంలో మంత్రి పొంగూరు నారాయణ తన సొంత డబ్బులు రూ.2 కోట్లు ఖర్చుచేసి 100 దరఖాస్తులు వేయించినట్లు చెబుతున్న ఆడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఆయన మంగళవారం పార్టీ కార్యకర్తలతో గ్రూప్ కాల్‌లో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేసినట్లు భావిస్తున్నారు. 'నగరంలో కొందరు నన్ను బ్రాందీ షాపులు కావాలని అడిగారు. 5, 10% అయినా ఇప్పించండని అడిగారు. వారు దరఖాస్తులకు అంత ఖర్చు పెట్టుకోలేరు కాబట్టి నేనే ఆ ఖర్చు భరిస్తున్నా. నెల్లూరులో రౌడీయిజం ఒప్పుకోను. దుకాణాల వద్దకు వచ్చి ఏ డిపార్ట్‌మెంట్ వాళ్లు అడిగినా ఒప్పుకోను. రూ.2 కోట్లు సొంత డబ్బు ఖర్చుపెట్టి 100 దరఖాస్తులు వేయిస్తున్నా. వాటిలో 4 నుంచి 5 షాపులు రావచ్చని అనుకుంటున్నాను. ఒక షాపునకు రూ.80 లక్షలు ఖర్చవుతుంది. 5 లేక 6 మంది కలిసి డబ్బులు రెడీ చేసుకుని సిండికేట్‌గా ఉండండి. బ్రాందీ షాపుల కేటాయింపులో మొదటి ప్రాధాన్యత డివిజన్ ప్రెసిడెంట్‌లు, వైస్ ప్రెసిడెంట్‌లు, జనరల్ సెక్రటరీలకు ఇస్తున్నాను. వారు కూడా ముందుకు రాకపోతే డివిజన్ ఇన్‌చార్జిలు, బూత్ కన్వీనర్లకు అవకాశమిస్తా' అంటూ మంత్రి చెప్పినట్లుగా ఈ ఆడియోలో ఉంది. ఆ ఆడియో వైరల్ అవుతుండటంతో టీడీపీ నాయకులు తలలు పట్టుకుంటున్నారు.

బురిడీ కొట్టించేందుకే సిండికేట్‌తో భారీగా దరఖాస్తులు

రాష్ట్రంలో టీడీపీ మద్యం సిండికేట్ ఆగడాలు, బెదిరింపులపై తీవ్రస్థాయిలో వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఇతరులు దరఖాస్తులు చేయకుండా టీడీపీ కూటమి ఎమ్మెల్యేలు ఏ స్థాయిలో బెదిరింపులకు పాల్పడుతున్నారో దరఖాస్తుల సంఖ్యే వెల్లడించింది. తొలి ఆరు రోజుల్లో 3,396 దుకాణాలకు కేవలం 8,274 దరఖాస్తులు మాత్రమే రావడం దీనికి నిదర్శనం. దీంతో ప్రజల్ని మభ్యపెట్టేందుకు 'ముఖ్య'నేత మరో ఎత్తుగడ వేశారు. తమ సిండికేట్ సభ్యుల ద్వారా పెద్ద ఎత్తున దరఖాస్తులు చేయించారు. అందులో భాగంగా సోమవారం రాత్రి తరువాతే తమ వారితో ఏకంగా 16 వేల దరఖాస్తులు దాఖలు చేయించారు. తద్వారా భారీగా దరఖాస్తులు వచ్చినట్లు కనికట్టు చేసేందుకు యత్నించారు. వీటిలో 90 శాతం దరఖాస్తులు టీడీపీ కూటమి సిండికేట్‌కు చెందినవే అన్నది అసలు లోగుట్టు. మద్యం దుకాణాలన్నీ ఏకపక్షంగా హస్తగతం చేసుకునేందుకు పక్కా పథకం వేసినట్లు దీన్నిబట్టి స్పష్టమవుతోంది.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

గరుడ వాహనంపై గోవిందుడు

వేంకటేశ్వరుడికి విశేషాలంకరణతో వైభవంగా గరుడోత్సవం

నేడు శ్రీనివాసుడికి స్వర్ణ రథోత్సవం



తిరుమల: విశ్వపతి శ్రీవేంకటేశ్వరుడు గరుడునిపై మంగళవారం అంగరంగ వైభవంగా ఊరేగుతూ భక్తకోటికి దర్శనమిచ్చారు. రాత్రి 6:30 గంటలకు ఆరంభమైన ఈ వాహన సేవ లక్షలాది మంది భక్తుల సమక్షంలో అర్ధరాత్రి వరకు సాగింది. గరుడ వాహనంపై దేదీప్యమాన కాంతులతో ఆలయ నాలుగు మాడవీధుల్లో ఊరేగుతూ భక్తకోటిని మలయప్ప అనుగ్రహించారు. ఈ సేవలో గర్భాలయ మూలమూర్తికి అలంకరించే మకరకంఠి, లక్ష్మీహారం, సహస్ర నామ కాసులమాల, సుదర్శన చక్రమాల, మూలవిరాట్ పురాతన బ్రాస్‌లెట్ వంటి ఎన్నెన్నో విశేష ఆభరణాలు, శ్రీవిల్లి పుత్తూరు ఆండాళ్ తులసి, పుష్పమాల, చెన్నై నూతన ఛత్రాలను మలయప్పకు అలంకరించారు. భక్తకోటి గోవింద నామస్మరణతో తిరుమల క్షేత్రం భక్తిభావంతో నిండింది. గరుడ వాహనం ముందు భక్త బృందాల భజనలు, డప్పు వాయిద్యాలు, కోలాటాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, కళాకారుల వేషధారణలు, నగర సంకీర్తనలు విశేషంగా అలరించాయి. బ్రహ్మోత్సవాల్లో ఐదవరోజు ఉదయం మంగళవారం శ్రీవారు మోహిని అవతారంలో దర్శనమిచ్చారు. తిరుమలలో బుధవారం శ్రీవారి స్వర్ణ రథోత్సవం (రథరంగ డోలోత్సవం) జరగనుంది. సాయంత్రం 4 గంటల నుంచి ఆలయ పురవీధుల్లో స్వర్ణ రథంపై స్వామివారు ఊరేగనున్నారు.

కిక్కిరిసిన తిరుమలగిరులు

గరుడ వాహన సేవ దర్శనం కోసం భక్తులు పోటెత్తారు. ఈ వాహన సేవలో స్వామిని దర్శించుకునేందుకు భక్తులు ఉదయం నుంచే గ్యాలరీల్లో పడిగాపులు కాశారు. ఉదయం మోహినీ వాహన సేవలో పాల్గొన్న భక్తులే ఎక్కడికక్కడ గరుడ వాహన సేవ కోసం నిరీక్షించారు. 2 లక్షల మంది కూర్చునే విధంగా సిద్ధం చేసిన గ్యాలరీలు మధ్యాహ్నం 1 గంటకే నిండిపోయాయి.



మహాలక్ష్మీదేవిగా దుర్గమ్మ

కనులపండువగా నగరోత్సవం

నేడు మూలా నక్షత్రం.. పట్టువస్త్రాలను సమర్పించనున్న ముఖ్యమంత్రి



సాక్షి ప్రతినిధి, విజయవాడ: ఇంద్రకీలాద్రిపై దసరా వేడుకలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఆరో రోజు మంగళవారం మహాలక్ష్మీదేవిగా దుర్గమ్మ దర్శనమిచ్చారు. సాయంత్రం నగరోత్సవం కనులపండువగా సాగింది. కనకదుర్గానగర్‌లో కళావేదికపై ప్రదర్శించిన సంప్రదాయ నృత్యాలు ఆకట్టుకున్నాయి. బుధవారం మూలా నక్షత్రం కావడంతో సరస్వతీ దేవి రూపంలో ఉన్న అమ్మవారిని దర్శించుకునేందుకు మంగళవారం రాత్రి 11 గంటల నుంచే ఇంద్రకీలాద్రిపైకి భక్తులు పెద్ద ఎత్తున తరలిరానున్నారు. మూలా నక్షత్రం నాడు 2 లక్షల మందికిపైగా భక్తులు రానున్న నేపథ్యంలో అందుకు తగినట్లు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేపట్టింది. క్యూలైన్లలో మార్పులు చేసింది. వీఐపీ దర్శనాలనూ రద్దు చేసింది. బుధవారం తెల్లవారుజామున 2.00 గంటల నంచి రాత్రి 11 గంటల వరకు భక్తులందరికీ ఉచితంగా అమ్మవారి దర్శనాన్ని కల్పిస్తోంది. ఫ్లైఓవర్ కింద వాహనాలకు అనుమతి రద్దు చేసింది. సీఎం చంద్రబాబు బుధవారం అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించనున్నారు.

నేడు శ్రీ సరస్వతిదేవిగా...

ఇంద్రకీలాద్రిపై నిర్వహిస్తున్న దసరా ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు బుధవారం శ్రీ సరస్వతి దేవిగా భక్తులకు దర్శనమివ్వనున్నారు. మూలా నక్షత్రం అమ్మవారి జన్మనక్షత్రం. ఈ రోజున వాగ్దేవతామూర్తి అయిన సరస్వతీ అవతారంలో భక్తులను అమ్మవారు అనుగ్రహిస్తారు.

భవిత

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

మేటి ఇన్‌స్టిట్యూట్స్.. తగ్గిన ఆఫర్లు

ఐఐటీలు, ఐఐఎంలు.. ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్ విద్యకు ప్రసిద్ధ విద్యాసంస్థలు! వీటిలో చేరి కోర్సు పూర్తి చేసుకుంటే.. కార్పొరేట్ కొలువులు, కళ్లు చెదిరే వేతనాలు ఖాయమనే అభిప్రాయం! రూ.లక్షలు, వీలైతే కోట్లలో వార్షిక వేతనాలతో కొలువు సొంతం చేసుకోవచ్చనే అభిలాష!! కానీ.. ఈ ఏడాది (2023-24) ఐఐటీలు, ఐఐఎంల విద్యార్థులకు కొంత భిన్నమైన అనుభవాలు ఎదురయ్యాయి. ఐఐఎంల్లో ఆఫర్లు 'ఒకే' అనిపించేలా ఉన్నా.. ఐఐటీల్లో మాత్రం బాగానే తగ్గుదల కనిపించింది!! ఈ నేపథ్యంలో.. 2023-24 బ్యాచ్‌లో ఐఐటీలు, ఐఐఎంల్లో క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ ట్రెండ్స్‌పై కథనం..

- ప్లేస్‌మెంట్స్‌పై అంతర్జాయ పరిణామాలు, ఏఐ ప్రభావం
- గతంతో పోల్చితే తక్కువగానే ఆఫర్లు, వేతనాలు
- డేటా అనలిస్ట్‌లు, కోడింగ్‌కు పెరిగిన డిమాండ్

ఐఐటీల్లో 2024 బ్యాచ్ క్యాంపస్ ఆఫర్లలో తగ్గుదల కనిపించింది. తాజా గణాంకాలను పరిశీలిస్తే.. 30 శాతం మంది విద్యార్థులకు ఇంకా ఆఫర్లు అందాల్సి ఉంది. మొత్తం 23 ఐఐటీల్లో మొత్తం 21,500 మంది క్యాంపస్ డ్రైవ్స్‌కు దరఖాస్తు చేసుకోగా.. వారి లో 6,500 మంది ఆఫర్ల కోసం నిరీక్షిస్తున్నట్లు సమాచారం.

అంతర్జాతీయ పరిస్థితులు

ఐఐటీల్లో క్యాంపస్ డ్రైవ్స్‌లో తగ్గుదలకు ప్రస్తుతం అంతర్జాతీయంగా నెలకొన్న పరిస్థితులు కారణమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ముఖ్యంగా పలు దేశా ల్లో ఆర్థిక మందగమనం, అమెరికా ఎన్నికలు, ఉక్రె యిన్–రష్యా యుద్ధం, పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తదితర కారణాలతో సంస్థలు నూతన నియామకాల విషయంలో వేచి చూసే ధోరణి అవలంభిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో ఐఐటీల్లో ఇంటర్నేషనల్ ఆఫర్స్‌పై ఈ ప్రభావం ఎక్కువగానే పడినట్లు చెబుతున్నారు.

ఏఐ, చాట్ జీపీటీ ఎఫెక్ట్

ఐఐటీల్లో క్యాంపస్ డ్రైవ్స్‌పై ఏఐ, చాట్ జీపీటీ ప్రభావం సైతం పడిందనే వాదన వినిపిస్తోంది. చాట్ జీపీటీ, ఏఐ టూల్స్, జెన్ ఏఐ వంటి సాంకేతికతల కారణంగా.. ముగ్గురు చేసే పనిని ఇద్దరు పూర్తి చేస్తున్నారు. దీంతో సహజంగానే నియామకాల్లో 20 నుంచి 30 శాతం మేరకు కోత పడిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

జాబ్ రెడీ స్కిల్స్

ఐఐటీల్లో ఆఫర్లు తగ్గడానికి జాబ్ రెడీ స్కిల్స్ లేమి కూడా కారణమని చెబుతున్నారు. విద్యార్థుల్లో ఉద్యోగ నైపుణ్యాలు 80 శాతం మేరకే ఉంటున్నాయని పేర్కొంటున్నారు. విద్యార్థులు ఇంటర్న్‌షిప్ సమయంలో కోర్ నైపుణ్యాలకే ప్రాధాన్యమిస్తున్నారని.. రియల్ టైమ్ ఎక్స్‌పోజర్‌పై దృష్టి పెట్టడం లేదని, ఇదే జాబ్ రెడీ స్కిల్స్ కొరతకు కారణమవుతోందని అంటున్నారు.



డిమాండింగ్ జాబ్ ప్రొఫైల్స్

ఐఐటీ క్యాంపస్ డ్రైవ్స్‌లో జాబ్ ప్రొఫైల్స్‌ను పరిశీలిస్తే.. కోర్ ఇంజనీరింగ్, సాఫ్ట్‌వేర్ డెవలపర్స్ అండ్ ప్రోగ్రామర్స్, డేటా అనలిస్ట్స్, యుఎక్స్ డిజైనర్, ప్రొడక్ట్ డిజైనర్, ఫుల్‌స్టాక్ ఇంజనీర్ జాబ్ ప్రొఫైల్స్‌లో అత్యధిక సంఖ్యలో నియామకాలు జరిగాయి.

డేటా అనలిస్ట్‌లకు డిమాండ్

కన్సల్టింగ్, ఫైనాన్షియల్ రంగంలోని సంస్థలు డేటా అనలిస్ట్‌ల నియామకాలు ఎక్కువగా చేపట్టాయి. బీఎఫ్ఎస్ఐ, కన్సల్టింగ్ సంస్థలు.. క్లయింట్స్‌ను, వినియోగదారులను పెంచుకునే ప్రయత్నాల్లో ఉన్నాయి. అందుకే డేటా అనలిస్ట్‌లను ఎక్కువగా నియమించుకుంటున్నాయి. అదేవిధంగా కోడింగ్ స్కిల్స్‌కు కూడా డిమాండ్ అధికంగా కనిపించింది. ఐటీ మొదలు ఆన్‌లైన్ టెక్నాలజీస్ ఆధారంగా సేవలందిస్తున్న సంస్థల వరకూ.. అన్ని కంపెనీలు సాఫ్ట్‌వేర్స్, ప్రోగ్రామింగ్, డిజైనింగ్‌కు ప్రాధాన్యమిస్తుండటమే ఇందుకు కారణం.

టాప్ రిక్రూటర్స్ వీరే

ఐఐటీల్లో క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో.. క్వాల్‌కామ్, టెక్సాస్ ఇన్‌స్ట్రుమెంట్స్, గూగుల్, బార్‌క్లేస్, ఎస్ఏపీ ల్యాబ్స్, సిటీ బ్యాంక్, వెల్ ఫార్గో, మైక్రోసాఫ్ట్, బీసీజీ, బెయిన్ అండ్ కో సంస్థలు అంతర్జాతీయ ఆఫర్స్ అందించడంలో ముందంజలో ఉన్నాయి. డొమెస్టిక్ ఆఫర్స్ విషయంలో ఉబెర్, హనీవెల్, మైట్రాన్ టెక్నాలజీ, ఓఎన్‌జీసీ, ఫ్లిప్‌కార్ట్, బజాజ్ ఆటో, టాటా స్టీల్, ఎస్‌టీఎం మైక్రో ఎలక్ట్రికల్స్ వంటి సంస్థలు ముందు వరుసలో ఉన్నాయి.

కోడింగ్ నైపుణ్యాలు తప్పనిసరి

ఐఐటీల క్యాంపస్ డ్రైవ్స్‌లో సంస్థలు విద్యార్థుల్లోని కోడింగ్ నైపుణ్యాలపైనే ప్రధానంగా దృష్టి పెట్టాయి. రిటెన్ టెస్ట్‌లు, టెక్నికల్ రౌండ్స్‌లో కోడింగ్ సంబంధిత స్కిల్స్‌ను ఎక్కువగా పరిశీలించాయని ప్లేస్‌మెంట్ వర్గాలు పేర్కొన్నాయి. కోర్ ఇంజనీరింగ్, సర్క్యూట్ బ్రాంచ్‌లకు సంబంధించి ఆయా విభాగాల్లోని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ నైపుణ్యాలను పరిశీలించాయని తెలిపారు.

ఐఐఎం క్యాంపస్‌లలో

దేశంలో మేనేజ్‌మెంట్ విద్యకు కేరాఫ్‌గా నిలిచే ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ మేనేజ్‌మెంట్ క్యాంపస్‌లలో ఈ ఏడాది ఆఫర్స్ ఆశావాహంగానే ఉన్నట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. మొత్తం 21 ఐఐఎం క్యాంపస్‌లలో 2023–24లో పీజీ మేనేజ్‌మెంట్ విద్యార్థులకు 90 శాతం మందికిపైగా ఆఫర్లు లభించాయి. ప్రముఖ ఐఐఎం క్యాంపస్‌లలో నూటికి నూరు శాతం విద్యార్థులకు ఆఫర్లు సొంతమయ్యాయి.

- ఐఐఎం– బెంగళూరు క్యాంపస్‌లో పీజీపీ విద్యార్థులకు సగటున రూ.32.5 లక్షల వార్షిక వేతనంతో ఆఫర్లు లభించాయి.
- ఐఐఎం అహ్మదాబాద్‌లో 100 శాతం ప్లేస్‌మెంట్స్ నమోదయ్యాయి. ఈ క్యాంపస్‌లో సగటు వార్షిక వేతనం రూ.35 లక్షలుగా ఉండడం గమనార్హం.
- ఐఐఎం–కోల్‌కతలో కూడా 100 శాతం ప్లేస్‌మెంట్స్ లభించాయి.
- ఐఐఎం–లక్నోలో సగటు వేతనం రూ.30 లక్షలుగా నమోదైంది.
- ఐఐఎం–ఇండోర్, బోధ్‌గయ తదితర న్యూ జనరేషన్ ఐఐఎంలలో సగటు వేతనాల్లో తగ్గుదల కనిపించింది. అయితే వీటిలో 100 శాతం ప్లేస్‌మెంట్స్ లభించడం విశేషం.

ఈ మూడు రంగాలు

ఐఐఎంలలో 2024 ఫైనల్ ప్లేస్‌మెంట్స్‌లో కన్సల్టింగ్, ఫైనాన్స్, జనరల్ మేనేజ్‌మెంట్ విభాగాల హవా కనిపించింది. అంతర్జాతీయంగా పేరున్న బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్, పీడబ్ల్యూసీ, డెలాయిట్, కేపీఎంజీ, ఈ అండ్ వై తదితర సంస్థలు ఆఫర్ల విషయంలో ముందంజలో నిలిచాయి. వీటితో పాటు బీఎఫ్ఎస్ఐ, ఈ–కామర్స్, ఎడ్‌టెక్, ఫిన్‌టెక్, ఐటీ/ఐటీఈఎస్ సంస్థలు కూడా భారీ నియామకాలు చేపట్టాయి.

కన్సల్టింగ్ హవా

మొత్తం ఆఫర్లలో దాదాపు 40 శాతం కన్సల్టింగ్ సంస్థల నుంచే ఉండటం విశేషం. కార్పొరేట్ కంపెనీలు వ్యాపార ప్రణాళికల విస్తరణలో భాగంగా కన్సల్టింగ్ సంస్థలను సంప్రదిస్తున్నాయి. ఇదే ఇప్పుడు కన్సల్టింగ్ కంపెనీల్లో నియామకాలు భారీగా పెరగడానికి కారణమని చెబుతున్నారు.

- ఈ–కామర్స్, స్టార్టప్స్ ఆఫర్లు భారీగా లభించాయి. ఎప్పటి మాదిరిగానే కన్సల్టింగ్, బీఎఫ్ఎస్ఐ సంస్థలు ఆఫర్లలో ముందు వరుసలో నిలిచాయి. అదే విధంగా మాన్యు ఫ్యాక్చరింగ్ విభాగంలోనూ నియామకాలు ఆశాజనకంగానే కనిపించాయి. వీటిలోనూ అధిక శాతం డేటా అనాలిసిస్, బిగ్ డేటా, మార్కెటింగ్, ఫైనాన్స్ భాగాల్లోనే లభించాయి.

కంపెనీలు కోరుకుంటున్న లక్షణాలు

ఐఐఎం విద్యార్థులకు ఆఫర్లు ఖరారు చేసిన కార్పొరేట్ సంస్థలు.. ప్రాబ్లమ్ సాల్వింగ్ స్కిల్స్, ఇంటర్ పర్సనల్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్ వంటి నైపుణ్యాలకు ప్రాధాన్యం ఇచ్చాయి. కోర్ స్కిల్స్ కోణంలో సబ్జెక్ట్ నాలెడ్జ్‌తోపాటు సదరు సబ్జెక్ట్‌కు సంబంధించి డిజిటల్ నైపుణ్యాలున్న విద్యార్థుల కోసం ప్రత్యేక దృష్టి పెట్టాయి. అదే విధంగా బిజినెస్ అనలిటిక్స్, డేటా అనలిటిక్స్, డేటా మేనేజ్‌మెంట్ వంటి లేటెస్ట్ స్కిల్స్ ఉన్న విద్యార్థులకు పెద్ద పీట వేశాయని ఆయా గణంకాలు స్పష్టం చేస్తున్నాయి.



సిడ్బీలో 22 కన్సల్టెంట్ క్రెడిట్ అనలిస్ట్ పోస్టులు

లక్నోలోని స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(సిడ్బీ).. ఒప్పంద ప్రాతిపదికన కన్సల్టెంట్ క్రెడిట్ అనలిస్ట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 22.
» **పోస్టుల వివరాలు:** కన్సల్టెంట్ క్రెడిట్ అనలిస్ట్–19, అకౌంట్స్ అండ్ ట్యాక్స్ కన్సల్టెట్ (ఏటీసీ)–03.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో సీఏ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 28 ఏళ్లు మించకూడదు. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, పీడబ్ల్యూబీడీలకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
» **ఎంపిక విధానం:** సైకోమెట్రిక్ టెస్ట్, షార్ట్‌లిస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం:

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 10.10.2024.
» **పనిచేయాల్సిన ప్రదేశాలు:** ముంబై, లక్నో, న్యూఢిల్లీ, అహ్మదాబాద్, చెన్నై.
» **వెబ్‌సైట్:** https://www.sidbi.in/en/

సిడ్బీలో జూనియర్ లెవల్ ఆఫీసర్ పోస్టులు

లక్నోలోని స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(సిడ్బీ).. ఒప్పంద ప్రాతిపదికన జూనియర్ లెవల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 03.
» **విభాగాలు:** మిడ్ ఆఫీస్ (మార్కెట్ రిస్క్ మేనేజర్), ఆపరేషనల్ రిస్క్ మేనేజర్.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో సీఏ/సీఎఫ్ఏ, బీఈ/బీటెక్, ఎంబీఏ/ఎంఎంఎస్/ఎంఎస్/పీజీడీఎం(ఫైనాన్స్), ఎంఎస్సీ/ఎంఏ (మ్యాథ్స్ /స్టాటిస్టిక్స్/ ఎకనామిక్స్) ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 35 ఏళ్లు మించకూడదు. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, పీడబ్ల్యూబీడీలకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
» **ఎంపిక విధానం:** మెరిట్ లిస్ట్, షార్ట్‌లిస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం:

» **దరఖాస్తు విధానం:** ఈమెయిల్ ద్వారా
» **ఈమెయిల్:** RIMV_MidOffice@sidbi.in.
» **దరఖాస్తులకు చివరితేది:** 18.10.2024.
» **పని చేయాల్సిన ప్రదేశం:** ముంబై.
» **వెబ్‌సైట్:** https://www.sidbi.in/

సెస్, హైదరాబాద్‌లో వివిధ ఉద్యోగాలు

హైదరాబాద్‌లోని తెలంగాణ ప్రభుత్వ మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖలో సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ స్టడీస్(సెస్).. ఒప్పంద ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 05.
» **పోస్టుల వివరాలు:** ప్రోగ్రామ్ ఆఫీసర్–01, అకౌంటెంట్స్ ఆఫీసర్–01, అసిస్టెంట్ కమ్ డేటా ఎంట్రీ ఆపరేటర్–02, అటెండర్–01.
» **అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి, 12వ తరగతి ఉత్తీర్ణులవ్వాలి. సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవముండాలి.
» **వయసు:** 21 ఏళ్లు మించకూడదు.

ముఖ్య సమాచారం:

» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును సంబంధిత సర్టిఫికేట్ల జిరాక్స్ కాపీలతో పాటు డైరెక్టర్, సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ స్టడీస్, నిజామియా అబ్జర్వేటరీ క్యాంపస్, బేగంపేట్, హైదరాబాద్ చిరునామకు వ్యక్తిగతంగా లేదా రిజిస్టర్డ్/స్పీడ్ పోస్టు ద్వారా నోటిఫికేషన్ వెలువడిన 15 రోజుల్లోగా పంపించాలి.
» **నోటిఫికేషన్ తేది:** 29.09.2024.
» **వెబ్‌సైట్:** http://cess.ac.in/

ట్రిపుల్ ఐటీ డీఎం కర్నూల్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు

కర్నూల్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ డిజైన్ అండ్ మ్యానుఫ్యాక్చరింగ్(ట్రిపుల్ ఐటీ డీఎం).. తాత్కాలిక ప్రాతిపదికన అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. » **మొత్తం పోస్టుల సంఖ్య:** 02.
» **విభాగం:** కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్.
» **అర్హత:** పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.70,000.

ముఖ్య సమాచారం:

» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును రిజిస్ట్రార్, ట్రిపుల్‌ఐటీ డీఎం కర్నూలు, జగన్నాథగట్టు, కర్నూలు చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 22.10.2024.
» **వెబ్‌సైట్:** http://iiitk.ac.in/

ట్రిపుల్ ఐటీ శ్రీ సిటీ, చిత్తూరులో టీచింగ్ పోస్టులు

చిత్తూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శ్రీ సిటీ(ట్రిపుల్ ఐటీ శ్రీ సిటీ).. టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **పోస్టులు:** విజిటింగ్ ఫ్యాకల్టీ/అడ్జంక్ట్ ఫ్యాకల్టీ.
» **విభాగాలు:** కంప్యూటర్ అండ్ కమ్యూనికేషన్ నెట్‌వర్క్, డేటా అనాలిసిస్, ఏఐఎంఎల్, డీప్ లెర్నింగ్, పైథాన్ ఫర్ డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ.
» **అర్హత:** సంబంధిత విభాగంలో పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణులవ్వాలి. పని అనుభవం తప్పనిసరిగా ఉండాలి.

ముఖ్య సమాచారం:

» **స్కాన్ చేసిన సర్టిఫికేట్‌లు పంపాల్సిన ఈమెయిల్:** careers.faculty@iiits.in.
» **దరఖాస్తులకు చివరితేది:** 15.11.2024.
» **వెబ్‌సైట్:** https://www.iiits.ac.in/



ఎములాడలో 'ఏడొద్దుల' సందడి

వేములవాడ: తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మలతో, మహిళల ఆటపాటలతో మూల వాగు మురిసింది. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలో మంగళవారం ఏడొద్దుల సద్దుల బతుకమ్మ వేడుకలు అంబరాన్నంటాయి. మూలవాగు ఒడ్డున ప్రత్యేకంగా బతుకమ్మ తెప్పను ఏర్పాటు చేశారు. మహిళలు పెద్దసంఖ్యలో మూలవాగుకు చేరుకొని ఆడిపాడి బతుకమ్మలను నిమజ్జనం చేశారు.



ఒక్కేసి.. పువ్వేసి..

సాక్షి, హైదరాబాద్ : హైదరాబాద్ నాంపల్లిలోని టీజీవో భవన్‌లో టీజీవో కేంద్ర సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బతుకమ్మ వేడుకల్లో మంత్రి సీతక్క పాల్గొని ఉద్యోగులతో కలసి బతుకమ్మ ఆడి సందడి చేశారు.



సచివాలయంలో బతుకమ్మకు పూజలు చేస్తున్న సీఎస్ శాంతికుమారి తదితరులు

'సద్దుల బతుకమ్మ'ను ఘనంగా నిర్వహించాలి

- 10న అమరవీరుల స్తూపం నుంచి ట్యాంక్‌బండ్ వరకు బతుకమ్మలతో ర్యాలీ
- తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించిన సీఎస్ శాంతికుమారి

సాక్షి, హైదరాబాద్: సద్దుల బతుకమ్మ ఉత్సవాలను ఈనెల 10న అత్యంత ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. వేలాది మంది మహిళలతో హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై నిర్వహించే ఈ ఉత్సవాలకు తగిన ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అధికారులను ఆదేశించారు. మంగళవారం సచివాలయంలో వివిధ శాఖల అధికారులతో సీఎస్ సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఈనెల 10న సాయంత్రం సచివాలయం ఎదురుగా ఉన్న అమరవీరుల స్మారక కేంద్రం నుంచి బతుకమ్మలతో మహిళలు ట్యాంక్‌బండ్‌పైకి చేరుకుంటారని, వీరితోపాటు వందలాది మంది కళాకారులు తమ కళారూపాలతో ర్యాలీగా వస్తారన్నారు. బుద్ధ విగ్రహం, సంజీవయ్య పార్క్‌లనుంచి ప్రత్యేకంగా ఫైర్ వర్క్స్, లేజర్ షోల ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు.

ప్రధాన కూడళ్లలో బతుకమ్మల ఏర్పాట్లు

బతుకమ్మ ఉత్సవాలను పురస్కరించుకొని పండుగ శోభ వచ్చేలా నగరంలోని 150 ప్రధాన కూడళ్లలో బతుకమ్మలను ఏర్పాటు చేయాలన్నారు. నగరంలోని పలు జంక్షన్లను, ప్రభుత్వ కార్యాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించాలని సూచించారు. ట్యాంక్‌బండ్‌పై బతుకమ్మ ఆడేందుకు సమీపంలోని కాలనీలు, బస్తీల నుంచి పెద్ద ఎత్తున మహిళలు వచ్చే అవకాశమున్నందున వారికి ఏవిధమైన ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అదే విధంగా ట్యాంక్ బండ్ చిల్డ్రన్స్ పార్క్‌లో ఉన్న బతుకమ్మ ఘాట్‌తో పాటు నెక్లెస్ రోడ్డులో బతుకమ్మల నిమజ్జనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ అధికారులను కోరారు. సాయంత్రం 5 గంటల నుంచి 7.30 గంటల మధ్య ట్యాంక్‌బండ్‌పై బతుకమ్మ ఉత్సవాల నేపథ్యంలో ట్రాఫిక్ మళ్లింపు, బారికేడ్లను ఏర్పాట్లను చేయాలన్నారు. సమావేశంలో ప్రభుత్వ ముఖ్య కార్యదర్శులు వాణి ప్రసాద్, దాన కిషోర్, ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా చోంగ్తు, హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, రోడ్లు భవనాల శాఖ ప్రత్యేక కార్యదర్శి హరిచందన, ఇంధనశాఖ కార్యదర్శి రోనాల్డ్ రోస్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి, జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి, సమాచార శాఖ స్పెషల్ కమిషనర్ హనుమంతరావు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



మంగళవారం మాసబ్‌ట్యాంక్‌లోని సంక్షేమ భవన్‌లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ బాల మాయాదేవి తదితరులు

క్లుప్తంగా...

రూ. పది కోట్లు కొట్టేసి.. పోలీసులకు చిక్కి...

- పోలీసులమంటూ బెదిరించి ఓ వృద్ధుడి నుంచి రూ.10.61 కోట్లు వసూలు చేసిన నేరగాళ్లు
- బెంగళూరులో నిందితులను అరెస్టు చేసిన టీజీసీఎస్‌బీ.. హైదరాబాద్‌కు తరలింపు

సాక్షి, హైదరాబాద్: ముంబైలో మీ పై కేసు నమోదైందని ఓ వృద్ధుడిని బెదిరించి అతడి నుంచి రూ.10.61 కోట్లు కొల్లగొట్టిన కేసులో ఇద్దరు నిందితులను తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ) అధికారులు అరెస్టు చేశారు. ఇద్దరు నిందితులను బెంగళూరులో అరెస్టు చేసి హైదరాబాద్‌కు తరలించినట్లు టీజీసీఎస్‌బీ అధికారులు మంగళవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. నిందితులను బెంగళూరుకు చెందిన వినయ్ కుమార్, మారుతిగా గుర్తించినట్లు పేర్కొన్నారు. కేసు వివరాలిలా ఉన్నాయి. హైదరాబాద్‌కు చెందిన ఓ వృద్ధుడికి గత నెలలో గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి ముంబై పోలీసులుగా పరిచయం చేసుకున్నారు. బ్యాంకు ఖాతా నుంచి మనీ లాండరింగ్ జరిగిందని వృద్ధుడిని ఫోన్‌లో బెదిరించారు. అనంతరం సీబీఐ, ఈడీ, ఆదాయపు పన్ను శాఖతోపాటు పలు శాఖల పేరిట నకిలీ నోటీసులు పంపి ఆయనపై ఒత్తిడి తెచ్చారు. ఈ కేసులో మూడు నుంచి ఐదేళ్లు శిక్ష తప్పదని, కేసు తేలేవరకు ఆస్తులు జప్తు చేస్తామని బెదరగొట్టారు. అడిగినంత డబ్బు ఇస్తే ఈ కేసు నుంచి బయటపడేస్తామని వృద్ధుడికి నమ్మబలికారు. దీంతో సదరు వృద్ధుడు సైబర్ నేరగాళ్లు సూచించిన బ్యాంకు ఖాతాకు పలు దఫాలుగా రూ.10.61 కోట్లు చెల్లించాడు. తర్వాత వారి నుంచి ఎటువంటి ఫోన్ కాల్స్ రాకపోవడంతో తాను మోసపోయానని గ్రహించిన వృద్ధుడు పోలీసులను ఆశ్రయించాడు. దీంతో రంగంలోకి దిగిన టీజీసీఎస్‌బీ అధికారులు నేరగాళ్లను పట్టుకున్నారు.

ఢిల్లీకి ముడుపులంటూ మతిలేని మాటలు

బీఆర్ఎస్ బతికే ఉందని చెప్పుకునేందుకే కేటీఆర్ ప్రయత్నాలు: బీర్ల అయిలయ్య



సాక్షి, హైదరాబాద్: ప్రజాపాలనను ఓర్వలేకనే సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శలు చేస్తున్నారని, ఢిల్లీకి ముడుపులు తీసుకెళ్తున్నారంటూ మతిలేని మాటలు మాట్లాడుతున్నారని అసెంబ్లీలో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య విమర్శించారు. మంగళవారం సీఎల్పీ మీడియా హాల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ పర్యటన గురించి కేటీఆర్ విమర్శలు చేయడం సిగ్గుచేటని అన్నారు. కేంద్ర మంత్రులతో సమావేశమయ్యేందుకు, వరద సాయం విడుదల చేయాలని కేంద్రాన్ని కోరేందుకు రేవంత్‌రెడ్డి ఢిల్లీ వెళ్లారని, రాష్ట్ర అభివృద్ధి కోసం 23 సార్లు కాకపోతే 230సార్లు కూడా ఆయన ఢిల్లీ వెళ్తారని చెప్పారు. ప్రతిపక్ష నాయకుడు కేసీఆర్ ప్రజల సొమ్మును జీతంగా తీసుకుంటూ ఫామ్‌హౌస్‌కు పరిమితమయ్యారని, కానీ తమ సీఎం అలా కాదని ఎద్దేవా చేశారు. డబ్బుల మూటలు ఢిల్లీకి తీసుకెళ్లింది ఎవరో, అక్కడ దొరికి జైలుకు వెళ్లింది ఎవరో రాష్ట్ర ప్రజలకు తెలుసునని అన్నారు. ఢిల్లీలో ముడుపులిచ్చి దొరికిపోయి జైలుకు వెళ్లింది కేటీఆర్ చెల్లెలు కాదా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ దుకాణం బంద్ అయిందని, చచ్చిపోయిన బీఆర్ఎస్ బతికి ఉందని చెప్పుకునేందుకే రేవంత్‌రెడ్డిపై కేటీఆర్ విమర్శలు చేస్తున్నారని అయిలయ్య పేర్కొన్నారు.

అందంగా ఉన్నావనగానే..

ఓ ట్యాక్సీ డ్రైవర్ కోసం లండన్ నుంచి హైదరాబాద్ వచ్చేసిన వివాహిత

- 17 ఏళ్ల వివాహ బంధాన్ని పక్కనపెట్టి.. పిల్లలను వదిలేసి రాక
- భర్త ఇచ్చిన ఆన్‌లైన్ ఫిర్యాదుతో రంగంలోకి దిగిన ఆర్‌జీఐఏ పోలీసులు
- ఫోన్ ట్రాకింగ్‌తో వారి గుర్తింపు.. ట్యాక్సీ డ్రైవర్ ట్రాప్ చేశాడన్న మహిళ
- వివాహిత ఇష్టపూర్వకంగానే వచ్చిందన్న యువకుడు
- భర్త విజ్ఞప్తితో లండన్ విమానం ఎక్కించి పంపిన పోలీసులు



శంషాబాద్: 'మీరు చాలా అందంగా ఉన్నారు' అంటూ ఓ యువకుడు పంపిన మేసేజ్‌కు ఆ వివాహిత మనసు గతితప్పింది. 'మీ నవ్వు బాగుంటుంది' అన్న మేసేజ్ చూడగానే 17 ఏళ్ల వివాహ బంధాన్ని సైతం ఆమె పక్కన పెట్టేసింది. తనకు ఇద్దరు పిల్లలు ఉన్నారన్న స్పృహ మరచి మెసేజ్ పంపిన వ్యక్తి కోసం ఏకంగా విదేశాల నుంచి రెక్కలు కట్టుకొని భాగ్యనగరానికి వాలిపోయింది.

ఆన్‌లైన్ పేమెంట్‌తో..

ఆర్‌జీఐఏ సీఐ బాలరాజు తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్ అల్వాల్‌కు చెందిన ఓ జంటకు 17 ఏళ్ల కిందట పెళ్లయింది. వారికి 13 ఏళ్ల కుమారుడు, 12 ఏళ్ల కుమార్తె ఉన్నారు. కొంతకాలం కిందట భర్తకు లండన్‌లో ఉద్యోగం రావడంతో అయన ఒక్కడే అక్కడికి వెళ్లి ఉద్యోగం చేసుకుంటున్నాడు. ఈ క్రమంలో ఈ ఏడాది ఫిబ్రవరిలో వివాహిత తల్లి చనిపోవడంతో ఆమె అస్తికలను కలిపేందుకు పహాడీషరీఫ్‌కు చెందిన ఓ ట్రావెల్స్ కారును బుక్ చేసుకొని వెళ్లి వచ్చింది. గూగుల్ పే ద్వారా ట్యాక్సీ డ్రైవర్ శివకు కిరాయి చెల్లించింది. దీంతో వివాహితపై కన్నేసిన అతను.. ఆమెకు గుడ్ మార్నింగ్ సందేశాలు పంపేవాడు. తొలుత వాటిని పట్టించుకోని వివాహిత ఆ తర్వాత అతని పొగడ్తల సందేశాలకు కరిగిపోయింది. ట్యాక్సీ డ్రైవర్‌తో ఫోన్లో సంభాషించడంతోపాటు పలుమార్లు అతన్ని కలిసింది. ఆమె ప్రవర్తనలో తేడాను గమనించిన అత్తింటి వారు.. ఈ విషయాన్ని భర్తకు ఫోన్లో వివరించారు. దీంతో అతను భార్య, ఇద్దరు పిల్లలను సెప్టెంబర్ 16న హైదరాబాద్ నుంచి లండన్ రప్పించుకున్నాడు.

ఏం జరిగింది..?

లండన్ వెళ్లినా వారి మధ్య సంభాషణలు కొనసాగాయి. సెప్టెంబర్ 29న భర్త తల్లి చనిపోవడంతో అతను హైదరాబాద్ వచ్చాడు. ఆ మర్నాడే వివాహిత తన ఇద్దరి పిల్లలను లండన్‌లోని ఓ పార్కుకు తీసుకొచ్చి అక్కడే వదిలేసి ట్యాక్సీ డ్రైవర్‌ను కలిసేందుకు ముంబై మీదుగా హైదరాబాద్ చేరుకుంది. తల్లి తమను వదిలేసి ఎటో వెళ్లిపోయిందంటూ పిల్లలు తండ్రికి ఫోన్లో చెప్పడంతో అతను హుటాహుటిన ఈ నెల 1న లండన్‌కు తిరిగి చేరుకున్నాడు. భార్యకు పలుమార్లు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. చివరకు కాల్ కలవడంతో ఆమెతో మాట్లాడగా తనను ఎవరో కిడ్నాప్ చేసి శంషాబాద్ మధురానగర్ నుంచి బాలాపూర్ వైపు తీసుకెళ్తున్నట్లు భర్తకు చెప్పింది. దీంతో అతను వెంటనే తన స్నేహితులకు సమాచారం ఇవ్వడంతోపాటు ఆన్‌లైన్‌లో ఆర్‌జీఐఏ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న ఆర్‌జీఐఏ పోలీసులు పలు బృందాలుగా ఏర్పడి దర్యాప్తు ప్రారంభించారు. ఆర్‌జీఐఏ, రాజేంద్రనగర్, బోయిన్‌పల్లి పోలీసులు ఆమె ఫోన్‌ను ట్రాక్ చేయగా చివరకు ఫోన్ లొకేషన్ రాజేంద్రనగర్‌లో చూపింది.

శంషాబాద్ టు గోవా..

పలుమార్లు ట్యాక్సీ డ్రైవర్ ఫోన్‌కు కూడా ఫోన్లు చేయగా ఓసారి వివాహిత లిఫ్ట్ చేసి మాట్లాడింది. ట్యాక్సీ డ్రైవర్ తనను ట్రాప్ చేశాడని.. తాము గోవాలో ఉన్నట్లు తెలిపి లైవ్ లోకేషన్ షేర్ చేసింది. అక్కడి నుంచి బస్సులో హైదరాబాద్ వస్తున్నట్లు బస్సు టికెట్‌ను వాట్సాప్ చేసింది. దీంతో పోలీసులు సోమవారం ఉదయం ఆరాంఘర్ వద్ద వారిని బస్సులోంచి దింపి ఆర్‌జీఐఏ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తనకు చెప్పకుండా లండన్ ఎందుకు వెళ్లావని.. ఆత్మహత్య చేసుకొని నువ్వే కారణమని చెబుతానని ట్యాక్సీ డ్రైవర్ బ్లాక్‌మెయిల్ చేయడంతోనే తాను హైదరాబాద్‌కు వచ్చానని వివాహిత పోలీసులకు తెలిపింది. అయితే ట్యాక్సీ డ్రైవర్ మాత్రం ఈ నెల 5న తన పుట్టినరోజు ఉన్నందున.. ఆ వేడుకకు రావాలని ఆహ్వానించడంతో వివాహిత ఇష్టపూర్వకంగానే వచ్చిందని పోలీసులకు వివరించాడు. మరోవైపు తన భార్యను తిరిగి లండన్ పంపాలని భర్త ఆర్‌జీఐఏ పోలీసులను కోరాడు. దీంతో పోలీసులు ఆమెను సోమవారం సాయంత్రం దగ్గరుండి లండన్ విమానం ఎక్కించారు. ట్యాక్సీ డ్రైవర్‌ను విచారించిన పోలీసులు... ఇద్దరు మేజర్లు ఇష్టపూర్వకంగానే కలుసుకున్నందున అతనిపై కేసు నమోదు చేయలేదు.

ఆర్జీ కర్‌లో 50 మంది సీనియర్ డాక్టర్ల రాజీనామా


జూనియర్లకు మద్దతుగా నిర్ణయం...

కోల్‌కతా: ఆర్జీ కర్ ఆస్పత్రిలో అత్యాచారం, హత్య బాధితురాలికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న జూనియర్లకు సంఘీభావంగా 50 మంది సీనియర్ వైద్యులు రాజీనామా చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే తాము సైతం ఇదే బాటలో పయనిస్తామని రాష్ట్రంలోని ఇతర మెడికల్ కాలేజీలకు చెందిన సీనియర్ డాక్టర్లు ఒక ప్రకటనలో తెలిపారు. తమ సహచర ట్రైనీ డాక్టర్‌పై అత్యాచారం, హత్యకు సంబంధించిన దర్యాప్తులో పురోగతి లేదని, ఆస్పత్రిలో మెరుగైన భద్రత కల్పించాలని, ఆరోగ్య కార్యదర్శిని తొలగించాలని డిమాండ్ చేస్తూ జూనియర్ డాక్టర్లు అక్టోబర్ 5 నుంచి ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్నారు. ఆందోళన చేస్తున్న జూనియర్ డాక్టర్ల ఆరోగ్యం క్షీణిస్తుండటంతో మంగళవారం ఉదయం సమావేశమైన వివిధ విభాగాధిపతులు మూకుమ్మడి రాజీనామా నిర్ణయం తీసుకున్నారు. తమ జూనియర్ సహోద్యోగుల డిమాండ్లేవీ ఇంతవరకు నెరవేరలేదని సీనియర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న వైద్యుల ఆరోగ్యం క్షీణిస్తోందని, వారితో సయోధ్య కుదుర్చుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. జూనియర్ డాక్టర్ల న్యాయమైన డిమాండ్లపై ప్రభుత్వం స్పందించకపోతే.. ప్రభుత్వ ఆస్పత్రు ల్లోని సీనియర్ డాక్టర్లందరూ రాజీనామా పత్రాలను సమర్పించాలని రాష్ట్ర వ్యాప్త పిలుపునిస్తామని హెచ్చరించారు. జూనియర్ డాక్టర్లు ఆమరణ నిరాహార దీక్షను కొనసాగించగా, దాదాపు 15 మంది సీనియర్ డాక్టర్లు సంఘీభావంగా దీక్షలో పాల్గొన్నారు. అనంతరం మంగళవారం సాయంత్రం డాక్టర్లు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు.

జేపీడీ సంఘీభావం..: జూనియర్ డాక్టర్లకు పశ్చిమ బెంగాల్ వైద్యుల సంయుక్త వేదిక సంఘీభావం తెలిపింది. ఈ మేరకు మంగళవారం ప్రకటన విడుదల చేసింది. ''జూడాలు తమ డిమాండ్ల కోసం 5 రోజులుగా దీక్షలు చేస్తున్నారు. అధికారుల నుంచి ఎటువంటి ప్రతిస్పందన లేదు. ఈ పరిస్థితుల్లో రాజీనామా చేసిన వైద్య అధ్యా పకులు, ప్రభుత్వ వైద్యుల రాజీనామాలకు పశ్చిమ బెంగాల్ వైద్యుల సంయుక్త వేదిక సంఘీభావంగా నిలుస్తుంది'' అని తమ ప్రకటనలో పేర్కొంది.

బోర్డు తిప్పేసి.. రూ.7 వేల కోట్లు కొట్టేసి..

- ఏడాదికి 120 శాతం వడ్డీ పేరుతో డిపాజిట్ల సేకరణ
- భారత్‌తోపాటు ఆస్ట్రేలియాలోనూ వసూళ్లు
- ఇన్వెస్టర్లకు కుచ్చుటోపీ పెట్టిన డీబీ స్టాక్ బ్రోకింగ్
- హైదరాబాద్‌లోనూ ఈ సంస్థకు కార్యకలాపాలు



సాక్షి, హైదరాబాద్: ఒకటి రెండు కాదు ఏకంగా రూ.7 వేల కోట్ల స్కాం జరిగింది. అధిక వడ్డీ ఆశ చూపించి పెట్టుబడిదారులకు కుచ్చుటోపీ పెట్టింది అస్సాంలోని గువాహటికి చెందిన డీబీ స్టాక్ బ్రోకింగ్. ఈ సంస్థకు హైదరాబాద్‌లోని కేపీహెచ్‌బీ కాలనీలోనూ కార్యాలయం ఉంది. నగరానికి చెందిన వందలాది మంది ఇన్వెస్టర్లు డీబీ స్టాక్ బ్రోకింగ్‌లో పెట్టుబడులు పెట్టారు. వడ్డీ కాదు కదా అసలు కూడా చెల్లించకుండా బిచాణా ఎత్తివేయడంతో లబోదిబోమంటూ బాధితులు సైబరాబాద్ పోలీసులను ఆశ్రయించారు. దీంతో ఆర్థిక నేరాల నియంత్రణ విభాగం (ఈఓడబ్ల్యూ)లో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపడుతున్నారు.

23 వేల మంది పెట్టుబడులు

అస్సాంకు చెందిన దీపాంకర్ బర్మన్ 2018లో డీబీ స్టాక్ బ్రోకింగ్‌ను ప్రారంభించారు. ఈ సంస్థకు గువాహటితోపాటు హైదరాబాద్, బెంగళూరు, ముంబైలోనూ కార్యాలయాలున్నాయి. పెట్టుబడులపై ఏడాదికి 120 శాతం, ఆరు నెలలకు 54 శాతం, మూడు నెలలకు 27 శాతం, నెలకు 8 శాతం చొప్పున వడ్డీ ఇస్తామని ప్రకటించారు. దీంతో స్థానికులతోపాటు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, వివిధ రంగాలకు చెందిన నిపుణులు పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టారు. ఇన్వెస్టర్లను ఆకర్షించేందుకు కొంతకాలంపాటు వడ్డీ చెల్లించిన ఈ సంస్థ.. ఈ ఏడాది జూలై నుంచి చెల్లింపులు నిలిపివేసింది. అధిక వడ్డీ ఆశ చూపించి మన దేశంతో పాటు ఆస్ట్రేలియాలో ఇన్వెస్టర్ల నుంచి కూడా డిపాజిట్లు సేకరించారు. సుమారు 23 వేల మంది పెట్టుబడులు పెట్టారు. గత నెలలో పుప్పాలగూడకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి పంచాక్షర్ రూ. 11 లక్షలు, గంటాడి హరి రూ. 88.50 లక్షలు, విశ్వజీత్ సింగ్ రూ. 36.80 లక్షలు, పి.రాజు మహేంద్ర కుమార్ రూ. 26 లక్షలు, వందపాటి లక్ష్మి రూ. 64.50 లక్షలు.. ఇలా డీబీ స్టాక్ బ్రోకింగ్‌లో పెట్టుబడులు పెట్టి మోసపోయామని పలువురు బాధితులు సైబరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు దీపాంకర్ బర్మన్, అతని సహచరులపై చీటింగ్‌తోపాటు ఇతర సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ఆగస్టు 21న బర్మన్ అస్సాంలోని ఆఫీసు బోర్డు తిప్పేసి గువాహటి నుంచి పరారయ్యారు. దీంతో పాన్ బజార్ పోలీసు స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి. తెలుగు రాష్ట్రాలకు చెందిన ఇన్వెస్టర్లు ఫిర్యాదు చేసేందుకు ముందుకు రావాలని పోలీసులు సూచించారు. బర్మన్ ఆస్ట్రేలియాలో తలదాచుకున్నట్లు అనుమానిస్తున్నారు.

ఈడీ విచారణకు హాజరైన అజారుద్దీన్

- హెచ్‌సీఏలో నిధుల అవకతవకలపై విచారణ.. తొమ్మిది గంటలపాటు ప్రశ్నించిన అధికారులు
- అవన్నీ నిరాధారమైన ఆరోపణలు
- మీడియాతో అజారుద్దీన్



సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) నిధుల అవకతవకలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)అధికారులు హెచ్‌సీఏ మాజీ అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత మహ్మద్ అజారుద్దీన్‌ను ప్రశ్నించారు. మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో ఈడీ కార్యాలయానికి చేరుకున్న అజారుద్దీన్‌ను తొమ్మిది గంటలపాటు ఈడీ అధికారులు పలు అంశాలపై ఆరా తీశారు. హెచ్‌సీఏ నిధుల్లో మొత్తం రూ.20 కోట్ల మేర అక్రమాలు జరిగినట్టు వచ్చిన ఆరోపణలపై తెలంగాణ ఏసీబీ అధికారులు 3 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ కేసుల ఆధారంగా మనీలాండరింగ్ కోణంలో మరో కేసు నమోదు చేసిన ఈడీ అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. కేసు దర్యాప్తులో భాగంగా ఈడీ అధికారులు గతేడాది నవంబర్‌లో పలుచోట్ల సోదాలు సైతం చేశారు. అందులో లభించిన ఆధారాల మేరకు అజారుద్దీన్‌ను ఈ నెల 3న విచారణకు హాజరుకావాల్సిందిగా తొలుత నోటీసులు జారీ చేశారు. అజారుద్దీన్ విచారణకు రాకపోవడంతో ఈ నెల 8న మళ్లీ నోటీసులు ఇచ్చారు. దీంతో మంగళవారం ఆయన ఈడీ ఎదుట హాజరయ్యారు. అసిస్టెంట్ డైరెక్టర్ ఆధ్వర్యంలో ముగ్గురు సభ్యుల స్పెషల్ టీమ్ అజారుద్దీన్‌ను ప్రశ్నించింది. 2020 మార్చి నుంచి 2023 ఫిబ్రవరి మధ్య హెచ్‌సీఏ ఆర్థికలావాదేవీల వివరాలు సేకరించినట్టు తెలిసింది. పలు సామగ్రి కొనుగోలు వివరాలు, వాటి టెండర్లు, ఇతర వివరాలు సేకరించినట్టు సమాచారం. ఇందుకు సంబంధించిన పూర్తి ఆధారాలను అందించాలని ఈడీ అధికారులు ఆదేశించినట్టు తెలిసింది. విచారణకు అందుబాటులో ఉండాలని, అవసరమైతే మళ్లీ పిలుస్తామని చెప్పినట్టు సమాచారం. అయితే తనపై వస్తున్న ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవి, ఈడీ అధికారులు అడిగిన పత్రాలు, సమాచారం ఇచ్చినట్టు విచారణ అనంతరం అజారుద్దీన్ మీడియాకు చెప్పారు.

జమ్మూలో విజయం చరిత్రాత్మకం

ప్రజలు మాతో ఉన్నట్లు రుజువైంది: కిషన్‌రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: జమ్మూ ప్రాంతంలో బీజేపీ విజయం చరిత్రాత్మకమని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి, జమ్మూ కశ్మీర్ ఎన్నికల ఇన్‌చార్జి జి.కిషన్‌రెడ్డి అన్నారు. జమ్మూ ప్రజలు బీజేపీతో ఉన్నారని మరోసారి నిరూపితమైందని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో కంటే ఎక్కువ సీట్లు, ఓట్లు పొందామని, కాంగ్రెస్ ముక్త జమ్మూకశ్మీర్ సాధనలో విజయం సాధించామని తెలిపారు. ఇకపై జమ్మూకశ్మీర్ అభివృద్ధి కోసం ప్రజలతో కలిసి మరింత కష్టపడి పనిచేస్తామన్నారు. ప్రధాని మోదీపై ప్రజలకున్న విశ్వాసమేంటో.. జమ్మూకశ్మీర్, హరియాణా ఎన్నికల ఫలితాలు స్పష్టం చేశాయన్నారు. ప్రజలు చూపించిన విశ్వాసంతోనే.. జమ్మూ ప్రాంతంలోని 43 అసెంబ్లీ స్థానాల్లో.. బీజేపీ 29 స్థానాలు గెలుచుకోగా.. కాంగ్రెస్ కేవలం ఒక్క సీటుకే పరిమితమైందన్నారు. కేంద్ర పార్టీ నాయకత్వ మార్గదర్శనంలో కశ్మీర్ రాష్ట్ర నాయకులు అన్ని స్థాయిల్లో కష్టపడి పనిచేశారని కిషన్‌రెడ్డి తెలిపారు.

స్క్రాప్ స్వచ్ఛందమే

▶ మొదటి పేజీ తరువాయి

నాన్ ట్రాన్స్‌పోర్టు వాహనాల తరహాలోనే వర్తిస్తాయి.

- ప్రభుత్వ వాహనాల విషయంలో మాత్రం నిర్బంధ స్క్రాప్ విధానమే వర్తిస్తుంది. పదిహేనేళ్లు దాటిన ప్రతి ప్రభుత్వ వాహనాన్ని ఈ–ఆక్షన్ పద్ధతిలో తుక్కు కింద తొలగించాల్సిందే. అవి రోడ్డెక్కడానికి వీలు లేదు.
- ఏ కేటగిరీ వాహనాన్ని స్క్రాప్‌గా మారిస్తే.. అదే కేటగిరీ కొత్త వాహనంపై మాత్రమే రాయితీ వర్తిస్తుంది. ఉదాహరణకు ద్విచక్రవాహనాన్ని తుక్కుగా మారిస్తే.. మళ్లీ ద్విచక్రవాహనం కొంటేనే రాయితీ వర్తిస్తుంది. అంతేకాదు వాహనాన్ని తుక్కుగా మార్చిన రెండేళ్లలోపే ఈ రాయితీ పొందాల్సి ఉంటుంది.

కేంద్రం చట్టం చేసిన మూడేళ్ల తర్వాత..: దేశవ్యాప్తంగా వాహన కాలుష్యం పెరుగుతోందంటూ సుప్రీం కోర్టు ఆందోళన వ్యక్తం చేసిన నేపథ్యంలో.. కేంద్ర ప్రభుత్వం మోటారు వాహన చట్టానికి సవరణ చేసింది. 15 ఏళ్లు దాటిన వాహనాలను తుక్కుగా మార్చాలన్న విధాన నిర్ణయం తీసుకుంది. దీనిపై 2021లో రాష్ట్రాలకు ఆదేశాలు జారీ చేసింది. అయితే ఈ చట్టం అమలుపై రాష్ట్రాలకు స్వేచ్ఛ కల్పించింది. చాలా రాష్ట్రాలు దశలవారీగా దీని అమలు ప్రారంభించాయి. కానీ నిర్బంధంగా తుక్కు చేయకుండా.. స్వచ్ఛంద విధానానికే మొగ్గు చూపాయి. తెలంగాణలో మూడేళ్ల తర్వాత ఇప్పుడు పాలసీని అమల్లోకి తెచ్చారు.



- 'రిజిస్టర్డ్ వెహికల్ స్క్రాపింగ్ ఫెసిలిటీ (ఆర్‌వీఎస్ఎఫ్)' కేంద్రాల్లో వాహనాలను తుక్కుగా మారుస్తారు. ఈ కేంద్రాల ఏర్పాటు కోసం గత ఆగస్టులో నోటిఫికేషన్ జారీ చేయగా.. మహీంద్రా కంపెనీ సహా నాలుగు సంస్థలు దరఖాస్తు చేసుకున్నాయి. ఆ కేంద్రాలు నిబంధనల ప్రకారం ఉన్నాయా, లేదా అన్నది పరిశీలించి అనుమతిస్తారు. యజమానులు ఈ కేంద్రాల్లోనే వాహనాలను అప్పగించి, సర్టిఫికెట్ తీసుకోవాల్సి ఉంటుంది.

వాహనం ధరను బట్టి.. రాయితీ ఇలా.. (రూ.లలో)

వాహన శ్రేణి	ఎక్స్‌షోరూమ్ ధర	గరిష్ఠంగా పన్ను రాయితీ
ద్విచక్ర వాహనం	లక్ష లోపు	1,000
ద్విచక్ర వాహనం	లక్ష నుంచి 2 లక్షలు	2,000
ద్విచక్ర వాహనం	2 లక్షల నుంచి 3 లక్షలు	3,000
నాలుగు చక్రాల వాహనం	5 లక్షలలోపు	10,000
నాలుగు చక్రాల వాహనం	5- 10 లక్షలు	20,000
నాలుగు చక్రాల వాహనం	10-15 లక్షలు	30,000
నాలుగు చక్రాల వాహనం	20లక్షలు, ఆపైన	50,000

వాహనాల 'ఫిట్‌నెస్' పక్కాగా తేల్చేందుకు..: 15 ఏళ్లు దాటిన వాహనాలను మరికొంతకాలం నడుపుకొనేందుకు ఫిట్‌నెస్ తనిఖీ తప్పనిసరి. ఇప్పటివరకు మాన్యువల్‌గానే టెస్ట్ చేసి సర్టిఫికెట్ ఇస్తున్నారు. ఇది సరిగా జరగడం లేదని, అవినీతి చోటుచేసుకుంటోందన్న ఫిర్యాదుల నేపథ్యంలో.. ఆటోమేటెడ్ స్టేషన్‌లలో కంప్యూటరైజ్డ్ పద్ధతిలో ఫిట్‌నెస్ టెస్టులు చేయించాలని కేంద్రం ఆదేశించింది. ఈ క్రమంలో రాష్ట్రంలో 37 ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ల ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించింది. వీటి ఏర్పాటుకు రూ.293 కోట్లు అవుతాయని అంచనా వేశారు. అందులో కేంద్రం రూ.133 కోట్లను భరించనుంది. ఇక వాహనాల విక్రయానికి సంబంధించిన ఎన్‌ఓసీలు, లైసెన్సులు ఇతర సేవలను అన్ని రాష్ట్రాలతో అనుసంధానిస్తూ కేంద్ర ప్రభుత్వం వాహన్, సారథి పోర్టల్‌లను ఏర్పాటు చేసింది. చాలా రాష్ట్రాలు వీటితో అనుసంధానమయ్యాయి. తాజాగా తెలంగాణ కూడా అందులో చేరుతున్నట్టు ప్రకటించింది. దీనిని తొలుత సికింద్రాబాద్ రవాణాశాఖ కార్యాలయంలో ప్రారంభిస్తున్నారు.

భద్రతపై దృష్టి సారించాం

దేశవ్యాప్తంగా ఏటా 1.6 లక్షల మంది రోడ్డు ప్రమాదాల్లో చనిపోతున్నారు. తెలంగాణలో కూడా ఆ సంఖ్య ఆందోళనకరంగానే ఉంది. దీన్ని రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోంది. ఈ క్రమంలో రోడ్డు భద్రతపై దృష్టి సారించాం. నిబంధనల విషయంలో కచ్చితంగా ఉండాలని నిర్ణయించాం. రవాణా శాఖకు సంబంధించి కొన్ని కొత్త నిర్ణయాలు తీసుకున్నాం. రాష్ట్రంలో ఇప్పటివరకు వాహనాల తుక్కు విధానం లేదు. దాన్ని ప్రారంభించాలని నిర్ణయించాం. జాతీయ స్థాయిలో ఇతర రాష్ట్రాలు ఎలా అమలు చేస్తున్నాయో పరిశీలించి మంచి విధానాన్ని తెచ్చాం. జాతీయ స్థాయిలో ఇతర రాష్ట్రాలతో రవాణాశాఖకు సంబంధించిన సమాచార మార్పిడికి వీలుగా సారథి, వాహన్ పోర్టల్‌లో తెలంగాణ చేరాలని నిర్ణయించింది. ఏడాదిలో అన్ని విభాగాలను అనుసంధానం చేస్తాం.

– రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



తొలిరౌండ్‌లో సింధు ఓటమి

పారిస్ ఒలింపిక్స్ తర్వాత పాల్గొన్న తొలి టోర్నమెంట్‌లో భారత బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు తొలి రౌండ్‌లోనే పరాజయం ఎదురైంది. ఫిన్‌లాండ్‌లో మంగళవారం మొదలైన ఆర్క్‌టిక్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–500 టోర్నీలో సింధు ప్రిక్వార్టర్ ఫైనల్ చేరుకోలేకపోయింది. మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 16వ ర్యాంకర్ సింధు 16–21, 10–21తో ప్రపంచ 32వ ర్యాంకర్ మిచెల్లి లీ (కెనడా) చేతిలో ఓడిపోయింది. గతంలో మిచెల్లి లీపై 10 సార్లు గెలిచిన సింధు నాలుగోసారి ఆమె చేతిలో ఓటమి చవిచూసింది. ఇదే టోర్నీలో ఆడుతున్న భారత రైజింగ్ స్టార్స్ మాళవిక బన్సోడ్, ఆకర్షి కశ్యప్ తొలి రౌండ్‌లో గెలిచి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లారు. ప్రపంచ 23వ ర్యాంకర్ సుంగ్ షువో యున్ (దక్షిణ కొరియా)తో జరిగిన మ్యాచ్‌లో ప్రపంచ 37వ ర్యాంకర్ మాళవిక 21–19, 24–22తో నెగ్గగా... ప్రపంచ 39వ ర్యాంకర్ వైవోన్ లీ (జర్మనీ)తో జరిగిన మ్యాచ్‌లో ప్రపంచ 41వ ర్యాంకర్ ఆకర్షి 21–19, 21–14తో విజయం సాధించింది. పురుషుల సింగిల్స్ విభాగంలో భారత ప్లేయర్ కిరణ్ జార్జి మెయిన్ 'డ్రా'కు అర్హత సాధించాడు. క్వాలిఫయింగ్ మ్యాచ్‌లో కిరణ్ జార్జి 21–16, 13–21, 21–19తో లుకాస్ క్లియర్‌బౌట్ (ఫ్రాన్స్)పై గెలుపొందాడు.

సిరీస్ విజయంపై భారత్ గురి

నేడు బంగ్లాదేశ్‌తో రెండో టి20 • జోరు మీదున్న టీమిండియా

రాత్రి 7 గంటల నుంచి స్పోర్ట్స్ 18, జియో సినిమాలలో ప్రత్యక్ష ప్రసారం



న్యూఢిల్లీ: బంగ్లాదేశ్‌పై తొలి టి20లో సంపూర్ణ ఆధిపత్యం ప్రదర్శించిన భారత్ మరో విజయంపై గురి పెట్టింది. గత మ్యాచ్ జోరును కొనసాగించి సిరీస్ సొంతం చేసుకోవాలని టీమిండియా పట్టుదలగా ఉంది. ఈ నేపథ్యంలో నేడు జరిగే రెండో టి20లో భారత్, బంగ్లాదేశ్ తలపడనున్నాయి. తొలి మ్యాచ్ ప్రదర్శనను బట్టి చూస్తే మరో మాట లేకుండా భారతే ఫేవరెట్‌గా కనిపిస్తుండగా... బంగ్లా ఈసారైనా పోటీనిస్తుందా అనేది చూడాలి.

దూకుడుకు మారుపేరుగా...

తొలి టి20లో భారత జట్టు ఆటతీరు చూస్తే మరో గెలుపు కూడా కష్టం కాకపోవచ్చు. అర్ష్‌దీప్, వరుణ్ చక్రవర్తి తమ బౌలింగ్‌తో బంగ్లాదేశ్ పని పట్టగా... ఇతర బౌలర్లు మయాంక్, సుందర్ కూడా ఒక చేయి వేశారు. వైవిధ్యమైన ఈ బౌలింగ్ దళానికి ప్రత్యర్థిని కట్టిపడేయగల సామర్థ్యం ఉంది. ఇక బ్యాటింగ్‌లో నైతే అందరూ చెలరేగిపోయారు. నాటౌట్‌గా నిలిచిన నితీశ్ కుమార్ రెడ్డి మినహా మిగతా నలుగురు బ్యాటర్లు 150కు పైగా స్ట్రయిక్‌రేట్‌తో పరుగులు సాధించారు. ఈ ఫార్మాట్‌లో సూర్యకుమార్ ఎంత ప్రమాదకరమైన బ్యాటరో అందరికీ తెలిసిందే. రనౌట్ కాకపోయింటే అభిషేక్ శర్మ కూడా విధ్వంసం సృష్టించేవాడే. ఇలాంటి స్థితిలో భారత్ మరోసారి పైచేయి సాధించేందుకు అన్ని విధాలా అవకాశం ఉంది. యువ పేసర్ హర్షిత్ రాణా రిజర్వ్‌లో ఉన్నా... వెంటనే మయాంక్‌ను తప్పించి అతడిని ఆడించే అవకాశాలు తక్కువ. అయితే నితీశ్ స్థానంలో తిలక్ వర్మకు చాన్స్ ఉంది.

గెలిపించేదెవరు?

టి20ల్లో బంగ్లాదేశ్ ఆట ఎప్పుడో దశాబ్దం క్రితం స్థాయిలోనే ఆగిపోయింది. ఇది గత మ్యాచ్‌లో మరోసారి కనిపించింది. బ్యాటర్ల నుంచి ఎలాంటి ధాటి కనిపించకపోగా... అనుభవం ఉన్న ప్రధాన ప్లేయర్లు సైతం తేలిపోతున్నారు. కెప్టెన్ నజ్ముల్, మిరాజ్ కేవలం వంద పరుగుల స్ట్రయిక్‌రేట్‌తో పరుగులు సాధించడం ఆ జట్టు పరిస్థితిని చూపించింది. ఇక జట్టు తరఫున అందరికంటే ఎక్కువగా 139 టి20లు ఆడిన అనుభవం ఉన్న మహ్ముదుల్లా కూడా ఇటీవల ఎలాంటి ప్రభావం చూపించలేకపోతున్నాడు. ఈ సిరీస్ తర్వాత రిటైర్ కానున్న అతను ఈ మ్యాచ్‌లోనైనా ప్రభావం చూపిస్తే బంగ్లా పరువు దక్కుతుంది.

పిచ్, వాతావరణం

ఫిరోజ్‌షా కోట్లా మైదానం బ్యాటింగ్‌కు బాగా అనుకూలమైన పిచ్. ఐపీఎల్‌లో భారీ స్కోర్లు వచ్చాయి. ఈసారీ అదే జరగవచ్చు. అనుకూల వాతావరణం ఉంది. మ్యాచ్ రోజున వర్ష సూచన లేదు.

2 ఫిరోజ్‌షా కోట్లా (అరుణ్ జైట్లీ స్టేడియం) మైదానంలో ఇప్పటి వరకు భారత జట్టు 3 టి20 మ్యాచ్‌లు ఆడింది. ఇందులో 1 మ్యాచ్‌లో గెలిచి, 2 మ్యాచ్‌ల్లో ఓడిపోయింది. 2017లో న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో 53 పరుగులతో నెగ్గిన భారత్... 2019లో బంగ్లాదేశ్ చేతిలో 7 వికెట్ల తేడాతో... 2022లో దక్షిణాఫ్రికా చేతిలో 7 వికెట్ల తేడాతో ఓడిపోయింది.

64 ఏళ్ల తర్వాత...

- ఆసియా టీటీ చాంపియన్‌షిప్ సెమీఫైనల్లో భారత మహిళల జట్టు
- క్వార్టర్ ఫైనల్లో దక్షిణ కొరియాపై 3–2తో సంచలన విజయం
- రెండు మ్యాచ్‌ల్లో నెగ్గి భారత్‌ను గెలిపించిన ఐహిక ముఖర్జీ





ఐహిక ముఖర్జీ

అస్తానా (కజకిస్తాన్): అంచనాలకు మించి రాణించిన భారత మహిళల జట్టు ఆసియా టేబుల్ టెన్నిస్ (టీటీ) చాంపియన్‌షిప్‌లో పెను సంచలనం సృష్టించింది. పారిస్ ఒలింపిక్స్ కాంస్య పతక విజేత, గత ఏడాది రన్నరప్ దక్షిణ కొరియా జట్టును భారత బృందం బోల్తా కొట్టించింది. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో మూడో స్థానంలో ఉన్న దక్షిణ కొరియాతో మంగళవారం జరిగిన టీమ్ విభాగం క్వార్టర్ ఫైనల్లో భారత జట్టు 3–2తో గెలిచి సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. 'డబుల్స్ స్పెషలిస్ట్' ఐహిక ముఖర్జీ రెండు సింగిల్స్ మ్యాచ్‌ల్లో నెగ్గి తనకంటే మెరుగైన ర్యాంక్ ఉన్న క్రీడాకారిణులను ఓడించి భారత జట్టు విజయంలో కీలకపాత్ర పోషించింది. నేడు జరిగే సెమీఫైనల్లో జపాన్‌తో భారత్ ఆడుతుంది. సెమీఫైనల్ బెర్త్ పొందిన భారత జట్టుకు కనీసం కాంస్య పతకం ఖరారైంది. భారత మహిళల జట్టు ఏకైకసారి 1960లో ముంబై ఆతిథ్యమిచ్చిన ఆసియా చాంపియన్‌షిప్‌లో సెమీఫైనల్ చేరి కాంస్య పతకాన్ని దక్కించుకుంది. 64 ఏళ్ల తర్వాత మళ్లీ భారత జట్టు ఈ టోర్నీలో సెమీఫైనల్ చేరుకోవడం విశేషం. ఆసియా టీటీ సమాఖ్య ఆధ్వర్యంలో 1952 నుంచి 1970 వరకు ఆసియా చాంపియన్‌షిప్ జరగ్గా... 1972 నుంచి కొత్తగా ఏర్పడిన ఆసియా టీటీ యూనియన్ ఆధ్వర్యంలో ఈ టోర్నీని నిర్వహిస్తున్నారు.

ఇద్దరు మేటి ర్యాంకర్లపై గెలిచి...

ప్రపంచ 8వ ర్యాంకర్ షిన్ యుబిన్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో ప్రపంచ 92వ ర్యాంకర్ ఐహిక 11–9, 7–11, 12–10, 7–11, 11–7తో గెలిచి భారత్‌కు 1–0 ఆధిక్యం అందించింది. రెండో మ్యాచ్‌లో ప్రపంచ 29వ ర్యాంకర్ మనిక బత్రా 12–14, 13–11, 11–5, 5–11, 12–10తో ప్రపంచ 16వ ర్యాంకర్ జియోన్ జిహీను ఓడించి భారత ఆధిక్యాన్ని 2–0కు పెంచింది. మూడో మ్యాచ్‌లో ప్రపంచ 26వ ర్యాంకర్, భారత నంబర్‌వన్ ఆకుల శ్రీజ 6–11, 10–12, 8–11తో ప్రపంచ 49వ ర్యాంకర్ లీ యున్‌హై చేతిలో... నాలుగో మ్యాచ్‌లో మనిక బత్రా 11–13, 4–11, 11–6, 11–7, 10–12తో షిన్ యుబిన్ చేతిలో ఓడిపోవడంతో స్కోరు 2–2తో సమమైంది. నిర్ణాయక ఐదో మ్యాచ్‌లో ఐహిక ముఖర్జీ 7–11, 11–6, 12–10, 12–10తో ప్రపంచ 16వ ర్యాంకర్ జియోన్ జిహీపై గెలిచి భారత్‌కు చిరస్మరణీయ విజయాన్ని అందించింది.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

ఆస్ట్రేలియా జోరు



మేగన్ షట్

- న్యూజిలాండ్‌పై 60 పరుగులతో విజయం
- 3 పరుగులిచ్చి 3 వికెట్లు తీసిన మేగన్ షట్

షార్జా: డిఫెండింగ్ చాంపియన్, ఆరుసార్లు విజేత ఆస్ట్రేలియా జట్టు మహిళల టి20 వరల్డ్ కప్‌లో తమ ఆధిపత్యాన్ని కొనసాగిస్తోంది. తొలి మ్యాచ్‌లో శ్రీలంకను చిత్తు చేసిన ఆసీస్ వరుసగా రెండో విజయంతో గ్రూప్ 'ఎ'లో తమ అగ్ర స్థానాన్ని పటిష్ట పర్చుకుంది. మంగళవారం జరిగిన పోరులో ఆస్ట్రేలియా 60 పరుగుల తేడాతో న్యూజిలాండ్‌ను ఓడించింది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 148 పరుగులు చేసింది. బెత్ మూనీ (32 బంతుల్లో 40; 2 ఫోర్లు), ఎలైస్ పెరీ (24 బంతుల్లో 30; 3 ఫోర్లు, 1 సిక్స్) కీలక ఇన్నింగ్స్ ఆడగా... కెప్టెన్ అలీసా హీలీ (20 బంతుల్లో 26; 4 ఫోర్లు), ఫోబీ లిచ్‌ఫీల్డ్ (18 బంతుల్లో 18; 2 ఫోర్లు) అండగా నిలిచారు. ఒకదశలో 109/2తో పటిష్ట స్థితిలో నిలిచిన ఆసీస్ జట్టు ఆ తర్వాత దూకుడుగా ఆడే క్రమంలో 29 పరుగుల వ్యవధిలో 6 వికెట్లు కోల్పోయింది. కివీస్ బౌలర్లలో అమేలియా కెర్ 26 పరుగులిచ్చి 4 వికెట్లు పడగొట్టగా... హ్యాలిడే, రోజ్‌మేరీ చెరో 2 వికెట్లు తీశారు. అనంతరం న్యూజిలాండ్ 19.2 ఓవర్లలో 88 పరుగులకే కుప్పకూలింది. అమేలియా కెర్ (31 బంతుల్లో 29; 3 ఫోర్లు), సుజీ బేట్స్ (20) మినహా ఎవరూ ప్రభావం చూపలేకపోయారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' మేగన్ షట్ 3.2 ఓవర్లు బౌలింగ్ చేయగా... ఈ 20 బంతుల్లో 18 డాట్ బంతులు వేసింది. 3 పరుగులు మాత్రమే ఇచ్చిన ఆమె 3 వికెట్లు పడగొట్టింది. ఇతర బౌలర్లలో అనాబెల్ సదర్లాండ్ (3/21), సోఫీ మాలినెక్స్ (2/15) కివీస్ పతనంలో ప్రధాన పాత్ర పోషించారు.

టి20 ప్రపంచకప్‌లో నేడు

భారత్ X శ్రీలంక

వేదిక: దుబాయ్; రాత్రి గం. 7:30 నుంచి

స్కాట్లాండ్ X దక్షిణాఫ్రికా

వేదిక: దుబాయ్ ; మధ్యాహ్నం గం. 3:30 నుంచి

స్టార్ స్పోర్ట్స్, హాట్ స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

సినిమా



• రానా, సమంత, ఆలియా భట్, వేదాంగ్ రైనా, వాసన్ బాల, త్రివిక్రమ్

మహిళలందరూ హీరోలే

- దర్శకుడు త్రివిక్రమ్

''మహిళలందరూ ఎప్పటికీ హీరోలే. మహిళలు లేకుండా తర్వాతి తరాలు లేవు. మిమ్మల్ని ఎవరో ఎంపవర్ చేయాల్సిన అవసరం లేదు. ఎందుకంటే శక్తి అంటేనే స్త్రీ కదా. ఈ తొమ్మిది రోజులు (దసరా నవరాత్రులు) ఈ విషయాన్నే మనం ప్రపంచం అంతా చెబుతున్నాం. వీలుంటే మమ్మల్ని (పురుషులు) కొంచెం ఎంపవర్ చేయండి'' అని దర్శకుడు త్రివిక్రమ్ అన్నారు. ఆలియా భట్ ప్రధాన పాత్రలో, వేదాంగ్ రైనా మరో లీడ్ రోల్‌లో నటించిన చిత్రం 'జిగ్రా'. వాసన్ బాల దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఈ నెల 11న విడుదల కానుంది. 'జిగ్రా' తెలుగు వెర్షన్‌ను ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై దగ్గుబాటి రానా రిలీజ్ చేస్తున్నారు. ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో త్రివిక్రమ్ మాట్లాడుతూ– ''ఆర్ఆర్ఆర్'తో ఆలియా మన ఇళ్లల్లోకి వచ్చారు. ఈ విజయదశమికి ఆమెకు విజయాన్ని కానుకగా ఇచ్చి, మన ఇంటి ఆడపడుచులా పంపుదాం. తెలుగు, తమిళ, మలయాళం... ఇలా అన్ని చోట్ల ఒక రకమైన ఫ్యాన్ బేస్ ఉన్న యాక్టర్స్ నాకు తెలిసి ఒకరు రజనీకాంత్‌గారు... తర్వాత సమంత గారే అనుకుంటున్నాను. సమంతగారూ ముంబై లోనే కాదు... అప్పుడప్పుడు హైదరాబాద్‌కు వస్తుండండి. సినిమాలు చేయాలి'' అన్నారు. సమంత మాట్లాడుతూ– ''తెలుగు ప్రేక్షకుల ప్రేమ వల్లే నేను ఎదిగాను. తెలుగు ప్రేక్షకులే నా ఫ్యామిలీ. హీరోయిన్లుగా మా సినిమాలు చూస్తున్న అమ్మాయిలకు వాళ్ల కథలో వాళ్లే హీరోలు అని గుర్తు చేసే బాధ్యత మా మీద ఉంది. మా కథల్లో మేమే హీరో అని ఆలియా భట్ తన వర్క్‌తో గుర్తు చేస్తుంటారు. కొన్ని రోజుల క్రితం రానా ఓ ఫిమేల్ మూవీని (35: చిన్న కథ కాదు' సినిమాను ఉద్దేశించి కావొచ్చు) ప్రెజెంట్ చేశారు. ఇప్పుడు 'జిగ్రా'ను రిలీజ్ చేస్తున్నారు. ప్రతి అమ్మాయికి రానాలాంటి బ్రదర్ ఉండాలేమో '' అని మాట్లాడారు. ఆలియా భట్ మాట్లాడుతూ– ''సమంతకు, నాకు కలిపి త్రివిక్రమ్‌గారు ఓ కథ రాయాలని కోరుకుంటున్నాను. పురుషాధిక్య ప్రపంచంలో స్ట్రాంగ్‌గా నిలబడటం అనేది చిన్న విషయం కాదు. ఆన్‌స్క్రీన్‌లోనే కాదు.. ఆఫ్ స్క్రీన్‌లో కూడా సమంత హీరోనే. తెలుగు ప్రేక్షకుల ప్రేమ 'జిగ్రా' పై కూడా ఉండాలి'' అని తెలిపారు. ''జిగ్రా' అంటే ధైర్యం. యాక్టింగ్ అంటే ఆలియా'' అని చెప్పారు వాసన్ బాల. ''సినిమా ప్రమోషన్ విషయంలో ఆలియా అంకితభావం చూస్తుంటే ఇక్కడ ఉన్న యాక్టర్స్‌కు కొంత నేర్చాలని అనుకుంటాను'' అని రానా అన్నారు. ఈ వేడుకలో జాన్వీ నారంగ్, సిమ్రాన్ నారంగ్ పాల్గొన్నారు.

ఓదెల మల్లన్న క్షేత్రంలో...



• తమన్నా

తమన్నా ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'ఓదెల 2'. హెబ్బా పటేల్ లీడ్ రోల్‌లో నటించిన హిట్ మూవీ 'ఓదెల రైల్వేస్టేషన్' (2021)కి సీక్వెల్‌గా 'ఓదెల 2' రూపొందుతోంది. తొలి భాగాన్ని తెరకెక్కించిన అశోక్ తేజయే రెండో భాగానికి కూడా దర్శకత్వం వహిస్తున్నారు. మధు క్రియేషన్స్, సంపత్ నంది టీమ్ వర్క్స్‌పై డి. మధు నిర్మిస్తున్న ఈ సినిమా ఫైనల్ షెడ్యూల్ ఓదెల గ్రామంలో జరుగుతోంది. ''సూపర్ నేచురల్ థ్రిల్లర్‌గా 'ఓదెల 2' రూపొందుతోంది. కాశీలో ప్రారంభమైన ఈ సీక్వెల్ చిత్రీకరణ ప్రస్తుతం ఓదెల మల్లన్న క్షేత్రంలో జరుగుతోంది. ఓదెల మల్లన్న ఆలయంతో పాటు గ్రామంలో కీలక సన్నివేశాలు తెరకెక్కిస్తున్నాం. తమన్నా, మురళీ శర్మ, హెబ్బా పటేల్, యువ తదితరులు షూట్‌లో పాల్గొంటున్నారు. తన కెరీర్‌లో తొలిసారిగా తమన్నా శివశక్తి (నాగ సాధు) పాత్రలో నటిస్తున్నారు'' అని మేకర్స్ పేర్కొన్నారు. ఈ చిత్రానికి సంగీతం: అజనీష్ లోక్‌నాథ్, కెమెరా: సౌందర్ రాజన్ .ఎస్, క్రియేటెడ్ బై: సంపత్ నంది.

ప్రేక్షకులకు నవ్వు ఆగదు

- గోపీచంద్




• టీజీ విశ్వప్రసాద్, గోపీచంద్, శ్రీను వైట్ల, కావ్యా థాపర్, దోనేపూడి చక్రపాణి

''విశ్వం' చిత్రం షూటింగ్‌లో ప్రతి సన్నివేశం చేసేటప్పుడు నవ్వుకుంటూనే ఉన్నాం. వినోదం, యాక్షన్ అద్భుతంగా వచ్చాయి. థియేటర్లో కూర్చున్న ప్రేక్షకులకు నవ్వు ఆగదు... చాలా ఎంజాయ్ చేస్తారు. ఒక్క మాట చెప్పగలను... శ్రీను వైట్లగారు ఈజ్ బ్యాక్ విత్ బ్యాంగ్'' అని గోపీచంద్ అన్నారు. శ్రీను వైట్ల దర్శకత్వంలో గోపీచంద్, కావ్యా థాపర్ జంటగా నటించిన చిత్రం 'విశ్వం'. దోనేపూడి చక్రపాణి సమర్పణలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, చిత్రాలయం స్టూడియోస్‌పై టీజీ విశ్వ ప్రసాద్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 11న విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో గోపీచంద్ మాట్లాడుతూ– ''శ్రీను వైట్లగారి సినిమా లో ఎంత వినోదం ఆశిస్తారో... అంతకు మించి ఇవ్వడానికి ఆయన 'విశ్వం' స్క్రిప్ట్‌పై దాదాపు 7 నెలలు పని చేశారు. నేను చాలా సినిమాలు చేశాను. ఆయన వద్ద ఉండే సౌకర్యం ఎక్కడా ఫీల్ అవ్వలేదు. రాజీ పడకుండా ఈ సినిమా తీసిన విశ్వప్రసాద్, చక్రపాణిగార్లకు కృతజ్ఞతలు'' అని తెలిపారు. శ్రీను వైట్ల మాట్లాడుతూ–''విశ్వం' అందమైన ప్రయాణం. ఈ సినిమాని అనుకున్నట్లు తీయగలిగా. ఈ చిత్రం అందర్నీ నవ్విస్తుందని వంద శాతం నమ్మకం ఉంది''అని చెప్పారు. ''విశ్వం' పూర్తి వినోదాత్మకంగా ఉంటుంది. అందరూ మా సినిమాని ఎంజాయ్ చేస్తారని నమ్ముతున్నాను'' అన్నారు టీజీ విశ్వప్రసాద్. ''మా కుటుంబం 86 ఏళ్ల నుంచి సినిమాల్లో ఇన్వాల్వ్ అయింది. 'విశ్వం' నాకు తొలి సినిమా. ఇది మా హీరో సినిమా అని గోపీచంద్ అభిమానులు కాలర్ ఎగరేసేలా ఉంటుంది'' అని వేణు దోనేపూడి పేర్కొన్నారు.

అందరికీ నచ్చే చిత్రం ఇది

- దర్శకుడు సందీప్



సుహాస్, సంగీర్తన జంటగా నటించిన చిత్రం 'జనక అయితే గనక'. సందీప్ రెడ్డి బండ్ల దర్శకత్వంలో శిరీష్ సమర్పణలో 'దిల్' రాజు ప్రొడక్షన్స్ పతాకంపై హర్షిత్ రెడ్డి, హన్షితా రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 12న విడుదల కానుంది. ఈ సందర్భంగా సందీప్ రెడ్డి బండ్ల మాట్లాడుతూ– ''ఈ తరంలో పెళ్లైన ఓ కొత్త జంట ఓ పాపనో, బాబునో కనడానికి ఎందుకింత ఆలోచిస్తున్నారు? ఇప్పుడు ఉన్న పరిస్థితులు ఏమిటి? అన్న అంశాలను ఈ సినిమాలో చూపించే ప్రయత్నం చేశాం. తండ్రి అయిన ఓ సగటు మధ్య తరగతి వ్యక్తి కథ ఇది. కండోమ్ కంపెనీపై ఓ వ్యక్తి కేసు వేస్తే ఎలా ఉంటుంది? అనే ఆలోచనతో ఈ కథ పుట్టింది. 'దిల్' రాజుగారి సలహాలు మాకు హెల్ప్ అయ్యాయి. ఈ సినిమాను ముందు నాగచైతన్యతోనే అనుకున్నాం. అయితే ఆయనకి శేఖర్ కమ్ములగారి సినిమా ఉండటంతో కుదర్లేదు. నేను జంధ్యాలగారి అభిమానిని. ఫ్యామిలీ ఆడియన్స్ నా సినిమాను చూసేందుకు ఇబ్బందిపడితే దర్శకుడిగా నేను ఫెయిల్ అనే అనుకుంటాను'' అని అన్నారు.

ప్రేక్షకుల కళ్లు నా కలర్ మీద నుంచి కాళ్లవైపు మళ్లాయి

- నటుడు మిథున్ చక్రవర్తి



• ద్రౌపది ముర్ము నుంచి అవార్డు స్వీకరిస్తున్న మిథున్



• మణిరత్నం



• అభిషేక్, నిఖిల్, చందు



• 'ఆట్టమ్' చిత్రదర్శకుడు ఆనంద్



• రిషబ్ శెట్టి



• నిత్యా మీనన్



• మానసీ పరేఖ్



• ఏఆర్ రెహమాన్

''నా చర్మపు రంగు నలుపుగా ఉండటం అనేది నా కెరీర్ ఆరంభంలో పెద్ద సవాల్‌లా అనిపించింది. నల్లగా ఉన్నవారు నటులుగా ఇండస్ట్రీలో నెగ్గుకు రావడం కష్టమన్నట్లు కొందరు మాట్లాడారు. ఇండస్ట్రీ నుంచి వెనక్కి వెళ్లమని కూడా సలహా ఇచ్చారు. ఒకానొక దశలో నా చర్మపు రంగును మార్చమని ఆ దేవుణ్ణి ప్రార్థించాను. ఆ తర్వాత అసలు నేనేం చేయగలను? నా బలం ఏంటి? అని ఆలోచించాను. నేను బాగా డ్యాన్స్ చేయగలనని నా బలం తెలుసుకున్నాను. మంచి డ్యాన్సర్ కావాలనుకున్నాను. అప్పుడు ప్రేక్షకుల కళ్లు నా కలర్ మీద నుంచి కాళ్ల వైపు మళ్లుతాయని అనుకున్నాను. ప్రేక్షకులు నా డ్యాన్స్‌ను అభిమానించడం ప్రారంభించారు. ఈ క్రమంలో వారు నా కలర్‌ను మర్చిపోయారు. నేనో సెక్సీ డ్యాన్సర్‌గా, డస్కీ బెంగాలీ బాబుగా పేరు సంపాదించుకున్నాను'' అని ప్రతిష్ఠాత్మక దాదా సాహెబ్ ఫాల్కే పురస్కారం స్వీకరించిన అనంతరం ఒకింత ఉద్వేగంగా మాట్లాడారు ప్రముఖ నటుడు మిథున్ చక్రవర్తి. దేశ రాజధాని ఢిల్లీలో 70వ జాతీయ చలన చిత్ర అవార్డుల ప్రదానోత్సవం మంగళవారం జరిగింది. రాష్ట్రపతి భవన్‌లో జరిగిన ఈ వేడుకలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము విజేతలకు పురస్కారాలు అందజేశారు. 2022 సంవత్సరానికిగాను ఈ అవార్డులను కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన సంగతి తెలిసిందే. ఉత్తమ చిత్రం 'ఆట్టమ్' (మలయాళం), ఉత్తమ నటుడిగా రిషబ్ శెట్టి (కాంతార-కన్నడ), ఉత్తమ నటీమణులుగా నిత్యా మీనన్ (తిరుచిత్రం బలం–తమిళ్), మానసీ పరేఖ్ (కచ్‌ఎక్స్‌ప్రెస్–గుజరాతీ) అవార్డు అందుకున్నారు. తెలుగు నుంచి ఉత్తమ ప్రాంతీయ చిత్రం అవార్డు 'కార్తికేయ 2'కు దక్కింది. నిర్మాత అభిషేక్ అగర్వాల్ అవార్డు స్వీకరించగా, చిత్రదర్శకుడు చందు మొండేటి, హీరో నిఖిల్ కూడా హాజరయ్యారు. 'పొన్నియిన్ సెల్వన్– 1'కు గానూ ఉత్తమ సంగీతం (నేపథ్య సంగీతం) విభాగంలో ఏఆర్ రెహమాన్ అవార్డు అందుకున్నారు. ఈ వేడుకకు వివిధ భాషల నటీనటులు, సాంకేతిక నిపుణులు హాజరయ్యారు.

ఈ వేదికపై ఇంకా **మిథున్ చక్రవర్తి మాట్లాడుతూ** – ''ఇప్పటికి మూడు జాతీయ అవార్డులు అందుకున్నాను. తొలి అవార్డు ('మృగయా') అందుకున్నప్పుడే నేను చాలా సాధించాననుకున్నాను. 'మృగయా' సినిమా స్క్రీనింగ్‌కి వెళ్లినప్పుడు ఒక డిస్ట్రిబ్యూటర్... అతను ఈ లోకంలో లేడు కాబట్టి పేరు చెప్పను. అతను 'ఈ సినిమా చాలా బాగుంది. నువ్వు అద్భుతమైన నటుడివి. కానీ ఇలాంటి బట్టలతో నువ్వు ఎలా కనిపిస్తున్నావో తెలుసా?' అంటే నేను నిర్ఘాంత పోయాను. నేను ఆయన ముందు నగ్నంగా నిలబడ్డానా? అనిపించింది. వెంటనే ఆయన 'మృగయా'లో నేను చేసిన ఆదివాసీ పాత్ర గురించి చెప్పినట్లు పేర్కొన్నారు. నేను నా తొలి జాతీయ అవార్డు అందుకున్న తర్వాత హాలీవుడ్ యాక్టర్ అల్ పచీనో అంతటి ప్రతిభ నాలోనూ ఉందనుకున్నాను. అకస్మాత్తుగా నా తీరు మారిపోయింది. కొందరు నిర్మాతలతో దురుసుగా ప్రవర్తించాను. నన్ను నేను అల్ పచీనో అనుకుంటున్నానని నిర్మాతలు గ్రహించలేకపోయారు. ఓ సందర్భంలో ఒక నిర్మాతకు కథను నా ఇంటికి పంపాలన్నాను. అతను వెంటనే లేచి నా చెంప చెళ్లుమనిపించాడు. అప్పట్నుంచి నన్ను నేను ఓ అల్ పచీనోలా ఊహించుకోవడం మానేశాను. నాదే తప్పని గ్రహించాను. నా తీరు మార్చుకున్నాను'' అన్నారు.

మంచి మార్పు తీసుకురావాలన్నదే...

- రిషబ్ శెట్టి

ప్రతి సినిమా ప్రభావం ప్రేక్షకుల పై ఉంటుంది. అందుకే ప్రజల్లో, సమాజంలో మంచి మార్పును తీసుకువచ్చే సినిమాలు తీయాలన్నది నా ఉద్దేశం.

కష్టానికి ప్రతిఫలం దక్కింది

- నిత్యా మీనన్

చిత్రపరిశ్రమలో దాదాపు 15 ఏళ్ల కష్టం నాది. ఆ కష్టానికి తగ్గ ప్రతిఫలం ఈ అవార్డు. చాలా సంతోషంగా ఉంది. ప్రస్తుతానికి దీన్ని బాధ్యతగా చూడకుండా సెలబ్రేట్ చేసుకోవాల్సిన సమయం ఇది. 'తిరుచిత్రంబలం' బృందానికి, నా సహ నటులకు ఈ అవార్డుని అంకితం ఇస్తున్నాను. ఇదే ఉత్సాహంతో మంచి దర్శకులు, రచయితలతో కలిసి పని చేసేందుకు చాలా ఆసక్తిగా ఉన్నాను.

సినిమాకి సరిహద్దులు లేవు

- ఏఆర్ రెహమాన్

సినిమాకి ప్రాంతం, భాష అంటూ ఎలాంటి సరిహద్దులు లేవు. నేను అందుకున్న ఏడో జాతీయ అవార్డు ఇది. సంతోషంగా ఉంది. ఈ అవార్డు నాకు వచ్చేందుకు కారకులైన ఫిల్మ్ మేకర్స్‌కి, ముఖ్యంగా డైరెక్టర్ మణిరత్నంగారికి ధన్యవాదాలు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	585	81,634
నిఫ్టీ ▲	217	25,013

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	18,112	▲	188
డోజోన్స్	41,990	▲	36
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,191	▼	113
డాక్స్	19,066	▼	17
షాంఘై	3,490	▲	153
నికాయ్	38,938	▼	395

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై		
బంగారం (99.9 స్వచ్ఛత)	75,726 ▼	207
బంగారం (99.5 స్వచ్ఛత)	75,422 ▼	207
వెండి (కేజీ)	90,412 ▼	1,528

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటికి	83.57	84.59
£	బ్రిటన్ పౌండ్	ఒకటికి	108.08	111.40
€	యూరో	ఒకటికి	91.17	93.55
¥	జపాన్ ఎన్ (100)	ఒకటికి	56.22	57.49
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఒకటికి	55.67	57.63
S$	సింగపూర్ డాలర్	ధామసేతకి	62.15	66.84
SAR	సౌదీ రియాల్	ధామసేతకి	21.49	23.05
UAE D	యూఏఈ దిర్హామ్	ధామసేతకి	21.97	23.75
¥	చైనా యువాన్	ధామసేతకి	11.03	12.85

ఓటీటీ స్నాక్స్ ట్రెండింగ్..!

థియేటర్లో నచ్చిన స్నాక్స్ తింటూ ఫేవరెట్ మూవీని ఎంజాయ్ చేయడం కామన్! ఇప్పుడు ఓటీటీ పుణ్యమా అని కోరుకున్న కంటెంట్ కుప్పలుతెప్పలుగా దొరుకుతుండటంతో వినోదం ఇంట్లోనే మూడు సినిమాలు ఆరు వెబ్ సిరీస్‌లుగా వెలిగిపోతోంది. యువతరానికి ముఖ్యంగా జెన్ జెడ్‌కు స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్‌లు బాగా కనెక్ట్ కావడంతో ఫుడ్, స్నాక్స్ బ్రాండ్లు దీన్ని ఒక సరికొత్త వ్యాపారావకాశంగా మార్చుకుంటున్నాయి. నెట్‌ఫ్లిక్స్, డిస్నీ-హాట్‌స్టార్, అమెజాన్ ప్రైమ్ వీడియో, జీ5 తదితర ఓటీటీ దిగ్గజాలతో జట్టు కట్టి సరికొత్త కో-బ్రాండెడ్ ప్యాక్‌లతో పాప్‌కార్న్ నుంచి ఐస్‌క్రీమ్ వరకూ అన్నింటినీ ప్రత్యేకంగా చేతికందిస్తున్నాయి.

- ఆన్‌లైన్‌లో సినిమాలు, వెబ్ సిరీస్‌లకు పెరుగుతున్న క్రేజ్
- స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్‌లతో ఫుడ్ బ్రాండ్స్ జట్టు
- పాప్‌కార్న్ నుంచి ఐస్‌క్రీమ్ వరకూ కో-బ్రాండెడ్ ప్యాక్‌లు..
- క్విక్, ఈ-కామర్స్, రిటైల్ స్టోర్స్‌లోనూ లభ్యం
- జెన్ జెడ్, యువ కస్టమర్లే టార్గెట్...

ఓటీటీ స్ట్రీమింగ్ దుమ్మురేపుతుండటంతో స్నాక్స్, ఫుడ్ బ్రాండ్స్ దీన్ని కూడా సొమ్ము చేసుకుంటున్నాయి. తాజాగా ప్రీమియం పాప్‌కార్న్ బ్రాండ్ 4700బీసీ ప్రత్యేకంగా ఓటీటీ యూజర్ల కోసం కో-బ్రాండెడ్ ప్యాక్‌లను ప్రవేశపెట్టేందుకు నెట్‌ఫ్లిక్స్‌తో మూడేళ్ల ఒప్పందం కుదుర్చుకుంది. వీటిని ఈ-కామర్స్, క్విక్ కామర్స్‌తో పాటు రిటైల్ స్టోర్లలోనూ అందుబాటులోకి తెస్తోంది. 'ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లలో మునిగితేలే జెన్ జెడ్ కుర్రకారును టార్గెట్ చేసేందుకు ఇది సరైన మార్గం' అని 4700బీసీ ఫౌండర్, సీఈవో చిరాగ్ గుప్తా చెబుతున్నారు. ఇదొక్కటేకాదు కిట్‌క్యాట్, కార్నిటోస్, ప్రింగిల్స్, కోకాకోలా, ఓరియో, థమ్సప్‌తో పాటు సఫోలా మసాలా ఓట్స్ తదితర స్నాక్స్ బ్రాండ్స్ సైతం సేల్స్ పెంచుకోవడం కోసం ఓటీటీ ప్లాట్‌ఫామ్స్‌తో జట్టుకట్టిన వాటిలో ఉన్నాయి.

అల్టిమేట్ 'బ్రేక్'..

వినోదంతో పాటు రుచికరమైన మంచింగ్ కూడా ఉంటే 'ఆహా' అదిరిపోతుంది కదూ! అందుకే నెస్లే తన కిట్ క్యాట్ చాక్లెట్లను ఓటీటీ యూజర్ల చెంతకు చేర్చేందుకు నెట్‌ఫ్లిక్స్ 'సబ్‌స్క్రిప్షన్' తీసుకుంది. 'అల్టిమేట్ బ్రేక్' పేరుతో కో-బ్రాండెడ్ ప్రచారానికి తెరతీసింది. తద్వారా ప్రత్యేక ఓటీటీ కిట్‌క్యాట్ ప్యాక్‌లను విడుదల చేయడంతో పాటు నెట్‌ఫ్లిక్స్ షోలు.. స్క్విడ్ గేమ్, కోటా ఫ్యాక్టరీతో జతకట్టింది. గిఫ్టింగ్ సంస్థ అల్యూరింగ్ బాస్కెట్ అయితే ప్రింగిల్స్, కిట్‌క్యాట్, కోకాకోలాతో కూడిన బండిల్డ్ ప్యాక్‌లను అందుబాటులోకి తెచ్చింది. 'నెట్‌ఫ్లిక్స్ – చిల్', 'జస్ట్ వన్ మోర్ ఎపిసోడ్' పేరుతో ఓటీటీ లవర్స్ కోసం వీటిని విక్రయిస్తోంది. ఓటీటీ వినోదంతో పాటు స్నాక్స్‌ను ప్రమోట్ చేసే విధంగా బీన్ ట్రీ ఫుడ్స్ కూడా ప్రత్యేక ప్యాక్‌లను అందిస్తోంది. ఇక మాండెలెజ్ కుకీ బ్రాండ్ ఓరియో నెట్‌ఫ్లిక్స్ వెబ్ సిరీస్ 'స్ట్రేంజర్ థింగ్స్'తో జట్టుకట్టడం ద్వారా ఓరియో రెడ్ వెల్వెట్‌ను ప్రవేశపెట్టేలా ఒప్పందం కుదుర్చుకుంది. కోకాకోలా థమ్సప్.. డిస్నీ-హాట్‌స్టార్‌తో కలిసి 'థమ్సప్ ఫ్యాన్ పల్స్' ప్రచారం నిర్వహిస్తుండగా.. మారికో తన సఫోలా మసాలా ఓట్స్ కో-బ్రాండెడ్ ప్యాక్స్ విక్రయానికి జీ5తో డీల్ కుదుర్చుకుంది. 'స్నాక్స్ బ్రాండ్ల అమ్మకాల ఆధారంగా లాభాల పంపకం లేదా సంస్థలు ఒకరికొకరు తమ యాడ్‌లలో ప్రచారం కల్పించుకోవడం, లేదా క్విక్ కామర్స్ ప్లాట్‌ఫామ్‌లలో నేరుగా లింక్‌లను ఇవ్వడం ద్వారా స్నాక్స్ బ్రాండ్లు తమ ఉత్పత్తులను విక్రయించడం వంటి మార్గాల్లో డీల్స్ కుదురుతున్నాయి' అని ఎగ్జిక్యూటివ్‌లు చెబుతున్నారు. 'కంటెంట్‌ను చూస్తూ, నచ్చిన స్నాక్స్ తినే అలవాటు ఎప్పటి నుంచో అనవాయితీగా వస్తోంది. ప్రత్యేకంగా ఓటీటీ యూజర్లను దృష్టిలో పెట్టుకుని 4700బీసీ ఇతర బ్రాండ్లతో జట్టుకట్టాం' అని నెట్‌ఫ్లిక్స్ ఇండియా మార్కెటింగ్ పార్ట్‌నర్‌షిప్స్ హెడ్ పూర్ణిమ శర్మ చెప్పారు.



ఫుల్ చిల్!

70.7 కోట్లు: గతేడాది ఓటీటీ స్ట్రీమింగ్‌ను ఉపయోగించుకున్న ఇంటర్నెట్ యూజర్లు

2.77 బిలియన్ డాలర్లు: 2027 నాటికి వీడియో ఆన్ డిమాండ్ సబ్‌స్క్రిప్షన్ మార్కెట్ వృద్ధి అంచనా.

రూ. 95,520 కోట్లు: 2032 నాటికి భారతీయ స్నాక్స్ మార్కెట్ పెరుగుదల అంచనా.

ఓటీటీ జోరు.. ఫుడ్ ఆర్డర్ల తోడు!

దేశంలో కరోనా కాలంలో బంపర్ హిట్ కొట్టిన ఓటీటీ స్ట్రీమింగ్.. ముఖ్యంగా యువత, మహిళలకు బాగా చేరువైంది. కోరుకున్న కంటెంట్ కుప్పలుతెప్పలుగా ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉండటంతో ఓటీటీ ప్లాట్‌ఫామ్‌ల 'బాక్సాఫీస్' కళకళలాడిపోతోంది. గతేడాది 70.7 కోట్ల మంది ఇంటర్నెట్ యూజర్లు ఓటీటీ స్ట్రీమింగ్ ద్వారా కంటెంట్‌ను చూసినట్లు ఇంటర్నెట్ ఇన్ ఇండియా–2023 నివేదిక అంచనా వేసింది. మరోపక్క, ఈ వీడియో ఆన్ డిమాండ్ సబ్‌స్క్రిప్షన్ మార్కెట్ 2027 నాటికి 2.77 బిలియన్ డాలర్లకు ఎగబాకనున్నట్లు లెక్కగట్టింది. ఇదిలా ఉంటే, రెడీ–టు–ఈట్ లేదా రెడీ–టు–కుక్ ఆహారోత్పత్తుల వృద్ధికి తోడు డైరెక్ట్ టు కన్జూమర్ బ్రాండ్స్‌తో స్నాక్స్ మార్కెట్ దూసుకుపోతోంది. ఈ-కామర్స్, క్విక్ కామర్స్ విస్తరణ జోరుతో చిన్న పట్టణాల్లోనూ స్నాక్స్ బ్రాండ్స్ రెండంకెల అమ్మకాల వృద్ధిని సాధిస్తున్నాయి. 2023లో దాదాపు రూ.43,000 కోట్లుగా ఉన్న భారతీయ స్నాక్స్ మార్కెట్ 2032 నాటికి రూ.95,000 కోట్లకు పైగా ఎగబాకుతుందనేది మార్కెట్ రీసెర్చ్ కంపెనీ ఐమార్క్ గ్రూప్ అంచనా.

– సాక్షి, బిజినెస్ డెస్క్



ఓలా ఎలక్ట్రిక్‌కు మరో షాక్

- సెంట్రల్ కన్జూమర్ ప్రొటెక్షన్ అథారిటీ నుంచి షోకాజ్ నోటీసు

న్యూఢిల్లీ: విద్యుత్ స్కూటర్ల సంస్థ ఓలా ఎలక్ట్రిక్‌కు వరుసగా షాకులు తగులుతున్నాయి. తప్పుదోవ పట్టించే ప్రకటనలు, అనుచిత వ్యాపార విధానాలతో నిబంధనలను ఉల్లంఘిస్తోందన్న ఆరోపణలతో సెంట్రల్ కన్స్యూమర్ ప్రొటెక్షన్ అథారిటీ (సీసీపీఏ) తాజాగా షోకాజ్ నోటీసు జారీ చేసింది. దీనిపై 15 రోజుల్లోగా వివరణ ఇవ్వాలని సూచించినట్లు ఎక్స్ఛేంజీలకు కంపెనీ తెలిపింది. అయితే, తమ ఆర్థిక, నిర్వహణ కార్యకలాపాలపై దీని ప్రభావం ఉండదని పేర్కొంది. అలాగే, సీసీపీఏ ఎలాంటి జరిమానాలు విధించలేదని తెలిపింది. ఈ వార్తలతో ఓలా షేరు మంగళవారం మరో 6% పడింది. చివర్లో కోలుకుని 5 శాతం లాభంతో రూ. 95 వద్ద క్లోజైంది. వాహనాల సర్వీస్ నాణ్యతపై సోషల్ మీడియాలో స్టాండప్ కమెడియన్ కునాల్ కమ్రాతో ఓలా వ్యవస్థాపకుడు భవీష్ అగర్వాల్ మధ్య వాగ్వాదం ప్రభావంతో సోమవారం కంపెనీ షేరు 8 శాతం పైగా పతనమైంది.

బ్యాంక్ ఆఫ్ బరోడా ప్రచారకర్తగా సచిన్ టెండూల్కర్



ముంబై: ప్రముఖ క్రికెటర్ సచిన్ టెండూల్కర్‌ను తమ గ్లోబల్ బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించుకున్నట్లు ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం బ్యాంక్ ఆఫ్ బరోడా వెల్లడించింది. ఆయనతో ప్లే ది మాస్టర్‌స్ట్రోక్ పేరిట తొలి ప్రచార కార్యక్రమాన్ని ఆవిష్కరిస్తున్నట్లు తెలిపింది. అలాగే ప్రీమియం సేవలను కోరుకునే కస్టమర్ల కోసం ప్రత్యేకంగా రూపొందించిన బీవోబీ మాస్టర్‌స్ట్రోక్ సేవింగ్స్ అకౌంటును ప్రవేశపెడుతున్నట్లు బ్యాంకు సీఈవో దేవదత్త చంద్ తెలిపారు. ఈ ఖాతాలపై తక్కువ వడ్డీ రేటుకే రిటైల్ రుణాలు, ఫ్లెక్సీ ఫిక్స్‌డ్ డిపాజిట్లపై అధిక వడ్డీ రేట్లు, వరల్డ్ ఆప్యులెన్స్ వీసా డెబిట్ కార్డు, జీవితకాల ఉచిత ఎటర్నా క్రెడిట్ కార్డు మొదలైన ప్రయోజనాలు పొందవచ్చు. కస్టమర్లు ఖాతాలో మూడు నెలలకు సగటున రూ. 10 లక్షల కనీస బ్యాలెన్స్ ఉంచాలి. బీవోబీతో జట్టు కట్టడంపై సచిన్ టెండూల్కర్ హర్షం వ్యక్తం చేశారు.

ఆరు రోజుల తర్వాత లాభాలు

- కలిసొచ్చిన షార్ట్ కవరింగ్ కొనుగోళ్లు
- మళ్లీ 25వేల స్థాయిపైకి నిఫ్టీ
- 585 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్



ముంబై: ఆరు రోజుల వరుస నష్టాల నుంచి సూచీలు మంగళవారం బలంగా పుంజుకున్నాయి. బ్యాంకులు, టెలికం, ఆటో, రియల్టీ షేర్లలో షార్ట్ కవరింగ్ కొనుగోళ్లతో దాదాపు ఒకశాతం మేర లాభపడ్డాయి. సెన్సెక్స్ 585 పాయింట్లు పెరిగి 81,634 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 217 లాభపడి 25వేల స్థాయిపైన 25,013 వద్ద నిలిచింది. ఉదయం సానుకూలంగా మొదలైన సూచీలు స్థిరమైన లాభాలతో ట్రేడయ్యాయి. కేంద్రంలోని బీజేపీ వరుసగా మూడోసారి హరియాణా ఎన్నికల్లో గెలుపు సాధించడంతో దేశీయ మార్కెట్లో మరింత ఆశావహ దృక్పథం నెలకొంది. సెన్సెక్స్ 713 పాయింట్లు బలపడి 81,763 వద్ద, నిఫ్టీ 248 పాయింట్లు ఎగసి 25,044 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకాయి. బీఎస్‌ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు 2%, 2.50% రాణించాయి.

- అధిక వెయిటేజీ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్(2%), రిలయన్స్ (2%), ఇన్ఫోసిస్ (1%), ఎల్అండ్‌టీ (2%), ఎంఅండ్ఎం (3.50%) షేర్లు రాణించి సూచీలకు దన్నుగా నిలిచాయి.
- సెన్సెక్స్ అనూహ్య రికవరీతో భారీ సంపద సృష్టి జరిగింది. ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్‌ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ రూ.7.51 లక్షల కోట్లు పెరిగి రూ.459 లక్షల కోట్లు(5.47 బిలియన్ డాలర్లు)కు చేరింది. మొత్తం 4,045 లిస్టెడ్ కంపెనీల షేర్లలో 2,969 షేర్లు లాభపడ్డాయి.

ఒకసారి చార్జింగ్‌తో 530 కిలోమీటర్లు

భారత్‌కు బీవైడీ ఈ-మ్యాక్స్ 7 • ధర 26.9 లక్షల నుంచి

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎలక్ట్రిక్ వాహన తయారీలో ఉన్న చైనా దిగ్గజం బీవైడీ.. భారత మార్కెట్లో ఈ-మ్యాక్స్ 7 ఎలక్ట్రిక్ ఎంపీవీ ప్రవేశపెట్టింది. ధర రూ.26.9 లక్షల నుంచి ప్రారంభం. మూడు వరుసల సీటింగ్‌తో 2021లో ఎంట్రీ ఇచ్చిన ఈ6కు ఆధునిక హంగులు జోడించి ఈ-మ్యాక్స్7కు రూపకల్పన చేశారు.



ఒకసారి చార్జింగ్‌తో ప్రీమియం వేరియంట్ 420 కిలోమీటర్లు, సుపీరియర్ వేరియంట్ 530 కిలోమీటర్లు ప్రయాణిస్తుంది. అడ్వాన్స్‌డ్ డ్రైవర్ అసిస్టెన్స్ సిస్టమ్స్, 12.7 అంగుళాల డిజిటల్ డ్రైవర్ డిస్‌ప్లే, 12.8 అంగుళాల ఇన్ఫోటైన్‌మెంట్ స్క్రీన్, వైర్‌లెస్ చార్జింగ్, ఆరు ఎయిర్‌బ్యాగ్స్, టైర్ ప్రెజర్ మానిటరింగ్ సిస్టమ్, 360 డిగ్రీ కెమెరా, ఐసోఫిక్స్, ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ కంట్రోల్, ట్రాక్షన్ కంట్రోల్, హిల్ హోల్డ్ అసిస్ట్ వంటి హంగులు ఉన్నాయి.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
భారత్ రెగ్యులేటర్లు.. భేష్: నిర్మలా సీతారామన్ | ఎయిర్‌టెల్ చేతికి టాటా ప్లే!

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

సాక్షి ప్లస్
బుధవారం । 9-10-2024

తైవాన్ పింక్.. వియత్నాం వైట్


డ్రాగన్‌ఫ్రూట్ వడియాలు, చిప్స్..

ఆస్ట్రేలియన్ ఐఎస్ఐఎస్., అపోలో ఇజ్రాయెలీ కూడా..

- 32 రకాల డ్రాగన్‌ఫ్రూట్ వెరైటీలతో ప్రదర్శన
- వడియాలు, సబ్బులు, సౌందర్య ఉత్పత్తులు సైతం..

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: డ్రాగన్ ఫ్రూట్ అంటే సాధారణంగా గుర్తొచ్చేది.. పింక్, వైట్ రకాలు. కానీ ఏకంగా 32 రకాల డ్రాగన్‌ఫ్రూట్ వెరైటీలతో సంగారెడ్డిలో మేళా నిర్వహించారు. తైవాన్ పింక్.. వియత్నాం వైట్.. ఆస్ట్రేలియన్ ఐఎస్ఐఎస్.. అపోలో ఇజ్రాయెలీ.. వివిధ దేశాల్లో సాగయ్యే వెరైటీలతో పాటు, ఆసుంట.. బ్లడ్‌మేరీ.. బేబీ సెరడో.. వంటి చిన్న రకాలను ఈ ప్రదర్శనలో ఉంచారు. పెద్ద సైజులో ఉండే జంబోరెడ్, కాన్‌డార్, ఓరిజోన వంటి ప్రత్యేక రకాలు.. మెక్సికో, సెంట్రల్ అమెరికా వంటి దేశాల్లో సాగయ్యే సాన్ వంటి వెరైటీని సైతం ఈ మేళాలో ప్రదర్శించారు. కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో మంగళవారం సంగారెడ్డిలోని ఫల పరిశోధన స్థానంలో డ్రాగన్‌ఫ్రూట్ మేళా జరిగింది. ఈ పంట పట్ల రైతుల్లో అవగాహన కల్పించేందుకు ఈ మేళా నిర్వహించినట్లు యూనివర్సిటీ శాస్త్రవేత్తలు తెలిపారు. సంగారెడ్డి జిల్లా రంజోల్ గ్రామానికి చెందిన యువ రైతు రమేశ్‌రెడ్డి వ్యవసాయక్షేత్రం, సంగారెడ్డి ఫల పరిశోధన స్థానంలో సాగవుతున్న ఈ రకాలతో ఈ ప్రదర్శన నిర్వహించారు.

పోషక విలువలు పుష్కలం..

డ్రాగన్‌ఫ్రూట్‌తో కూడిన ప్రత్యేక ఉత్పత్తులను సైతం ఈ ప్రదర్శనలో ఉంచారు. డ్రాగన్‌ఫ్రూట్‌తో చేసిన చిప్స్, వడియాలు, కుకీస్ (బిస్కెట్లు), చాక్లెట్లు, డ్రైపౌడర్ వంటివాటితో పాటు, ఈ ఫ్రూట్‌తో చేసిన సబ్బులు, ఫేస్‌ప్యాక్ వంటి సౌందర్య సాధనాలు ప్రదర్శనలో సందడి చేశాయి. ఈ ఉత్పత్తులు ఆశ్చర్యానికి గురి చేశాయి. ఎడారి మొక్కగా పేరున్న డ్రాగన్‌ఫ్రూట్‌లో పోషక విలువలు మెండుగా ఉంటాయి. పీచుపదార్థాలతో కూడిన బలవర్థకమైన ఫలం కావడంతో దీన్ని నిత్యం తీసుకుంటే కేన్సర్ వంటి రోగాల బారిన పడకుండా ఉండవచ్చు. సమశీతోష్ణ వాతావరణానికి తట్టుకునే ఈ పంటను చౌడు నేలల్లోనూ సాగుచేసేందుకు వీలుంది. ఈ పంట ఈదురు గాలుల వంటి ప్రకృతి వైపరీత్యాలను సైతం తట్టుకుంటుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.



అన్ని నేలలూ అనుకూలమే..

ఈ పంట సాగుకు అన్ని నేలలూ అనుకూలమే. కొంత జాగ్రత్తలు తీసుకుని పంట సాగు చేస్తే మంచి లాభాలను ఆర్జించవచ్చు. కమర్షియల్ వెరైటీలతో పాటు మరో 30 వరకు వెరైటీలను పండిస్తున్నాను. ఇతర రైతులు కూడా ఈ పంట సాగు చేస్తే బాగుంటుంది. ప్రస్తుతం వియత్నాం నుంచి ఈ పండ్లు దిగుమతి అవుతున్నాయి.

–రమేశ్‌రెడ్డి, డ్రాగన్‌ఫ్రూట్ రైతు, రంజోల్, సంగారెడ్డి జిల్లా



ఉద్యానవన రైతులకు ప్రోత్సాహం

ఉద్యానవన పంటలు సాగు చేసే రైతులకు ప్రభుత్వం అన్ని ప్రోత్సాహకాలు ఇస్తోంది. మా యూనివర్సిటీ ద్వారా రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు ఇస్తున్నాము. డ్రాగన్ ఫ్రూట్ సాగు విస్తీర్ణం రాష్ట్రంలో పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నాము.

–బి.నీరజ, వీసీ, ఉద్యానవన విశ్వవిద్యాలయం.

డ్రాగన్‌ఫ్రూట్ వెరైటీలు







డీఎస్సీ: జిల్లాల వారీగా నోటిఫైడ్ పోస్టులు

ఈ ఏడాది జూలై 18 నుంచి ఆగస్టు 5 వరకూ ఆన్‌లైన్ విధానంలో డీఎస్సీ నిర్వహించిన విషయం తెలిసిందే. సెప్టెంబర్ 30న డీఎస్సీ మెరిట్ లిస్ట్‌ను విడుదల చేశారు. ప్రతి పోస్టుకు ముగ్గురు చొప్పున ఎంపిక చేశారు. ధ్రువపత్రాల పరిశీలన అనంతరం ఎంపికైన ముగ్గురి నుంచి తుదిగా ఒకరిని జిల్లా సెలక్షన్ కమిటీ ఎంపిక చేసింది. ఆయా జిల్లాల వారీగా ఎంపికైన అభ్యర్థుల నోటిఫైడ్ పోస్టుల జాబితా వివరాలిలా..

– సాక్షి, హైదరాబాద్

జిల్లా	స్కూల్ అసిస్టెంట్	నింపినవి	లాంగ్వేజ్ పండిట్	నింపినవి	పీఈటీ	నింపినవి	ఎస్‌జీటీ	నింపినవి	ఎస్ఏ (స్పెషల్ ఎడ్యుకేషన్)	నింపినవి	ఎస్‌జీటీ (స్పెషల్ ఎడ్యుకేషన్)	నింపినవి	మొత్తం	నింపినవి
1 ఆదిలాబాద్	74	67	14	12	2	1	209	195	6	5	19	16	324	296
2 భద్రాద్రి కొత్తగూడెం	129	127	10	9	1	1	268	265	8	0	31	19	447	421
3 హనుమకొండ	73	70	5	5	7	7	81	77	4	4	17	10	187	173
4 హైదరాబాద్	158	138	113	108	31	0	537	510	6	5	33	0	878	761
5 జగిత్యాల	99	98	39	36	8	7	161	153	5	5	22	0	334	299
6 జనగామ	50	48	21	19	7	7	118	115	5	4	20	18	221	211
7 జయశంకర్	41	40	20	19	7	7	152	147	4	0	13	0	237	213
8 జోగుళాంబ గద్వాల్	35	34	28	26	8	8	80	77	4	4	17	0	172	149
9 కామారెడ్డి	121	119	15	13	5	5	318	305	11	0	36	34	506	476
10 కరీంనగర్	86	84	18	17	7	5	114	105	5	5	15	14	245	230
11 ఖమ్మం	176	174	18	17	10	10	334	331	8	0	29	0	575	532
12 కుమురంభీం ఆసిఫాబాద్	62	60	25	24	2	2	234	225	3	3	15	0	341	314
13 మహబూబాబాద్	71	69	19	19	2	2	264	257	5	0	20	18	381	365
14 మహబూబ్ నగర్	38	35	24	22	8	7	146	144	7	6	20	0	243	214
15 మంచిర్యాల	70	68	16	14	3	3	176	170	5	0	18	0	288	255
16 మెదక్	92	90	30	28	1	1	156	152	9	0	22	20	310	291
17 మేడ్చల్ మల్కాజిగిరి	26	25	8	8	1	1	51	47	3	3	20	18	109	102
18 ములుగు	33	32	16	15	1	1	125	122	3	3	14	12	192	185
19 నాగర్ కర్నూల్	70	68	18	17	2	2	141	139	13	0	41	0	285	226
20 నల్లగొండ	128	126	28	27	6	6	383	375	13	12	47	0	605	546
21 నారాయణపేట	73	70	23	22	1	1	161	154	5	5	16	0	279	252
22 నిర్మల్	70	67	4	3	4	4	236	225	5	0	23	0	342	299
23 నిజామాబాద్	124	112	23	22	9	8	403	375	11	9	31	0	601	526
24 పెద్దపల్లి	49	47	5	5	1	1	21	19	5	0	12	10	93	82
25 రాజన్న సిరిసిల్ల	56	53	12	11	4	4	67	64	3	0	9	2	151	134
26 రంగారెడ్డి	61	59	30	30	6	6	226	219	10	0	46	43	379	357
27 సంగారెడ్డి	92	83	24	23	6	6	385	370	9	8	35	0	551	490
28 సిద్దిపేట	77	76	24	23	8	8	167	163	8	0	27	0	311	270
29 సూర్యాపేట	86	83	23	22	5	5	224	222	11	0	37	0	386	332
30 వికారాబాద్	102	96	23	22	5	5	195	190	6	5	28	26	359	344
31 వనపర్తి	57	55	9	8	6	6	56	52	5	5	19	0	152	126
32 వరంగల్	66	64	21	19	6	6	182	178	5	5	21	0	301	272
33 యాదాద్రి భువనగిరి	84	78	21	20	2	2	137	135	10	7	23	21	277	263
మొత్తం	2,629	2,515	727	685	182	145	6,508	6,277	220	103	796	281	11,062	10,006

గమనిక: కోర్టు కేసులు, ఇతర సమస్యల కారణంగా 1,056 పోస్టులు భర్తీ కాలేదు

'సింగరేణి'కి ముందే పండుగ!

లాభాల్లో వాటా.. దీపావళి బోనస్.. దసరా అడ్వాన్స్

- సింగరేణి కార్మికులకు ఈసారి ట్రిపుల్ ధమాకా
- కాంట్రాక్టు కార్మికులకు సైతం బోనస్‌తో హర్షాతిరేకాలు


సింగరేణి కార్మికులు

సాక్షి, పెద్దపల్లి: పగలనక, రాత్రనక భూగర్భంలో పనిచేస్తూ సింగరేణి సంస్థను ప్రగతిపథంలో నడిపిస్తున్న కార్మికుల శ్రమకు తగిన ఫలితం దక్కింది. సింగరేణి కార్మికుల్లో ముందే పండుగ సంబురం వెల్లివిరిసింది. యాజమాన్యం వేతనంతోపాటు ఈసారి ట్రిపుల్ ధమాకా ప్రకటించడంతో కార్మిక కుటుంబాల్లో ఆనందం వ్యక్తమవుతోంది. సంస్థ సాధించే లాభాల్లో కార్మికుల వాటా, పీఎల్ఆర్ (దీపావళి) బోనస్, దసరా పండుగ అడ్వాన్స్ కార్మికులకు ఖరారైంది. లాభాల వాటాకు సంబంధించిన మొత్తాన్ని సంస్థవ్యాప్తంగా ఉన్న సుమారు 42వేల మంది కార్మికుల బ్యాంకు ఖాతాల్లో సోమవారం యాజమాన్యం జమచేసింది. అలాగే పీఎల్ఆర్ బోనస్ చెల్లింపులకూ రంగం సిద్ధం చేసింది. వేతనంలో రికవరీ చేసే దసరా పండుగ అడ్వాన్స్‌ను కూడా యాజమాన్యం కార్మికుల బ్యాంకు ఖాతాల్లో జమచేసింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక తొలిసారి కాంట్రాక్టు కార్మికులకు లాభాల వాటా ప్రకటించింది. దీంతో సంస్థలో పనిచేస్తున్న ఒక్కో కాంట్రాక్టు కార్మికుడికి వాటా రూపంలో రూ.5వేలు అందనుంది.

సగటున రూ.1.90 లక్షలు..

సింగరేణి సాధించిన లాభాల్లో కార్మికుల వాటాను యాజమాన్యం ప్రకటించింది. తద్వారా 33% కార్మికులకు చెల్లించనున్నట్టు డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క ఇప్పటికే స్పష్టం చేశారు. ఒక్కో కార్మికుడికి రూ.1.40 లక్షల నుంచి రూ.3.23 లక్షల వరకు వాటా అందుకున్నారు. తొలుత 1999–2000 ఆర్థిక సంవత్సరంలో సంస్థ సాధించిన లాభాల్లో వాటా చెల్లించడం ప్రారంభమైంది. అప్పటి గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ పట్టుబట్టి వార్షిక లాభాల్లో 10% వాటాను సాధించింది. అలా మొదలైన లాభాల వాటా ప్రస్తుతం 33 శాతానికి చేరుకుంది.

పీఎల్ఆర్ బోనస్ రూ.93,750

దేశవ్యాప్తంగా ఉన్న బొగ్గుగని కార్మికులకు ఏటా దీపావళి ముందు పీఎల్ఆర్ (పెర్ఫార్మెన్స్ లింక్‌డ్ రివార్డు) బోనస్ చెల్లిస్తారు. ఈసారి కూడా కోలిండియా యాజమాన్యం పీఎల్ఆర్ బోనస్ ఖరారు చేసింది. కార్మిక సంఘాలతో జరిగిన చర్చల మేరకు ఒక్కో కార్మికుడికి రూ.93,750 చెల్లించేందుకు అంగీకారం కుదిరింది. ఇది దేశంలోని సుమారు 4.50లక్షల మంది కార్మికులకు అందనుంది.

దసరా అడ్వాన్స్ రూ.25వేలు

సంస్థలో పనిచేస్తున్న కార్మిక కుటుంబాల అవసరాల నిమిత్తం ఏటా దసరా పండుగ అడ్వాన్స్ చెల్లిస్తున్న సింగరేణి యాజమాన్యం.. ఆ తర్వాత కార్మికుల వేతనాల్లోంచి రికవరీ చేస్తూ వస్తోంది. ఈసారి పండగ అడ్వాన్ ఒక్కో పర్మినెంట్ కార్మికుడికి రూ.25 వేలు, బదిలీ వర్కర్‌కు రూ.12,500 చొప్పున ఈ నెల వేతనాలతో కలిపి అందజేసింది.

కాంట్రాక్టు కార్మికులకూ వాటా..

సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను ఈసారి రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. రెండు దశాబ్దాలుగా పనిచేస్తున్న సుమారు 27 వేల మంది కాంట్రాక్టు కార్మికులకు గతంలో ఎన్నడూ లేని విధంగా సంస్థ లాభాల్లో రూ.5వేల చొప్పున అందించేందుకు నిర్ణయించింది. ఈ మేరకు కాంట్రాక్టు కార్మికులకు యజమానులు లాభాల వాటా చెల్లిస్తున్నారు. మొత్తంగా ఈసారి ట్రిపుల్ ధమాకాతో కార్మికులు, వారి కుటుంబాల్లో పండుగ జోష్ నెలకొంది.




డాలస్‌లో..


అట్లాంటాలో

అమెరికాలో బతుకమ్మ

అమెరికాలోని వివిధ ప్రాంతాల్లో బతుకమ్మ ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. తెలంగాణ పీపుల్స్ అసోసియేషన్, డాలస్ ఆధ్వర్యంలో టెక్సాస్ ఈవెంట్ సెంటర్‌లో నిర్వహించిన ఉత్సవాలకు పదివేల మందికి పైగా హాజరై బతుకమ్మలతో ఆడిపాడారు. ఈ వేడుకల్లో జానకిరాం మందాడి, బుచ్చిరెడ్డి గోలి, రవికాంత్ మామిడి, రూప కన్నయగారి, రఘువీర్ బండారు, అజయ్‌రెడ్డి, రావు కల్వల, రమణ లష్కర్, రేణుక చనుమోలు, సుధాకర్ కలసాని, లింగారెడ్డి అల్వా, శివ కొడిత్యాల తదితరులు పాల్గొన్నారు.



బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీవారి గరుడవాహన సేవను తిలకించేందుకు వేచిఉన్న భక్తజనం



మోహినీ అవతారంలో మాడవీధుల్లో ఊరేగుతున్న మలయప్ప స్వామి, పక్కన తిరుచ్చి వాహనంపై శ్రీకృష్ణుడు

క్లుప్తంగా...

నిర్ణీత వ్యవధిలో సమాచారం ఇవ్వాల్సిందే

చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్ మహబూబ్ బాషా ఆదేశం

సాక్షి, అమరావతి: సమాచార హక్కు చట్టం ద్వారా దరఖాస్తుదారులు కోరిన సమాచారాన్ని నిర్ణీత వ్యవధిలో అందించాల్సిందేనని వివిధ శాఖల పీఐవో(ప్రజా సమాచార అధికారి)లను చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్ మహబూబ్ బాషా ఆదేశించారు. మంగళవారం 26 జిల్లాల్లోని సమాచార హక్కు చట్టం నోడల్ అధికారుల(డీఆర్‌వో)తో ఆయన ఆన్‌లైన్‌లో సమావేశమయ్యారు. మహబూబ్ బాషా మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో దరఖాస్తుదారులు కోరిన సమాచారాన్ని 30 రోజుల్లో ఆయా కార్యాలయాల్లో సిబ్బంది స్వచ్ఛందంగా వెల్లడిస్తే.. వారు అప్పీళ్లకు రావాల్సిన ప్రయాస తగ్గుతుందన్నారు.

ఉపాధి నిధులు రోడ్ల నిర్మాణానికి మళ్లిస్తే ఎలా?

సాక్షి, అమరావతి: గ్రామీణ ఉపాధి హామీ నిధులను సిమెంటు, తారు రోడ్ల కోసం మళ్లించాలన్న ప్రభుత్వ వైఖరి సరైంది కాదని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీ వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పనులు లేక వ్యవసాయ కూలీలు పెద్ద ఎత్తున వలస పోతున్నారు. పనులు లేక పేదలు పస్తులతో జీవిస్తున్నటువంటి నేపథ్యంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వలన లక్షలాది మంది వ్యవసాయ కూలీలు రోడ్డున పడతారన్నారు. రోడ్లు వేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులను కేటాయించాలే తప్ప ఉపాధి హామీ నిధులను మళ్లించి, పేదల పొట్టకొట్టేలా వ్యవహరించడం అత్యంత దుర్మార్గమని విమర్శించారు.

రెడ్డి కార్పొరేషన్‌కు చైర్మన్‌ను నియమించాలి

ఏపీ రెడ్డి సంఘం డిమాండ్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని రెడ్డి సామాజికవర్గం సంక్షేమం కోసం రెడ్డి కార్పొరేషన్‌కు చైర్మన్‌ను నియమించి నిధులు కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంఘం అధ్యక్షుడు గంగులకుంట నరేష్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆయన మంగళవారం విజయవాడలో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో 60 లక్షలకుపైగా ఉన్న రెడ్డి సామాజికవర్గంలో 80 శాతం మంది పేద, మధ్య తరగతి వారేనని చెప్పారు. వారికి ప్రభుత్వం సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలని కోరారు.

డ్రగ్స్ పేరిట సైబర్ బెదిరింపు

ఓ డాక్టర్ వద్ద నుంచి రూ.2 కోట్లు వసూలు

రాయచోటి టౌన్: డ్రగ్స్ ముఠాతో సంబంధాలు ఉన్నాయంటూ సైబర్ నేరగాళ్లు అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలోని ఒక ప్రైవేట్ హాస్పిటల్ యజమానిని మోసం చేసి రూ. 2 కోట్లు దోచుకున్నారు. రెండు రోజుల క్రితం జరిగిన ఈ సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసుల కథనం మేరకు.. రాయచోటి పట్టణం బ్రాహ్మణ వీధిలోని మాండవ్యనది ఒడ్డున నిర్మించిన ఓ ప్రైవేట్ హాస్పిటల్ యజమానికి (చిన్న పిల్లల డాక్టర్‌కు) సైబర్ నేరగాళ్లు ఫోన్ చేశారు. తాము సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్ పోలీసులమని చెప్పారు. మీకు డ్రగ్స్ ముఠాతో సంబంధాలున్నాయని, మీ హాస్పిటల్‌లో డ్రగ్స్ వాడుతున్నట్లు మాదగ్గర ఆధారాలున్నాయని చెప్పారు. కేసు నుంచి బయట పడాలంటే డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బెదిరిపోయిన డాక్టర్ వారు అడిగినట్లుగానే ఆరు బ్యాంక్ ఖాతాల ద్వారా రూ. 2 కోట్లు ట్రాన్స్‌ఫర్ చేశాడు. తరువాత తాను మోసపోయానని తెలుసుకుని పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

మహానందీశ్వరునికి సహస్రదీపాలంకరణ

మహానంది: నంద్యాల జిల్లా మహానందిలో కొలువైన కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి దంపతులకు మంగళవారం రాత్రి సహస్రదీపాలంకరణ పూజలు కనులపండువగా జరిగాయి. ఈఓ నల్లకాలువ శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, ప్రధాన అర్చకులు మామిళ్లపల్లి అర్జునశర్మ, పండితులు, రుత్వికులు ప్రత్యేక పూజలు చేశారు.

రెండు దశాబ్దాల క్రితం ఆమదాలవలస పేరు చెబితే జాతీయ స్థాయిలో ఠక్కున గుర్తుకొచ్చేది వెయిట్ లిఫ్టింగ్. ఒకరా ఇద్దరా.. పదుల సంఖ్యలో క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని తమ సత్తా చాటేవారు. విశ్వక్రీడావేదిక ఒలింపిక్స్‌లోనూ ఆమదాలవలస వైభవాన్ని చాటిచెప్పారు. కానీ నేడు ఆ వైభవమంతా గతకాలపు స్మృతిగా మిగిలిపోయింది. కరణం మల్లీశ్వరి, నీలంశెట్టి లక్ష్మి, పూజారి శైలజ వంటి దిగ్గజ క్రీడాకారులకు శిక్షణ ఇచ్చి సిద్ధం చేసిన ఆమదాలవలస వెయిట్‌లిఫ్టింగ్ శిక్షణ కేంద్రం నేడు ఆదరణ కరువై శిథిలావస్థకు చేరుకుంది. ప్రోత్సాహం కరువై క్రీడాకారులు ఇటువైపు చూడటమే మానుకున్నారు.

బరువైపోయిందా?

ఆమదాలవలసలో మారుతీ వ్యాయామ మండలి శిక్షణా భవనం





సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: వెయిట్‌లిఫ్టింగ్ క్రీడాంశంలో ఒలింపిక్ పతకంతో పాటు ఎన్నో జాతీయ అంతర్జాతీయ పతకాలు సాధించిన క్రీడాకారులను తీర్చిదిద్దిన శిక్షణా కేంద్రానికి నేడు నిర్లక్ష్యపు గ్రహణం కమ్మేసింది. పట్టించుకునే నాథుడు లేక దయనీయ స్థితికి చేరుకుంది. వెయిట్ లిఫ్టింగ్‌లో ఒకప్పుడు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస పేరు మారుమ్రోగింది. ఇక్కడి నుంచి పదుల సంఖ్యలో క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ, ఒలింపిక్స్ క్రీడా పోటీల్లో పాల్గొని పతకాలు సాధించారు. ఆమదాలవలస ప్రాంతం నుంచి వెయిట్‌లిఫ్టింగ్ క్రీడాకారులు ఎక్కువగా వస్తుండటంతో 1987లో ప్రభుత్వం ఇక్కడ శిక్షణా కేంద్రం ఏర్పాటుచేసింది.

మెరిసిన ఆణిముత్యాలు..

ఈ ప్రాంతం నుంచి తొలిసారిగా ఊసవానిపేటకు చెందిన నీలం శెట్టి గురువునాయుడు సీనియర్ నేషనల్ చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొని సత్తాచాటారు. ఆ తరువాత నీలంశెట్టి సూర్యనారాయణ, కరణం నరసమ్మలు అంతర్జాతీయ స్థాయిలో రాణించారు. అలాగే సీతమ్మ అనే క్రీడాకారిణి స్టేట్ చాంపియన్‌గా నిలిచింది. అనంతరం కామన్వెల్త్ గేమ్స్‌లో పతకం సాధించి నీలంశెట్టి లక్ష్మి సిక్కోలు కీర్తి ప్రతిష్ఠలను అంతర్జాతీయ స్థాయిలో నిలిపింది. ఇక 2000 సంవత్సరంలో ఆస్ట్రేలియాలో జరిగిన ఒలింపిక్స్ క్రీడల్లో కాంస్య పతకంతో కరణం మల్లీశ్వరి సృష్టించిన చరిత్ర అందరికీ తెలిసిందే. కామన్వెల్త్ క్రీడల్లో వెయిట్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌గా నిలిచిన పూజారి శైలజ ప్రతిభ చెప్పనవసరం లేదు. వీరితోపాటు యామిని, కరణం కల్యాణి, కరణం కృష్ణవేణి, గౌరి, నీలంశెట్టి ఉమామహేశ్వరరావు, అప్పలనాయుడు, బొడ్డేపల్లి రాజ్యలక్ష్మి, చీర రాజేశ్వరి, ఎన్ని శ్రీదేవి ఇలా ఎంతో మంది జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతలు సాధించారు.

ఆ వైభవం గతమే..

ఆమదాలవలసలో వెయిట్‌లిఫ్టింగ్ క్రీడాకారులు కనుమరుగయ్యే పరిస్థితి కనిపిస్తోంది. గతంలో జాతీయ ,అంతర్జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారులు సుమారు 60నుంచి 80మంది వరకు ఉండేవారు. ఇప్పుడు పది విభాగాల్లో పాల్గొనేందుకు క్రీడాకారులే కరువయ్యారు. ప్రస్తుతం ఇక్కడ ఎనిమిది మంది మాత్రమే శిక్షణ పొందుతున్నారు.

ఆదరణ లేకే..

ఆమదాలవలసలో తొలుత కొత్తకోట అమ్మినాయుడు అనే వ్యక్తి మారుతి వ్యాయామ మండలిని ఏర్పాటు చేశారు. అనంతరం 1983లో అప్పటి ప్రభుత్వం చిన్న శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. అది శిథిలావస్థకు చేరడంతో అమ్మినాయుడు విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిధులు సాధించుకున్నారు. 1987లో అప్పటి ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు విడుదల చేసింది. వాటితో నూతన భవనాన్ని నిర్మించారు. నీలంశెట్టి అప్పన్న అనే వ్యక్తి కోచ్‌గా ఉండేవారు. ఆయన రిటైరయ్యాక కోచ్‌ను నియమించలేదు. దీంతో సీనియర్ క్రీడాకారులే శిక్షకులుగా వ్యవహరిస్తూ క్రీడాకారులను తీర్చిదిద్దేవారు. కాల క్రమేణా ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం అందకపోవడం, ఔత్సాహికులు కూడా ముందుకు రాకపోవడంతో శిక్షణా కేంద్రం దయనీయ స్థితికి చేరుకుంది. భవనం కూడా శిథిలావస్థకు చేరుకుంది. సామగ్రి లేకపోవడంతో క్రీడాకారులు వెళ్లడం మానేశారు. దీంతో పూర్తిగా మూతపడిపోయింది. ఇటీవల ఆమదాలవలస మండలం కొర్లకోట గ్రామానికి చెందిన జాతీయ క్రీడాకారిణి చిగురుపల్లి రాజ్యలక్ష్మి తన సొంత డబ్బులతో ఇక్కడ వెయిట్ లిఫ్టింగ్ సామగ్రి ఏర్పాటు చేశారు. అక్కడే తన కుమార్తె చిగురుపల్లి హారికరాజ్‌కు శిక్షణ ఇస్తున్నారు. ఆ బాలిక ఇక్కడ ప్రాక్టీస్ చేస్తుండటంతో మరో 8 మంది వచ్చి ప్రాక్టీస్ చేస్తున్నారని ఆమె చెబుతున్నారు.


శిథిలావస్థలోని శిక్షణా కేంద్రంలో వెయిట్‌లిఫ్టింగ్ ప్రాక్టీస్ చేస్తున్న చిన్నారి చిగురుపల్లి హారికారాజ్


శిక్షణాకేంద్రంలో నిరుపయోగంగా మారిన పరికరాలు


పగిలిపోయిన కిటికీలు


చెదలు పట్టి దెబ్బతిన్న తలుపులు

పట్టించుకునే నాథుడే లేడు

ఎంతో పేరు ప్రఖ్యాతులు కలిగిన ఆమదాలవలస వెయిట్ లిఫ్టింగ్ శిక్షణ కేంద్రం శిథిలావస్థకు చేరిపోవడం బాధగా ఉంది. 2001లో ఇక్కడ ప్రాక్టీస్ మొదలు పెట్టిన నేను జాతీయ ,అంతర్జాతీయ స్థాయిలో పలు పతకాలు అందుకున్నాను. ప్రస్తుతం సరైన ప్రోత్సాహం, వసతులు లేక ఔత్సాహిక క్రీడాకారులు ముందుకు రావడంలేదు. ఈ ప్రాంతంలో ఈ క్రీడ కనుమరుగైపోకుండా చూడాలనే ఉద్దేశ్యంతో నా సొంత డబ్బుతో సామగ్రి కొనుగోలు చేసి నాకున్న సామర్థ్యం మేరకు శిక్షణ ఇస్తున్నాను. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు చింతాడ రవికుమార్ ఇటీవల రూ.50వేలు ఇచ్చి ప్రోత్సహించారు. నా కుమార్తెకు కూడా ఆయనే స్పాన్సర్ చేసి పోటీలకు పంపిస్తున్నారు. ఇప్పటికైనా శిక్షణా కేంద్రంలో సామగ్రి ఏర్పాటు చేసి, వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారులను ఆదుకోవాలి. కోచ్‌ను ఏర్పాటు చేయాలి.



– చిగురుపల్లి రాజ్యలక్ష్మి, వెయిట్ లిఫ్టర్, ఆమదాలవలస

క్రీడాకారులు కరువు

వెయిట్‌లిఫ్టింగ్ క్రీడాకారులకు ప్రభుత్వం నుంచి ఎటువంటి ప్రోత్సాహం లేదు. ఎక్కువగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని సామాన్య కుటుంబాల నుంచి వచ్చిన పిల్లలు ఈ క్రీడాంశాన్ని ఎంచుకుంటుంటారు. ఆర్థిక పరిస్థితులు అంతగా సహకరించక రాణించలేకపోతున్నారు. వెయిట్ లిఫ్టింగ్‌లో రాణించినవారికి కనీసం హోంగార్డు పోస్టులో అయినా ప్రాధాన్యత ఇస్తే ఉత్సాహంగా ముందుకువచ్చేవారు. పతకం తెచ్చిన క్రీడాకారుడిని నాయకులు ఆరోజు అభినందించడం తప్ప తరువాత పట్టించుకోవడంలేదు. గతంలో జిల్లా వ్యాప్తంగా సుమారు 80 మంది వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొనేవారు. ప్రస్తుతం 30 నుంచి 40 మంది మాత్రమే పాల్గొంటున్నారు.



– బలివాడ తిరుపతిరావు, వెయిట్‌లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా మాజీ కార్యదర్శి, వెయిట్‌లిఫ్టర్

ఏడేళ్ల తరువాత తల్లిదండ్రుల చెంతకు కుమారుడు

ఆధార్ కేంద్రంలో వేలిముద్రల ద్వారా గుర్తింపు

కడప అర్బన్ : అదృశ్యమైన కుమారుడిని ఏడేళ్ల తరువాత తల్లిదండ్రులకు అప్పగించిన ఘటన వైఎస్సార్ జిల్లా కడప నగరంలో మంగళవారం చోటుచేసుకుంది. ప్రభుత్వ బాలుర గృహంలో వుంటున్న మహారాష్ట్రలోని ముంబైకి చెందిన రిత్వాన్ (16)ను అతని తండ్రి దుర్గాదాస్‌కు అప్పగించారు. వసతిగృహం సూపరింటెండెంట్ వీరయ్య తెలిపిన వివరాల ప్రకారం.. రిత్వాన్ 8 ఏళ్ల వయసులో 2018లో ముంబై నుంచి అదృశ్యమయ్యాడు. అప్పటి నుంచి వివిధ ప్రాంతాలు తిరుగుతూ కర్నూలుకు వచ్చాడు. 2022లో అతన్ని కడపలోని ప్రభుత్వ బాలుర గృహానికి పంపించారు. అప్పటి నుంచి ఇక్కడే ఉన్నాడు. ఇటీవల ఆ బాలుడికి ఆధార్ కార్డు తయారు చేయించాలని సూపరింటెండెంట్ పర్యవేక్షణలో సిబ్బంది ఆధార్ నమోదు కేంద్రానికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆధార్‌కార్డు కోసం బాలుడి చేతి వేళ్లను ముద్రించే ప్రయత్నం చేయగా.. అప్పటికే ఆధార్ కార్డు వుందని గమనించారు. అతని తల్లిదండ్రుల వివరాలు తెలుసుకుని వారికి సమాచారం ఇచ్చారు. వారు తగిన ఆధారాలతో రాగానే బాలుడు రిత్వాన్‌ను తండ్రి దుర్గాదాస్‌కు అప్పగించారు.


రిత్వాన్‌ను తండ్రి దుర్గాదాస్‌కు అప్పగించిన బాలుర గృహం సూపరింటెండెంట్ వీరయ్య, సిబ్బంది

ఛత్తీస్‌గఢ్ 'ఎన్‌కౌంటర్'పై న్యాయవిచారణ జరిపించాలి

ఏపీ పౌరహక్కుల సంఘం రాష్ట్ర కార్యదర్శి చిలుకా చంద్రశేఖర్



సత్తెనపల్లి: ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్ ఘటనపై న్యాయవిచారణ జరిపించాలని ఏపీ పౌర హక్కుల సంఘం రాష్ట్ర కార్యదర్శి, సీనియర్ న్యాయవాది చిలుకా చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో మంగళవారం చంద్రశేఖర్ మాట్లాడుతూ.. అబూజ్‌మాడ్‌లోని తెల్హులి-నెండూర్ ప్రాంతంలో ఈ నెల 4వ తేదీ జరిగిన ఆదివాసీల హత్యాకాండ రాజ్యాంగ వ్యతిరేకమే కాక మానవ హక్కుల ఉల్లంఘనే అవుతుందన్నారు. డీజీజీ సుందర్ రాజన్, తదితర పోలీసులు ఇచ్చిన సమాచారం మేరకే మృతులంతా ఆదివాసీ తెగలకు చెందిన వారని, వాళ్లలో 13 మంది మహిళలు సైతం ఉన్నారని తెలుస్తుందని చెప్పారు. ఈ ఘటన జరిగిన తీరుపై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయన్నారు. రాజ్యాంగం కల్పించిన జీవించే హక్కును కాలరాస్తూ ఎన్‌కౌంటర్ పేరుతో మూకుమ్మడిగా ఆదివాసీలను కాల్చేశారన్నారు.



శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో మంగళవారం భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 24 కంపార్ట్‌మెంట్లు నిండాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 81,481 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 38,762 మంది భక్తులు తలనీలాలు సమర్పించుకున్నారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.31 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనం లభిస్తోంది. దర్శన టిక్కెట్లు లేని వారు స్వామిని దర్శించుకునేందుకు 24 గంటల సమయం పడుతోంది.

శ్రీ మహాలక్ష్మి అలంకారంతో చెంగాళమ్మ పరమేశ్వరి



సూళ్లూరుపేట: తిరుపతి జిల్లా సూళ్లూరుపేటలోని శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయంలో శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా ఆరో రోజున మంగళవారం అమ్మవారిని శ్రీ మహాలక్ష్మి అలంకారంతో దర్శనభాగ్యం కల్పించారు. అమ్మవారికి ఎంతో ప్రీతిపాత్రమైన మహాచండీయాగం వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

సింహగిరిపై నేడు ఆయుధపూజ



సింహాచలం: సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో జరుగుతున్న విజయదశమి మహోత్సవాల్లో భాగంగా మూల నక్షత్రాన్ని పురస్కరించుకుని బుధవారం ఆయుధపూజని నిర్వహించనున్నారు. ఆలయంలో వేంజేసిన సింహవల్లీ తాయారు సన్నిధిలో ఉదయం స్వామివారి ఆయుధాలైన కత్తి, ధనస్సు, బాణం, బాకు తదితర వాటిని ఉంచి ఆయుధపూజ చేయనున్నారు.

అంజన్నను దర్శించుకున్న భక్తులు

జంగారెడ్డిగూడెం రూరల్: ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలం గురవాయిగూడెంలో కొలువైన శ్రీమద్ది ఆంజనేయస్వామి వారిని మంగళవారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు స్వామి వారికి తమలపాకులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మహంకాళేశ్వరునిగా క్షీరారామలింగేశ్వరస్వామి



పాలకొల్లు సెంట్రల్: పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులోని పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వర స్వామి ఆలయంలో స్వామివారిని మంగళవారం ప్రత్యేకంగా అలంకరించారు. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు సందర్భంగా స్వామివారిని మహంకాళేశ్వరునిగా అలంకరించగా, అమ్మవారిని లలితాత్రిపురసుందరీ దేవిగా అలంకరణ చేశారు.


భీమేశ్వరునికి ప్రత్యేక పూజలు



సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రం బాలాత్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భాద్రపద మాసం పంచమిని పురస్కరించుకుని ఈఓ బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు స్వామి వారికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు.

15వరకు ఎన్‌ఎంఎంఎస్ దరఖాస్తుల గడువు పెంపు

తిరుపతి ఎడ్యుకేషన్ : డిసెంబరు 8న జాతీయ స్థాయిలో నిర్వహించనున్న నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్‌ఎంఎంఎస్) పరీక్షకు దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 15వ తేదీ వరకు గడువును పెంచినట్లు తిరుపతి డీఈఓ డాక్టర్ వి.శేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. "డబ్ల్యు. డబ్ల్యు.డబ్ల్యు.బీఎస్ఈ.ఏపి.జీఓవి.ఇన్" అనే వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ పరీక్షకు జిల్లాలోని అన్ని యాజమాన్య ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతూ, వార్షికాదాయం రూ.3.50 లక్షల లోపున్న వారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.



'నన్నయ'లో సాంస్కృతిక వైభవం సదస్సు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలో నవంబరు 7, 8 తేదీల్లో ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక వైభవం సదస్సు నిర్వహించనున్నట్టు ఇన్‌చార్జి వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు తెలిపారు. ఇందుకు సంబంధించిన బ్రోచర్‌ని మంగళవారం విడుదల చేశారు.

గీతం సైన్స్ డీన్‌కు ప్రతిష్ఠాత్మక ఐజీయూ అవార్డు

కొమ్మాది: భౌతిక శాస్త్రవేత్తలకు ఇండియన్ జియో ఫిజికల్ యూనియన్ (ఐజీయూ) ఏటా ప్రకటించే ప్రతిష్ఠాత్మక హరి నారాయణ్ లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు–2024 కు గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కె.ఎస్.కృష్ణ ఎంపికయ్యారు. మెరైన్ జియో ఫిజిక్స్‌లో జరిపిన విశిష్ట పరిశోధనలు గుర్తిస్తూ ఈ అవార్డు అందజేస్తున్నారు.

ముగిసిన ఏపీటీఎఫ్ రాష్ట్ర మహాసభలు

విజయనగరం అర్బన్: విజయనగరంలో మూడు రోజులుగా జరిగిన ఏపీటీఎఫ్ 80 వసంతాల మహాసభ మంగళవారంతో ముగిసింది. ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలతో కూడిన 16 డిమాండ్ల సాధన ప్రతిపాదనలను మహాసభ ఆమోదించింది. అధ్యక్షుడు జి.హృదయరాజు అధ్యక్షతన జరిగిన ముగింపు సభలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.చిరంజీవి విధాన పత్రాన్ని సభలో ప్రకటించి తీర్మానాలను ఆమోదింప చేశారు.

సాక్షి ప్లస్
బుధవారం । 9-10-2024

బిజినెస్ రీల్

టాటా టెక్నాలజీస్, బీఎండబ్ల్యు జేవీ

ముంబై: టాటా టెక్నాలజీస్, బీఎండబ్ల్యూ గ్రూప్ తాజాగా బీఎండబ్ల్యు టెక్‌వర్క్స్ ఇండియా పేరుతో జాయింట్ వెంచర్‌ను మంగళవారం ప్రకటించాయి. ఈ జేవీ సాఫ్ట్‌వేర్ డిఫైన్డ్ వెహికల్స్, బిజినెస్ ఐటీ కోసం డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సొల్యూషన్స్‌తో సహా ఆటోమోటివ్ సాఫ్ట్‌వేర్‌లో నూతన పద్ధతులను అభివృద్ధి చేస్తుంది. కాంట్రాక్టులపై తుది సంతకం, ప్రభుత్వ ఆమోదంతో పుణే, బెంగళూరు, చెన్నైలోని కీలక టెక్నాలజీ హబ్‌లలో 100 మంది ఉద్యోగులతో జేవీ కార్యకలాపాలను ప్రారంభించనున్నట్టు ఇరు సంస్థలు వెల్లడించాయి. 2025 చివరినాటికి సిబ్బంది సంఖ్య నాలుగు అంకెల స్థాయికి చేరుతుందని తెలిపాయి.

పేటెంట్ వివాదాన్ని పరిష్కరించుకున్న మైలాన్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఓజెంపిక్ జనరిక్ ఔషధానికి సంబంధించి యూఎస్‌లో నోవో నార్డిస్క్‌తో ఉన్న పేటెంట్ వివాదాన్ని మైలాన్ ఫార్మాస్యూటికల్స్ పరిష్కరించుకుందని నాట్కో ఫార్మా సోమవారం తెలిపింది. జనరిక్ ఓజెంపిక్ (సెమాగ్లుటైడ్) అభివృద్ధికి నాట్కో, మైలాన్ గతంలో భాగస్వామ్యం కుదుర్చుకున్నాయి. రక్తంలో చక్కెరను తగ్గించడానికి, బరువు తగ్గడానికి ఓజెంపిక్‌ను వైద్యుల సిఫార్సు మేరకు ఉపయోగిస్తారు. సెటిల్‌మెంట్ వార్త నేపథ్యంలో నాట్కో షేరు ధర క్రితం ముగింపుతో పోలిస్తే సోమవారం 3.47 శాతం దూసుకెళ్లి రూ.1,401.60 వద్ద స్థిరపడింది.

రెండేళ్లలో క్యూ-కామర్స్ అయిదు రెట్లు వృద్ధి

ఇమామీ ఎండీ అగర్వాల్ అంచనా

న్యూఢిల్లీ: వచ్చే రెండేళ్లలో క్విక్ కామర్స్ మాధ్యమం ద్వారా తమ ఉత్పత్తుల అమ్మకాలు నాలుగు నుంచి అయిదు రెట్లు పెరుగుతాయని అంచనా వేస్తున్నట్లు ఎఫ్‌ఎంసీజీ దిగ్గజం ఇమామీ వైస్ చైర్మన్, ఎండీ హర్ష వి అగర్వాల్ తెలిపారు. అలాగే, పౌష్టికాహారం, పెంపుడు జంతువుల ఆహారం వంటి డైరెక్ట్–టు–కన్స్యూమర్ ఉత్పత్తుల విభాగంలో మరిన్ని సంస్థలను కొనుగోలు చేసే అంశాన్ని కూడా పరిశీలిస్తున్నట్లు వివరించారు. వర్షపాతం మెరుగ్గా ఉండటంతో ఈసారి గ్రామీణ మార్కెట్లలో కూడా పండుగ సీజన్ బాగుంటుందని ఆశిస్తున్నట్లు అగర్వాల్ చెప్పారు. ఇమామీ ఇటీవలే 'ది మ్యాన్ కంపెనీ' బ్రాండ్ మాతృ సంస్థ హీలియోస్ లైఫ్‌స్టయిల్‌లో మిగతా 49.6 శాతం వాటాను కొనుగోలు చేసింది. అలాగే యాక్సియోమ్ ఆయుర్వేదలో 26 శాతం వాటా తీసుకోవడం ద్వారా ప్యాక్డ్ జ్యూస్ వ్యాపార విభాగంలోకి ప్రవేశించింది. 2024 ఆర్థిక సంవత్సరంలో తమ ఆదాయంలో 45 శాతం వాటా తాము కొనుగోలు చేసిన కంపెనీలదే ఉందని వార్షిక నివేదికలో ఇమామీ వెల్లడించింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

9-10-2024	
విశాఖ	525-00
చిత్తూరు	523-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	525-00
విజయవాడ	525-00
రిటైల్ ధర (డజను)	78.00
హైదరాబాద్	510-00
వరంగల్	512-00
రిటైల్ ధర	5.70

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
TRENT	8,042.00	7.95
BEL	281.5	5.29
ADANIENT	3,166.95	4.94
ADANIPORTS	1,421.00	4.86
M&M	3,169.25	3.56

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
SBILIFE	1,730.00	-3.24
TATASTEEL	159.89	-2.72
TITAN	3,504.90	-2.35
BAJAJFINSV	1,836.00	-2.3
JSWSTEEL	1,001.80	-1.66

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	6,527
ఎన్ఎస్ఈ	1,13,420
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	2,25,046
ఎఫ్ఐఐ	- 5,730
డీఐఐ	+ 7,001

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	74.11	$ 77.14
బ్రెంట్	77.71	$ 80.93

రుణ పూచీకత్తు మార్గదర్శకాలు కఠినతరం

మైక్రోఫైనాన్స్ నియంత్రణ సంస్థ ఎంఫిన్ ప్రకటన

న్యూఢిల్లీ: మైక్రో ఫైనాన్స్ సంస్థలకు 'రుణ పూచీకత్తు' మార్గదర్శకాలను కఠినతరం చేసినట్లు స్వీయ నియంత్రణ సంస్థ– మైక్రో ఫైనాన్స్ ఇండస్ట్రీ నెట్‌వర్క్ (ఎంఫిన్) ప్రకటించింది. మైక్రో ఫైనాన్స్ సంస్థల నుంచి రుణాలకు సంబంధించి రుణ గ్రహీతలపై భారం పెరిగిపోతోందని, దీనితో తీసుకున్న రుణాలను వారు తిరిగి చెల్లించలేకపోతున్నారన్న ఆందోళనల నేపథ్యంలో ఎంఫిన్ తాజా నిర్ణయం తీసుకుంది. రుణాల్లో నెలకొన్న ప్రస్తుత సవాళ్ల పరిష్కారానికి తాజా చర్య దోహదపడుతుందని ఎంఫిన్ తెలిపింది. బుల్లెట్ రీపేమెంట్ (రుణ వ్యవధిలో అప్పటికి చెల్లింపులు జరిపింది పోగా, మిగిలిన మొత్తం బ్యాలెన్స్‌ను ఒకేసారి భారీగా చెల్లించేయడం), చెల్లించని ఈఎంఐల గురించి ప్రస్తుతం మైక్రో ఫైనాన్స్ సంస్థలకు ప్రస్తుతం తగిన సమాచారం అందడంలేదని, ఆయా సమస్యల పరిష్కారానికి ప్రస్తుత మార్గదర్శకాలు దోహదపడతాయని ప్రకటన వివరించింది. అయితే మార్గదర్శకాలు ఏమిటన్నది నిర్దిష్టంగా తెలియరాలేదు. ఇక ఒకే రుణగ్రహీత ఐదు రుణాలను తీసుకున్న పలు సందర్భాలూ వ్యవస్థలో ఆందోళనను సృష్టిస్తున్నాయి. ఒక రుణ గ్రహీత నెలవారీ సంపాదన ఎంత? చెల్లింపుల సామర్థ్యం ఏమిటి? అన్న అంశాలపైనా మైక్రో ఫైనాన్స్ సంస్థలకు తగిన సమాచారం లేకపోవడం సమస్యకు మరో కోణం. ఆయా అంశాలు మైక్రో ఫైనా న్స్ సంస్థల రుణ నాణ్యతపై ప్రభావం చూపుతున్నాయి. ఆయా సమస్యలను ఎదుర్కొనడానికి ప్రస్తుత మార్గదర్శకాలు దోహదపడతాయని సమాచారం. సంబంధిత వర్గాల నుంచి ఆరు నెలలకు పైగా అందిన సమాచారం, 12 కోట్ల రుణ రికార్డులను విశ్లేషించిన తర్వాత కొత్త మార్గదర్శకాలు జారీ అయ్యాయి.

ఎఫ్‌ఎంసీజీలకు 'కిక్' కామర్స్

- అమ్మకాలు రెండు రెట్లు పెరుగుదల
- డెలాయిట్, ఫిక్కీ సంయుక్త నివేదిక



న్యూఢిల్లీ: క్విక్ కామర్స్ ప్రముఖ ఎఫ్‌ఎంసీజీలకు కిక్కెక్కిస్తోంది. ఎఫ్‌ఎంసీజీ కంపెనీల మొత్తం ఆన్‌లైన్ అమ్మకాల్లో క్విక్‌కామర్స్ విక్రయాలు రెండు రెట్లు పెరిగినట్టు డెలాయిట్, ఫిక్కీ సంయుక్త నివేదిక వెల్లడించింది. పట్టణ వినియోగదారులకు క్విక్ కామర్స్ ప్రాధాన్య ఛానల్‌గా మారుతున్నట్టు ఈ నివేదిక తెలిపింది. దీంతో ఎఫ్‌ఎంసీజీ ఆన్‌లైన్ విక్రయాల్లో క్విక్ కామర్స్ విభాగం వాటా 35 శాతానికి చేరుకున్నట్టు పేర్కొంది. ''18 శాతానికి పైగా వినియోగదారులు ఆహారం, పానీయాలను క్విక్ కామర్స్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా కొనుగోలుకు మొగ్గు చూపిస్తున్నారు. 2021 నుంచి 2023 నాటికి క్విక్ కామర్స్ మార్కెట్ 230% పెరిగింది''అని ఈ నివేదిక వివరించింది. మరుసటి రోజు డెలివరీ చేసే సంప్రదాయ ఆన్‌లైన్ గ్రోసరీ సంస్థల మార్కెట్ వాటాను క్విక్ కామర్స్ సంస్థలు కొల్లగొడుతున్నట్టు తెలిపింది. ''క్విక్ కామర్స్ వృద్ధి ఇదే మాదిరిగా కొనసాగుతుంది. వినియోగదారులు క్విక్ కామర్స్ ఛానళ్ల ద్వారా కొనుగోలుకు మొగ్గు చూపిస్తున్నారు. ఎఫ్‌ఎంసీజీ ఉత్పత్తుల కొనుగోళ్లకు ఈ-కామర్స్ ప్రధాన్య ఛానల్‌గా మారింది. ఇంటర్నెట్ వినియోగం వేగంగా విస్తరిస్తోంది. ఎఫ్‌ఎంసీజీ మొత్తం అమ్మకాల్లో ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌ల వాటా 17 శాతానికి చేరింది. సంపన్న వినియోగదారులు ఈ దిశగా ఆసక్తి చూపిస్తున్నారు. గొప్ప సౌకర్యం, విస్తృత ఉత్పత్తుల శ్రేణి, పోటీతో కూడిన ధరలు ఆకర్షిస్తున్నాయి''అని ఈ నివేదిక వెల్లడించింది.

ఫుడ్, బెవరేజెస్..

ఫుడ్, బెవరేజెస్ కోసం సంప్రదాయ ఈ-కామర్స్ ఛానళ్ల కంటే క్విక్ కామర్స్ సంస్థల్లో ఆర్డర్ చేసేందుకే కస్టమర్లు ఆసక్తి చూపిస్తున్నారని, ఇవి తక్షణ అవసరాల కోసం ఉద్దేశించినవిగా డెలాయిట్, ఫిక్కీ నివేదిక పేర్కొంది. అదే సౌందర్య, గృహ ఉత్పత్తులు తక్షణ అవసరమైనవి కావకపోవడంతో, వీటిని ఈ-కామర్స్ వేదికలపై ఆర్డర్ చేసేందుకు వినియోగదారులు మొగ్గు చూపిస్తున్నట్టు వెల్లడించింది. చిన్న కుటుంబాలు, భార్యా భర్తలు ఇద్దరూ ఉద్యోగాలు చేసే వారు కావడం క్విక్ కామర్స్‌కు డిమాండ్‌ను పెంచుతున్నట్టు వివరించింది.

స్పైస్‌జెట్‌కు మరో 10 విమానాలు



ముంబై: విమానయాన సంస్థ స్పైస్‌జెట్ వచ్చే నెలలోగా మరో 10 విమానాలను సమకూర్చుకుంటున్నట్లు తెలిపింది. వీటిలో ఏడింటిని లీజుపై తీసుకుంటున్నట్లు, గతంలో నిలిపివేసిన మరో మూడింటిని తిరిగి వినియోగంలోకి తెస్తున్నట్లు వివరించింది. తొలి విమానం అక్టోబర్ 10న అందుబాటులోకి వస్తుందని సంస్థ తెలిపింది. అందుబాటులో ఉన్న గణాంకాల ప్రకారం ప్రస్తుతం స్పైస్‌జెట్‌కి చెందిన 36 విమానాలు నిల్చిపోగా, 19 మాత్రమే వినియోగంలో ఉన్నాయి. కంపెనీ ఇటీవల రూ. 3,000 కోట్ల మేర కొత్తగా మూలధనం సమకూర్చుకున్న నేపథ్యంలో తాజా ప్రకటన ప్రాధాన్యం సంతరించుకుంది. లీజుకు తీసుకుంటున్న విమానాలకు సంబంధించి ఇప్పటికే ఒప్పందాలు కుదుర్చుకున్నామని, నవంబర్ 15 నాటికి మొత్తం ఏడు ఎయిర్‌క్రాఫ్ట్‌లు అందుబాటులోకి వస్తాయని సంస్థ తెలిపింది. కార్యకలాపాల నిర్వహణ సామర్థ్యాలను పటిష్టం చేసుకోవడంతో పాటు విమాన ప్రయాణాలకు పెరుగుతున్న డిమాండ్‌ను తీర్చడానికి అదనంగా విమానాలను సమకూర్చుకోవడం సహాయకరంగా ఉంటుందని స్పైస్‌జెట్ చైర్మన్ అజయ్ సింగ్ తెలిపారు.

ఎయిర్‌టెల్ చేతికి టాటా ప్లే!

తుది దశలో చర్చలు!



ముంబై: నష్టాలలో ఉన్న టాటా ప్లే కొనుగోలుకి మొబైల్ టెలికం రంగ దిగ్గజం భారతీ ఎయిర్‌టెల్ పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది. దేశీయంగా డైరెక్ట్ టు హోమ్(డీటీహెచ్) సేవలకు అతిపెద్ద కంపెనీగా నిలుస్తున్న టాటా గ్రూప్ కంపెనీని సొంతం చేసుకునేందుకు ఎయిర్‌టెల్ చేపట్టిన చర్చలు తుది దశలో ఉన్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. టాటా ప్లేను కొనుగోలు చేయడం ద్వారా డిజిటల్ టీవీ విభాగంలో కార్యకలాపాలను సమీకృతం చేయాలని ఎయిర్‌టెల్ భావిస్తున్నట్లు తెలియజేశాయి. వృద్ధి సంబంధ సవాళ్లను ఎదుర్కొంటున్న ఎయిర్‌టెల్ ఈ కొనుగోలుతో విభిన్న సేవల ప్యాకేజీలను ఆఫర్ చేయడం ద్వారా నాన్‌మొబైల్ ఆదాయాన్ని పెంచుకునే యోచనలో ఉన్నట్లు వివరించాయి. విక్రయ ఒప్పందం కుదిరితే కంటెంట్, ఎంటర్‌టైన్‌మెంట్ కార్యకలాపాల నుంచి టాటా గ్రూప్ వైదొలగే అవకాశముంది. అంతేకాకుండా రెండు గ్రూప్‌ల మధ్య రెండోసారి విక్రయ డీల్‌కు తెరలేవనుంది. గతంలో టాటా గ్రూప్ కన్జూమర్ మొబిలిటీ బిజినెస్‌ను 2017లో ఎయిర్‌టెల్ చేజిక్కించుకున్న విషయం విదితమే.

టర్న్అరౌండ్

గత ఆర్థిక సంవత్సరాని(2023–24)కల్లా టాటా ప్లే డీటీహెచ్ వినియోగదారుల సంఖ్య 20.77 మిలియన్లుకాగా.. టాటా ప్లే ఫైబర్(బ్రాడ్‌బ్యాండ్) సబ్‌స్క్రయిబర్ల సంఖ్య 0.48 మిలియన్లు. డీటీహెచ్ విభాగం ఆదాయం వార్షికంగా 6 శాతం నీరసించి రూ. 3,983 కోట్లకు పరిమితమైంది. లాభాలను వీడి రూ. 247 కోట్ల నష్టం ప్రకటించింది. అంతక్రితం ఏడాది(2022–23) రూ. 20 కోట్ల నికర లాభం ఆర్జించింది. డీటీహెచ్ సేవలలో 32.7 శాతం మార్కెట్ వాటాను సాధించింది. ఈ బాటలో ఎయిర్‌టెల్ డిజిటల్ టీవీ 27.8 శాతం, డిష్ టీవీ 20.8 శాతం, సన్ టీవీ డైరెక్ట్ 18.7 శాతం చొప్పున మార్కెట్ వాటాలను కలిగి ఉన్నాయి.

అమెజాన్ చేతికి ఎంఎక్స్ ప్లేయర్ యాప్

న్యూఢిల్లీ: ఉచిత స్ట్రీమింగ్ ఓటీటీ ప్లాట్‌ఫాం 'ఎంఎక్స్ ప్లేయర్'ను కొనుగోలు చేసినట్లు అమెజాన్ వెల్లడించింది. దాన్ని తమ కంటెంట్ స్ట్రీమింగ్ సర్వీస్ మినీటీవీలో విలీనం చేసి, 'అమెజాన్ ఎంఎక్స్ ప్లేయర్' కింద ఒకే సర్వీసుగా మార్చినట్లు పేర్కొంది. అమెజాన్‌డాట్‌ఇన్ షాపింగ్ యాప్, ప్రైమ్ వీడియో, ఫైర్ టీవీ, కనెక్టెడ్ టీవీల ద్వారా ఇది అందుబాటులో ఉంటుందని తెలిపింది. రెండు సర్వీసుల అనుసంధానం ఆటోమేటిక్‌గా జరుగుతుందని, దీనికోసం ఆయా యాప్‌లను రీఇన్‌స్టాల్ లేదా అప్‌గ్రేడ్ చేయనక్కర్లేదని వివరించింది. సెప్టెంబర్‌లో రెండు సర్వీసులను 25 కోట్ల మంది యూజర్లు వినియోగించుకున్న ట్లు అమెజాన్ పేర్కొంది. అయితే, ఈ డీల్ విలువ ఎంతనేది మాత్రం కంపెనీ వెల్లడించలేదు. సర్వీసును ఉచితంగా కొనసాగిస్తూనే మరింత నాణ్యమైన కంటెంట్‌ను, మెరుగైన స్ట్రీమింగ్ అనుభూతిని అందించేందుకు ఈ డీల్ ఉపయోగపడగలదని అమెజాన్ ఎంఎక్స్ ప్లేయర్ హెడ్ కరణ్ బేడీ తెలిపారు.

పేటీఎం మనీలో బీఎస్ఈ ఫ్యూచర్స్, ఆప్షన్స్ ట్రేడింగ్

న్యూఢిల్లీ: వన్97 అనుబంధ సంస్థ పేటీఎం మనీ తాజాగా బీఎస్ఈ ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్‌లో ట్రేడింగ్ సర్వీసులను ప్రారంభించింది. ఆర్డరుకు రూ. 20 చొప్పున చార్జీలు ఉంటాయని (పన్నులు అదనం) తెలిపింది. ప్రస్తుత ఎన్ఎస్ఈ ఎఫ్అండ్ఓ సర్వీసును పొందుతున్న యూజర్లకు బీఎస్ఈ ఎఫ్అండ్ఓ ట్రేడింగ్‌కి యాక్సెస్ ఆటోమేటిక్‌గా లభిస్తుంది. కొత్త యూజర్లు తమ కేవైసీ ప్రక్రియను పూర్తి చేసి యాక్సెస్ పొందవచ్చు.

ఔషధ పరీక్ష ఫలితాలు సానుకూలం: ఆరిజీన్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మల్టిపుల్ మైలోమా (బ్లడ్ క్యాన్సర్) చికిత్సకై భారత్‌లో తొలిసారిగా చేపట్టిన ఆటోలోగస్ సీఏఆర్–టీ సెల్ థెరపీ కోసం తొలి దశ ఔషధ పరీక్షల్లో సానుకూల ఫలితాలు వెలువడ్డాయని డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్ అనుబంధ కంపెనీ ఆరిజీన్ ఆంకాలజీ ప్రకటించింది.

భారత్ రెగ్యులేటర్లు.. భేష్

ప్రపంచ స్థాయి పని విధానం ● ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రశంస



ముంబై: భారత ఆర్థిక రంగ నియంత్రణ సంస్థలు అత్యుత్తమ రీతిలో ''ప్రపంచ ప్రమాణాల స్థాయి'' విధులు నిర్వహిస్తున్నాయని ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రశంసించారు. అలాగే వ్యవస్థలో పారదర్శకతను తీసుకురావడానికి సైతం రెగ్యులేటర్లు కృషి చేస్తున్నాయని అన్నారు. కాగా రెగ్యులేటర్లను ప్రశ్నించడానికి లేదా విమర్శించడానికి తాను వ్యతిరేకం కాదని ఆమె ఆ సందర్భంగా ఉద్ఘాటిస్తూ, అయితే రెగ్యులేటర్లు నిర్వహిస్తున్న అత్యున్నత బాధ్యతలు, ఎకానమీ పురోభివృద్ధిలో సహకారం పట్ల కూడా ''అత్యంత స్పృహ' కలిగి ఉండాల్సిన అవసరం ఉందని ఇక్కడ జరిగిన ఫైనాన్షియల్ ఎక్స్‌ప్రెస్‌బెస్ట్ బ్యాంక్స్ అవార్డుల కార్యక్రమంలో అన్నారు. సెబీ విషయంలో బయటకు వస్తున్న వాస్తవాలను అందరూ పరిశీలించాలని కోరారు. సెబీ చైర్‌పర్సన్ మాధవీ పురి బుచ్‌పై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో సీతారామన్ వ్యాఖ్యలకు ప్రాధాన్యత సంతరించుకుంది. 'రెగ్యులేటర్లపై చర్యలు తీసుకోవాలని చర్చించే ముందు వాస్తవాలను పరిగణనలోకి తీసుకోవాలని నేను గట్టిగా సిఫార్సు చేస్తున్నాను'' అని సీతారామన్ పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ తక్కువ సీట్లు గెలుచుకున్నప్పటికీ, ప్రభుత్వం ఎలాంటి ఒత్తిడికి లోనుకావడం లేదని ఆమె ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

డిజిటల్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాట్‌ఫామ్‌లకు ధన్యవాదాలు

బ్యాంకుల్లో పొదుపులు... పెట్టుబడుల్లోకి మారుతున్నాయన్న భయాలను ప్రస్తావిస్తూ, తక్కువ వడ్డీవచ్చే ఖాతాల వద్ద సౌకర్యవంతంగా కూర్చుండిపోకుండా, కొంత రిస్క్ తీసుకుని ఎక్కువ రాబడులు పొందే వీలున్న మార్కెట్లలోకి మధ్యతరగతి భారతీయులు ప్రవేశించడానికి దోహదపడుతూ ''గొప్ప సేవ''చేస్తున్న డిజిటల్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాట్‌ఫారమ్‌లకు ధన్యవాదాలని ఆర్థికమంత్రి పేర్కొన్నారు. 2014లో 2.31 కోట్లుగా ఉన్న డీమ్యాట్ ఖాతాల సంఖ్య సెప్టెంబరు 2024 నాటికి 17.1 కోట్లకు పెరిగాయన్న గణాంకాలను కూడా ఆమె ఈ సందర్భంగా ప్రస్తావించారు. బ్యాంకుల పటిష్ఠత అటు ఎకానమీని ఇటు కుటుంబాల ఆర్థిక పరిస్థితులను బలోపేతం చేస్తుందని ఆమె ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో వాటి లాభదాయకతను ప్రభావితం చేసే రుణ నాణ్యత విషయంలో జాగ్రత్తగా ఉండాలని ఆమె బ్యాంకింగ్‌కు సూచించారు. సైబర్ సెక్యూరిటీ విషయంలో అత్యంత అప్రమత్తత అవసరమని అన్నారు. పెద్ద సంఖ్యలో ఇంజనీర్లు విద్యాపరంగా అర్హత కలిగి ఉన్నారని, అయితే పారిశ్రామిక అవసరాల గురించి వారికి పెద్దగా తెలియడం లేదని ఆమె ఈ సందర్భంగా ఆవేదన వ్యక్తం చేశారు.

గ్రామీణాభివృద్ధితోనే వికసిత భారత్ సాధ్యం

కాగ్ గిరీష్ చంద్ర ముర్ము వ్యాఖ్య



న్యూఢిల్లీ: లోతట్టు, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి లేకుండా 2047 నాటికి భారతదేశం వికసిత భారత్ లేదా అభివృద్ధి చెందిన దేశంగా మారబోదని కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియా (కాగ్) గిరీష్ చంద్ర ముర్ము అన్నారు. అధికార వికేంద్రీకరణ జరగాల్సిన స్థాయిలో జరగలేదని పేర్కొన్న ఆయన, సమాఖ్య నిర్మాణంలో గ్రామసభ లేదా గ్రామీణ సంస్థలకు ఇంకా తగిన ప్రాధాన్యత లభించలేదన్నారు. ఇంకా ఆయన ఏమన్నారంటే..

- అట్టడుగు స్థాయి అభివృద్ధి లేకుండా, మనం వికసిత భారత్ లక్ష్యాన్ని సాధించలేము. 50 శాతానికి పైగా ప్రజలు గ్రామీణ ప్రాంతంలో నివసిస్తున్నారు. వారికి సంబంధించి అభివృద్ధి, పరిపాలన, వనరులు పెంపొందించే వరకు ఎకానమీ పురోగతి అసాధ్యం. వికసిత్ భారత్ లక్ష్యం దిశగా అందరు ఒక్క అడుగు వేస్తే 1.4 బిలియన్ల అడుగులు వేస్తామన్న మన ప్రధానమంత్రి చెబుతున్నట్లుగా (విక్షిత్ భారత్ లక్ష్యం) ప్రతి విభాగం పురోగతికి ప్రతి ఒక్కరి, పరస్పర సహకారం అవసరం.
- దేశంలో ఉన్న దాదాపు 2,60,000 పంచాయతీలు 7,000 పట్టణ స్థానిక సంస్థల పురోగతికి తొలుత అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలి. తద్వారా ప్రభుత్వ పథకాలు మరింత సమర్థవంతంగా అవసరమైన వారికి అందుతాయి.


పట్టణ స్థానిక సంస్థల్లో ఆడిటింగ్ మెరుగుపడాలి...

పట్టణ స్థానిక సంస్థలకు సంబంధించి... మున్సిపల్ కార్పొరేషన్లు సరైన అకౌంటింగ్ నిబంధనలను పాటించకపోతే మార్కెట్ నుండి వనరులను సేకరించడానికి అనుమతి ఇవ్వకూడదు. అకౌంటింగ్, ఆడిట్ ప్రమాణాలను సక్రమంగా పాటించేలా స్థానిక సంస్థల సామర్థ్యం పెంపుదలపై రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించాలి.

ప్రమాణాలతో కూడిన ఆడిటింగ్ వ్యవస్థలో పారదర్శకతను పెంపొందించడమే కాకుండా ప్రభుత్వ పథకాల్లో ఆర్థిక పటిష్ఠత, సామర్థ్యాన్ని గణనీయంగా మెరుగుపరుస్తుంది. పటిష్ట ఆడిటింగ్ ద్వారా మాత్రమే వ్యవస్థలో మెరుగైన ఫలితం సాధించవచ్చు.

హిటాచీ ఎనర్జీ పెట్టుబడులు

రూ. 2,000 కోట్లు వెచ్చింపునకు రెడీ




న్యూఢిల్లీ: స్విట్జర్లాండ్ కంపెనీ హిటాచీ ఎనర్జీ దేశీయంగా రానున్న నాలుగైదేళ్లలో రూ. 2,000 కోట్ల పెట్టుబడులు వెచ్చించే ప్రణాళికలు ప్రకటించింది. హిటాచీ ఎనర్జీ ఇండియా పేరుతో దేశీయంగా అనుబంధ సంస్థను కలిగి ఉంది. ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్య విస్తరణ, నైపుణ్యాలను పెంచుకోవడం, పోర్ట్‌ఫోలియోను పటిష్టపరచుకోవడం వంటి అంశాలకు పెట్టుబడులను వినియోగించనున్నట్లు హిటాచీ ఎనర్జీ ఇండియా, దక్షిణాసియా ఎండీ, సీఈవో ఎన్ వేణు పేర్కొన్నారు. ప్రధానంగా భారీ, చిన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్య పెంపుసహా.. డ్రై, ట్రాక్షన్ ట్రాన్స్‌ఫార్మర్ల తయారీకి నిధులు వెచ్చించనున్నట్లు వెల్లడించారు. వీటితోపాటు ఇన్సులేషన్, సంబంధిత విడిభాగాల తయారీ, ప్రస్తుత హెచ్‌వీడీసీ హైవోల్టేజీ డైరెక్ట్ కరెంట్ సామర్థ్య విస్తరణలు సైతం చేపట్టనున్నట్లు తెలియజేశారు. ఇందుకు ఏడాదికి రూ. 400 కోట్లు చొప్పున ఐదు సంవత్సరాలపాటు నిధులు కేటాయించనున్నట్లు పేర్కొన్నారు. నిధులను మార్కెట్ నుంచి సమీకరించే యోచనలో ఉన్నట్లు వెల్లడించారు.

ఈ వార్తల నేపథ్యంలో హిటాచీ ఎనర్జీ ఇండియా షేరు బీఎస్ఈలో 2.7 శాతం క్షీణించి రూ. 13,633 వద్ద ముగిసింది.

అంతర్జాతీయ చమురు ధరలపై అప్రమత్తత

- సవాళ్లను ఎదుర్కొంటాం
- కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరి



న్యూఢిల్లీ: మధ్యప్రాచ్యంలో పెరుగుతున్న వివాదాలు, దీనితో అంతర్జాతీయంగా మండిపోతున్న చమురు ధరల నేపథ్యంలో పరిస్థితిని భారత్ జాగ్రత్తగా గమనిస్తోందని, ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కొంటామన్న విశ్వాసంతో ఉందని చమురు వ్యవహారాల మంత్రి హర్దీప్ సింగ్ పూరి తెలిపారు. గత వారం క్షిపణి దాడికి ఇరాన్‌పై ఇజ్రాయెల్ ప్రతీకారం తీర్చుకుంటుందా అన్న అంశంపై మార్కెట్ వేచిచూస్తున్న పరిస్థితుల్లో అంతర్జాతీయ చమురు ధరలు బ్యారెల్‌కు 70 డాలర్ల నుంచి 78 డాలర్లకు చేరుకున్న సంగతి తెలిసిందే. ఇక్కడ జరిగిన ఎగ్జిన్‌మొబిల్ గ్లోబల్ ఔట్‌లుక్ 2024లో పాల్గొన్న చమురు వ్యవహారాల మంత్రి ఈ సందర్భంగా మాట్లాడారు. ముఖ్యాంశాలు చూస్తే..

- మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు తీవ్రమయితే, ఆ ప్రభావం దేశంలో ఇంధన లభ్యతపై ఉంటుంది.
- అయితే దేశానికి చమురు సరఫరాల్లో ఎటువంటి అవాంతరాలూ ఉండబోవని భావిస్తున్నాం. ప్రపంచంలోని మూడవ అతిపెద్ద చమురు వినియోగ, దిగుమతి దేశమైన భారత్ ఎటువంటి పరిస్థితినైనా ఎదుర్కొనగలదన్న విశ్వాసంతో ఉన్నాం.
- దేశంలో చమురు కొరత లేదు. భారతదేశ అవసరాలకు తగిన నిల్వలు, వనరులు ఉన్నాయి.
- మార్చిలో సగటున భారత్ దిగుమతి చేసుకునే క్రూడ్ ఆయిల్ బాస్కెట్ ధర బ్యారల్‌కు 83 నుంచి 84 డాలర్లు ఉంటే, సెప్టెంబర్‌లో 73.69 డాలర్లకు తగ్గింది. అయితే తాజా పరిస్థితులు మళ్లీ ధరల పెరుగుదలపై ఆందోళనలను లేవనెత్తుతున్నాయి. దేశంలో పెట్రోల్–డీజిల్ ధరలు లీటర్‌కు 2 నుంచి 3 వరకూ తగ్గే వీలుందని గత వారం రేటింగ్ ఏజెన్సీ ఇక్రా పేర్కొన్న నేపథ్యంలోనే పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడం గమనార్హం.
- దేశ రాజధాని న్యూఢిల్లీలో లీటర్ పెట్రోల్ ధర రూ.94.72 కాగా, డీజిల్ ధర రూ.87.62గా ఉంది.

గణనీయంగా పెరగనున్న క్లీన్ టెక్ సామర్థ్యం

- 2030 నాటికి సోలార్ విద్యుత్‌లో స్వావలంబన
- ఎస్అండ్‌పీ గ్లోబల్ కమోడిటీ ఇన్‌సైట్స్



న్యూఢిల్లీ: శుద్ధ ఇంధన టెక్నాలజీ సామర్థ్యం భారత్‌లో గణనీయంగా పెరగనుందని ఎస్అండ్‌పీ గ్లోబల్ కమోడిటీ ఇన్‌సైట్స్ నివేదిక తెలిపింది. అదే సమయంలో 2030 నాటికి భారత్ నిర్దేశించుకున్న శుద్ధ ఇంధన వనరుల లక్ష్యాలను చేరుకోవడంలో సవాళ్లను ఎదుర్కోవచ్చని పేర్కొంది. టెక్నాలజీ ఆవిష్కరణల్లో అంతరాలు, నైపుణ్యాలు కలిగిన మానవ వనరుల లభ్యత సరిపడా లేకపోవడం, మౌలిక వసతుల లేమి, సహేతుక విధానాలు అమలు చేయకపోవడం రూపంలో సవాళ్లు ఎదురుకావొచ్చని తెలిపింది. 2030 నాటికి దేశ మొత్తం విద్యుత్ ఉత్పాదకతలో 50 శాతం కర్బనేతర ఇంధన వనరుల రూపంలోనే ఉండాలన్నది కేంద్రం పెట్టుకున్న లక్ష్యం. ప్రభుత్వం నుంచి పూర్తి సహకారంతో భారత్ సోలార్ పీవీలో 2030 నాటికి పూర్తి స్వయం సమృద్ధి సాధిస్తుందని ఈ నివేదిక అంచనా వేసింది. స్థానిక తయారీని ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం పలు విధాన చర్యలను అమలు చేయడం తెలిసిందే. దిగుమతులపై బేసిక్ కస్టమ్స్ డ్యూటీ విధించడం, పీఎల్ఐ పథకం తదితర చర్యలను ఈ నివేదిక ప్రస్తావించింది. ఈ సానుకూల విధానాలతో 2030 నాటికి శుద్ధ ఇంధన సామర్థ్యం గణనీయంగా పెరుగుతుందని అంచనా వేసింది. ''భారత్ 107 గిగావాట్ల పీవీ మాడ్యూళ్ల తయారీ, 20 గిగావాట్ల విండ్ టర్బయిన్లు, 69 గిగావాట్ హవర్ బ్యాటరీ సెల్స్, 8 గిగావాట్ ఎలక్ట్రోలైజర్ల సామర్థ్యానికి చేరుకుంటుందన్న అంచనాలు ఉన్నాయి. ఈ వృద్ధితో భారత్ సోలార్ పీవీలో, విండ్‌లో పూర్తి స్వావలంబన, బ్యాటరీ సెల్స్‌లో 90 శాతం సామర్థ్యాన్ని సాధిస్తుంది''అని ఎస్అండ్‌పీ గ్లోబల్ కమోడిటీ ఇన్‌సైట్స్‌కు చెందిన ఇంద్రా ముఖర్జీ తెలిపారు. సోలార్ పీవీలో పాలసీ సిలికాన్, వేఫర్ తయారీ లక్ష్యాలను చేరుకోవడంలో భారత్ సమస్యలను ఎదుర్కొంటోందని, ఇది పోటీతత్వానికి విఘాతం కలిగించొచ్చని అభిప్రాయపడింది.


స్మృతి మంధాన, షఫాలీ వర్మ

బ్యాటింగ్‌లో సత్తా చాటితేనే...

- నేడు ప్రపంచ కప్‌లో భారత మహిళల కీలక మ్యాచ్
- ఆసియా చాంపియన్ శ్రీలంకతో హర్మన్ బృందం పోరు
- రాత్రి గం.7:30 నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్‌లలో ప్రత్యక్ష ప్రసారం

దుబాయ్: అంతర్జాతీయ మహిళల టి20ల్లో శ్రీలంకపై భారత విజయాల రికార్డు 19–5తో ఎంతో ఘనంగా ఉంది. అయితే ఈ ఐదు పరాజయాల్లో చివరిది ఇటీవల ఆసియా కప్ టి20 టోర్నీ ఫైనల్లో వచ్చింది. అప్పటి వరకు అద్భుత ఫామ్‌లో చెలరేగిన హర్మన్‌ప్రీత్ కౌర్ బృందం తుది పోరులో అనూహ్యంగా పరాజయం పాలైంది. కాబట్టి శ్రీలంకే కదా అని తేలిగ్గా తీసుకోవడానికి లేదు. ఈ వరల్డ్ కప్‌లో ముందంజ వేయాలంటే కచ్చితంగా గెలవడంతో పాటు రన్‌రేట్ మెరుగుపర్చుకోవడం కూడా భారత్‌కు ముఖ్యం. ఈ నేపథ్యంలో నేడు జరిగే గ్రూప్ 'ఎ' పోరులో భారత్, శ్రీలంక తలపడను న్నాయి. టోర్నీ తొలి మ్యాచ్‌లో న్యూజిలాండ్ చేతిలో చిత్తుగా ఓడిన భారత్... తర్వాతి మ్యాచ్‌లో పాకిస్తాన్‌ను ఓడించింది. మరోవైపు శ్రీలంక వరుసగా పాకిస్తాన్, ఆస్ట్రేలియాల చేతిలో చిత్తయింది. ఈ మ్యాచ్‌లో ఓడితే లంక నిష్క్రమణ ఖాయమవుతుంది.

హర్మన్ సిద్ధం...

కివీస్‌తో మ్యాచ్‌లో భారత బ్యాటింగ్ పూర్తిగా విఫలమైంది. టాప్–5 స్మృతి, షఫాలీ, హర్మన్, జెమీమా, రిచా విఫలం కావడంతో భారీ ఓటమి తప్పలేదు. దాని నుంచి కోలుకొని పాక్‌ను ఓడించినా... ఇక్కడా బ్యాటింగ్ గొప్పగా సాగలేదు. బౌలర్ల ప్రదర్శనతో పాక్‌ను తక్కువ స్కోరుకే పరిమితం చేసినా 106 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని ఛేదించేందుకు కూడా జట్టు 18.5 ఓవర్లు తీసుకోవడంతో రన్‌రేట్ కూడా పెంచుకునే అవకాశం లేకపోయింది. ఇలాంటి స్థితిలో లంకపై బ్యాటర్లు చెలరేగి భారీ స్కోరు సాధిస్తేనే జట్టుకు మేలు కలుగుతుంది. రెండు మ్యాచ్‌లలోనూ విఫలమైన స్మృతికి లంకపై కూడా పేలవ రికార్డు ఉంది. మెడ నొప్పితో పాక్‌తో మ్యాచ్‌లో చివరి క్షణాల్లో నిష్క్రమించిన కెప్టెన్ హర్మన్ కోలుకొని ఈ పోరుకు అందుబాటులోకి రావడం టీమ్‌కు సానుకూలాంశం. షఫాలీ దూకుడుగా ఆడి శుభారంభం అందిస్తే మిగతా బ్యాటర్లు దానిని కొనసాగించగలరు. పాక్‌తో ఆడిన టీమ్‌నే ఇక్కడా కొనసాగించే అవకాశం ఉంది. పేసర్ పూజ గాయం నుంచి కోలుకోకపోవడంతో ఆల్‌రౌండర్ సజనకు చోటు ఖాయం.

అటపట్టు ఆడితేనే...

వరుసగా రెండు ఓటముల తర్వాత శ్రీలంక పరిస్థితి కూడా ఆశాజనకంగా లేదు. ముఖ్యంగా జట్టు ఎన్నో ఆశలు పెట్టుకున్న కెప్టెన్, స్టార్ ప్లేయర్ చమరి అటపట్టు రెండు మ్యాచ్‌లలోనూ ఓపెనర్‌గా విఫలం కావడంతో దాని ప్రభావం టీమ్‌పై కూడా పడింది. ఆస్ట్రేలియాతో పోరులో 93 పరుగులకే పరిమితం అయిన లంక... అంతకుముందు తమకంటే బలహీన జట్టు అయిన పాకిస్తాన్‌తో కూడా పేలవంగా ఆడి 85 పరుగులే చేయగలిగింది. రెండు మ్యాచ్‌లలో కూడా ఒక్క బ్యాటర్ కనీసం 30 పరుగులు స్కోరు చేయలేదు. బౌలింగ్‌లో అనుభవరాహిత్యం కూడా లంకను బలహీనంగా మార్చింది. ఇలాంటి టీమ్ భారత్‌కు పోటీనివ్వగలదా లేక ఆసియా కప్ ఫైనల్ స్ఫూర్తితో మళ్లీ ఇబ్బంది పెట్టగలదా అనేది చూడాలి.

తెలంగాణ సెయిలర్ మాన్యా రెడ్డికి రజతం

న్యూఢిల్లీ: ముసానా రేస్ వీక్ అంతర్జాతీయ సెయిలింగ్ రెగెట్టా టోర్నమెంట్‌లో భారత క్రీడాకారులు రాణించారు. ఒమన్‌లో జరిగిన ఈ పోటీల్లో భారత్‌కు ఒక స్వర్ణం, నాలుగు రజతాలు, రెండు కాంస్యాలతో కలిపి మొత్తం ఏడు పతకాలు లభించాయి. అండర్–19 బాలికల ఐఎల్‌సీఏ–6 కేటగిరీలో భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన తెలంగాణ అమ్మాయి మాన్యా రెడ్డి రజత పతకాన్ని దక్కించుకుంది. మాన్యా రెడ్డి 74 పాయింట్లు స్కోరు చేసింది. కమేలియా అల్ కుబైసీ (యూఏఈ–77 పాయింట్లు) స్వర్ణ పతకాన్ని సాధించింది. అండర్–15 బాలికల ఆప్టిమిస్ట్ విభాగంలో శ్రేయ కృష్ణ లక్ష్మీనారాయణన్ స్వర్ణం నెగ్గగా... కొమరవెల్లి లాహిరి రజత పతకాన్ని సొంతం చేసుకుంది. అండర్–16 బాలుర ఐఎల్‌సీఏ–4 కేటగిరీలో శశాంక్ బాథమ్ రజతం, అక్షత్ కుమార్ కాంస్యం గెలిచారు. అండర్–16 బాలికల ఐఎల్‌సీఏ–4 కేటగిరీలో సౌమ్య సింగ్ పాటిల్ రజతం, షగున్ ఝా కాంస్యం కైవసం చేసుకున్నారు. ఒమన్, యూఏఈ, ఖతర్, కువైట్, థాయ్‌లాండ్, సింగపూర్, భారత్ నుంచి మొత్తం 106 మంది సెయిలర్లు ఈ టోర్నీలో పాల్గొన్నారు.





సల్మాన్ సెంచరీ

పాక్ తొలి ఇన్నింగ్స్‌లో 556 ఆలౌట్ ● ఇంగ్లండ్ 96/1 ● రాణించిన క్రాలీ

ముల్తాన్: తొలి టెస్టులో పాకిస్తాన్ బ్యాటర్ల హవా కొనసాగుతోంది. రెండో రోజు మూడో సెంచరీ నమోదు అయింది. అనుభవంలేని ఇంగ్లండ్ బౌలర్లపై లోయర్ ఆర్డర్ బ్యాటర్ సల్మాన్ ఆఘా (119 బంతుల్లో 104 నాటౌట్; 10 ఫోర్లు, 3 సిక్స్‌లు) అజేయ శతకంతో కదంతొక్కాడు. దీంతో పాకిస్తాన్ తొలి ఇన్నింగ్స్‌లో 149 ఓవర్లలో 556 పరుగుల భారీస్కోరు వద్ద ఆలౌటైంది. రెండో రోజు ఆటలో మిడిలార్డర్‌లో సౌద్ షకీల్ (177 బంతుల్లో 82; 8 ఫోర్లు) కూడా రాణించాడు. ఇంగ్లండ్ బౌలర్లలో జాక్ లీచ్ 3 వికెట్లు పడగొట్టగా, అట్కిన్సన్, బ్రైడన్ కార్స్ చెరో 2 వికెట్లు తీశారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ఆరంభించిన ఇంగ్లండ్ ఆట నిలిచే సమయానికి 20 ఓవర్లలో వికెట్ నష్టానికి 96 పరుగులు చేసింది. ఓపెనర్, కెప్టెన్ ఒలీ పోప్ (0) డకౌట్ కాగా, మరో ఓపెనర్ జాక్ క్రాలీ (64 బంతుల్లో 64 బ్యాటింగ్; 11 ఫోర్లు) వన్డేను తలపించే ఆటతీరుతో అలరించాడు. జో రూట్ (54 బంతుల్లో 32 బ్యాటింగ్; 2 ఫోర్లు) క్రీజులో ఉన్నాడు. ఇద్దరు కలిసి అబేధ్యమైన రెండో వికెట్‌కు 92 పరుగులు జోడించారు. నసీమ్ షాకు ఒక వికెట్ దక్కింది.

రెండో రోజూ అదే జోరు!

ఇంగ్లండ్ బౌలింగ్‌పై పాక్ బ్యాటర్ల ఆధిపత్యం కొనసాగింది. ఓవర్‌నైట్ స్కోరు 328/4తో మంగళవారం ఆట కొనసాగించిన పాక్ ఇన్నింగ్స్‌ను నసీమ్ షా (33; 1 ఫోర్, 3 సిక్స్‌లు), సౌద్ షకీల్ నడిపించారు. ఐదో వికెట్‌కు 64 పరుగులు జోడించాక నసీమ్ వికెట్‌కు కార్స్ పడగొట్టాడు. కాసేపటికే రిజ్వాన్ (0)ను లీచ్ డకౌట్ చేశాడు. ఈ దశలో ఎనిమిదో స్థానంలో బ్యాటింగ్‌కు దిగిన సల్మాన్ ఆఘా వేగంగా ఆడుతూ... ముందుగా షకీల్‌తో, తర్వాత షాహిన్ అఫ్రిది (49 బంతుల్లో 26; 2 ఫోర్లు, 1 సిక్స్)తో కీలకమైన భాగస్వామ్యాలు నమోదు చేశాడు. దీంతో పాకిస్తాన్ స్కోరు అవలీలగా 500 పరుగుల మార్క్‌ను దాటేసింది. కాసేపటికే సల్మాన్ కూడా 108 బంతుల్లోనే శతకాన్ని పూర్తి చేసుకున్నాడు. టెస్టుల్లో అతనికిది మూడో సెంచరీ. తొమ్మిదో వికెట్‌కు 85 పరుగులు జోడించాక అఫ్రిదిని లీచ్ బౌల్డ్ చేయగా, అబ్రార్ (3)ను రూట్ అవుట్ చేయడంతో 556 పరుగుల వద్ద పాక్ ఇన్నింగ్స్‌కు తెరపడింది.

స్కోరు వివరాలు

పాకిస్తాన్ తొలి ఇన్నింగ్స్: షఫీఖ్ (సి) పోప్ (బి) అట్కిన్సన్ 102; అయూబ్ (సి)స్మిత్ (బి) అట్కిన్సన్ 4; మసూద్ (సి అండ్ బి) లీచ్ 151; బాబర్ ఆజమ్ (ఎల్బీడబ్ల్యూ) (బి) వోక్స్ 30; షకీల్ (సి) రూట్ (బి) బషీర్ 82; నసీమ్ షా (సి) బ్రూక్ (బి) కార్స్ 33; రిజ్వాన్ (సి) వోక్స్ (బి) లీచ్ 0; సల్మాన్ ఆఘా (నాటౌట్) 104; జమాల్ (ఎల్బీడబ్ల్యూ) (బి) కార్స్ 7; అఫ్రిది (బి) లీచ్ 26; అబ్రార్ (సి) డకెట్ (బి) రూట్ 3; ఎక్స్‌ట్రాలు 14; **మొత్తం (149 ఓవర్లలో ఆలౌట్) 556. వికెట్ల పతనం:** 1–8, 2–261, 3–263, 4–324, 5–388, 6–393, 7–450, 8–464, 9–549, 10–556. **బౌలింగ్:** వోక్స్ 23–5–69–1, అట్కిన్సన్ 25–5–99–2, కార్స్ 22–3–74–2, బషీర్ 32–3–124–1, లీచ్ 40–5–160–3, రూట్ 7–0–25–1.

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: క్రాలీ (బ్యాటింగ్) 64; పోప్ (సి) జమాల్ (బి) నసీమ్ 0; రూట్ (బ్యాటింగ్) 32; ఎక్స్‌ట్రాలు 0; **మొత్తం (20 ఓవర్లలో వికెట్ నష్టానికి) 96. వికెట్ల పతనం:** 1–4. **బౌలింగ్:** షాహిన్ షా అఫ్రిది 6–1–24–0, నసీమ్ షా 7–0–29–1, అబ్రార్ అహ్మద్ 4–0–31–0, ఆమిర్ జమాల్ 3–0–12–0.



హర్వంశ్ శతకం

భారత్ అండర్–19 భారీ స్కోరు ● రెండో యూత్ టెస్టులో ఆసీస్ 142/3

చెన్నై: యువ భారత బ్యాటర్ హర్వంశ్ సింగ్ పంగాలియా (143 బంతుల్లో 117; 7 ఫోర్లు, 6 సిక్స్‌లు) 'శత'క్కొట్టడంతో రెండో యూత్ టెస్టులో భారత అండర్–19 జట్టు భారీస్కోరు చేసింది. ఆస్ట్రేలియాతో జరుగుతున్న ఈ మ్యాచ్‌లో రెండో రోజు భారత జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 133.3 ఓవర్లలో 492 పరుగుల వద్ద ఆలౌటైంది. సౌరాష్ట్ర వికెట్ కీపర్, బ్యాటర్ హర్వంశ్ వీరోచిత సెంచరీతో అదరగొట్టాడు. ఓవర్‌నైట్ స్కోరు 316/5తో మంగళవారం ఆట కొనసాగించిన భారత జట్టు ఆరంభంలోనే క్రితం రోజు బ్యాటర్ కెప్టెన్ సోహమ్ పట్వర్ధన్ (63; 6 ఫోర్లు) వికెట్‌ను కోల్పోయింది. ఓవర్‌నైట్ స్కోరుకు కేవలం 2 పరుగులు మాత్రమే జోడించి అతను పెవిలియన్ చేరుకున్నాడు. ఈ దశలో హర్వంశ్ లోయర్ ఆర్డర్ బ్యాటర్లతో కలిసి జట్టును నడిపించాడు. మొహమ్మద్ ఇనాన్ (26; 4 ఫోర్లు) చక్కని సహకారం అందించడంతో ఏడో వికెట్‌కు వీరిద్దరు 54 పరుగులు జోడించారు. ఇనాన్ అవుటయ్యాక క్రీజులోకి వచ్చిన సమర్థ్ నాగరాజ్ (20; 1 ఫోర్, 2 సిక్స్‌లు)తో కలిసి జట్టు స్కోరును 400 పైచిలుకు చేర్చాడు. అయితే కాసేపటికే సమర్థ్‌తో పాటు చేతన్ శర్మ (0)ను లచ్లాన్ రనాల్డో ఒకే ఓవర్లో పెవిలియన్ చేర్చడంతో 402 పరుగులకే భారత్ 9 వికెట్లను కోల్పోయింది. ఇక ఆలౌట్ లాంఛనమే అనుకున్న దశలో ఆఖరి వరుస బ్యాటర్ అన్‌మోల్‌జీత్ సింగ్ (50 బంతుల్లో 11 నాటౌట్; 1 ఫోర్) క్రీజులో మొండిగా నిలువడంతో హర్వంశ్ పరుగుల్ని చక్కబెట్టాడు. ఈ క్రమంలో అతను సెంచరీని పూర్తి చేసుకున్నాడు. పదో వికెట్‌కు ఏకంగా 90 పరుగులు జోడించాక హర్వంశ్‌ను కింగ్‌స్టెల్ పెవిలియన్ చేర్చడంతో భారత్ ఇన్నింగ్స్ ముగిసింది. ఆసీస్ అండర్–19 జట్టులో ఏకంగా తొమ్మిది మంది బౌలింగ్‌కు దిగడం గమనార్హం. ఇందులో ఓలీ పాటర్సన్, హ్యారీ, క్రిస్టియాన్ హోవ్, రనాల్డో తలా రెండేసి వికెట్లు పడగొట్టారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ఆరంభించిన ఆస్ట్రేలియా జట్టు ఆట నిలిచే సమయానికి 44 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 142 పరుగులు చేసింది. ఓపెనర్లు రిలే కింగ్‌స్టెల్ (4), సైమన్ బడ్జ్ (5)లను భారత బౌలర్లు తక్కువ స్కోరుకే కట్టడి చేశారు. అయితే వన్‌డౌన్ బ్యాటర్, కెప్టెన్ ఒలీవర్ పెక్ (61 బ్యాటింగ్; 8 ఫోర్లు, 1 సిక్స్), అలెక్స్ లీ (45 బ్యాటింగ్; 6 ఫోర్లు) అబేధ్యమైన నాలుగో వికెట్‌కు సరిగ్గా 100 పరుగులు జోడించారు. మొహమ్మద్ ఎనాన్‌కు 2 వికెట్లు దక్కగా, అన్‌మోల్‌జీత్ ఒక వికెట్ తీశాడు.

భారత్ తొలి పోరు మలేసియాతో

ఆసియా మహిళల చాంపియన్స్ హాకీ టోర్నీ



కౌలాలంపూర్: డిఫెండింగ్ చాంపియన్ భారత జట్టు మహిళల ఆసియా చాంపియన్స్ ట్రోఫీలో తమ తొలి మ్యాచ్‌ను మలేసియా జట్టుతో ఆడుతుంది. నవంబర్ 11 నుంచి 20 వరకు బిహార్‌లో కొత్తగా నిర్మించిన రాజ్‌గిర్ స్టేడియంలో జరిగే ఈ టోర్నీలో భారత్‌తోపాటు చైనా, దక్షిణ కొరియా, జపాన్, మలేసియా, థాయ్‌లాండ్ జట్లు పోటీపడతాయి. నవంబర్ 11న మలేసియా మ్యాచ్‌తో టైటిల్ వేటను ఆరంభించనున్న భారత్... తదుపరి మ్యాచ్‌ల్లో వరుసగా కొరియా (నవంబర్ 12న), థాయ్‌లాండ్ (నవంబర్ 14న), చైనా (నవంబర్ 16న), జపాన్ (నవంబర్ 17న) జట్లతో ఆడుతుంది. లీగ్ దశ ముగిశాక టాప్–4లో నిలిచిన జట్లు సెమీఫైనల్‌కు చేరుకుంటాయి. నవంబర్ 19న సెమీఫైనల్స్... నవంబర్ 20న ఫైనల్ జరుగుతుంది. వరుసగా రెండో ఏడాది ఈ టోర్నీ భారత్‌లోనే జరగనుంది. గత ఏడాది రాంచీలో జరిగే ఈ టోర్నీలో భారత జట్టు విజేతగా నిలిచింది.

పోరాడి ఓడిన బోపన్న జోడీ

షాంఘై: భారత టెన్నిస్ స్టార్ రోహన్ బోపన్నకు మరో టోర్నీలో నిరాశ ఎదురైంది. షాంఘై ఓపెన్ మాస్టర్స్ సిరీస్ ఏటీపీ–1000 టోర్నీ నుంచి రోహన్ బోపన్న (భారత్)–ఇవాన్ డోడిగ్ (క్రొయేషియా) ద్వయం ప్రిక్వార్టర్ ఫైనల్లో నిష్క్రమించింది. మంగళవారం జరిగిన పురుషుల డబుల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో ఐదో సీడ్ బోపన్న–డోడిగ్ జోడీ 6–7 (5/7), 6–2, 12–14తో 'సూపర్ టైబ్రేక్'లో వెస్లీ కూలాఫ్ (నెదర్లాండ్స్)–నికోలా మెక్‌టిక్ (క్రొయేషియా) ద్వయం చేతిలో పోరాడి ఓడిపోయింది. గంటా 45 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో బోపన్న–డోడిగ్ నాలుగు ఏస్‌లు సంధించి, రెండు డబుల్ ఫాల్ట్‌లు చేశారు. తమ సర్వీస్‌ను రెండుసార్లు కోల్పోయారు. ప్రిక్వార్టర్ ఫైనల్లో ఓడిన బోపన్న–డోడిగ్‌లకు 34,100 డాలర్ల (రూ. 28 లక్షల 63 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 90 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

ప్రిక్వార్టర్ ఫైనల్లో జొకోవిచ్

ఇదే టోర్నీ పురుషుల సింగిల్స్ విభాగంలో సెర్బియా దిగ్గజం నొవాక్ జొకోవిచ్ ప్రిక్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టాడు. మూడో రౌండ్‌లో జొకోవిచ్ 6–1, 6–2తో ఫ్లావియో కొబోలి (ఇటలీ)పై గెలుపొందాడు. టాప్ సీడ్ యానిక్ సినెర్ (ఇటలీ), మూడో సీడ్ అల్‌కరాజ్ (స్పెయిన్), రెండో సీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్ (జర్మనీ) కూడా ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించారు.



శ్రీనిధి డెక్కన్ ఎఫ్‌సీ షర్ట్ స్పాన్సర్‌గా అపోలో హాస్పిటల్స్

సాక్షి, హైదరాబాద్: భారత దేశవాళీ ఐ–లీగ్ టోర్నమెంట్‌లో పాల్గొనే శ్రీనిధి డెక్కన్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) జట్టుకు అపోలో హాస్పిటల్స్ మెడికల్ పార్ట్‌నర్‌గా, షర్ట్ స్పాన్సర్‌గా వ్యవహరించనుంది. మంగళవారం జరిగిన కార్యక్రమంలో శ్రీనిధి డెక్కన్ ఎఫ్‌సీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విక్రమ్ రావు కటికనేని, చీఫ్ ఫుట్‌బాల్ ఆఫీసర్ ఫాబియో ఫెరీరా, అపోలో హాస్పిటల్స్ మెడికల్ సర్వీసెస్ డైరెక్టర్ రవీందర్ బాబు తదితరులు ఈ ఒప్పందం వివరాలను తెలిపారు. 2024–2025 ఐ–లీగ్ ఈనెల 18 నుంచి వచ్చే ఏడాది ఏప్రిల్ 30వ తేదీ వరకు వివిధ నగరాల్లో జరుగుతుంది. శ్రీనిధి డెక్కన్ జట్టు 2021–2022 సీజన్‌లో మూడో స్థానం... 2022–2023, 2023–2024 సీజన్‌లలో రెండో స్థానం సంపాదించింది.



'స్వప్నిల్‌కు రూ. 5 కోట్ల నజరానా ఇవ్వాల్సింది'

రూ. 2 కోట్ల ప్రోత్సాహకంపై షూటర్ తండ్రి అసంతృప్తి

ముంబై: పారిస్ ఒలింపిక్స్‌లో కాంస్యం గెలిచిన షూటర్ స్వప్నిల్ కుసాలేకు మహారాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన రూ. 2 కోట్ల ప్రోత్సాహకంపై అతని తండ్రి సురేశ్ కుసాలే తీవ్రస్థాయిలో అసంతృప్తి వ్యక్తం చేశారు. తన కుమారుడికి రూ. 5 కోట్లు నజరానాతో పాటు, పుణేలో నివాసం ఉండేందుకు ఫ్లాట్ ఇవ్వాల్సి ఉండేదని అతని తండ్రి సురేశ్ కుసాలే చెప్పాడు. 1952 హెల్సింకి ఒలింపిక్స్‌లో రెజ్లర్ ఖాషాబా జాదవ్ పతకం గెలిచిన 72 ఏళ్ల తర్వాత మహారాష్ట్ర క్రీడాకారుడు మరో పతకం అందిస్తే ఇంత తక్కువ మొత్తం నజరానా ఇవ్వడం సమంజసంగా లేదని సురేశ్ అన్నారు. 'ప్రభుత్వం స్వర్ణంకు రూ. 5 కోట్లు, రజతానికి రూ. 3 కోట్లు, కాంస్యానికి రూ. 2 కోట్లు ప్రోత్సాహకాన్ని ప్రకటించింది. అయితే ఇన్నేళ్ల చరిత్రలో మహారాష్ట్ర నుంచి కేవలం ఇద్దరే వ్యక్తిగత పతకాలు సాధించినపుడు నజరానా స్థాయిని కూడా పెంచాలి కదా! ఓ సాధారణ కుటుంబానికి చెందిన వ్యక్తి కావడంతో ఈ వివక్ష చూపుతున్నారు. అదే ఎమ్మెల్యే, మంత్రి కుమారుడైతే ఏ స్థాయిలో ఇచ్చేవారో ఊహించండి' అని తీవ్రస్థాయిలో సురేశ్ కుసాలే దుయ్యబట్టారు.

రష్మిక, స్మృతి శుభారంభం

మైసూర్: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) మహిళల టోర్నమెంట్‌లో తెలంగాణ క్రీడాకారిణులు భమిడిపాటి శ్రీవల్లి రష్మిక, స్మృతి భాసిన్ శుభారంభం చేశారు. మంగళవారం జరిగిన సింగిల్స్ తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో రష్మిక 7–5, 6–1తో సోనల్ పాటిల్ (భారత్)పై నెగ్గగా... స్మృతి 4–6, 6–0, 6–2తో ఐదో సీడ్ కరోలాన్ డెలానే (ఫ్రాన్స్)పై సంచలన విజయం సాధించింది. తెలంగాణకే చెందిన మరో ప్లేయర్ హుమేరా బహార్మస్ కూడా రెండో రౌండ్‌లోకి ప్రవేశించింది. తొలి రౌండ్‌లో హుమేరా 7–5, 6–4తో అమోదిని నాయక్ (భారత్)పై గెలిచింది. డబుల్స్ విభాగంలో హైదరాబాద్ ప్లేయర్ చిలకలపూడి శ్రావ్య శివాని (భారత్)–కరోలాన్ డెలానే (ఫ్రాన్స్) జోడీ క్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టింది. తొలి రౌండ్‌లో శ్రావ్య శివాని–కరోలాన్ ద్వయం 7–6 (7/3), 6–3తో శ్రీనిధి బాలాజీ–హర్షిణి నాగరాజ్ (భారత్) జంటను ఓడించింది.


స్మృతి


రష్మిక

ఫ్లోరిడాను భయపెడుతున్న 'మిల్టన్'



హెలెన్ తుఫాను సృష్టించిన బీభత్సం నుంచి బయటపడకముందే అమెరికాను మరో తుఫాను భయపెడుతోంది. ఫ్లోరిడా తీరం వైపు మిల్టన్ హరికేన్ దూసుకొస్తోంది. మిల్టన్ ఐదో కేటగిరీ హరికేన్‌గా బలపడింది, అత్యంత శక్తివంతమైన ఈ తుఫాను వల్ల ప్రాణహాని ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఫ్లోరిడా పశ్చిమ తీరం వైపు కదులుతున్న మిల్టన్.. బుధవారం తీరం దాటే అవకాశం ఉంది. తుఫాను ఉధృతితో బుధవారం తెల్లవారుజామునుంచే తీవ్రమైన గాలులు వీస్తాయని ఎన్‌హెచ్‌సీ హెచ్చరించింది. మిల్టన్ ఐదో కేటగిరీ కావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ప్రజలను సురక్షిత స్థానాలకు తరలిస్తున్నారు. ఈ అతి పెద్ద తరలింపు ప్రయత్నానికి సిద్ధం కావాలని గవర్నర్ రాన్ డిసాంటిస్ ప్రజలను కోరారు. మిల్టన్ మార్గంలోని విమానాశ్రయాలు మూసివేశారు. తుఫాను హెచ్చరికలతో ప్రజలు తమ ఇళ్ల నుంచి ఒకేసారి బయటకు రావడంతో రోడ్లన్నీ వాహనాలతో నిండిపోయాయి.

మిల్టన్ తుఫాను.. హరికేన్లను వర్గీకరించడానికి ఉపయోగించే సాఫిర్-సింప్సన్ స్కేలుపై మిల్టన్ ఐదో కేటగిరీగా నమోదైంది. ఈ తుఫాను సమయంలో గాలులు గంటకు 285 కిలోమీటర్ల వేగంతో వీస్తాయని నేషనల్ హరికేన్ సెంటర్ (ఎన్‌హెచ్‌సీ) తెలిపింది. మొదట రెండో కేటగిరీలో ఉన్న తుఫాను కొన్ని గంటల్లోనే 5వ కేటగిరీకి మారింది. ఇంత వేగంగా తుఫాను బలపడటం నమ్మశక్యంగా లేదని ఫ్లోరిడా వాతావరణ నిపుణులు చెబుతున్నారు. చరిత్రలో ఎన్నడూ లేనంతా ఈ హరికేన్ బలపడిందంటున్నారు. ఒక శతాబ్దంలో ఈ ప్రాంతాన్ని తాకిన అత్యంత తీవ్రమైన తుఫాను ఇదే కావచ్చని చెబుతున్నారు. హరికేన్లు మూడో కేటగిరీ దాటితేనే తీవ్రమైన ప్రాణ, ఆస్తి నష్టం జరుగుతుంది. గత నెలలో ఫ్లోరిడాను తాకిన హెలెన్ తుఫాను నాలుగో కేటగిరీకి చెందింది. గంటకు 225 కి.మీ. వేగంతో గాలులు వీయడంతో ఆస్తి నష్టం జరిగింది. దీని ధాటికి నార్త్ కరోలినా, సౌత్ కరోలినా, జార్జియా, ఫ్లోరిడా, టేనస్సీ, వర్జీనియాలో దాదాపు 230 మంది మరణించారు. ఇంకా మృతదేహాలను వెలికి తీస్తూనే ఉన్నారు. సాధారణం కంటే 2024 హరికేన్ సీజన్ తీవ్రంగా ఉందని నేషనల్ ఓషియానిక్ అట్మాస్ఫియరిక్ అసోసియేషన్ (ఎన్ఓఏఏ) అంచనా వేసింది. మానవుల వల్ల ఏర్పడిన వాతావరణ మార్పుల కారణంగా సముద్ర మట్ట ఉష్ణోగ్రతలు పెరగడమే ఇందుకు కారణమని తెలిపింది. – ఫ్లోరిడా


ఆగ్రాలోని తాజ్‌మహల్ వద్ద ముయిజ్జు దంపతులు

మంత్రముగ్ధ 'మహల్'

ఏమని వర్ణించను: ముయిజ్జు

న్యూఢిల్లీ: తాజ్‌మహల్ అందాన్ని వర్ణించడానికి మాటలు సరిపోవని మాల్దీవుల అధ్యక్షుడు మహమ్మద్ ముయిజ్జు అన్నారు. ప్రథమ మహిళ సాజిదా మహమ్మద్‌తో కలిసి ఆయన మంగళవారం ఆగ్రాలోని తాజ్‌మహల్‌ను సందర్శించారు. "ఈ సమాధి అందాన్ని వర్ణించడం కష్టం. ఎందుకంటే మాటలు దానికి న్యాయం చేయలేవు. మంత్రముగ్ధులను చేసే సంక్లిష్టత కలిగిన తాజ్ మహల్ ప్రేమ, నిర్మాణ నైపుణ్యానికి నిదర్శనం" అని ముయిజ్జు సందర్శకుల పుస్తకంలో రాశారు. అంతకుముందు ముయిజ్జు, ప్రథమ మహిళ సాజిదా మహమ్మద్‌లకు మంత్రి యోగేంద్ర ఉపాధ్యాయ్ విమానాశ్రయంలో స్వాగతం పలికారు. సందర్శన అనంతరం తాజ్‌మహల్ ప్రతిరూపాన్ని వారికి బహూకరించారు. కాగా, ముయిజ్జు పర్యటన కారణంగా తాజ్‌మహల్‌ను ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు సందర్శకులకోసం మూసివేశారు.

చెత్త బుట్టలో ఆర్ట్ వర్క్



చెత్త బుట్టలో

అదో అమూల్యమైన ఆర్ట్ వర్క్. ఈ ఘటన నెదర్లాండ్‌లోని లిస్సేలో ఉన్న ఎల్ఏఎమ్ మ్యూజియంలో జరిగింది. అలెగ్జాండర్ లావెట్.. అనే కళాకారుడు 1988లో "ఆల్ ద గుడ్ టైమ్స్ వి స్పెంట్ టుగెదర్" పేరుతో బీర్ క్యాన్‌ను పోలిన ఆర్ట్ వర్క్‌ను తయారు చేశాడు. వాటి డేట్స్ దగ్గర నుంచి క్యాన్‌కు పడిన డెంట్.. దాని వల్ల వచ్చిన మెరుపు.. అన్నింటినీ అద్భుతంగా పెయింట్ చేశాడు. ఈ సర్రియలిస్టిక్ ఆర్ట్ వర్క్‌ను ఎల్ఏఎం మ్యూజియంలో ఉంచారు. అయితే సందర్శకులను సర్‌ప్రైజ్ చేసేందుకు ఒక్కోసారి కళాఖండాలను లిఫ్ట్‌లో కూడా ప్రదర్శిస్తారు. అలా లిఫ్ట్‌లో ప్రదర్శనకు ఉంచిన బీర్ క్యాన్‌లను మెకానిక్ చూశాడు. అవి నిజంగానే తాగి పడేసిన బీర్ క్యాన్‌లు అనుకున్నాడు. ఇంకేముంది తీసుకెళ్లి చెత్త బుట్టలో పడేశాడు. బ్రేక్ కోసం బయటికి వెళ్లిన మ్యూజియం క్యూరేటర్ వచ్చి చూసే సరికి అవి లేవు. మ్యూజియం అంతటా వెదకగా బయట పడేయడానికి సిద్ధంగా ఉన్న చెత్త బ్యాగుల్లో దొరికాయి. అయితే సర్‌ప్రైజ్‌ల పేరుతో ఇలా చేస్తే అసలుకే మోసం వస్తుందని గ్రహించిన నిర్వాహకులు మళ్లీ వాటి స్థానంలోనే ఉంచారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

పలు ఘటనలు..

గ్యాలరీలు, మ్యూజియంల్లోని కళాఖండాలకు ఇలాంటి ఘటనలు జరుగుతూనే ఉంటాయి. 2023లో సియోల్లోని ఓ గ్యాలరీలో ఓ ఇటాలియన్ కళాకారుడు గోడకు తగిలించిన 'అరటిపండు' ఇన్‌స్టాలేషన్‌ను ఆకలితో ఉన్న ఓ వ్యక్తి తిన్నాడు. 2011లో జర్మనీలో 690,000 పౌండ్ల విలువైన ఆధునిక కళాఖండాన్ని తుప్పు పట్టినట్టుగా భావించిన క్లీనర్.. స్క్రబ్‌తో అది వదిలేదాకా రుద్ది శుభ్రం చేశాడు.



హరియాణాలో ఆప్ గుండుసున్నా

జమ్మూకశ్మీర్‌లో ఖాతా తెరిచింది

న్యూఢిల్లీ: జమ్మూకశ్మీర్, హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్)కి రెండు రకాల అనుభవాలు ఎదురయ్యాయి. జమ్మూకశ్మీర్‌లో తొలిసారి ఖాతా తెరవగా, హరియాణాలో మాత్రం చతికిలపడింది. జమ్మూకశ్మీర్‌లో ముస్లిం మెజార్టీ కలిగిన దోడా నియోజకవర్గంలో ఆప్ అభ్యర్థి మెహ్రాజ్ మాలిక్ తన సమీప ప్రత్యర్థి, బీజేపీ అభ్యర్థి గజయ్‌సింగ్ రాణాపై 4,538 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. జిల్లా అభివృద్ధి మండలి(డీడీసీ) సభ్యుడైన మెహ్రాజ్ మాలిక్‌కు 32,228 ఓట్లు, గజయ్‌సింగ్‌కు 18,690 ఓట్లు లభించాయి. దోడాలో నేషనల్ కాన్ఫరెన్స్, డీపీఏపీ, కాంగ్రెస్ అభ్యర్థులు నామమాత్రంగా ఓట్లు సాధించారు. మెహ్రాజ్ మాలిక్ 2013లో ఆమ్ ఆద్మీ పార్టీలో చేరారు. 2020లో డీడీసీ సభ్యుడిగా గెలిచారు. లెఫ్టినెంట్ గవర్నర్ పాలనపై పదునైన విమర్శలు చేస్తూ అందరి దృష్టిని ఆకర్షించారు. తన విజయం ప్రజలకే దక్కుతుందని మాలిక్ అన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా3 కోసం తన పోరాటం సాగిస్తానని చెప్పారు. ఆయన ఈ ఏడాది జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయినప్పటికీ నిరాశ చెందకుండా అసెంబ్లీ ఎన్నికల బరిలో నిలిచి గెలుపు సొంతం చేసుకున్నారు. జమ్మూకశ్మీర్‌లో మొత్తం 90 అసెంబ్లీ నియోజకవర్గాలకుగాను 'ఆప్' 7 స్థానాల్లో పోటీ చేసింది. కేవలం ఒక స్థానాన్ని తన ఖాతాలో వేసుకుంది.

హరియాణాలో 1.79 శాతం ఓట్లే

హరియాణా అసెంబ్లీలో పాగా వేయాలని ఎన్నికల్లో గట్టిగా తలపడిన ఆమ్ ఆద్మీ పార్టీకి నిరాశే మిగిలింది. ఒక్క స్థానం కూడా గెలుచుకోలేకపోయింది. ఆ పార్టీకి కేవలం 1.79 శాతం ఓట్లు లభించాయి. వచ్చే ఏడాది ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో హరియాణా ఎన్నికల్లో ఓటమి ఆ పార్టీకి శరాఘాతంగా మారింది. ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ సొంత రాష్ట్రమైన హరియాణాలో ఆప్ 89 స్థానాల్లో పోటీ చేసింది. చివరకు రిక్తహస్తమే ఎదురయ్యింది. 2014లో ఆ పార్టీ ఏర్పాటయ్యింది. హరియాణాలో ఇప్పటిదాకా అసెంబ్లీ ఎన్నికల్లో గానీ, లోక్‌సభ ఎన్నికల్లో గానీ కనీసం ప్రభావం చూపలేకపోయింది. ఏ ఒక్క ఎన్నికల్లోనూ గెలుపు దక్కలేదు. రాష్ట్రంలో 2019 అసెంబ్లీ ఎన్నికల్లో 46 సీట్లలో పోటీ చేయగా, ఎక్కడా కూడా 'నోటా' కంటే ఎక్కువ ఓట్లు రాలేదు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తు కుదరకపోవడం ఆప్‌ను దెబ్బతీసినట్లు పరిశీలకులు చెబుతున్నారు. హరియాణాకు రెండు వైపులా ఉన్న పంజాబ్, ఢిల్లీలో ఆప్ అధికారంలో ఉన్న సంగతి తెలిసిందే.

అతివిశ్వాసం వల్లే ఓటమి: కేజ్రీవాల్

న్యూఢిల్లీ: హరియాణాలో అతి విశ్వాసం వల్లే ఓడిపోయామని ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ చెప్పారు. ఆయన మంగళవారం ఢిల్లీలో ఓ సమావేశంలో మాట్లాడారు. అతి విశ్వాసం ఉన్నవారికి హరియాణా ఎన్నికల ఫలితాలు ఒక గుణపాఠం అని పేర్కొన్నారు. ఏ ఒక్క ఎన్నికనూ తేలిగ్గా తీసుకోవద్దని, ప్రతి సీటూ ముఖ్యమేనని, గెలుపు కోసం కష్టపడి పని చేయాలని కార్యకర్తలకు సూచించారు. హరియాణాలో ఇతర పార్టీలతో తాము పొత్తు పెట్టుకొని ఉంటే భిన్నమైన ఫలితాలు వచ్చేవని రాష్ట్ర ఆమ్ ఆద్మీ పార్టీ అధ్యక్షుడు సుశీల్ గుప్తా చెప్పారు.

ఎన్నికల్లో నెగ్గిన ఉగ్రవాద బాధితురాలు

జమ్మూకశ్మీర్‌లో బీజేపీ ఏకైక మహిళా అభ్యర్థి విజయం



శ్రీనగర్: జమ్మూకశ్మీర్ ఎన్నికల్లో బీజేపీ తరఫున పోటీ చేసిన ఏకైక మహిళా అభ్యర్థి షగున్ పరిహార్(29) విజయం సాధించారు. కిష్త్వార్ స్థానంలో నేషనల్ కాన్ఫరెన్స్ అభ్యర్థి, మాజీ మంత్రి సజాద్ అహ్మద్ కిచ్లూపై 521 ఓట్ల మెజార్టీతో నెగ్గారు. పరిహార్‌కు 29,053, కిచ్లూకు 28,532 ఓట్లు లభించాయి. కిష్త్వార్ స్థానం కిచ్లూ కుటుంబానికి కంచుకోటలాంటి నియోజకవర్గం. ఇక్కడ కిచ్లూ రెండుసార్లు, ఆయన తండ్రి మూడుసార్లు గెలిచారు. అయినప్పటికీ ఈసారి కిచ్లూను పరాజయం పలుకరించింది. ఉన్నత విద్యావంతురాలైన షగున్ పరిహార్ ఉగ్రవాద బాధితురాలు. 2018 నవంబర్‌లో ఉగ్రవాదుల దాడిలో ఆమె తండ్రి అజిత్ పరిహార్, చిన్నాన్న అనిల్ పరిహార్ ప్రాణాలు కోల్పోయారు. అజిత్ పరిహార్ బీజేపీ జిల్లా నేతగా చురుగ్గా పనిచేశారు. తన గెలుపు జమ్మూకశ్మీర్ ప్రజలకే చెందుతుందని షగున్ పరిహార్ అన్నారు.

జులానాలో విజేత.. వినేశ్ ఫొగాట్!



సాక్షి, న్యూఢిల్లీ: ఒలింపిక్స్‌లో పతకం సాధించలేకపోయినా హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించి సత్తా చాటారు రెజ్లర్ వినేశ్ ఫొగాట్(30). జులానా అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ తరఫున పోటీకి దిగిన ఫొగాట్ దాదాపు 19 ఏళ్ల అనంతరం ఆ పార్టీకి విజయాన్ని సాధించి పెట్టారు. రెజ్లింగ్‌లో విజయం సాధించలేకపోయిన ఫొగాట్‌ను జులానా ఓటర్లు ఆదరించారు. ఫొగాట్‌కు 65,080 ఓట్లు రాగా బీజేపీ అభ్యర్థి యోగేష్ కుమార్‌కు 59,065 ఓట్లు పడ్డాయి. ఓట్ల లెక్కింపులో తొలి రౌండ్ నుంచి ఆధిక్యాన్ని ప్రదర్శించిన ఫొగాట్ మధ్యలో కాస్త వెనుకబడ్డారు. చివరకు 6,015 ఓట్ల తేడాతో గెలుపు తీరాలకు చేరారు. అసెంబ్లీలో తొలిసారి అడుగుపెట్టే అవకాశం దక్కించుకున్నారు. కాగా, 2019 ఎన్నికల్లో ఇక్కడ కేవలం 12,440 ఓట్లు సాధించిన కాంగ్రెస్ పార్టీ ఈసారి ఒలింపియన్ వినేశ్ ఫొగాట్‌ను బరిలోకి దింపి జాట్ ఓట్లను కొల్లగొట్టే ప్రయత్నం చేసి, సఫలమైంది. మరోవైపు, బీజేపీ యోగేష్ కుమార్‌ను నిలిపి ఓబీసీ ఓట్లను ఆకర్షించేందుకు ప్రయత్నించి, విఫలమైంది.



నా ఓటమికి ఎన్నో కారణాలు: ఇల్తిజా ముఫ్తీ

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లో పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ(పీడీపీ) అధ్యక్షురాలు మెహబూబా ముఫ్తీ కుమార్తె ఇల్తిజా ముఫ్తీ అనూహ్యంగా ఓడిపోయారు. ఆమె దక్షిణ కశ్మీర్‌లోని బిజ్‌బెహరా స్థానం నుంచి పోటీచేశారు. నేషనల్ కాన్ఫరెన్స్ అభ్యర్థి బషీర్ అహ్మద్ వీరీ చేతిలో పరాజయం చవిచూశారు. తన ఓటమిపై ఇల్తిజా ముఫ్తీ మంగళవారం స్పందించారు. బీజేపీతో గతంలో పీడీపీ పొత్తు పెట్టుకోవడం ఈ ఎన్నికల్లో ఎలాంటి ప్రభావం చూపలేదని అన్నారు. తన పరాజయానికి బీజేపీతో అప్పటి స్నేహం కారణం కాదని స్పష్టంచేశారు. తాను ఆశించిన ఫలితం రాలేదని, ఇందుకు చాలా కారణాలు ఉన్నాయని చెప్పారు. నేషనల్ కాన్ఫరెన్స్‌కు ఒక అవకాశం ఇచ్చి చూద్దామని ప్రజలు నిర్ణయించుకున్నారని, అందుకే ఆ పార్టీకి ఓటు వేశారని తెలిపారు. తమ నాయకులు, కార్యకర్తలు చాలామంది పీడీపీకి దూరమయ్యారని, దీనివల్ల పార్టీ కొంత బలహీన పడిందని అంగీకరించారు. బిజ్‌బెహరా నుంచి గెలిచే అవకాశం తక్కువగా ఉందని తెలిసినప్పటికీ రిస్క్ చేశానని ఇల్తిజా ముఫ్తీ వ్యాఖ్యానించారు. రిస్క్ చేసినప్పటికీ తగిన ఫలితం రాలేదన్నారు. సురక్షితమైన నియోజకవర్గంలో పోటీ చేసి గెలిస్తే గొప్పేం ఉంటుందని ప్రశ్నించారు. పరాజయం ఎదురైనా కుంగిపోనని, పోరాటం సాగిస్తూనే ఉంటానని తేల్చిచెప్పారు. ఐదేళ్ల తర్వాత రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లీ పోటీ చేస్తానో లేదో ఇప్పుడే చెప్పలేనని అన్నారు.

అంచనాలు మళ్లీ తప్పాయి!

న్యూఢిల్లీ: హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు స్పష్టమైన మెజారిటీ వస్తుందంటూ ఎగ్జిట్ పోల్స్ ఇచ్చిన అంచనాలు గురి తప్పాయి. ఓటర్ల నాడి పసిగట్టడంలో ఆ సర్వేలు మరోసారి విఫలమయ్యాయి. 90 మంది సభ్యులుండే హరియాణా అసెంబ్లీలో కాంగ్రెస్ పార్టీ 50కి పైగా సీట్లు సాధిస్తుందని ఎగ్జిట్ పోల్స్ అన్నీ కోడై కూశాయి. అదేవిధంగా, అధికార బీజేపీ 30 మార్కు మించడం కూడా కష్టమని తేల్చాయి. సీవోటర్- ఇండియా టుడే సర్వే కాంగ్రెస్‌కు 50–58 సీట్లు, బీజేపీకి 20–28 సీట్లు ఇచ్చింది. రిపబ్లిక్- మ్యాట్రిజ్ కూడా కాంగ్రెస్‌కు 55–62 సీట్లు, బీజేపీకి 18–24 స్థానాలు దక్కుతాయని పేర్కొంది. అందుకు విరుద్ధంగా, మొత్తం 90 సీట్లలో బీజేపీ ఏకంగా 48 సీట్లు దక్కించుకోగా, కాంగ్రెస్ 37 సీట్లతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. బీజేపీ వరుసగా మూడోసారి ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు సిద్ధమైంది.

హిందూ మెజార్టీ స్థానాల్లో బీజేపీ ఓటమి

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లోని జమ్మూ ప్రాంతంలో హిందూ ఓటర్ల జనాభా అధికంగా ఉన్న బానీ, రాంబన్ నియోజకవర్గాల్లో బీజేపీ అభ్యర్థులు అనూహ్యంగా ఓటమి పాలయ్యారు. బానీ స్థానంలో బీజేపీ అభ్యర్థి జివాన్‌లాల్‌పై స్వతంత్ర అభ్యర్థి డాక్టర్ రామేశ్వర్ సింగ్ ఏకంగా 18,672 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. 2014 ఎన్నికల్లో ఈ స్థానంలో జివాన్‌లాల్ నెగ్గారు. ఈసారి మాత్రం ఓడిపోయారు. రాంబన్ నియోజకవర్గంలో నేషనల్ కాన్ఫరెన్స్ అభ్యర్థి అర్జున్‌సింగ్ రాజు చేతిలో బీజేపీ అభ్యర్థి రాకేశ్ సింగ్ ఠాకూర్ ఓటమి చెందారు. ఇక్కడ బీజేపీ తిరుగుబాటు అభ్యర్థి సూరజ్‌సింగ్ పరిహార్ రెండో స్థానంలో నిలిచారు. అర్జున్‌సింగ్ రాజుకు 8,869 ఓట్ల మెజార్టీ లభించింది. 2014 ఎన్నికల్లో రాంబన్ సీటును బీజేపీ గెలుచుకుంది. తమకు గట్టి పట్టున్న రెండు కీలక నియోజకవర్గాల్లో ఓడిపోవడం బీజేపీని నిరాశకు గురిచేసింది.

వేర్పాటువాదులకు ఎదురుదెబ్బ

శ్రీనగర్: జమ్మూకశ్మీర్ ఎన్నికల్లో వేర్పాటువాదులకు చేదు అనుభవం ఎదురైంది. ఇంజనీర్ రషీద్ నేతృత్వంలోని అవామీ ఇత్తెహాద్ పార్టీ, జమాత్–ఇ–ఇస్లామీ పెద్దగా ప్రభావం చూపలేకపోయాయి. ఆయా పార్టీల టిక్కెట్లపై పోటీ చేసిన అభ్యర్థులు చాలాచోట్ల కనీసం డిపాజిట్లు కూడా దక్కించుకోలేకపోయారు. 'నోటా' కంటే తక్కువ ఓట్లు సాధించారు. సోపోరు నుంచి పోటీ చేసిన అఫ్జల్ గురు సోదరుడు ఐజాజ్ అహ్మద్ గురుకు కేవలం 129 ఓట్లు వచ్చాయి. అవామీ ఇత్తెహాద్ పార్టీ నుంచి 44 మంది పోటీ చేశారు. ఇంజనీర్ రషీద్ తమ్ముడు పిర్దోస్ బాబా ఓడిపోయాడు. జమాత్–ఇ–ఇస్లామీ నుంచి నలుగురు పోటీ చేశారు. మరో నలుగురు అభ్యర్థులకు ఆ పార్టీ మద్దతు ఇచ్చింది. ఎవరూ నెగ్గలేదు. చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం(యూఏపీఏ) కింద అరెస్టయ్యి, ప్రస్తుతం జైలులో ఉన్న సర్జన్ అహ్మద్ వాగే అలియాస్ ఆజాదీ చాచా కూడా ఓటమి చెందాడు.

32 ఓట్లతో దక్కిన విజయం

చండీగఢ్: హరియాణాలోని ఉచానా కలాన్ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి దేవేందర్ చతర్ భుజ్ అత్రి కేవలం 32 ఓట్ల తేడాతో గెలుపు సాధించారు. అత్రి తన సమీప ప్రత్యర్థి, కాంగ్రెస్‌కు చెందిన మాజీ ఐఏఎస్ అధికారి బ్రిజేందర్ సింగ్‌ను ఓడించారని ఎన్నికల కమిషన్ ప్రకటించింది. ఈ సీటులో సిట్టింగ్ ఎమ్మెల్యే, జననాయక్ జనతా పార్టీ(జేజేపీ) నేత దుష్యంత్ చౌతాలా ఐదో స్థానంలో నిలిచారని తెలిపింది. అత్రికి 48,968 ఓట్లు లభించగా, కాంగ్రెస్ అభ్యర్థి, కేంద్ర మాజీ మంత్రి బీరేందర్ సింగ్ కుమారుడు బ్రిజేంద్ర సింగ్‌కు 48,936 ఓట్లు పోలయ్యాయని ఈసీ పేర్కొంది.

జేజేపీ: కింగ్ మేకర్ నుంచి జీరోకు..

చండీగఢ్: 2019 హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో కింగ్‌మేకర్‌గా అవతరించిన జననాయక్ జనతా పార్టీ(జేజేపీ) పరిస్థితి కేవలం ఐదేళ్లకే కనుమరుగయ్యే పరిస్థితికి వచ్చింది. జేజేపీ నేత, మాజీ డిప్యూటీ సీఎం దుశ్యంత్ చౌతాలా 2019లో గెలుచుకున్న ఉచానా కలాం స్థానంలో ఈసారి అవమానకరమైన రీతిలో ఓటమి పాలయ్యారు. 90 సీట్లున్న అసెంబ్లీలో 2019 ఎన్నికల్లో బీజేపీ 40 సీట్లు గెలుచుకుంది. మెజారిటీకి ఆరు సీట్లు తక్కువ కావడంతో 10 సీట్లున్న జేజేపీ ప్రభుత్వంలో చక్రం తిప్పింది. బీజేపీ అధిష్టానం సీఎం ఖట్టర్ స్థానంలో నాయబ్ సింగ్ సైనీకి బాధ్యతలివ్వడంతో మార్చిలో బీజేపీ ప్రభుత్వం నుంచి జేజేపీ బయటకు వచ్చింది. పార్టీ రాష్ట్ర నేత చీఫ్ నిషాన్ సింగ్ పార్టీని వీడటంతో 10 ఎమ్మెల్యేలకు గాను ఏడుగురు కాంగ్రెస్/ బీజేపీల్లో చేరారు. లోక్‌సభ ఎన్నికల్లో మొత్తం 10 సీట్లలో పోటీ చేసిన ఆ పార్టీ అభ్యర్థులకు కనీసం డిపాజిట్లు కూడా రాలేదు.

ఆయుర్వేదంతో అద్భుత ఫలితాలంటూ ప్రకటించడం నేరం

కేంద్ర ఆయుష్ శాఖ ప్రకటన

న్యూఢిల్లీ: వివిధ వ్యాధుల నివారణలో ఆయుర్వేద, సిద్ధ, యునాని, హోమియోపతి ఔషధాలు అద్భుతంగా పనిచేస్తాయంటూ ప్రకటించడం చట్ట వ్యతిరేకమని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఎటువంటి ధ్రువీకరణలు లేని ఇలాంటి ప్రకటనలతో ప్రజలను తప్పుదోవ పట్టించడంతోపాటు వారి ఆరోగ్యానికి హాని కలిగిస్తాయని హెచ్చరించింది. ఇటువంటి ప్రకటనలపై నిషేధం విధించామని, ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవని తెలిపింది. ఈ మేరకు మంగళవారం కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ ఒక బహిరంగ ప్రకటన జారీ చేసింది. తాము ఏవిధమైన ఆయుర్వేద, సిద్ధ, యునాని, హోమియోపతి(ఏఎస్‌యూహెచ్) మందులకు ధ్రువీకరణలను ఇవ్వలేదని కూడా తెలిపింది. అదేవిధంగా, ఆయా వైద్య విధానాలకు సంబంధించిన ఔషధాల తయారీ, విక్రయాలకు కూడా ఏ ఉత్పత్తిదారు లేదా కంపెనీకి అనుమతులు మంజూరు చేయలేదని ఆయుష్ శాఖ స్పష్టం చేసింది. డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ చట్టం–1940ని అనుసరించి ఏఎస్‌యూహెచ్ ఔషధాల తయారీ, విక్రయాలకు అనుమతులను సంబంధిత రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలే జారీ చేస్తాయని కూడా వివరించింది. ఏఎస్‌యూహెచ్ ఔషధాలను సంబంధిత వైద్యులు/ రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనర్ పర్యవేక్షణలో మాత్రమే వాడాలని కూడా తెలిపింది. అభ్యంతరకర, తప్పుడు ప్రకటనలు, నకిలీ మందులపై రాష్ట్ర లైసెన్సింగ్ అథారిటీకి లేదా ఆయుష్ శాఖకు ఫిర్యాదు చేయాలని కేంద్ర ఆయుష్ శాఖ సూచించింది.

ఐదుగురు రష్యన్ పర్వతారోహకుల దుర్మరణం

కఠ్మాండు: నేపాల్‌లో 8,167 మీటర్ల ఎత్తయిన ధౌలగిరి పర్వతం అధిరోహించేందుకు వెళ్లిన రష్యా వాసులు ఐదుగురు దుర్మరణం పాలయ్యారు. ప్రపంచంలోనే ఏడో అత్యంత ఎత్తైన ఈ పర్వతం బేస్‌క్యాంప్ నుంచి ఆదివారం ఉదయం 6 గంటలకు బయలుదేరిన ఈ బృందంతో కొద్ది సేపటి తర్వాత సంబంధాలు తెగిపోయాయని రక్షణ చర్యల్లో పాలుపంచుకుంటున్న మింగ్మా షెర్పా చెప్పారు. వీరంతా ఒకే తాడు సాయంతో ఎక్కుతుండగా ఘటన చోటుచేసుకున్నట్లు చెప్పారు. వాతావరణం అనుకూలించకపోవడంతో సోమవారం గాలింపు చేపట్టలేకపోయామన్నారు. మంగళవారం హెలికాప్టర్ ద్వారా గాలింపు చేపట్టగా మృతదేహాలు 7,700 మీటర్ల ఎత్తులో కనిపించాయని వివరించారు. బేస్ క్యాంపులో ఉన్న మరో రష్యన్ పర్వతారోహకుడిని బేస్‌క్యాంపు నుంచి తీసుకువచ్చినట్లు చెప్పారు. ప్రమాదానికి కారణాలు తెలియాల్సి ఉందని చెప్పారు. అంత ఎత్తు నుంచి మృతదేహాలను ఎప్పుడు కిందికి తీసుకువస్తారో ఆయన స్పష్టత ఇవ్వలేదు. ఇలా ఉండగా, నేపాల్ దక్షిణాన ఉన్న సూర్యకుండ్ ప్రాంతంలో ట్రెక్కింగ్ చేస్తున్న పోలండ్ దేశస్తురాలు(23) అనారోగ్యానికి గురై చనిపోయారని అధికారులు వెల్లడించారు.

బెట్టింగ్ మార్కెట్‌లో ట్రంప్ ఆధిక్యం

కీలక స్వింగ్ స్టేట్స్‌లో కమలాహారిస్ వెనుకంజ

వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష ఎన్నికలు దగ్గర పడుతున్న వేళ ట్రెండ్ మారుతున్నట్లు కనిపిస్తోంది. అంతర్జాతీయ బెట్టింగ్ మార్కెట్లలో కమలాహారిస్ కంటే డోనాల్డ్ ట్రంప్ ముందంజలో ఉన్నారు. జాతీయ పోల్స్‌లో కమలా హారిస్ ముందంజలో ఉండగా, బెట్టింగ్ అవకాశాలు మాత్రం 51.1 శాతంతో ట్రంప్‌కు అనుకూలంగా ఉన్నాయి. ఇందులో కమలా హారిస్‌కు 47.6 శాతం ఓట్లే పడ్డాయి. ట్రంప్ రెండోసారి అధికారంలోకి రావడానికి అంతర్జాతీయ టెక్ నిపుణులు మద్దతు తెలపడంతో పరిస్థితులు ట్రంప్ అనుకూలంగా మారాయని ఓ నివేదిక పేర్కొంది. దీనిపై టెస్లా సీఈఓ ఎలన్ మస్క్ స్పందించారు. 'ట్రంప్ ఇప్పుడు బెట్టింగ్ మార్కెట్లలో కమల కంటే 3% ముందంజలో ఉన్నారు. ఎన్నికల కంటే ఖచ్చితమైనది. ఎందుకంటే నిజమైన డబ్బు లైన్లో ఉంది. హారిస్‌కు అడ్వాంటేజ్ ఉన్న జాతీయ పోల్స్ కంటే బెట్టింగ్ మార్కెట్లలో ట్రంప్ స్థానం బలంగా ఉంది'' అని ఎక్స్‌లో పోస్ట్ చేశారు. అరిజోనా, జార్జియా, నార్త్ కరోలినా రాష్ట్రాల్లో సెప్టెంబర్‌లో బెట్టింగ్‌లు పెరిగాయి. స్వింగ్ రాష్ట్రాల్లో పెరుగుతున్న ఈ మద్దతు అధ్యక్ష పదవిని దక్కించుకోవడానికి అవసరమైన ఎలక్టోరల్ కాలేజ్ ఓట్లను గెలుచుకునే అవకాశాలను బలపరుస్తుంది. చారిత్రాత్మకంగా ఎలక్టోరల్ కాలేజ్‌లో ట్రంప్‌కు అడ్వాంటేజ్ ఉంది. 2020 ఎన్నికల్లో ఆయన జో బైడెన్ చేతిలో ఓడిపోయినా.. అరిజోనా, జార్జియా, నార్త్ కరోలినాను కైవసం చేసుకున్నారు.

రేపు లావోస్‌కు ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ నెల 10వ తేదీన లావోస్ వెళ్లనున్నారు. 10, 11వ తేదీల్లో రెండు రోజుల పర్యటనలో భాగంగా ఆయన ఆసియాన్-భారత్, 19వ తూర్పు ఆసియా దేశాల శిఖరాగ్ర సదస్సుల్లో పాల్గొంటారు. ప్రస్తుతం ఆసియాన్ అధ్యక్ష హోదాలో లావోస్ ఉంది. లావోస్ ప్రధానమంత్రి సొనెక్సే సిఫండోన్ ఆహ్వానం మేరకు ప్రధాని అక్కడికి వెళ్తున్నారని విదేశాంగ శాఖ తెలిపింది. రాజధాని లావెంటైన్‌లో జరిగే ద్వైపాక్షిక సమావేశాలకు ప్రధాని హాజరవుతారని తెలిపింది. పర్యటనల సమయంలో ఆసియాన్-భారత్ 'సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం'పై సమీక్ష, సంబంధాల బలోపేతంపై తీసుకోవాల్సిన చర్యలను చర్చిస్తారని విదేశాంగ శాఖ వెల్లడించింది.

మూడో రోజుకు వాంగ్చుక్ నిరాహార దీక్ష

న్యూఢిల్లీ: లద్దాఖ్‌ను రాజ్యాంగంలోని ఆరో షెడ్యూల్‌లో చేర్చాలంటూ పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్చుక్ తదితరులు ఢిల్లీలోని లద్దాఖ్ భవన్‌లో ఆదివారం చేపట్టిన నిరాహార దీక్ష కొనసాగుతోంది. మూడు రోజులుగా 25 మంది ఆమరణ దీక్ష సాగిస్తున్నాడిమాండ్లపై చర్చించేందుకు ప్రభుత్వ ప్రతినిధులెవరూ తమను సంప్రదించలేదని వాంగ్చుక్ తెలిపారు. ఎటువంటి వేతనం, యూనిఫాం లేకుండానే దేశ రక్షణ కోసం శ్రమిస్తున్న లద్దాఖ్ ప్రజలకు ప్రతిఫలమిదా? అని వాంగ్చుక్ ప్రశ్నించారు. రాజ్యాంగంలోని ఆరో షెడ్యూల్‌లో ఉన్న ప్రాంతాలకు స్వయం పాలక మండళ్లను ఏర్పాటు చేసుకునే అవకాశం లభిస్తుంది. న్యాయ, పరిపాలన, ఆర్థిక విషయాల్లో ఈ మండళ్లు స్వతంత్రంగా వ్యవహరిస్తాయి.

హెజ్‌బొల్లా సీనియర్ కమాండర్ మృతి

ప్రకటించిన ఇజ్రాయెల్ మిలటరీ

జెరుసలేం/బీరుట్: లెబనాన్ రాజధాని బీరుట్‌పై జరిపిన దాడిలో సీనియర్ కమాండర్, హెజ్‌బొల్లా మిలటరీ కౌన్సిల్ సభ్యుడు సుహైల్ హుస్సైనీ చనిపోయినట్లు మంగళవారం ఇజ్రాయెల్ ఆర్మీ ప్రకటించింది. హెజ్‌బొల్లాలో ఆయుధ రవాణా, నిధులు, నిర్వహణ వ్యవహారాలు చూస్తుంటారని తెలిపింది. ఇరాన్ నుంచి అందే అత్యాధునిక ఆయుధాలను సంస్థలోని వివిధ విభాగాలకు సరఫరా చేస్తుంటారని వివరించింది. దీనిపై హెజ్‌బొల్లా స్పందించాల్సి ఉంది. తమ మొట్టమొదటి రిజర్వు బలగాలు భూతల పోరాటానికి దక్షిణ లెబనాన్‌లోకి ప్రవేశించినట్లు ఇజ్రాయెల్ ఆర్మీ ప్రకటించింది. తమ పౌరులపై దాడులను ఆపేవరకు ఇది కొనసాగుతుందని స్పష్టం చేసింది. హెజ్‌బొల్లా మిలిటెంట్లు మంగళవారం ఇజ్రాయెల్‌పైకి 170కి పైగా రాకెట్లను ప్రయోగించారు. ఇవి హైఫా వరకు వచ్చినట్లు ఇజ్రాయెల్ ఆర్మీ తెలిపింది. అన్నిటినీ తమ గగనతల రక్షణ వ్యవస్థలు కూల్చేశాయంది. అయితే, ఇజ్రాయెల్ దాడులు తమ సైనిక సామర్థ్యాన్ని దెబ్బతీయలేవని హెజ్‌బొల్లా తాత్కాలిక సారథి షేక్ నయీమ్ కస్సెమ్ పేర్కొన్నారు. లెబనాన్‌లో వారం క్రితం భూతల దాడులు మొదలుపెట్టిన ఇజ్రాయెల్ ఆర్మీ అడుగు ముందుకు వేయలేకపోయిందన్నారు.

గాజాలో భీకర పోరు

ఇజ్రాయెల్‌పైకి సోమవారం పదుల సంఖ్యలో రాకెట్లను ప్రయోగించినట్లు గాజాలోని పాలస్తీనా మిలిటెంట్లు ప్రకటించారు. గాజాలోని బురెయిజ్ శరణార్థి శిబిరంపై సోమవారం రాత్రి ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో ఆరుగురు చిన్నారులు, ఇద్దరు మహిళలు సహా 30 మంది ప్రాణాలు కోల్పోయారు. ఉత్తర గాజాలో హమాస్, ఇజ్రాయెల్ బలగాలకు మధ్య భీకర పోరు సాగుతున్నట్లు సమాచారం. ఇజ్రాయెల్ యుద్ధ విమానాలు, శతఘ్నులు మంగళవారం జబాలియాతోపాటు బెయిట్ హనౌన్, బెయిట్ లహియా శరణార్థి శిబిరాలపై దాడులు చేశాయి. జబాలియాలో 20 మంది మిలిటెంట్లను చంపేసి, గ్రెనేడ్లు, రైఫిళ్లు సహా ఆయుధాలను భారీగా పట్టుకున్నట్లు ఇజ్రాయెల్ తెలిపింది. ఇజ్రాయెల్ దాడుల్లో జబాలియాలో ఇద్దరు మహిళలు, నలుగురు చిన్నారులు సహా 15 మంది చనిపోయినట్లు కమాల్ అద్వాన్ ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. హమాస్, ఇజ్రాయెల్ మధ్య యుద్ధానికి సోమవారంతో ఏడాది పూర్తయిన విషయం తెలిసిందే.

పత్రికా స్వేచ్ఛ గురించి తెలిపే ఆర్టికల్ ఏది?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

పాలిటీ



వ్యక్తిగత స్వేచ్ఛలు, హక్కులు

ప్రకరణ 19 నుంచి 22 వరకు ఉన్న హక్కులను వివిధ స్వేచ్ఛల రూపంలో పొందుపర్చారు. ప్రజాస్వామ్యంలో వ్యక్తిగత స్వేచ్ఛలు చాలా విలువైనవి. కానీ ఈ స్వేచ్ఛలపై హేతుబద్ధమైన పరిమితులను విధించవచ్చు.

అధికరణం 19లో ఆరు వ్యక్తిగత స్వేచ్ఛలు ఉన్నాయి.

ప్రకరణ 19 (1)

ఎ. వాక్ స్వాతంత్ర్యం, భావ వ్యక్తీకరణ, అభిప్రాయ ప్రకటన.

బి. శాంతియుతంగా, ఆయుధాలు లేకుండా సమావేశాలు నిర్వహించడం.

సి. సంస్థలు, సంఘాల ఏర్పాటు. సహకార సంఘాల ఏర్పాటు, నిర్వహణ.

డి. దేశవ్యాప్త సంచార స్వేచ్ఛ.

ఇ. దేశవ్యాప్త స్థిర నివాస స్వేచ్ఛ.

ఎఫ్. ఆస్తిని సముపార్జించుకునే స్వేచ్ఛ. (ఈ క్లాజ్‌ను 1978లో 44వ రాజ్యాంగ సవరణ ద్వారా తొలగించారు.)

జి. వృత్తి, వ్యాపార, వాణిజ్య స్వేచ్ఛలు.

పైన పేర్కొన్న ఆరు స్వేచ్ఛలు ప్రభుత్వ చర్యలకు వ్యతిరేకంగా ఉంటాయి. ఇవి భారత పౌరులకు మాత్రమే వర్తిస్తాయి. విదేశీయులకు, కంపెనీలకు, కార్పొరేషన్లకు వర్తించవు.

ప్రకరణ 19(1)(ఎ)లో పేర్కొన్న వాక్ స్వాతంత్ర్యం, భావ ప్రకటనా స్వేచ్ఛకు సంబంధించి సుప్రీంకోర్టు విస్తృత వ్యాఖ్యానాలు చేసింది. పౌరుడు తన భావాలతో పాటు ఇతరుల భావాలను కూడా వ్యక్తీకరించవచ్చు. ఇది పత్రికా స్వేచ్ఛ ద్వారా సాధ్యమవుతుంది. కాబట్టి పత్రికా స్వేచ్ఛ(ఫ్రీడం ఆఫ్ ప్రెస్) అనేది భావ ప్రకటన స్వేచ్ఛలో అంతర్గతంగా ఉంటుందని అత్యున్నత న్యాయస్థానం పేర్కొంది.

కింద పేర్కొన్న స్వేచ్ఛలు కూడా భావ వ్యక్తీకరణ స్వేచ్ఛలో అంతర్గతంగా ఉంటాయని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది.

- పత్రికా స్వేచ్ఛ
- వాణిజ్య ప్రకటన స్వేచ్ఛ
- రహస్యాలను కాపాడుకునే స్వేచ్ఛ
- ప్రసారాల స్వేచ్ఛ
- సమాచార స్వేచ్ఛ
- బంద్‌కు వ్యతిరేకమైన స్వేచ్ఛ
- మౌనం పాటించే స్వేచ్ఛ
- నిరసన వ్యక్తం చేసే స్వేచ్ఛ

మినహాయింపులు

ఈ స్వేచ్ఛలపై హేతుబద్ధమైన పరిమితులను విధించే అధికారం ప్రభుత్వానికి ఉంటుంది. కింది కారణాల వల్ల పరిమితులు విధించవచ్చు.

- భారత సార్వభౌమాధికారం, సమగ్రత.
- దేశ రక్షణ, విదేశాలతో స్నేహ సంబంధాలు.
- ప్రజాశాంతి, సభ్యత, మర్యాద, నీతి, కోర్టు ధిక్కారం.
- పరువు నష్టం, నేర ప్రేరేపణ తదితర ప్రాతిపదికలపై స్వేచ్ఛకు హేతుబద్ధమైన పరిమితులు విధించవచ్చు.

ఈ పరిమితులు పార్లమెంట్, శాసనసభ చర్చలకు వర్తించవు. సభాధ్యక్షుల రూలింగ్ మేరకు సభ్యులు తమ భావాలను వ్యక్తీకరించవచ్చు.

19 (1) (బి) - సమావేశ స్వేచ్ఛ

శాంతి భద్రతలకు భంగం కలగకుండా, ఆయుధాలు లేకుండా, శాంతియుతంగా సమావేశం కావడానికి పౌరులకు స్వేచ్ఛ ఉంది. కానీ సిక్కులు తమ మత చిహ్నమైన చిన్న కత్తిని (కృపాణం) ధరించి శాంతియుతంగా సమావేశం కావచ్చు. స్వేచ్ఛపై కూడా కొన్ని పరిమితులుంటాయి. దేశ సార్వభౌమత్వానికి, సమగ్రతకు, శాంతి భద్రతలకు భంగం కలిగించేలా నిర్వహించే సమావేశాలను నిషేధించవచ్చు. ఉదా: క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ సెక్షన్ 144 ప్రకారం నిషేధాజ్ఞను, కర్ఫ్యూను అమలు చేయవచ్చు.

19 (1) (సి) - సంఘాలను, సంస్థలను ఏర్పాటు చేసుకునే స్వేచ్ఛ

పౌరుడు స్వచ్ఛందంగా తమకు నచ్చిన సంఘాలు, సంస్థలు స్థాపించి కార్యకలాపాలు నిర్వహించవచ్చు. నైతిక విరుద్ధమైన, సమాజ హితానికి వ్యతిరేకమైన సంస్థలను, దేశ సార్వభౌమత్వానికి, సమగ్రతకు, శాంతిభద్రతలకు భంగం కలిగించే సంస్థలను, సంఘాలను అనుమతించరు.

2012లో 97వ రాజ్యాంగ సవరణ ద్వారా సహకార సంఘాలను ఏర్పాటు చేసి, నిర్వహించుకునే స్వేచ్ఛను ఆర్టికల్ 19(1)(సి)లో చేర్చారు.

19 (1) (డి) - సంచార స్వేచ్ఛ

పౌరులు తమ ఇష్ట ప్రకారం దేశమంతటా సంచరించవచ్చు. తద్వారా వారికి విశాల భావజాలం పెంపొందడమే కాకుండా వైవిధ్యాన్ని అర్థం చేసుకునే అవకాశం లభిస్తుంది. అయితే సంచార స్వేచ్ఛపై కొన్ని ఆంక్షలను విధించవచ్చు. ప్రజల సంక్షేమం, షెడ్యూల్డ్ తెగల ప్రయోజనాలు, శాంతి భద్రతల దృష్ట్యా జన సంచారాన్ని నిషేధించవచ్చు. సంచార సమయంలో పౌరులు కొన్ని నియమ నిబంధనలు పాటించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవచ్చు.

ఉదా: వాహనదారులు హెల్మెట్లు ధరించడం, సీటు బెల్టు పెట్టుకోవడం, అంటువ్యాధులు రాకుండా వ్యాక్సిన్లు తీసుకోవడం తదితర సహేతుకమైన నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవచ్చు.

19 (1) (ఇ): నివాసం ఏర్పరచుకొని స్థిరపడే స్వేచ్ఛ

దేశంలోని ఏ ప్రాంతంలోనైనా నివాసం ఏర్పర్చుకొని స్థిరపడే స్వేచ్ఛ పౌరులకు ఉంది. అయితే ప్రజా సంక్షేమం, షెడ్యూల్డ్ ప్రాంతాల ప్రయోజనాల దృష్ట్యా ఈ హక్కుపై హేతుబద్ధమైన పరిమితులు విధించవచ్చు.

ప్రకరణ-20

నేరం, శిక్ష నుంచి రక్షణ పొందే హక్కు

ఈ నిబంధన ప్రకారం వ్యక్తులకు నేరం, శిక్ష నుంచి రక్షణ పొందేందుకు కొన్ని అంశాలను పొందుపరిచారు.

- 20(1) ప్రకారం తప్పు చేయనిదే ఎవరినైనా శిక్షించరాదు. ఒక వ్యక్తి చేసిన పని అది చేసిన సమయానికి చట్టరీత్యా నేరమైతేనే శిక్షించాలి. ఆ నేరానికి చట్టపరంగా విధించాల్సిన శిక్ష కంటే ఎక్కువ శిక్ష విధించరాదు. కానీ తక్కువ శిక్షను విధించవచ్చు. దీన్ని 'Doctrine of Beneficial Construction' అంటారు.
- 20(2) ప్రకారం ఒకే నేరానికి ఒకసారి కంటే ఎక్కువ సార్లు విచారించి శిక్షించరాదు.
- 20(3) ప్రకారం ఏ వ్యక్తినీ తనకు తాను వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పమని నిర్బంధం చేయరాదు.

ఒక వ్యక్తి వర్తమానంలో చేసిన పనిని భవిష్యత్ కాలంలో నేరంగా పరిగణించి శిక్షించరాదు. క్రిమినల్ చట్టాలు చేసిన రోజు నుంచి లేదా తర్వాతి కాలం నుంచి అమల్లోకి వస్తాయి. క్రిమినల్ చట్టాలు ముందుకాలానికి వర్తిస్తాయి. కానీ గత కాలానికి వర్తించవు. దీన్నే న్యాయ పరిభాషలో ఎక్స్ పోస్ట్ ఫ్యాక్టో చట్టాలు (Ex post Facto Legislations) అంటారు. ఎక్స్ పోస్ట్ ఫ్యాక్టో అంటే Now and After, Not Before అని అర్థం. సివిల్ చట్టాలను గతకాలానికి కూడా వర్తింపజేయవచ్చు. **ఉదా:** ప్రభుత్వం ఇంటి పన్నును పెంచుతూ 2015 జనవరి 26న ఆదేశాలు జారీ చేస్తే.. అది గత ఏడాది జూలై నుంచి వర్తిస్తుందని పేర్కొనడం సమంజసమే. పౌరులు ఆ రోజు నుంచి పెరిగిన పన్నులు చెల్లించాల్సి ఉంటుంది.

డబుల్ జపార్డీ

ద్వంద్వ శిక్షలను న్యాయ పరిభాషలో డబుల్ జపార్డీ (Double Jeopardy) అంటారు. ఒక వ్యక్తి చేసిన తప్పుకు ఒకసారి శిక్ష పడి ఉంటే అదే నేరానికి మరోసారి శిక్ష వేయరాదు. ఈ రక్షణ న్యాయపరమైన ప్రక్రియలకు మాత్రమే వర్తిస్తుంది. శాఖాపరమైన, పరిపాలనాపరమైన చర్యలకు వర్తించదు.

ఉదా: ఒక ప్రభుత్వ ఉద్యోగి అవినీతికి పాల్పడినట్లు రుజువైతే అతణ్ని ఉద్యోగం నుంచి తొలగిస్తారు. జైలు శిక్ష విధించడంతోపాటు అన్యాక్రాంతమైన ప్రభుత్వ ధనాన్ని రికవరీ చేస్తారు. ఇక్కడ తప్పు ఒక్కటే కానీ శిక్షలు ఒకటి కంటే ఎక్కువ ఉండవచ్చు.

స్వయం సాక్ష్యం చెల్లదు

ఏ వ్యక్తినీ తనకు తాను వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పమని బలవంతం చేయరాదు. దీన్ని న్యాయభాషలో సెల్ఫ్ ఇంక్రిమినేషన్ (Self Incrimination) అంటారు. కానీ ముద్దాయి చేతిగుర్తులు, చేతిరాత, రక్త నమూనాలను అతడికి వ్యతిరేక సాక్ష్యాలుగా తీసుకుంటారు. 1978లో నందిని శతపతి V/s పి.ఎల్.డానీ కేసులో సుప్రీంకోర్టు బలవంతపు సాక్ష్యం అనే అంశాన్ని విశదీకరించింది. దీని ప్రకారం.. బెదిరించి, శారీరకంగా హింసించి, మానసిక క్షోభకు గురిచేసి నేరం ఒప్పుకునేలా చేసి సమాచారం రాబడితే అది బలవంతపు సాక్ష్యం కిందకు వస్తుందని పేర్కొంది. అలాంటి చర్యలు ఆర్టికల్ 20(3)కు వ్యతిరేకమని పేర్కొంది. నేర వైద్య శాస్త్ర పరంగా (Forensic Science) నిందితుల నుంచి సమాచారం రాబట్టడం కొంత మేరకు చెల్లుబాటు అవుతుంది. **ఉదా:** సత్యశోధన లేదా లై డిటెక్టర్ (Polygraph), నార్కో అనాలిసిస్, మైండ్ మ్యాపింగ్ మొదలైనవి. అయితే కొన్ని రసాయనాలు ఉపయోగించి చేసే నార్కో అనాలిసిస్ టెస్ట్ పూర్తిగా శాస్త్రబద్ధం కాదని కొవ్వాడ గాంధీ కేసు (2011)లో సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది.

ప్రకరణ -21

వ్యక్తి స్వేచ్ఛకు, ప్రాణానికి రక్షణ

ఇది చాలా ముఖ్యమైంది. భారత పౌరులతో పాటు విదేశీయులకు కూడా వర్తిస్తుంది. జీవించే హక్కును, ఆంతరంగిక స్వేచ్ఛను చట్టం నిర్దేశించిన పద్ధతి ప్రకారం తప్ప మరే విధంగా హరించడానికి వీల్లేదు. ఈ నిబంధన వ్యక్తి జీవించే స్వేచ్ఛకు రక్షణ కల్పిస్తుంది.

చట్టం నిర్దేశించిన పద్ధతి అనే భావాన్ని జపాన్ రాజ్యాంగం నుంచి గ్రహించారు. శాసనసభల చట్టాల నిర్ణీత పద్ధతి ప్రకారం వ్యక్తి స్వేచ్ఛను హరిస్తే పైన పేర్కొన్న పద్ధతి చెల్లుబాటవుతుంది. ఈ ప్రకరణను కార్యనిర్వాహక అధికారాల దుర్వినియోగానికి వ్యతిరేకంగా మాత్రమే పొందుపరిచారు. ఇది శాసనసభల చట్టాలకు వ్యతిరేకంగా రక్షణ ఇవ్వదు.

ప్రకరణ 21లో కల్పించిన రక్షణలు కార్యనిర్వాహక చర్యలకు వ్యతిరేకంగా మాత్రమే వర్తిస్తాయి. శాసనపరమైన చర్యలకు వర్తించవు. వీటిని న్యాయస్థానంలో ప్రశ్నించడానికి వీల్లేదు. సుప్రీంకోర్టు ఈ అంశాన్ని మేనకా గాంధీ కేసులో విస్తృతంగా వ్యాఖ్యానించింది. శాసన శాఖ చర్యలకు వ్యతిరేకంగా రక్షణ కల్పించేలా కొన్ని సూత్రాలను నిర్దేశించింది.

భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ - సుప్రీంకోర్టు తీర్పులు

భావ వ్యక్తీకరణ స్వేచ్ఛకు సంబంధించి సుప్రీంకోర్టు విస్తృత తీర్పులు వెలువరించింది.

శ్రేయా సింఘాల్ V/s యూనియన్ ఆఫ్ ఇండియా (2015)

ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టం-2000లోని సెక్షన్ 66ఎ భావ వ్యక్తీకరణ స్వేచ్ఛకు విరుద్ధమని, అది చెల్లదని సుప్రీం తీర్పు చెప్పింది.

శ్రీమతి కుష్బు V/s తమిళనాడు (2012)

పౌరులు తమ భావాలను స్వేచ్ఛగా వ్యక్తీకరించవచ్చు. ఒకరు వ్యక్తీకరించిన భావం నచ్చకపోతే న్యాయస్థానంలో దావా వేయవచ్చు. అంతేకానీ పూర్తిగా తమ భావాలను వ్యక్తీకరించకుండా నిషేధించడానికి వీల్లేదని వ్యాఖ్యానించింది. మేజర్లయిన స్త్రీ, పురుషులు వివాహం చేసుకోకుండా సహజీవనం చేయడం నేరం కాదని పేర్కొంది.

భరత్ కుమార్ V/s సి.పి.ఎం. (1998)

బంద్‌లు, సార్వత్రిక సమ్మెలు, ప్రాథమిక హక్కులు కావని, అవి ప్రజా జీవితాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తాయని, బలవంతంగా ప్రజా జీవితాన్ని ప్రభావితం చేయడం రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టు పేర్కొంది. టి.రంగరాజన్ V/s తమిళనాడు కేసు(2003)లోనూ సమ్మె చేసే హక్కు ప్రాథమిక హక్కు కాదని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది.

బిజో ఇమాన్యూవల్ V/s స్టేట్ ఆఫ్ కేరళ (1986)

దీన్ని జాతీయ గీతం కేసుగా పేర్కొంటారు. జాతీయ గీతాన్ని ఆలపించడం తమ మత విశ్వాసానికి విరుద్ధమని ఎవరైనా నిరూపించగలిగితే జాతీయ గీతాన్ని ఆలపించమని ఎవరూ ఒత్తిడి చేయరాదని పేర్కొంది. ఒక వ్యక్తి మౌనంగా ఉండటం కూడా భావ వ్యక్తీకరణ స్వేచ్ఛలో భాగమని వ్యాఖ్యానించింది.

మేనకా గాంధీ V/s యూనియన్ ఆఫ్ ఇండియా (1978)

పౌరులకు సంచార స్వేచ్ఛ, భావ వ్యక్తీకరణ స్వేచ్ఛలు దేశంలో ఉన్నప్పుడే కాకుండా, విదేశీ పర్యటనలో ఉన్నప్పుడు కూడా వర్తిస్తాయని తెలిపింది. వాటికి భౌగోళిక పరిమితి ఉండదని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది.

నవీన్ జిందాల్ V/s యూనియన్ ఆఫ్ ఇండియా (1995)

జాతీయ జెండాను ప్రతి పౌరుడు ఎగురవేయడం భావ వ్యక్తీకరణ స్వేచ్ఛలో అంతర్భాగమని ప్రకటించింది. పత్రికలు లేదా మీడియాపై ముందస్తు సెన్సార్‌షిప్ లేదా నియంత్రణ సాధ్యం కాదు. కానీ సినిమాలపై ముందస్తు సెన్సార్‌షిప్ ఉండాలి. అది స్వేచ్ఛకు వ్యతిరేకం కాదని, బ్రిజ్ భూషణ్ V/s యూనియన్ టెరిటరీ ఆఫ్ ఢిల్లీ వివాదంలో సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. సెన్సార్‌షిప్ విషయంలో పత్రికలు/మీడియాను, సినిమాలను ఒకే విధంగా చూడటం సమంజసం కాదని పేర్కొంది. సమాచార స్వేచ్ఛ అంటే ప్రభుత్వ కార్యకలాపాలకు సంబంధించి సమాచారాన్ని తెలుసుకునే హక్కు. అది ప్రకరణ 19(1)(ఎ)లో అంతర్భాగం అని బెన్నెట్ కోల్‌మన్ కంపెనీ కేసులో 1973లో సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. అందువల్ల 2005 జూన్‌లో పార్లమెంట్ సమాచార హక్కు చట్టాన్ని రూపొందించింది.

ఉద్యోగాలు

జూట్ కార్పొరేషన్‌లో 20 పోస్టులు

కోల్‌కతా(పశ్చిమ బెంగాల్)లోని జూట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(జేసీఐ).. 2024-25 సంవత్సరానికి సంబంధించి అప్రెంటిస్‌షిప్ శిక్షణ ఇచ్చేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

- మొత్తం ఖాళీల సంఖ్య: 20.
- శిక్షణా కాలం: ఒక సంవత్సరం.
- అర్హత: ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై ఉండాలి.
- వయసు: 18 నుంచి 21 ఏళ్ల మధ్య ఉండాలి. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, పీడబ్ల్యూబీడీలకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
- స్టైపెండ్: నెలకు రూ.7000.
- ఎంపిక విధానం: విద్యార్హతల్లో సాధించిన మార్కులు, ధ్రువపత్రాల పరిశీలన, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం:

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 21.10.2024.
- వెబ్‌సైట్: https://www.jutecorp.in/

ఎస్‌పీఏ భోపాల్‌లో 54 టీచింగ్ పోస్టులు

భోపాల్(మధ్యప్రదేశ్)లోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్(ఎస్‌పీఏ)లో టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- మొత్తం పోస్టుల సంఖ్య: 54.
- పోస్టుల వివరాలు: ప్రొఫెసర్-02, అసోసియేట్ ప్రొఫెసర్-08, అసిస్టెంట్ ప్రొఫెసర్-44.
- విభాగాలు: ఆర్కిటెక్చర్, ప్లానింగ్ ఇతరులు.
- అర్హత: పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు టీచింగ్ అనుభవం ఉండాలి.
- ఎంపిక విధానం: షార్ట్‌లిస్ట్, రాతపరీక్ష/ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం:





- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ది రిజిస్ట్రార్, స్కూల్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్, భోపాల్, నీల్‌బాద్ రోడ్, భౌరి, భోపాల్, మధ్యప్రదేశ్ చిరునామకు పంపించాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 21.10.2024.
- హార్డ్‌కాపీల ద్వారా దరఖాస్తులకు చివరితేది: 04.11.2024.
- వెబ్‌సైట్: https://spabhopal.ac.in/

డైనమో ఏ నిబంధన ఆధారంగా పనిచేస్తుంది?



టెట్/ డీఎస్సీ

ఫిజికల్ సైన్స్

1. ఒక సెకండ్ల లోలకం పొడవు 100 సెం.మీ. దాని పొడవును మార్చిన డోలనావర్తన కాలం ఒక సెకనుకు మారినప్పుడు దాని పొడవు? (సెం.మీ. లలో)
   1) 100 2) 50 3) 25 4) 75
2. అత్యంత కచ్చితంగా కాలాన్ని కొలిచే సాధనాలు?
   1) చేతి గడియారాలు
   2) పరమాణు గడియారాలు
   3) నీటి గడియారాలు 4) పైవన్నీ
3. విమానాల తయారీలో ఇమిడి ఉన్న సూత్రం?
   1) పాస్కల్ సూత్రం
   2) బాయిల్ సూత్రం
   3) ఆర్కిమెడీస్ సూత్రం
   4) బెర్నౌలీ సూత్రం
4. నీటి కాఠిన్యతకు కారణమైనవి
   1) కాల్షియం, మెగ్నీషియంల బైకార్బొనేట్లు
   2) కాల్షియం, మెగ్నీషియంల క్లోరైడ్లు, సల్ఫేట్లు
   3) కాల్షియం, మెగ్నీషియంల నైట్రేట్లు
   4) కాల్షియం, మెగ్నీషియంల కార్బొనేట్లు
5. 1986లో కనిపించిన హేలీ తోకచుక్క మళ్లీ ఏ సంవత్సరంలో కనిపిస్తుంది?
   1) 2062 2) 2022 3) 2046 4) 2056
6. వేసవిలో తారురోడ్డుపై ప్రయాణిస్తున్నప్పుడు దూరంగా నీరు ఉన్నట్లు కనిపిస్తుంది. దీనికి కారణం?
   1) కాంతి పరావర్తనం 2) కాంతి ధృవణం
   3) సంపూర్ణాంతర పరావర్తనం
   4) కాంతి వివర్తనం
7. 0 డిగ్రీల సెంటీగ్రేడు వద్ద గాలిలో ధ్వనివేగం 332 మీ/సె. అయిన 1 డిగ్రీ సెంటీగ్రేడు ఉష్ణోగ్రత పెరిగితే అప్పుడు గాలిలో ధ్వని వేగం (మీ/సెలలో)
   1) 332.608 2) 332
   3) 330.608 4) 332.680
8. కిందివాటిలో తిర్యక్ తరంగాలు
   1) స్ప్రింగ్‌లో ఏర్పడే తరంగాలు
   2) కాంతి తరంగాలు 3) నీటి తరంగాలు
   4) కాంతి, నీటి తరంగాలు
9. అత్యధిక కెలోరిఫిక్ విలువ గల పదార్థం?
   1) అరటి పండు 2) గోధుమలు
   3) మాంసం 4) వేరుసెనగ
10. ఆల్ఫా, బీటా, గామాల నిష్పత్తి
    1) 3 : 2 : 1 2) 1 : 2 : 3
    3) 1 : 3 : 2 4) 2 : 1 : 3
11. దూరపు వస్తువుల్ని మాత్రమే చూడగలిగి, దగ్గరి వస్తువుల్ని చూడలేనప్పుడు దృష్టి సవరణకు ఏ కటకాన్ని ఉపయోగిస్తారు?
    1) కుంభాకార 2) పుటాకార
    3) ద్వి పుటాకార 4) పైవన్నీ
12. న్యూటన్ మూడో గమన సూత్రం ఆధారంగా పనిచేసేది?
    1) హెలికాప్టర్ 2) రైలు
    3) రాకెట్ 4) విమానం
13. విశ్వ గురుత్వ స్థిరాంకం 'G'కు ప్రమాణం
    1) Nm^2Kg^2 2) Nm^2Kg^{-2}
    3) N^2m^2Kg 4) $Nm^{-2}Kg^{-2}$
14. పెట్రోలియంలో పెట్రో అనగా లాటిన్‌లో ?
    1) నూనె 2) రాయి
    3) మండుట 4) వాసన
15. 0.1 కిలోగ్రాముల బరువున్న ఒక పక్షి భూమికి 10 మీటర్ల ఎత్తులోని చెట్టు కొమ్మపై ఉన్న దాని స్థితిశక్తి?
    1) 4.9 జౌల్స్ 2) 9.8 జౌల్స్
    3) 20 జౌల్స్ 4) 0.1 జౌల్స్
16. ఓడలలో లంగరును పైకెత్తుటకు ఉపయోగించేది?
    1) స్క్రూ జాక్ 2) విండ్‌లాస్
    3) కాప్‌స్టన్ 4) వించ్
17. ద్రవాల విశిష్ట సాంద్రతను కనుగొనడానికి ఉపయోగించే పరికరం?
    1) లాక్టో మీటర్ 2) హైడ్రో మీటర్
    3) పైరో మీటర్ 4) బారో మీటర్
18. విద్యుదయస్కాంతాల తయారీకి ఉపయోగించేది?
    1) ఉక్కు 2) మెత్తని ఇనుము
    3) నిక్రోమ్ 4) మాంగనీస్
19. ఫెర్రో అయస్కాంతాల సాపేక్ష ప్రవేశ్య శీలత?
    1) $\mu_r \leq 1$ 2) $\mu_r > 1$
    3) $\mu_r = 1$ 4) $\mu_r >> 1$
20. కిందివాటిలో విద్యుత్ విశ్లేషణ అనువర్తనానికి ఉదాహరణ
    1) ఎలక్ట్రో ప్లేటింగ్ 2) ఎలక్ట్రో టైపింగ్
    3) లోహాల శుద్ధి 4) పైవన్నీ
21. లెడెన్ జాడీ అనేది ఒక
    1) కెపాసిటర్ 2) అమ్మీటర్
    3) వోల్ట్‌మీటర్ 4) ఓల్టా మీటర్
22. నిరోధానికి గుర్తు
    
23. డైనమో ఏ నిబంధన ఆధారంగా పనిచేస్తుంది?
    1) లెంజ్ నియమం
    2) ఫ్లెమింగ్ కుడిచేతి నిబంధన
    3) ఆంపియర్ 4) మాక్స్‌వెల్
24. ఒక రేడియో ధార్మిక మూలకం అర్ధ జీవిత కాలం 6.93 రోజులు. దాని విఘటన స్థిరాంకం?
    1) 0.1 $రోజు^{-1}$ 2) 00.1 $రోజు^{-1}$
    3) 100 రోజులు 4) 1000 రోజులు
25. కింది వాటిలో ఐసోబార్
    1) $_1H^1$, $_1H^2$, $_1H^3$
    2) $_{10}Ne^{20}$, $_{10}Ne^{21}$, $_{10}Ne^{22}$
    3) $_6C^{13}$, $_7N^{13}$ 4) ఏదీకాదు
26. కింది వాటిలో యంత్ర భాష
    1) బేసిక్ 2) కోబాల్
    3) ఫోర్ట్రాన్ 4) అసెంబ్లర్
27.  సంకేతం
    1) p-n-p ట్రాన్సిస్టర్
    2) n-p-n ట్రాన్సిస్టర్
    3) p-p-n ట్రాన్సిస్టర్
    4) n-p-p ట్రాన్సిస్టర్
28. వాయు స్థిరాంకం R విలువ
    1) 0.0821 లీ-అట్మా.$మోల్^{-1}k^{-1}$
    2) 8.314×10^7 $ఎర్గ్స్‌మోల్^{-1}k^{-1}$
    3) 1.987 కేలో.$మోల్^{-1}k^{-1}$ 4) అన్నీ
29. కింది వాటిలో సరైంది
    1) 3p<4s<4p<3d 2) 3p<4s<4d<2s
    3) 3s<3p<4s<3d 4) 4p<3d<5p<6s
30. ఆర్బిటాల్ ప్రాదేశిక దృగ్విన్యాసాలను తెలియజేసే క్వాంటం సంఖ్య
    1) ప్రధాన క్వాంటం సంఖ్య
    2) అజిమూతల్ క్వాంటం సంఖ్య
    3) అయస్కాంత క్వాంటం సంఖ్య
    4) స్పిన్ క్వాంటం సంఖ్య
31. పరమాణు సంఖ్య 57 నుంచి 70 వరకు గల మూలకాల్ని ఏమంటారు?
    1) లాంథనైడ్స్ 2) ఆక్టినైడ్స్
    3) ఛాల్కో జెన్స్ 4) హాలోజెన్స్
32. ఆక్సైడ్‌లతో పాటు పెరాక్సైడ్‌లను ఏర్పరిచే మూలకం
    1) Be 2) Ba 3) Ca 4) Sr
33. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ ఫార్ములా
    1) $CaSo_4\ 2H_2o$ 2) $CaSo_4\ ½\ H_2o$
    3) $CaSo_4$ 4) $Ca\ Co_3$
34. కోణీయ ఆకృతి గల అణువు
    1) నీరు 2) బెంజీన్
    3) అమ్మోనియా 4) బేరియం క్లోరైడ్
35. అంతరణుక హైడ్రోజన్ బంధాలు గల అణువుకు ఉదాహరణ
    1) HF 2) సాలిసిలిక్ ఆమ్లం
    3) 0- నైట్రో ఫినాల్ 4) 0- క్లోరో ఫినాల్
36. $H_2+I_2 \rightleftharpoons 2HI$ చర్యకు k_p, k_c మధ్య సంబంధం
    1) $k_p < k_c$ 2) $k_p = k_c$
    3) $k_p > k_c$ 4) $k_p >> k_c$
37. STP వద్ద 1 మోల్ వాయువు ఆక్రమించు ఘన పరిమాణం
    1) 2.24 లీటర్లు 2) 0.224 లీటర్లు
    3) 22.4 లీటర్లు 4) 224 లీటర్లు
38. క్షార గుణం కలిగిన మానవ శరీర ద్రవం
    1) ఉమ్మి 2) మూత్రం
    3) జఠర రసం 4) రక్తం
39. 750 మిల్లీ లీటర్ల 0.4 మోల్‌ల NaOH ద్రావణంలో NaOH ఉన్న మోల్‌ల సంఖ్య?
    1) 0.03 2) 0.3 3) 3.1 4) 0.4
40. అత్యంత శ్రేష్ఠమైన బొగ్గు
    1) బిట్యుమస్ 2) ఆంత్ర సైట్
    3) సెమీ బిట్యుమస్ 4) లిగ్నైట్
41. కిందివాటిలో ఏరోమాటిక్ సమ్మేళనం
    
    4) 1, 3
42. కిందివాటిలో మెటామెరిజం సాదృశ్యకాలు
    1) nబ్యూటేన్, ఐసో బ్యూటేన్
    2) 1- క్లోరో బ్యూటేన్, 2- క్లోరో బ్యూటేన్
    3) 1- ప్రొపనోల్, మిథాక్సీ ఈథేన్
    4) ఇథాక్సీ ఈథేన్, మిథాక్సీ ప్రొపేన్
43. 96 శాతం ఆల్కహాల్‌ను ఏమంటారు?
    1) వాష్ 2) రెక్టిఫైడ్ స్పిరిట్
    3) అబ్సల్యూట్ ఆల్కహాల్ 4) వెనిగర్
44. మూడు క్షారాల వరుసను ఏమంటారు?
    1) కోడన్ 2) ట్రాన్ స్క్రిప్షన్
    3) రెప్లికేషన్ 4) ట్రాన్స్‌లేషన్
45. నీటిలో కరిగే విటమిన్
    1) A 2) D 3) E 4) C
46. ప్రగలన ప్రక్రియకు ఉపయోగించే కొలిమి
    1) రివర్బరేటర్ 2) షాఫ్ట్
    3) బ్లాస్ట్ 4) ఓపెన్‌హార్త్
47. అమ్నికో మిశ్రమ లోహ సంఘటనం
    1) Fe+C 2) Fe+Al+Ni+Co
    3) Fe+Ni+Cr+Mn 4) Fe+cr+Ni
48. ముఖానికి వాడే పౌడర్‌లో ఉన్న ఫాటీ ఆమ్ల లవణం
    1) K^+ 2) Na^+ 3) Mg^{2+} 4) Li^+
49. దృశ్య పరికరాలు, విద్యుత్ బల్బుల తయారీలో ఉపయోగించే గాజు
    1) సోడా గాజు 2) పైరెక్స్ గాజు
    3) క్వార్ట్జ్ గాజు 4) ఫ్లింట్ గాజు
50. టాల్క్ రసాయన నామం
    1) మెగ్నీషియం సిలికేట్
    2) మెగ్నీషియం కార్బొనేట్
    3) మెగ్నీషియం ఆక్సైడ్
    4) కాల్షియం సిలికేట్
51. ఆస్పిరిన్ మందు నిర్మాణం
    
52. వల్కనైజేషన్ ప్రక్రియలో రబ్బరును ఏ మూలకంతో కలుపుతారు.
    1) ఫాస్పరస్ 2) సిలికాన్
    3) జింక్ 4) సల్ఫర్
53. రెండు విషయాల మధ్య ఎలాంటి సంబంధం లేదని చెప్పే ప్రకల్పన
    1) నల్ ప్రకల్పన 2) ప్రకటనాత్మక ప్రకల్పన
    3) ప్రాగుక్తి ప్రకల్పన 4) ప్రశ్నా ప్రకల్పన
54. జ్ఞాన సముపార్జనకు దోహదపడేది
    1) తర్కం 2) స్పందన
    3) కంఠస్థం 4) అధికారత్వం
55. సౌర గడియారం, నీటి గడియారాలను మొదటి సారిగా తయారు చేసింది?
    1) బాబిలోనియన్లు 2) చైనీయులు
    3) ఈజిప్టియన్లు 4) గ్రీకులు
56. ఆన్ ది రివల్యూషన్ ఆఫ్ ద సెలెస్టియల్ స్ఫియర్స్ అనే గ్రంథ రచయిత?
    1) కోపర్నికస్ 2) గెలీలియో
    3) అరిస్టాటిల్ 4) గ్రాహంబెల్
57. విద్యుత్ జనరేటర్ ఆవిష్కర్త
    1) ఆయర్‌స్టెడ్ 2) మాక్స్‌వెల్
    3) బ్రోగ్లీ 4) ఫారడే
58. తరగతిలో బోధనాభ్యసనా కార్యకలాపాల ద్వారా విద్యార్థుల్లో వచ్చే ప్రవర్తనా మార్పులు
    1) ఆశయాలు 2) లక్ష్యాలు
    3) స్పష్టీకరణలు 4) విలువలు
59. భావావేశ రంగంలో అత్యున్నత లక్ష్యం
    1) వ్యవస్థాపన 2) శీల స్థాపన
    3) విలువ కట్టడం 4) ప్రతిస్పందించడం

సమాధానాలు

1) 3	2) 2	3) 4	4) 2	5) 1
6) 3	7) 1	8) 4	9) 4	10) 2
11) 1	12) 3	13) 2	14) 2	15) 2
16) 3	17) 2	18) 2	19) 4	20) 4
21) 1	22) 2	23) 2	24) 1	25) 3
26) 4	27) 1	28) 4	29) 3	30) 3
31) 1	32) 2	33) 2	34) 1	35) 1
36) 2	37) 3	38) 4	39) 2	40) 2
41) 4	42) 4	43) 2	44) 1	45) 4
46) 3	47) 2	48) 3	49) 4	50) 1
51) 2	52) 4	53) 1	54) 3	55) 3
56) 1	57) 4	58) 2	59) 2	

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

సాక్షి ప్లస్
బుధవారం । 9-10-2024

ఆమ్లాలు, క్షారాలు - వాటి స్వభావాలు

అన్ని పోటీ పరీక్షల్లో జనరల్ సైన్స్‌కు ఎంతో ప్రాధాన్యత ఉంటుంది. కెమిస్ట్రీ, ఫిజిక్స్, బయాలజీ.. నిత్య జీవితంలో భాగంగా ఉండే అంశాలు. పోటీ పరీక్షలకు ప్రశ్నపత్రం ప్రిపేర్ చేసేవారికి వెంటనే స్ఫురించే అంశాలలో పదార్థాల స్వభావం ఒకటి. ఎందుకంటే మన జీవన క్రియల్లో పాల్పంచుకోవడంతో పాటు ప్రభావితం చేసే అనేక ఇతర అంశాల్లో ఆమ్లాలు, క్షారాలు, లవణాలు ముఖ్యమైనవి.



ఆమ్లాలు,క్షారాలు నిత్యజీవితంలో ఎంతో ప్రాధాన్యం కలిగి ఉన్నాయి. ఉదరంలో ఉన్న హైడ్రోక్లోరిక్ ఆమ్లం మనం తిన్న ఆహారం సరిగా జీర్ణం కావడానికి దోహదం చేయడంతో పాటు ఇన్ఫెక్షన్లు రాకుండా కాపాడుతుంది.సంప్రదాయంగా ఇస్తున్న తాంబూలంలో తమలపాకుపై సున్నపు తేట ఒక క్షారం. ఇది ఎసిడిటీ రాకుండా కాపాడే ఒక మంచి ఆచారం. అయితే ప్రస్తుతం మనం తినగానే వెంటనే 'కూల్ డ్రింక్' తాగుతుంటాం. అందులోని ఫాస్ఫారిక్ ఆమ్లంతో పాటు ఉన్న కార్బొనిక్ ఆమ్లం ఉదరంలో చేరడంతో మంటను చల్లార్చడానికి పెట్రోలు చల్లిన చందంగా అవుతుంది.

కొన్ని సహజ సిద్ధమైన అమ్లాలు

పచ్చళ్ల నిల్వ ఉంచడానికి ఉప్పును మంచి నిల్వకారిణిగా వాడతారు. మనం రుచి కోసం కూరల్లో వేసే ఉప్పు (సోడియం క్లోరైడ్) ఉదరంలో హైడ్రోక్లోరిక్ ఆమ్ల ఉత్పత్తికి తోడ్పడుతుంది. అదే విధంగా సోడియం బెంజోయేట్ ఒక మంచి 'ఆహార నిల్వకారిణి'. ఎర్ర చీమ కుడితే ఫార్మిక్ ఆమ్లం ఇంజెక్ట్ అవుతుంది. వెనిగర్ అనేది ఎసిటికామ్లం. గతంలో ఈ అంశంపై అనేకసార్లు ప్రశ్నలు వచ్చాయి. వివిధ ఆమ్ల, క్షారాలు-వాటి స్వభావాలు, ధర్మాలు, వివిధ లవణాలు-వాటి ఉపయోగాలపై ప్రశ్నలు అడగవచ్చు.

అనేక సిద్ధాంతాలు:

ప్రాచీన కాలం నుంచి పుల్లని రుచి కలిగిన పదార్థాలను ఆమ్లాలని, చేదు కలిగిన వాటిని క్షారాలని వ్యవహరించేవారు. ఈ రెండూ కాని వాటిని లవణాలని చెప్పేవారు. ఆ తర్వాత ఆమ్లాలలో ఆక్సిజన్ తప్పనిసరిగా ఉంటుందని కొందరు, హైడ్రోజన్ ఉంటుందని మరికొందరు శాస్త్రవేత్తలు భావించారు. లాటిన్ భాషలో 'ఆసిడస్' అంటే 'పులుపు' అని అర్థం. ప్రస్తుతం ఆమ్ల-క్షారాలకు సంబంధించి మూడు సిద్ధాంతాలు ప్రాచుర్యంలో ఉన్నాయి. అవి.. అర్హీనియస్, లూయీ, బ్రాన్‌స్టెడ్-లోరీ సిద్ధాంతాలు.

అర్హీనియస్ సిద్ధాంతం

లోతుగా వెళ్లకుండా సాధారణ పరిభాషలో ఆమ్ల-క్షార భావనను వివరించడానికి అర్హీనియస్ సిద్ధాంతం అనువైంది. ఈ సిద్ధాంతం ప్రకారం జల ద్రావణంలో ప్రోటాన్(H^+)ను ఇచ్చే పదార్థాలు ఆమ్లాలు.

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

జనరల్ సైన్స్

హైడ్రాక్సిల్ అయాన్(OH^-) ఇచ్చేవి క్షారాలు. ఆమ్లాలు క్షారాలతో కలిసి నీటితో పాటు లవణాన్ని ఏర్పరుస్తాయి. ఉదాహరణకు హైడ్రోక్లోరిక్ ఆమ్లం (HCl), సోడియం హైడ్రాక్సైడ్(NaOH)తో కలిసి సోడియం క్లోరైడ్ అనే లవణాన్ని ఏర్పరుస్తుంది.

ఆమ్లాలు-ఇతర ధర్మాలు:

- నీలి లిట్మస్‌ను ఎరుపు రంగులోకి మారుస్తాయి.
- చురుకైన లోహాలతో చర్య పొంది హైడ్రోజన్ వాయువును విడుదల చేస్తాయి.
- కార్బొనేటులు, బైకార్బొనేటులలో చర్యను పొందినపుడు బుసబుసమని పొంగుతూ కార్బన్‌డైఆక్సైడ్(CO_2) వాయువు విడుదలవుతుంది.
  ఉదా: చలువరాతి ముక్కలు (కాల్షియం కార్బొనేట్-$CaCO_3$)పై హైడ్రోక్లోరిక్ ఆమ్లం పోస్తే CO_2 వస్తుంది.
  $CaCO_3 + 2HCl \rightarrow CaCl_2 + H_2O + CO_2$ అదేవిధంగా తినేసోడా (సోడియం బైకార్బొనేట్ -$NaHCO_3$) మన ఆహారంతో పాటు తీసుకున్నప్పుడు తేన్పుల రూపంలో CO_2 బయటకు రావడాన్ని మనం గమనించవచ్చు.
  $NaHCO_3 + HCl \rightarrow NaCl + H_2O + CO_2$
- ఆమ్లాలు చాలా వరకు మంచి విద్యుత్ వాహకాలు

కొన్ని బలహీన ఆమ్లాలు

- కార్బోనిక్ ఆమ్లం-H_2CO_3
- ఫార్మిక్ ఆమ్లం-HCOOH
- ఎసిటిక్ ఆమ్లం-CH_3COOH

బలమైన ఆమ్లాలు

- హైడ్రోక్లోరిక్ ఆమ్లం-HCl
- సల్ఫ్యూరిక్ ఆమ్లం- H_2SO_4
- నైట్రిక్ ఆమ్లం-HNO_3
- ఫాస్ఫారిక్ ఆమ్లం-H_3PO_4

క్షారాల సాధారణ ధర్మాలు:

- సబ్బు నురగ వంటి జారుడు స్వభావం గల చేదుగా ఉండే పదార్థాలు
- ఎరుపు లిట్మస్ పేపర్‌ను నీలి రంగులోకి మారుస్తాయి.
- కాస్టిక్ సోడా వంటి బలమైన క్షారాలు చేతిపై పడినప్పుడు చర్మాన్ని తినేస్తాయి.

బలహీన క్షారాలు:

- మెగ్నీషియం హైడ్రాక్సైడ్-$Mg(OH)_2$
- కాల్షియం హైడ్రాక్సైడ్-$Ca(OH)_2$
- అల్యూమినియం హైడ్రాక్సైడ్-$Al(OH)_3$
- అమ్మోనియం హైడ్రాక్సైడ్-NH_4OH

బలమైన క్షారాలు:

- సోడియం హైడ్రాక్సైడ్ -NaOH
- పొటాషియం హైడ్రాక్సైడ్ -KOH

కొన్ని లవణాలు:

- సోడియం క్లోరైడ్ -NaCl
- అమ్మోనియం క్లోరైడ్ -NH_4Cl
- సోడియం కార్బొనేట్ -Na_2CO_3

p^H:స్కేలు

ఆమ్ల క్షార బలాలను కొలవడానికి సొరెన్‌సెన్ పరిచయం చేసిన 'p^H స్కేలు' అనే పరిభాషను ఉపయోగిస్తారు. ఆమ్లాల p^H విలువ 1-7 వరకు. క్షారాల p^H విలువ 7-14 వరకు. తటస్థ పదార్థాల p^H విలువ 7. బలమైన ఆమ్లాల p^H విలువ ఒకటికి దగ్గరగా ఉంటే బలమైన క్షారాల p^H విలువ 14కు దగ్గరగా ఉంటుంది.

లవణ జల విశ్లేషణ:

కొన్ని లవణాలు నీటిలో కరిగించినపుడు ఆ ద్రావణానికి ఆమ్ల లేదా క్షార స్వభావం వస్తుంది. ఆ దృగ్విషయాన్నే లవణ జల విశ్లేషణ అంటారు. సాధారణంగా బలమైన క్షారం -బలహీనమైన ఆమ్లం కలయికతో ఏర్పడిన లవణాల జలద్రావణం క్షార స్వభావాన్ని కలిగి ఉంటుంది.

ఉదా: సోడియం బైకార్బొనేట్ -$NaHCO_3$
సోడియం కార్బొనేట్ -Na_2CO_3

అందుకే తినేసోడా ($NaHCO_3$) అధికంగా వాడినపుడు ఆమ్లత్వం (acidity) పెరిగి ఉదరంలో మంట మండినట్లు అనిపించడం గమనించవచ్చు. ఇదే చివరకు అల్సర్లకు కూడా దారితీయవచ్చు.

కొన్ని నమూనా ప్రశ్నలు

1. పెరుగు పులుపునకు కారణమైన ఆమ్లం
   1) ఫార్మిక్ ఆమ్లం 2) ఎసిటిక్ ఆమ్లం
   3) టార్టారిక్ ఆమ్లం 4) లాక్టిక్ ఆమ్లం
2. నారింజ వంటి నిమ్మ జాతి పండ్లలో ఉండే ఆమ్లం
   1) సిట్రిక్ ఆమ్లం 2) హైడ్రోక్లోరిక్ ఆమ్లం
   3) ఫార్మిక్ ఆమ్లం 4) లాక్టిక్ ఆమ్లం
3. కిందివాటిలో బలహీన ఆమ్లం ఏది?
   1) హైడ్రోక్లోరిక్ ఆమ్లం 2) నైట్రిక్ ఆమ్లం
   3) సల్ఫ్యూరిక్ ఆమ్లం 4) కార్బొనిక్ ఆమ్లం
4. సబ్బుల పరిశ్రమలో ఉపయోగించే కాస్టిక్ సోడాగా పిలిచే క్షారం ఏది?
   1) మెగ్నీషియం హైడ్రాక్సైడ్
   2) కాల్షియం హైడ్రాక్సైడ్ 3) సోడియం హైడ్రాక్సైడ్
   4) అల్యూమినియం హైడ్రాక్సైడ్
5. కిందివాటిలో తటస్థమైనది ఏది?
   1) నీరు 2) సోడియం క్లోరైడ్ జల ద్రావణం
   3) 1, 2 4) లాలాజలం
6. ఉసిరికాయలో ఎక్కువగా ఉండే ఆమ్లం ఏది?
   1) ఫార్మిక్ ఆమ్లం 2) ఆస్కార్బిక్ ఆమ్లం
   3) ఎసిటిక్ ఆమ్లం 4) టార్టారిక్ ఆమ్లం
7. జతపరచండి:
   ఎ. ఎర్రచీమలు 1. టార్టారిక్ ఆమ్లం
   బి. వెనిగర్ 2. హైడ్రోక్లోరిక్ ఆమ్లం
   సి. పొట్టలోని ఆమ్లం 3. ఫార్మిక్ ఆమ్లం
   డి. బేకింగ్ పౌడర్ తయారీలో ఉపయోగించే ఆమ్లం 4. ఎసిటిక్ ఆమ్లం

	ఎ	బి	సి	డి
1)	2	4	3	1
2)	1	3	2	4
3)	3	4	2	1
4)	4	2	1	3

8. నీటిలో చాకలిసోడా (సోడియం కార్బొనేట్) కరిగిస్తే వచ్చే ద్రావణం
   1) ఆమ్లయుతం 2) క్షారయుతం
   3) తటస్థం 4) చెప్పలేం
9. పాన్ తయారీలో తమలపాకుపై రాసే సున్నపు తేటలోని రసాయనం
   1) కాల్షియం కార్బొనేట్ 2) కాల్షియం హైడ్రాక్సైడ్
   3) సోడియం బైకార్బొనేట్ 4) సోడియం కార్బొనేట్
10. గ్యాస్ట్రిక్ రసం విలువ
    1) 2 2) 7 3) 10 4)14
11. జతపరచండి:

జాబితా 1 (పదార్థం)	జాబితా 2 (p^H విలువ)
ఎ. సారవంతమైన పదార్థం	1. 6 - 6.8
బి. లాలాజలం	2. 6.2 - 6.9
సి. మూత్రం	3. 4.8 - 7.5
డి. రక్తం	4. 7.1 - 7.4

	ఎ	బి	సి	డి
1)	1	2	3	4
2)	4	3	2	1
3)	3	2	1	4
4)	2	4	1	3

12. బలమైన ఆమ్లాలను తరలించే కంటెయినర్‌లను దేనితో రూపొందిస్తారు?
    1) ఇత్తడి 2) కంచు 3) రాగి 4) సీసం
13. సిరా మరకలను తొలగించడానికి వాడే ఆమ్లం ఏది?
    1) లాక్టిక్ ఆమ్లం 2) ఆక్జాలిక్ ఆమ్లం
    3) టార్టారిక్ ఆమ్లం 4) ఎసిటిక్ ఆమ్లం
14. మానవుల జీర్ణ వ్యవస్థలో ఉత్పత్తి అయ్యే ఆమ్లం (గ్రూప్-1, 2012)
    1) అసిటిక్ ఆమ్లం 2) హైడ్రోక్లోరిక్ ఆమ్లం
    3) ఫార్మిక్ ఆమ్లం 4) నైట్రిక్ ఆమ్లం
15. అత్యధిక ఆమ్లాలలో సాధారణంగా ఉండే మూలకం
    1) గంధకం 2) ఉదజని 3) క్లోరిన్ 4) ఆక్సిజన్
16. రసాయనికంగా వంట సోడా (గ్రూప్-2, 2005)
    1) బేకర్స్ ఈస్ట్ 2) కాల్షియం ఫాస్ఫేట్
    3) సోడియం బైకార్బనేట్ 4) సోడియం క్లోరైడ్
17. వెనిగర్ దేని జల ద్రావణం (గ్రూప్-2, 2008)
    1) ఆక్సాలిక్ ఆమ్లం 2) సిట్రిక్ ఆమ్లం
    3) అసిటిక్ ఆమ్లం 4) హైడ్రోక్లోరిక్ ఆమ్లం
18. కింది వాటిలో ఆమ్ల విరోధి
    1) బేకింగ్ సోడా 2) మిల్క్ ఆఫ్ మెగ్నీషియం
    3) అల్యూమినియం హైడ్రాక్సైడ్ 4) అన్నీ
19. మిల్క్ ఆఫ్ లైమ్ అనేది
    1) కాల్షియం కార్బొనేట్ 2) కాల్షియం హైడ్రాక్సైడ్
    3) మెగ్నీషియం హైడ్రాక్సైడ్ 4) లాక్టిక్ ఆమ్లం
20. ఆమ్ల వర్షాల్లో భూమిని చేరే ప్రధాన ఆమ్లాలు
    1) నైట్రిక్ ఆమ్లం, హైడ్రోక్లోరిక్ ఆమ్లం
    2) సల్ఫ్యూరిక్ ఆమ్లం, నైట్రిక్ ఆమ్లం
    3) ఫార్మిక్ ఆమ్లం, ఎసిటిక్ ఆమ్లం
    4) హైడ్రోక్లోరిక్ ఆమ్లం,సల్ఫ్యూరిక్ ఆమ్లం
21. కింది వాటిలో సరిగా జతపరచనిది ఏది?
    1) ఆహార నిల్వకారిణి-సోడియం బెంజోయేట్
    2) టేబుల్ సాల్ట్-సోడియం క్లోరైడ్
    3) నిమ్మ ఉప్పు-సిట్రిక్ ఆమ్లం
    4) చాకలి సోడా-సోడియం బైకార్బొనేట్
22. కింది వాటిలో సరికాని వాక్యం ఏది?
    1) మనం ఆహారం ద్వారా తీసుకునే ఉప్పు(సోడియం క్లోరైడ్), ఉదరంలో ఆహారం జీర్ణం కావడానికి అవసరమైన హైడ్రోక్లోరిక్ ఆమ్లాన్ని తక్కువ పరిమాణంలో ఉత్పత్తి చేస్తుంది.
    2) నీటిలో సంఘటనం పరంగా హైడ్రోజన్ అయాన్‌లు, హైడ్రాక్సిల్ అయాన్‌లు సమాన సంఖ్యలో ఉండడం వల్ల ఆమ్ల గుణం కానీ, క్షార గుణం కానీ ఉండక తటస్థంగా ఉంటుంది.
    3) శీతల పానీయాల్లో ఫాస్ఫారిక్ ఆమ్లాన్ని విరివిగా ఉపయోగిస్తారు.
    4) శీతలపానీయాల్లో కార్బన్‌డైఆక్సైడ్ కరిగించడం వల్ల ఏర్పడే ఆమ్లం ఫార్మిక్ ఆమ్లం.
23. జతపరచండి
    ఎ. బ్యాటరీలు 1. సాలిసిలిక్ ఆమ్లం
    బి. బేకరీలు 2. సల్ఫ్యూరిక్ ఆమ్లం
    సి. సోడా నీరు 3. కార్బోనిక్ ఆమ్లం
    డి. ఆస్పిరిన్ తయారీ 4. వెనిగర్

	ఎ	బి	సి	డి
1)	2	1	4	3
2)	2	4	3	1
3)	4	3	2	1
4)	1	2	3	4

సమాధానాలు

1) 4; 2) 1; 3) 4; 4) 3; 5) 3;
6) 2; 7) 3; 8) 3; 9) 2; 10) 1;
11) 1; 12) 4; 13) 2; 14) 2; 15) 2;
16) 3; 17) 3; 18) 4; 19) 2; 20) 2;
21) 4; 22) 4; 23) 2.

The facts attributed to my report...

BANK EXAMS
English

Directions: Look at the italicized part of each sentence. Three alternatives are given, if one of them is better than the italicized part, indicate your response. If none of the substitutions improves the sentence, indicate D as your response.

1. They *are waiting* for Raju since morning.
   A) Have been waiting B) were waiting
   C) wait D) no improvement
2. They told me that they *were already sold* out all their belongings.
   A) Has sold already B) had already sold
   C) were already sold D) no correction
3. The disparity between the urban and the rural *area has widen* in the last decade.
   A) Areas has widened
   B) area have widen
   C) area has widened D) no alternative
4. He has studied Spanish *since four* years.
   A) Since four years ago
   B) for four years C) from four years
   D) no improvement
5. Roads are wet, *it must had* rained last night.
   A) Must have been B) must have
   C) would have beenD) no improvement
6. In winter, nights are *more colder* than days.
   A) More cold B) colder
   C) coldest D) no improvement
7. It is better to say *too little* than too much.
   A) Little B) only little
   C) very little D) no improvement
8. A large number of houses *has come up* around Secunderabad.
   A) Is coming up B) are coming up
   C) had come up D) no improvement
9. The rules of chess require that one *made* only one move at a time.
   A) Makes B) make
   C) will make D) no improvement
10. Gita enjoys *to tell stories* to children.
    A) Telling stories B) how to tell stories
    C) to narrate storiesD) no improvement
11. 'Daffodils' *have been written* by William Wordsworth.
    A) Has been written B) are written
    C) are being written D) no improvement
12. By temperament *the French* are reserved, so they prefer to live in solitude.



    A) French people B) French
    C) some French D) no improvement
13. Do not take an umbrella *lest you do* not get wet.
    A) Lest you should
    B) lest you should not
    C) lest you might not
    D) no improvement
14. He has been working *off and on* for several years to compile a dictionary.
    A) Regularly B) constantly
    C) on and off D) no improvement
15. But for the two incomes, we would be *hard out.*
    A) Hard upon B) hard up
    C) hard on D) no improvement
16. It is *all and one* to me whether he lives in Bangalore or Mumbai.
    A) All but one B) all one
    C) one and the same D) no improvement
17. The trunk is *so heavy* that I can hardly carry it.
    A) As B) too
    C) much D) no improvement
18. Most willingly Ravi agreed *to go to* Mumbai and remain there for a month.
    A) Go to B) on going to
    C) to going D) no improvement
19. Hemanth did not know the answer and I *did not neither.*
    A) And neither did I B) and either did I
    C) and neither have I
    D) no improvement
20. Although her parents warned her *of* what would happen, she continued to disobey them.
    A) Off B) on
    C) to D) no improvement
21. When new coins were issued, the old ones were *called out.*
    A) In B) up
    C) off D) no improvement
22. It will depend now on *they* coming on time.
    A) Their coming B) them coming
    C) theirs coming D) no improvement
23. He told us the story in *a nutshell.*
    A) In the nutshell B) putting it in a nut
    C) in nutshell D) no correction
24. Ravi is extraordinarily *clever at mimicking* his friends.
    A) Clever for mimicking
    B) clever in mimicking
    C) clever to mimick D) no correction
25. The facts *attributed to* my report in your paper are wrong.
    A) Attributing towards
    B) attributed against
    C) attribute for D) no correction

Answers:

1) A 2) B 3) A 4) B 5) B
6) B 7) A 8) B 9) A 10) A
11) A 12) D 13) A 14) C 15) B
16) C 17) B 18) B 19) A 20) D
21) C 22) A 23) D 24) B 25) B

PRACTICE TEST

Directions: In each sentence there is a blank) To fill the blank, three words are given below the sentence, which are denoted by (i), (ii) and (iii)) Find out which one can be used to fill up the blank and make the sentence meaningfully complete.

1. This is the common ____ followed by employees in many companies.
   i) Sense ii) practice iii) outcome
   a) Only i b) only ii c) only iii
   d) i and ii only e) ii and iii only
2. In such a ____changing scenario, the outdated methods should be dropped.
   i) Fast ii) speed iii) rapidly
   a) i or ii only b) ii or iii only
   c) i or iii only d) any one e) only i
3. He was the first to ____ this novel method in our factory.
   i) Intiate ii) start iii) implement
   a) Only i b) only ii c) only iii
   d) i or ii only e) any one
4. After spending a small amount on medicines, he refunded the entire ____ to his father.
   i) Remained ii) balance iii) residual
   a) Only i b) only ii
   c) only iii d) i and iii only
   e) ii and iii only
5. It happened inadvertently; he didn't do it - ____.
   i) Deliberately ii) purposefully
   iii) intentionally
   a) Anyone b) i or ii only
   c) i or iii only d) ii or iii only
   e) none of these

In each sentence below one word has been printed in bold. Below the sentence, five words/ groups of words are suggested, one of which can replace the word printed in bold without changing the meaning of the sentence. Find out the appropriate word/group of words in each case.

6. A very **stubborn** attitude in life cannot prove helpful.
   a) Uncooperative b) rigid
   c) unsuitable d) unhelpful
   e) inapplicable
7. Travel will **familiarize** you with new customs.
   a) Adjust b) popularize
   c) satisfy d) influence
   e) acquaint
8. His appearance was extremely **misleading.**
   a) Attractive b) depressing
   c) deceptive d) sad e) normal
9. He was a **cunning** businessman.
   a) Crafty b) successful
   c) dishonest d) corrupt
   e) respected
10. The **affluence** of Hindi film actors has no match.
    a) Handsome appearance
    b) brave action c) healthy physique
    d) wealth condition e) intelligent deed

Answers:

1) B 2) C 3) E 4) B 5) C
6) B 7) E 8) C 9) A 10) D

Directions: Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in the proper sequence to form a meaningful paragraph; then answer the questions given below them.

A. There is ample justification for the phenomenon of the description.
B. In the present era also, efforts are being made to rejuvenate Pali.
C. A curious researcher can study them provided he has mastery over Pali language.
D. The Indian tradition describes Buddha as an advocate of analytical method.
E. Pali was perhaps the most commonly used language in those days.
F. This justification is found in several discourses.

1. Which of the following should be the FIRST sentence after rearrangement?
   a) A b) B c) C d) D e) E
2. Which of the following should be the SECOND sentence after rearrangement?
   a) A b) B c) C d) D e) E
3. Which of the following should be the FOURTH sentence after rearrangement?
   a) A b) B c) C d) D e) E
4. Which of the following should be the FIFTH sentence after rearrangement?
   a) A b) B c) C d) D e) E
5. Which of the following should be the SIXTH sentence after rearrangement?
   a) A b) B c) C d) D e) E

Directions: In each sentence below four words have been printed in bold which are numbered (a), (b), (c) and (d)) One of these words may be misspelt or inappropriate in the context of the sentence. Find out the wrongly spelt or inappropriate word. The number of that word is the answer. If all four words are correctly spelt than the appropriate answer is (e) i.e) 'All correct')

6. Mary **constantly** (a) talks about herself **irregardless** (b) of other **people's** (c) **interests** (d)) All correct (e)
7. All roads, **hotels** (a) and **restaurants** (b) in the **surrounding** (c) area were **devastated** (d) All correct (e)
8. As soon as Gandhi **presented** (a) his **proposal** (b) Muni **sumoned** (c) his **advisors** (d) All correct (e)